
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16
సంచిక: 109
సోమవారం 10-7-2023



'నా అక్కలూ..చెల్లెళ్లు.. తమ్ముళ్ల కళ్లలో వెలుగులు చూసినపుడే నా నిజమైన పుట్టిన రోజు'



భారత్ శుభారంభం
మహిళల తొలి టి20 మ్యాచ్‌లో బంగ్లాదేశ్‌పై విజయం -12లో



గెట్.. సెట్.. ఫారిన్!
విదేశాలకు వలస వెళ్లాలంటే దృష్టి పెట్టాల్సిన అంశాలపై కథనం -13లో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మెకానిక్‌లు సాధికారత సాధించాలి
దేశ ఆటోమొబైల్ రంగాన్ని బలోపేతం చేయడానికి మెకానిక్‌లు మరింత కృషి చేయాలని రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు.
వివరాలు 6లో ▸



చంద్రయాన్-3.. త్రీ ఇన్ వన్
చంద్రయాన్-1, 2తో ఆర్బిటార్ ద్వారా ల్యాండర్‌ను, ల్యాండర్ ద్వారా రోవర్‌ను పంపిన భారత్.. ఒకేసారి మూడింటినీ పంపిస్తోంది.
వివరాలు 6లో ▸



యాత్ర పునఃప్రారంభం
జమ్మూకశ్మీర్‌లో 3 రోజుల క్రితం ప్రతికూల వాతావరణం వల్ల నిలిచిన అమర్‌నాథ్ యాత్ర ఆదివారం పునఃప్రారంభమైంది.
వివరాలు 6లో ▸



దయా హృదయం.. మహా ఖరీదు
అస్థికలను భద్రపర్చడానికి హాంకాంగ్‌లో భారీ భవనం నిర్మించారు. ఒక కలశానికి పదేళ్లకు రూ.63 లక్షల ఖర్చు అవుతుంది.
వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

పీజీ మెడికల్ కన్వీనర్ కోటా సీట్లకు నోటిఫికేషన్



పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. 2023–24 వైద్య విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని పీజీ మెడికల్ సీట్ల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తూ కాళోజీ నారాయణరావు ఆరోగ్య వర్సిటీ నోటిఫికేషన్ విడుదల చేసింది.
- వివరాలు 14లో▶

కడియం శ్రీహరి కుబేరుడు.. అవినీతి తిమింగలం




'ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కుబేరుడు.. అవినీతి తిమింగలం, ఆయన ఎస్సీ కాదు, ఆయన తల్లి పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వారు' అని ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య మరోసారి సంచలన ఆరోపణలు చేశారు.
- వివరాలు 3లో▶

210 మంది చిన్నారులకు విముక్తి



తప్పిపోయిన పిల్లలు, బాల కార్మికులుగా మారిన చిన్నారులను కనిపెట్టేందుకు ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్-9 స్పెషల్ డ్రైవ్ ముమ్మరంగా కొనసాగుతోంది.
- వివరాలు 14లో▶

గోదావరిలో 3,396.9 టీఎంసీల లభ్యత



75 శాతం లభ్యత ఆధారంగా గోదావరిలో 3,396.9 టీఎంసీల లభ్యత ఉందని సీడబ్ల్యూసీ తేల్చింది. వ్యాప్కోస్ అంచనా వేసిన దానికంటే ఐదు టీఎంసీలు అధికంగా ఉన్నట్లు పేర్కొంది.
- వివరాలు 5లో▶

గులాబీ టీమ్ గందరగోళం ఎట్లా?

బీఆర్‌ఎస్ పట్ల మెతక వైఖరి ప్రచారంతో ఇబ్బందులు
బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో రాష్ట్ర నేతల మొర



ఆదివారం బీజేపీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో జేపీ నడ్డాతో కిషన్‌రెడ్డి. చిత్రంలో బీఎల్ సంతోష్

రాష్ట్ర ప్రభుత్వ అవినీతిపై ఘాటుగా ఆరోపణలు చేస్తున్నా చర్యల్లేకపోవడంపై సందేహాలు

- బీఆర్‌ఎస్‌కు బీజేపీ 'బీ టీమ్' అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ఇబ్బందిగా మారింది
- ఈ విషయంలో తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి
- ఆందోళన చెందవద్దని రాష్ట్ర నేతలకు సూచించిన జేపీ నడ్డా
- అవినీతికి పాల్పడినవారిని వదిలే ప్రసక్తే లేదని, చర్యలుంటాయని వెల్లడి
- గెలుపే లక్ష్యంగా సమన్వయంతో పని చేసుకుంటూ వెళ్లాలని సూచన
- ఎన్నికలయ్యే దాకా వెంటే ఉండి పూర్తి సహకారం అందిస్తామని భరోసా
- 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, నేతలతో జరిగిన భేటీలో దిశానిర్దేశం
- దక్షిణాదిపై ప్రత్యేక ఫోకస్.. ప్రత్యేక ఎజెండా రూపొందించాలని నిర్ణయం
- త్వరలో జరగబోయే అన్ని అసెంబ్లీ ఎన్నికల్లో గెలవాల్సిందేనని వ్యాఖ్య

సాక్షి, హైదరాబాద్

బీఆర్‌ఎస్ పట్ల బీజేపీ మెతక వైఖరి అవలంబిస్తోందన్న ప్రచారంతో పార్టీలో గందరగోళం నెలకొందని.. రెండింటి మధ్య అవగాహన కుదిరిందన్న ప్రచారం ఇబ్బందికరంగా మారిందని బీజేపీ జాతీయాధ్యక్షుడు జేపీ నడ్డాకు రాష్ట్ర నేతలు ఫిర్యాదు చేశారు. కేంద్ర ప్రభుత్వ పెద్దలు తరచూ బీఆర్‌ఎస్ సర్కారు అవినీతి, అక్రమాలపై ఘాటుగా ఆరోపణలు చేయడానికే పరిమితమవుతూ.. ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంపై సందేహాలు ముసురుకుంటున్నాయని వివరించినట్టు సమాచారం. దీనిపై స్పందించిన నడ్డా.. అన్ని అంశాలూ తమ దృష్టిలో ఉన్నాయని, ఆందోళన చెందవద్దని సూచించినట్టు తెలిసింది. అవినీతికి పాల్పడే వారెవరినీ వదిలిపెట్టే ప్రసక్తే లేదని.. తగిన సమయంలో కచ్చితంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నట్టు సమాచారం. నాయకులంతా సమన్వయంతో ముందుకు వెళ్లి, ప్రజల మద్దతు కూడగట్టాలని.. తాము వెంటే ఉండి పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేసినట్టు తెలిసింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, వివిధ రాష్ట్రాల ఇన్‌చార్జులతో జరిగిన సమావేశంలో వివిధ అంశాలపై జేపీ నడ్డా దిశానిర్దేశం చేశారు. ఇందులో తెలంగాణకు సంబంధించిన
మిగతా 3వ పేజీలో ▶

బీజేపీ, బీఆర్‌ఎస్ ఎప్పుడూ ఒకటి కాబోవని చెప్పండి
దుష్ప్రచారం దీటుగా తిప్పికొట్టండి
పార్టీ లైన్ దాటితే కఠినచర్యలుంటాయి
బీజేపీ నేతలకు నడ్డా సీరియస్ క్లాస్
- వివరాలు 3లో

బోనాలు సందర్భంగా ఆదివారం ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న సీఎం కేసీఆర్ దంపతులు



వైభవంగా ఉజ్జయినీ మహంకాళి బోనాలు

అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించిన సీఎం కేసీఆర్
పలువురు మంత్రులు, ప్రజా ప్రతినిధులు, ప్రముఖుల ప్రత్యేక పూజలు
బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

రాంగోపాల్‌పేట్

చారిత్రక సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర ఆదివారం వైభవంగా జరిగింది. సీఎం కేసీఆర్ దంపతులతో పాటు వేలాది మంది భక్తులు అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఆదివారం ఉదయం 3.30 గంటలకు మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ కుటుంబసభ్యులతో కలిసి దేవాలయానికి వచ్చారు. ఆయన సతీమణి స్వర్ణ అమ్మవారికి బోనం సమర్పించారు. మంత్రి మొదటి పూజ చేసిన అనంతరం 4.15 గంటలకు సాధారణ భక్తులను అనుమతించారు. పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రముఖులు
మిగతా 2వ పేజీలో ▶





ఆదివారం హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో వరదల ధాటికి ఉధృతంగా ప్రవహిస్తున్న బియాస్ నది. మనాలిలో నదిలో కొట్టుకుపోతున్న వాహనాలు

ఉత్తరాదిన భారీ వర్షాలు

- ఢిల్లీలో 40 ఏళ్ల రికార్డు బద్దలు
- వివిధ ఘటనల్లో 19 మంది మృతి..
- యమున సహా పొంగిపొర్లుతున్న పలు నదులు

ఉత్తరభారతాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో 19 మంది చనిపోయారు. ఢిల్లీలోని యమున సహా పలు నదులు పొంగిపొర్లుతున్నాయి. దేశ రాజధానిలో 24 గంటల వ్యవధిలో రికార్డు స్థాయిలో 153 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఢిల్లీతో పాటు జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది. - వివరాలు 6లో

అధిక పెన్షన్ దరఖాస్తులకు రేపే ఆఖరు


- మళ్లీ గడువు పెంచే యోచన లేదంటున్న ఈపీఎఫ్‌ఓ వర్గాలు
- నిబంధనల సడలింపుతో భారీగా పెరిగిన దరఖాస్తులు.. ఇప్పటి వరకు ఆన్‌లైన్‌లో దాఖలైనవి 17.54 లక్షలపైనే..

సాక్షి, హైదరాబాద్: ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ (ఈపీఎఫ్‌వో) చందాదారులకు అధిక పెన్షన్ దరఖాస్తు గడువు ఈ నెల 11వ తేదీతో ముగుస్తోంది. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన విజ్ఞప్తుల మేరకు ఇప్పటికే మూడుసార్లు దరఖాస్తుల గడువు పెంచిన నేపథ్యంలో.. ఇకపై పొడిగింపు ఉండదని ఈపీఎఫ్‌వో వర్గాలు చెప్తున్నాయి. నిబంధనల సడలింపుతో దరఖాస్తులు బాగా పెరిగాయని.. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 17.54 లక్షల మంది అధిక పెన్షన్ కోసం ఆన్‌లైన్‌లో ఆప్షన్ ఇచ్చుకున్నారని తెలిపాయి. 26(6) పత్రాన్ని సమర్పించే విషయంలో వెసులుబాటు ఉద్యోగులకు ఊరట ఇచ్చిందని వివరించాయి. సోమ, మంగళవారాలు కూడా ఆప్షన్ ఇచ్చుకునే
మిగతా 2వ పేజీలో ▶

బీమాపై సాగదీత.. రైతుకు ఏదీ భరోసా?

రాష్ట్రంలో పంటల బీమా పథకం దిశగా ముందుకు పడని అడుగులు

- ప్రకృతి ప్రకోపిస్తే కష్టాలేనన్న ఆందోళన
- కేంద్ర పథకం నుంచి బయటకొచ్చిన రాష్ట్ర ప్రభుత్వం.. బీమా కంపెనీలకే తప్ప రైతులకు ప్రయోజనం లేదనే భావన
- గత యాసంగిలో రెండుసార్లు లక్షల ఎకరాల్లో పంట నష్టం.. 2.30 లక్షల ఎకరాలకు పరిహారం ప్రకటించిన ప్రభుత్వం



సాక్షి, హైదరాబాద్: వానాకాలం సీజన్ ఆలస్యంగా ప్రారంభమైంది. ఇప్పుడిప్పుడే వర్షాలు పడుతున్నాయి. అయితే ఎప్పటికప్పుడు అనూహ్యమైన వాతావరణ పరిస్థితులు రైతుల్ని బెంబేలెత్తిస్తున్నాయి. పంటలు పండి, చేతికొచ్చి అమ్ముకునేంత వరకు అంతా సజావుగా జరిగితేనే రైతులు ఊపిరి పీల్చుకునేది. మధ్యలో అధిక వర్షాలతో వరదల వంటి ప్రకృతి వైపరీత్యాలు సంభవిస్తే మాత్రం కోలుకోవడం కష్టమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పంట నష్టం జరిగితే బీమా కానీ, పరిహారం అందించే పరిస్థితి కానీ లేకపోవడం ఇందుకు కారణం. ఈ ఏడాది యాసంగిలో మార్చి, ఏప్రిల్ నెలల్లో రెండు మూడు దఫాలుగా కురిసిన తీవ్రమైన వర్షాలు, వడగళ్ల వాన కారణంగా 10 లక్షల ఎకరాలకు పైగా పంటలకు నష్టం వాటిల్లినట్లు అనధికార అంచనా కాగా.. మార్చిలో 1.51 లక్షల ఎకరాలు, ఏప్రిల్‌లో 2.30 లక్షల ఎకరాల్లో నష్టం వాటిల్లినట్టుగా నిర్ధారించిన ప్రభుత్వం.. ఆ మేరకు పరిహారం ఇవ్వాలని ప్రకటించింది. మిగిలిన వారికి ఎలాంటి సాయానికీ దిక్కులేకుండా పోయింది. ప్రభుత్వం పరిహారం ప్రకటించినప్పుడు ఆ సందర్భంలో జరిగిన పంట నష్టానికి మాత్రమేనని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంటే ముందు జరిగే పంట నష్టాలకు ఇది వర్తించదని అర్థమవుతుండగా, ఈ సీజన్‌లో పంటలు సాగు చేస్తున్న రైతులను పరిహారానికి సంబంధించిన ఆందోళన వెంటాడుతోంది.

కేంద్ర ప్రభుత్వ పథకం నుంచి బయటకు...

రాష్ట్ర రైతులకు అనుకూలంగా లేదన్న భావనతో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రధానమంత్రి ఫసల్ (పంటల) బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం నుంచి 2020లో రాష్ట్ర ప్రభుత్వం
మిగతా 5వ పేజీలో ▶

ఇదండీ సంగతి



ఆయనకు సీఎం కావాలని ఉన్నప్పుడు మీకు పీఎం కావాలని ఉంటుందిగా.. అప్పుడే రిటైర్ అంటే ఎలాసార్!

మాస్టార్ల బదిలీలు, పదోన్నతులు ఎప్పుడు?

- ఉపాధ్యాయుల్లో రగులుతున్న అసంతృప్తి
- విశ్వాసం కోల్పోతున్న ఉపాధ్యాయ సంఘాలు
- కోర్టు వివాదాల్లో విద్యాశాఖ మౌన పాత్ర
- వాస్తవాలు వివరించడం లేదని టీచర్ల అసహనం



సాక్షి, హైదరాబాద్: బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ముందుకెళ్లకపోవడంతో ఉపాధ్యాయుల్లో తీవ్ర అసంతృప్తి చోటు చేసుకుంటోంది. ఏడాదిగా అటు ప్రభుత్వం, ఇటు ఉపాధ్యాయ సంఘాలు తమతో ఆటలాడుతున్నాయని టీచర్లు తీవ్ర అసహనానికి లోనవుతున్నారు. టీచర్ల సంఘాల నేతలపై రాష్ట్రవ్యాప్తంగా వ్యతిరేకత పెరుగుతోంది. ఇటీవల విద్యాశాఖ మంత్రిని కలిసిన పలు ఉపాధ్యాయ సంఘాలు కూడా ఇదే విషయాన్ని స్పష్టం చేశాయి. న్యాయ పరమైన చిక్కులు తొలగించేందుకు విద్యాశాఖ ఆసక్తి చూపడం లేదని ఉపాధ్యాయులు ఆరోపిస్తున్నారు. నాన్-స్పౌజ్ పేరుతో న్యాయ వివాదం సృష్టించిన వ్యక్తుల వెనుక స్వార్థం ఉందని, దీన్ని న్యాయస్థానానికి సరిగా వివరించడంలో విద్యాశాఖ విఫలమైందంటున్నారు.

హెచ్‌ఆర్‌ఏ కోసమేనా ఈ రగడ?

భార్యాభర్తలు ఉద్యోగులైతే ఒకే చోట ఉండేలా చూడాలనేది ప్రభుత్వ విధానం. ఈ నేపథ్యంలోనే బదిలీలు చేపడుతున్నారు. కానీ కొంతమంది నాన్-స్పౌజ్ పేరుతో కొత్త వివాదం తెరమీదకు తెచ్చారు. బదిలీ అయ్యే 80 వేల మంది టీచర్లలో 30 వేల మంది ఉపాధ్యాయులు స్పౌజ్ పాయింట్లు వాడుకుని 24 శాతం హెచ్‌ఆర్‌ఏ ఉంటే పట్టణ ప్రాంతాల్లోని పాఠశాలలకు వస్తున్నారనేది నాన్-స్పౌజ్‌ల వాదన. నిజానికి జిల్లా యూనిట్‌గానే టీచర్ల బదిలీలు ఉంటాయి. హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల్లో స్పౌజ్ అనే అంశంతో సంబంధం లేకుండానే జిల్లాల్లోని అందరికీ ఒకే హెచ్‌ఆర్‌ఏ ఇస్తారు. రంగారెడ్డి జిల్లాలోని 5 మండలాలు, సంగారెడ్డి జిల్లాలోని 3 మండలాలు తప్ప రాష్ట్రంలో మిగిలిన 30 జిల్లాలకు 24 శాతం హెచ్‌ఆర్‌ఏ వర్తించదు. స్పౌజ్ పాయింట్లు 8 ఏళ్లకోసారి ఇస్తారు. అది కూడా దంపతుల్లో ఒకరికే వర్తిస్తుంది

వాస్తవాలు గుర్తించరేం?


వాస్తవాలు అలా ఉంటే నాన్ స్పౌజ్‌ల పేరుతో అభ్యంతరాలు లేవనెత్తే వ్యక్తులు అసత్య ప్రచారంతో నమ్మిస్తున్నారనేది
మిగతా 2వ పేజీలో ▶

గతేడాది బదిలీల షెడ్యూల్ ఇచ్చినా..

ఉపాధ్యాయ బదిలీలు, పదోన్నతులకు ప్రభుత్వం గత ఏడాది షెడ్యూల్ ఇచ్చింది. అయితే టీచర్లు ఆప్షన్లు ఇచ్చే దశలోనే నాన్ స్పౌజ్‌లు తమకు అన్యాయం జరిగిందని కోర్టును ఆశ్రయించారు. ఉపాధ్యాయుల బదిలీలు, సర్వీసుకు సంబంధించిన నిబంధనలను రాజ్యాంగంలోని ఆర్టికల్ 309 ప్రకారం రాష్ట్ర శాసనసభ రూపొందించి గవర్నర్ ఆమోదంతో జారీ చేయాలని నాన్ స్పౌజ్‌లు వాదిస్తున్నారు. కానీ జీవో 5, శాసనసభ, గవర్నర్ ఆమోదం లేకుండా అధికారులే భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 162, 163 (3) ప్రకారం గవర్నర్ ఇచ్చిన బిజినెస్ రూల్స్ ప్రకారం జారీ చేశారని, ఇది చట్టబద్ధం కాదని కోర్టుకు తెలిపారు. దీంతో బదిలీలు, పదోన్నతులపై కోర్టు స్టే విధించింది. ఈ దశలో విద్యాశాఖ వాస్తవాలు చెప్పడంలో విఫలమైందనేది టీచర్ల ఆరోపణ.

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా
జస్టిస్ శామ్ కోషీ!

కేంద్రానికి సుప్రీం కొలీజియం సిఫార్సు



న్యూఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి.శామ్ కోషీని తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ నేతృత్వంలోని కొలీజియం ఆదివారం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. ఛత్తీస్‌గఢ్ హైకోర్టు నుంచి తనను బదిలీ చేయాలంటూ జస్టిస్ కోషీ చేసిన విజ్ఞప్తిని కొలీజియం పరిగణనలోకి తీసుకుంది. వాస్తవానికి మధ్యప్రదేశ్ హైకోర్టుకు పంపించాలని తొలుత భావించినప్పటికీ ఆయన అంగీకరించలేదు. మధ్యప్రదేశ్ మినహా మరో హైకోర్టుకు బదిలీ చేయాలని జస్టిస్ కోషీ విన్నవించడంతో తెలంగాణ హైకోర్టుకు బదిలీ చేస్తూ కొలీజియం సిఫార్సు చేసింది.

క్లుప్తంగా...



ఖైదీల్లో సత్ప్రవర్తనే లక్ష్యంగా..

ఓయూతో త్రైపాక్షిక ఒప్పందం

లాలాపేట: ఖైదీల్లో సత్ప్రవర్తన తీసుకురావటం, మానసికంగా వారిని తీర్చిదిద్దేందుకు ఉస్మానియా యూనివర్సిటీ, పోలీసు పరిశోధన–అభివృద్ధి బ్యూరో, ఢిల్లీ జైళ్ల శాఖ మధ్య త్రైపాక్షిక ఒప్పందం కుదిరింది. ఈ మేరకు ఇటీవల కేంద్ర హోం మంత్రిత్వ శాఖ అధికారి అనుపమ నీలేఖర్ చంద్ర, ఢిల్లీ జైళ్ల శాఖ అధికారి హెచ్‌పీఎస్ గ్రాన్, ఓయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.లక్ష్మీనారాయణ, ఉన్నతి ప్రాజెక్టు డైరెక్టర్ ఓయూ విశ్రాంత అధ్యాపకురాలు ప్రొఫెసర్ బీనా చింతలపూరి సమక్షంలో ఎంవోయూ పత్రాలను మార్చుకున్నారు. 'ఉన్నతి' అనే కాగ్నిటివ్ బిహేవియరల్ చేంజ్(సీబీసీ) ఇంటర్వెన్షన్ ప్రోగ్రాంను 2015లో తెలంగాణ జైళ్ల శాఖ ఆదేశాల మేరకు ఓయూ సైకాలజీ అధ్యాపకురాలు ప్రొఫెసర్ బీనా రూపొందించారు. ఈ ఒప్పందం ద్వారా తీహార్ జైల్లో ఖైదీల్లో నేరప్రవృత్తి, అపరాధ భావనను తగ్గించే విధంగా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నారు. ఎంఓయూపై ఓయూ వీసీ ప్రొఫెసర్ రవీందర్ హర్షం వ్యక్తం చేశారు.

దేవులపల్లి శ్రుతికి డాక్టరేట్



సాక్షి, హైదరాబాద్: 'కోవిడ్ మహమ్మారి వ్యాప్తికి ముందు, లాక్‌డౌన్ సమయంలో, కోవిడ్ అనంతరం గాలి నాణ్యత'అనే అంశంపై సమగ్ర పరిశోధన జరిపిన హైదరాబాద్‌కు చెందిన దేవులపల్లి శ్రుతికి డాక్టరేట్ లభించింది. ఆమె చేసిన పరిశోధనకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ ఎన్విరాన్‌మెంట్ సైన్స్ కేటగిరీలో పీహెచ్‌డీని ప్రదానం చేసింది. ప్రముఖ ఫార్మా కంపెనీ నొవార్టిస్‌లో సీనియర్ అసోసియేట్‌గా పనిచేస్తున్న శ్రుతి.. హైదరాబాద్ నగర వాతావరణంపై ప్రభావం చూపిస్తున్న పలు వాయు కాలుష్య కారకాలపై సునిశిత పరిశోధన జరిపారు. సీనియర్ జియాలజీ ప్రొఫెసర్ పి.మధుసూదనరెడ్డి పర్యవేక్షణలో ఆమె జరిపిన పరిశోధనకు ప్రయోగాత్మక పద్ధతిని అనుసరించారు.

'సమతామూర్తి' స్థపతికి యూపీ సీఎం అభినందన



సాక్షి, హైదరాబాద్: శంషాబాద్ సమీపంలోని ముచ్చింతల్‌లో నిర్మించిన సమతామూర్తి స్ఫూర్తి కేంద్రం ఆర్కిటెక్ట్ ప్రసాద్ స్థపతిని ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అభినందించారు. హరియాణాలోని రోహతక్‌లో నిర్మిస్తున్న మహంత్ బాబా మస్తనాథ్ ఆలయ ప్రాంగణాన్ని ఆదివారం యోగి ఆదిత్యనాథ్ సందర్శించారు. ఈ ఆలయ రూపకల్పనలో ప్రసాద్ స్థపతి కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆలయ విశేషాలు, ముచ్చింతల్‌లోని సమతా మూర్తి విశిష్టతలపై ఆయనను ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ స్థపతి 'శిల్పకళా ప్రయాణం'అన్న పుస్తకాన్ని సీఎం యోగికి అందజేశారు.

అక్షర, ఆకర్ష్‌కు 'నాసా' అభినందనలు

చంద్రుడిపై పరిశోధనలకు రోవర్‌ను తయారు చేసిన బృందంలో విజయవాడ యువత




తయారు చేసిన రోవర్ ప్రాజెక్ట్‌తో బృందం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): అమెరికా అంతరిక్ష పరిశోధనా సంస్థ (నాసా) నిర్వహించిన హ్యూమన్ ఎక్స్‌ప్లొరేషన్ రోవర్ చాలెంజ్ (హెచ్ఈఆర్‌సీ–2023)లో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ నగరానికి చెందిన వేమూరి సాయి అక్షర, చిట్టినేని ఆకర్ష్ ప్రతిభ చూపి నాసా ప్రతినిధుల నుంచి శెభాష్ అనిపించుకున్నారు. గతేడాది ఏప్రిల్‌లో నాసా హెచ్ఈఆర్‌సీ–2023 నోటిఫికేషన్ ప్రకటించింది. దరఖాస్తు చేసుకున్న వారితో నాసా ప్రతినిధులు ఆన్‌లైన్ ద్వారా ఇంటర్వ్యూలు చేశారు. అండర్–19 విభాగంలో భారత్ నుంచి ఆరుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఆ బృందంలో విజయవాడకు చెందిన అక్షర, ఆకర్ష్‌తో పాటుగా ఒడిశా నుంచి ముగ్గురు, ముంబై నుంచి ఒకరు ఉన్నారు. వారు ఒక బృందంగా ఏర్పడి రోవర్ ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. గ్రహాలపై ఇద్దరు వ్యోమగాములు పరిశోధనలు చేయడానికి ఉపయోగపడేలా రోవర్ తయారు చేశారు. ఈ ఏడాది ఏప్రిల్‌లో బహుమతులను అందజేశారు. మొత్తం 13 విభాగాల్లో నాసా బహుమతులను ప్రకటించింది. ప్రపంచ వ్యాప్తంగా 60 బృందాలు పోటీ పడగా వీరు తయారు చేసిన రోవర్ ప్రాజెక్ట్‌కు సోషల్ మీడియా విభాగంలో ప్రత్యేక బహుమతి లభించింది. ఈ ఏడాది ఏప్రిల్ 22న అమెరికా అలబామా రాష్ట్రంలోని హాంట్స్ విల్లేలో ఉన్న స్పేస్ అండ్ రాకెట్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో ఈ విద్యార్థుల బృందం సభ్యులతో కలిసి పాల్గొని రోవర్ ప్రాజెక్ట్ గురించి వివరించారు.

ఒక వ్యక్తి రోజులో ఎక్కువ భాగం గడిపే చోటు ఏదైనా ఉందంటే అది ఉద్యోగం/ వృత్తిపరమైన విధులు నిర్వర్తించే ప్రదేశమే. ఎవరికైనా ఇది తప్పనిసరే అయినా.. ఆయా ఉద్యోగాలు/వృత్తి ప్రదేశాలకు వ్యక్తుల అనారోగ్యాలకు సంబంధం ఏర్పడుతోంది. సాధారణ జలుబు నుంచి తీవ్రమైన అనారోగ్యాలకు కారణమయ్యే దాకా.. వివిధ ఉద్యోగాలు, వృత్తుల ప్రభావం పడుతోంది. ఆరోగ్యం క్షీణించడం మొదలయ్యే వరకు కూడా చాలా మంది ఈ సమస్యను గమనించలేని పరిస్థితి ఉంటుంది. ఇటీవలికాలంలో వృత్తి వ్యాపకాల ప్రభావం గతంలో కంటే మరింత పెరిగిందని.. శారీరకంగానే కాకుండా మానసికంగానూ ఇబ్బంది పెరుగుతోందని నిపుణులు అంటున్నారు. వీటినే ఆక్యుపేషనల్ హజార్డ్స్‌గా చెప్తున్నారు. ఈ సమస్యలు రాకుండా ఉండటానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచిస్తున్నారు. ఆక్యుపేషనల్ హెల్త్‌పై అవగాహన కలిగిస్తున్న పలు సంస్థల అధ్యయనాలు ఏయే రంగాల్లో పనిచేస్తున్నవారికి ఎలాంటి అనారోగ్య సమస్యలు వస్తున్నాయన్నది తేల్చి చెప్తున్నాయి. వాటి ప్రకారం..

– సాక్షి, హైదరాబాద్



చేసే పనీ.. చేటు చేయొచ్చు!

అనారోగ్య 'గనులు'..: గనులలో పనిచేసే కార్మికులు, ఉద్యోగులకు వారు పీల్చే కలుషిత గాలి ఆరోగ్యంపై ప్రభావం చూపుతుంది. నెమ్మదిగా ఊపిరితిత్తులు పాడవుతాయి. ఎన్ని జాగ్రత్తలు, గట్టి టోపీలు, అగ్నిమాపక భద్రత పరికరాలు, గాగుల్స్ వంటివి వాడినా ప్రమాదం తప్పని పరిస్థితే ఉంటోందని నిపుణులు తేల్చారు.



సమస్యల కర్మాగారాలు..: కర్మాగారాల్లో భారీ యంత్రాలు, ప్రమాదకరమైన పదార్థాలు ఉంటాయి. పెద్ద శబ్దాలు వెలువడతాయి. ఇవన్నీ వ్యక్తుల ఆరోగ్యానికి హానికరమే. ఫ్యాక్టరీ కార్మికులు, మేనేజర్లు లేదా ఫ్లోర్ వర్కర్లలో వినికిడి లోపం సాధారణంగా మారుతోంది.



భవన నిర్మాణం.. ఆరోగ్య ధ్వంసం..: నిర్మాణ రంగంలో ప్రతి ఒక్కరికీ, వారు కార్మికులు, ఉద్యోగులు, డిజైనర్లు ఎవరైనా సరే.. ఎక్కువ సేపు అక్కడే గడిపితే ప్రమాదకరమే. సిమెంట్, మట్టి, ఇసుక ధూళి, పెయింట్లు, మరికొన్ని నిర్మాణ ఉత్పత్తులు ఊపిరితిత్తులను దెబ్బతీస్తాయి.

బీపీఓలలో.. బాడీ క్లాక్‌కు బ్రేక్..: బిజినెస్ ప్రాసెస్ ఔట్ సోర్సింగ్ (బీపీఓ) సెంటర్లలో రాత్రి షిఫ్టులలో పనిచేయడం, నిరంతర రాత్రి షిఫ్టులు, తరచూ షిఫ్టులు మారడం వంటివి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయి. పగటిపూట నిద్రపోతున్నా, షిఫ్టులు మారుతున్నా శరీరంలోని జీవ గడియారం (బయోలాజికల్ క్లాక్) ప్రభావితమవుతుంది. దీర్ఘకాలిక నష్టానికి కారణమవుతోంది. రాత్రి షిఫ్టులలో పనిచేసేవారిలో హైపర్ టెన్షన్, డయాబెటిస్‌తోపాటు సెప్టిక్ అల్సర్లు, గ్యాస్ట్రిక్ అల్సర్లు వస్తున్నాయి.

శుభ్రత.. ఆరోగ్యానికి లేదు భద్రత..: విభిన్న రకాల ఆవరణలను శుభ్రపరిచే వారికీ ఆరోగ్యపు ముప్పు తప్పడం లేదు. టాయిలెట్, బాత్రూం, ఫ్లోర్ క్లీనర్లు వాడినప్పుడు విష వాయువులు వెలువడతాయి. అవి చాలా ప్రమాదకరం.

కంప్యూటర్.. వెన్నెముక కష్టాలు..: కంప్యూటర్ స్క్రీన్ ముందు ఎక్కువ గంటలు కూర్చుని పనిచేసేవారికి వెన్ను భాగం, చేతులు, కళ్లపై తీవ్ర ప్రభావం పడుతుంది. ఇటీవల ఈ రకమైన కెరీర్‌ను ఎంచుకుంటున్నవారు పెరిగారు. చాలా మంది వెన్నెముక సమస్యలు, స్లిప్డ్ డిస్క్, కండరాల ఒత్తిడి వంటి సమస్యలతో బాధపడుతున్నారు.

పూల డిజైనర్‌కూ డేంజర్..: అందంగా, ఆకర్షణీయంగా ఉన్నప్పటికీ పూల డిజైనర్ వృత్తి కూడా సమస్య రేపేదే. పూల డిజైనర్ కాండం నుంచి పూలను కత్తిరించి, అందంగా అమర్చే సమయంలో వాటికి దగ్గరగా ఉంటారు. ఆ పూల మొక్కల కోసం వినియోగించే బలమైన పురుగుమందుల ప్రభావానికి లోనవుతారు.





వినికిడికి.. 'ధ్వని' దెబ్బ..: ఎక్కువ ధ్వని వెలువడే పరిశ్రమలు, ప్రాంతాల్లో పనిచేస్తున్నవారు వినికిడి సమస్యల బారినపడుతున్నారు. దీనికి సంబంధించి మార్గదర్శకాలు కూడా ఉన్నాయి. ఏవైనా పరిశ్రమల్లో ఒక ఉద్యోగి 8గంటల పాటు 90 డెసిబుల్స్ ధ్వనిలో పనిచేయవచ్చు. 95 డెసిబుల్స్ ఉంటే 4 గంటలు, 100 డెసిబుల్స్ ఉంటే 2 గంటలు మాత్రమే పనిచేయాలి. అదే 115 డెసిబుల్స్, ఆపైన తీవ్రతతో ధ్వని ఉంటే.. ఒక్క నిమిషం కూడా ఉండొద్దు. అంతేకాదు.. ఇయర్ ప్లగ్స్, ఇయర్ కెనాల్స్ వంటివి వాడాలి.

వివిధ రకాల వృత్తులు, ఉద్యోగాలతో అనారోగ్యాలు

సాధారణ జలుబు నుంచి కేన్సర్ల దాకా.. మణికట్టు నొప్పి నుంచి వెన్నెముక వ్యాధుల దాకా..

తెలియకుండానే 'ఆక్యుపేషనల్ హజార్డ్స్' బారినపడుతున్న వైనం

రాత్రిపూట పనిచేస్తున్నా, షిఫ్టులు మారుతున్నా ప్రమాదమే!

ముందు జాగ్రత్తపడితేనే సమస్య నుంచి తప్పించుకోవచ్చంటున్న నిపుణులు

వృత్తికో వ్యాధి తప్పట్లేదు

అనేక రకాల పరిశ్రమలు, రంగాలు, వృత్తులు, ఉద్యోగాలు వివిధ రకాల అనారోగ్యాలకు కారణమవుతున్నాయి.

- ట్రాఫిక్ కానిస్టేబుళ్లకు ఊపిరితిత్తుల సమస్యలు, అతిగా నిలబడడం వల్ల వెరికోసిటీస్, వినికిడి సమస్యలు వస్తున్నాయి.
- పాఠశాలల్లో పనిచేసే టీచర్లకు ఆక్యుపేషనల్ స్ట్రెస్ ఎక్కువగా ఉంటోందని, డయాబెటిస్, హైపర్ టెన్షన్ బారినపడుతున్నారని అధ్యయనాలు తేల్చాయి. గట్టిగా మాట్లాడుతూ బోధించడం వల్ల గొంతు సమస్యలూ కనిపిస్తున్నాయని అంటున్నాయి.
- లారీలు, కంటైనర్లు వంటి భారీ వాహనాల డ్రైవర్లకు వెన్ను సమస్యలు, ఆస్టియో ఆర్థరైటిస్, వాహనాల వైబ్రేషన్ వల్ల రక్తపోటు సమస్యలు వస్తున్నాయి. కన్నార్పకుండా రోడ్లను చూస్తూ ఉండటం వల్ల కళ్లు పొడిబారుతూ దృష్టి సమస్యలు వస్తున్నట్టు గుర్తించారు.
- సిలికా పరిశ్రమలో పనిచేసేవారు ఊపిరితిత్తులకు సంబంధించిన సిలికోసిస్‌కు గురవుతారు. ఆస్‌బెస్టాస్ పరిశ్రమల్లో పనిచేసేవారు పలు రకాల కేన్సర్లకు, చక్కెర పరిశ్రమలో పనిచేసేవారు పెగసోసిస్ వంటివాటికి గురవుతారు.

ముందు జాగ్రత్తలు పాటిస్తేనే మేలు

'ఆక్యుపేషనల్ హజార్డ్స్' బారిన పడకుండా ముందు జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు. తాము చేస్తున్న ఉద్యోగం/వృత్తి వల్ల ఎలాంటి సమస్యలు వస్తాయో గుర్తించి.. వాటి నుంచి తప్పించుకునే అంశాలను పాటించాలని స్పష్టం చేస్తున్నారు. ఉదాహరణకు కంప్యూటర్ ముందు గంటల తరబడి కూర్చుని పనిచేసేవారు.. మధ్యలో కాసేపు లేచి నడవడం, దూరంగా ఉన్న వస్తువులను చూడటం, వీలైతే చిన్నచిన్న వ్యాయామాలు చేయడం మంచిదన్నారు. అపరిశుభ్ర, కాలుష్య పరిస్థితుల్లో పనిచేసేవారు మాస్కులు, గ్లౌజులు వంటివి కచ్చితంగా వాడాలన్నారు. వైద్యులను సంప్రదించి ఏయే జాగ్రత్తలు తీసుకోవాలో సలహాలు తీసుకుని పాటించాలని స్పష్టం చేస్తున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం..



వృత్తి, ఉద్యోగపరమైన బాధ్యతల వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వస్తున్నాయి. వీటిపై తరచుగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నాం. గత వారం ట్రాఫిక్ పోలీసులకు వచ్చే సమస్యలపై సదస్సు ఏర్పాటు చేశాం. కొత్తగా పుట్టుకొస్తున్న ప్రొఫెషన్ల వల్ల కూడా కొత్త ఆరోగ్య సమస్యలు మొదలవుతున్నాయి. ఈ తరహా ఆక్యుపేషనల్ హజార్డ్స్‌కు చికిత్సలు లేవు. అందువల్ల ఆయా రంగాల్లో విధులు నిర్వర్తిస్తున్నవారు అవగాహన పెంచుకుని, జాగ్రత్తలు పాటించాలి.

– డాక్టర్ విజయ్‌రావు, జాతీయ అధ్యక్షుడు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ ఆక్యుపేషనల్ హెల్త్



ఉజ్జయినీ మహంకాళి బోనాల సందర్భంగా అమ్మవారిని దర్శించుకున్న సీఎం కేసీఆర్ దంపతులు. చిత్రంలో తలసాని, ఇంద్రకరణ్, శ్రీనివాస్ గౌడ్, సంతోష్, పల్లా, విజయలక్ష్మి తదితరులు

వైభవంగా ఉజ్జయినీ మహంకాళి బోనాలు

▶ మొదటి పేజీ తరువాయి

అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

ముఖ్యమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం

ముఖ్యమంత్రి కేసీఆర్ తన సతీమణితో కలిసి అమ్మవారిని దర్శించుకుని పట్టువస్త్రాలు సమర్పించి పూజలు చేశారు. దేవాదాయ శాఖ కమిషనర్ అనిల్ కుమార్, ఈవో గుత్తా మనోహర్‌రెడ్డి, వేద పండితులు, అర్చకులు పూర్ణ కుంభంతో ఆయనకు స్వాగతం పలికారు. మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ కేకే తదితరులు కూడా సీఎంకు స్వాగతం పలికారు. సీఎం వెంట మంత్రులు ప్రశాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ జోగినపల్లి సంతోష్ వచ్చారు. కాగా హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, కేంద్రమంత్రి, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, ఎంపీ కె.కేశవరావు, సీఎల్పీ నేత భట్టి విక్రమార్క, ఎమ్మెల్యేలు ఈటల రాజేందర్, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేష్, దానం నాగేందర్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కె.కవిత, మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డి, మాజీ ఎంపీలు వి.హన్మంతరావు, అంజన్‌కుమార్ యాదవ్, వివిధ కార్పొరేషన్ల చైర్మన్లు, ఇతర ప్రజా ప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఎమ్మెల్సీ కవిత బంగారు బోనంతో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయానికి వచ్చే సమయంలో విడిగా వచ్చిన కవిత, తిరిగి వెళ్లేటప్పుడు మాత్రం తల్లిదండ్రులతో కలిసి వెళ్లారు.

పద్మారావు ఇంట్లో విందుకు సీఎం

మహంకాళి అమ్మవారికి పూజలు చేసిన తర్వాత ముఖ్యమంత్రి నేరుగా టకారాబస్తీలోని డిప్యూటీ స్పీకర్ పద్మారావు నివాసానికి వెళ్లారు. ఆయన కుటుంబసభ్యులతో కలిసి బోనాల విందును ఆరగించారు. సీఎంతో పాటు ఆయన సతీమణి, మంత్రులు మల్లారెడ్డి, మహమూద్ అలీ, శ్రీనివాస్‌గౌడ్, ఎంపీ సంతోష్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, కవిత తదితరులు ఉన్నారు.

తెలుగులో తీర్పునివ్వడం అభినందనీయం



జస్టిస్ నవీన్‌రావును అభినందిస్తున్న జస్టిస్ సుదర్శన్ రెడ్డి తదితరులు

- జస్టిస్ నవీన్‌రావు చొరవ ప్రశంసనీయం
- సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

పంజగుట్ట (హైదరాబాద్): తెలుగు రాష్ట్రాల జిల్లా కోర్టుల్లో కూడా ఒకటి, రెండు మినహాయించి తెలుగులో తీర్పులివ్వడం లేదని అలాంటిది తెలంగాణ హైకోర్టులో తెలుగులోనే తీర్పు ఇచ్చేందుకు జస్టిస్ పి.నవీన్‌రావు చూపిన చొరవ అభినందనీయమని సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో విశ్వనాథ సాహిత్యపీఠం ఆధ్వర్యంలో ఆదివారం జస్టిస్ పి.నవీన్‌రావుకు అభినందన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ... తమిళనాడులో వాదనలు, తీర్పులన్నీ తమిళంలోనే ఉంటాయన్నారు. చాలా రాష్ట్రాల్లో 75% హైకోర్టు తీర్పులు కూడా వారి భాషల్లోనే ఇస్తున్నారని ఈ విషయంలో తెలుగురాష్ట్రాలు చాలా వెనుకబడి ఉన్నాయని చెప్పారు. జస్టిస్ నవీన్‌రావు న్యాయవాదవృత్తిలోకి ప్రవేశించినప్పటి నుంచి చూస్తున్నానని ఇలాంటి తీర్పులు ఇవ్వడం ఆయనకే సాధ్యమని కొనియాడారు. ప్రభుత్వ న్యాయవాదులు చేసే ఉత్తర ప్రత్యుత్తరాలు కూడా తెలుగులోనే ఉంటే కొంతమేర మార్పు తీసుకొచ్చే అవకాశముందన్నారు. జస్టిస్ నవీన్‌రావు మాట్లాడుతూ...తాను ఇంటర్‌వరకు తెలుగు మీడియంలోనే చదువుకున్నానని, ఇంటర్ తర్వాత ఆంగ్లమాధ్యమంలోకి వెళ్లి ప్రాక్టీస్ కూడా ఇంగ్లిష్‌లోనే చేశానన్నారు. తెలుగులో తీర్పు ఇచ్చినప్పటికీ ఇంగ్లిష్ పదాలకు సమానమైన తెలుగు పదాలు వాడలేకపోయానన్నారు. రాబోయే రోజుల్లో వచ్చే న్యాయమూర్తులు పూర్తిస్థాయిలో తెలుగు తీర్పులిచ్చే ప్రయత్నం చేస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. పీఠం అధ్యక్షుడు, సాహితీవేత్త కొండల్‌రావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి బుద్ధ ప్రసాద్, రామచంద్రమూర్తి, శ్రీనివాస్, హరగోపాల్ హాజరయ్యారు.

నల్లగొండకు పాకిన పేపర్ లీకేజీ

- సూర్యాపేట జిల్లా నడిగూడెంకు చెందిన నాగరాజు అరెస్టు
- ఏఈ ప్రశ్నపత్రం రూ.30 లక్షలకు కొన్నట్లు తేల్చిన సిట్



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీ వ్యవహారం ఉమ్మడి నల్లగొండ జిల్లాకు పాకింది. ఈ ఉదంతంలో మాజీ ఏఈ పూల రమేష్‌తో బేరాలు కుదుర్చుకొని పరీక్షలు రాసిన ఒక్కొక్కరిని సిట్ అరెస్ట్ చేస్తోంది. తాజాగా శనివారం సూర్యాపేట జిల్లా నడిగూడెం మండలం రామాపురానికి చెందిన నాగరాజు అనే అభ్యర్థి రూ.30 లక్షలకు బేరం పెట్టిన అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్ష ప్రశ్నపత్రాన్ని కొనుగోలు చేసినట్లు తేలడంతో అతడిని అరెస్టు చేసింది.

మొబైల్ లొకేషన్ ఆధారంగా..

రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన పేపర్ల లీకేజీ వ్యవహారంలో ఇప్పటివరకు ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన వారెవరూ ఇందులో దొరకలేదు. తాజాగా ఏఈ పరీక్షలో 16వ ర్యాంకు సాధించిన నాగరాజు ప్రశ్నపత్రం కొనుగోలు చేసినట్లు తేలడంతో అతన్ని అరెస్టు చేసింది. నాగరాజును అతని మొబైల్ లొకేషన్ ఆధారంగా సిట్ పోలీసులు పట్టుకున్నారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో పంచనామా చేపట్టి విచారణ నిమిత్తం హైదరాబాద్‌కు తరలించారు. పేపర్ లీకేజీ ఘటనలో గతంలో అరెస్ట్ అయిన గోగులోత్ శ్రీనునాయక్ ద్వారా పూల రమేష్‌కు నాగరాజు పరిచయం అయ్యాడు. ఈ కేసులోని ప్రధాన నిందితుల్లో ఒకరైన ప్రవీణ్‌కుమార్ ద్వారా ఏఈ పేపర్ తెప్పించుకున్న రమేష్, దానిని బహిరంగ మార్కెటల్లో ఒక్కొక్కరికి రూ.30 లక్షలకు బేరం పెట్టాడు. అప్పటికే మాస్ కాపీయింగ్‌లో పలువురితో బేరాలు కుదుర్చుకున్న రమేష్, లీకైన పేపర్‌ను అమ్మేందుకు అప్పటికే తన వద్ద ఉన్న మాస్ కాపీయింగ్ నెట్‌వర్క్‌ను వాడుకున్నాడు. ఇందులో భాగంగానే నాగరాజుకు ఏఈ ప్రశ్న పత్రం అమ్మాడు.

రమేష్ నెట్‌వర్క్‌లో మరికొందరు!

మాజీ ఏఈ పూల రమేష్ నెట్‌వర్క్‌లో ఉన్న వారందరినీ త్వరలోనే అరెస్ట్ చేసేందుకు సిట్ రంగం సిద్ధం చేసింది. ఇప్పటికే నాగరాజును అరెస్టు చేయగా, ఇంకా కొంతమంది కూడా ఉన్నట్లు అనుమానిస్తోంది. నాగరాజును విచారించాక, రమేష్ నెట్‌వర్క్‌లో ఇంకా ఎవరెవరు ఉన్నారనేది బయట పడుతుందని భావిస్తున్నారు.

మాస్టార్ల బదిలీలు, పదోన్నతులు ఎప్పుడు?

▶ మొదటి పేజీ తరువాయి

మెజారిటీ టీచర్ల వాదన. స్పౌజ్‌లు అందరూ దీన్ని అడ్డం పెట్టుకుని హైదరాబాద్ పరిసర ప్రాంతాలను కోరుకుంటే, ఇలాంటి వాళ్ళు 60 వేల మంది వరకు ఉండాలి. కానీ ఈ విషయాన్ని విద్యాశాఖ గుర్తించడం లేదని టీచర్లు అంటున్నారు. అసలు కోర్టులో వివాదం లేవనెత్తిన వాళ్ళల్లో ఎక్కువ మంది అధిక హెచ్ఆర్ఏ పొందుతూ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లోనే ఉన్నారు. ఇలా కేసులు వేసి, వాళ్ళను వాళ్ళు కాపాడుకునే ప్రయత్నం చేస్తుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని టీచర్లు ప్రశ్నిస్తున్నారు.

ఇది స్వార్థం కాదా?

వివాదం లేవనెత్తుతున్న నాన్ స్పౌజ్‌ల్లో 13 ఏళ్ళకుపైగా హైదరాబాద్, రంగారెడ్డి, సంగారెడ్డి జిల్లాల పరిధిలోని 8 మండలాల్లోనే పనిచేస్తున్నారు. వీరికి 24 శాతం హెచ్ఆర్ఏ వస్తుంది. ఇందులో చాలా మంది రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాలు చేస్తున్నారన్న ఆరోపణలున్నాయి. వీరి ప్రయోజనం కోసం 80 వేల మంది టీచర్ల బదిలీల ప్రక్రియకు అడ్డం పడుతున్న వాస్తవాన్ని ప్రభుత్వం ఎందుకు పట్టించుకోదు. ఇప్పటికైనా వివాదం వెనుక వాస్తవాలు గుర్తించి, బదిలీల ప్రక్రియ సాఫీగా సాగేందుకు ప్రభుత్వం కృషి చేయాలి. – జైపాల్ రెడ్డి (స్పౌజ్ ఉద్యోగుల నేత)

అసలో, నకిలీనో తేలాకే ముందుకు..

అభ్యర్థుల సర్టిఫికెట్లను వెరిఫికేషన్‌కు పంపుతున్న కంపెనీలు

- ఉన్నత విద్యామండలి వెరిఫికేషన్ సర్వీస్‌కు పెరుగుతున్న దరఖాస్తులు
- విదేశీ సంస్థల నుంచీ అప్లికేషన్లు.. జేఎన్‌టీయూహెచ్ సర్టిఫికెట్లపైనే ఎక్కువ అర్జీలు

సాక్షి, హైదరాబాద్: నకిలీ సర్టిఫికెట్లను గుర్తించేందుకు ఉన్నత విద్యామండలి నేతృత్వంలో ఏర్పాటు చేసిన స్టూడెంట్ అకడమిక్ సర్టిఫికెట్ వెరిఫికేషన్ (ఎస్‌ఏవీఎస్)కు దరఖాస్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. బోగస్ సర్టిఫికెట్లు కాదని నిర్ధారణయ్యాకే అభ్యర్థులకు కంపెనీలు ఆఫర్ లెటర్లు ఇస్తున్నాయి. కొన్ని విదేశీ సంస్థలు కూడా ఇదే బాట పడుతున్నాయి. ప్రముఖ ఐటీ కంపెనీలు సైతం ఎస్‌ఏవీఎస్‌పై ఆధారపడుతున్నాయి. ఉద్యోగాలకు దరఖాస్తులు అందిన వెంటనే కంపెనీలు ఆయా సర్టిఫికెట్లను వెరిఫికేషన్‌కు పంపుతున్నాయి. ఎస్‌ఏవీఎస్ పరిధిలోకి అన్ని విశ్వవిద్యాలయాలకు చెందిన 15 ఏళ్ల సర్టిఫికెట్లను క్లౌడ్ ద్వారా నిక్షిప్తం చేశారు. దీంతో కేవలం మౌస్‌క్లిక్ ద్వారానే అసలో నకిలీనో తేల్చడం సాధ్యమవుతోందని అధికార వర్గాలు అంటున్నాయి. కంపెనీలు గతంలో థర్డ్ పార్టీతో వెరిఫికేషన్ చేయించేవి. ఈ ప్రక్రియ ఆలస్యమయ్యేది. నకిలీ అని తేలిన తర్వాత ఉద్యోగులను తొలగించేవాళ్లు. ఇప్పుడు ఆన్‌లైన్ విధానంతో అన్నీ చకాచకా జరిగిపోతున్నాయి. ఆన్‌లైన్ వెరిఫికేషన్ వల్ల నకిలీ సర్టిఫికెట్లతో విదేశాలకు వెళ్లే వారిలోనూ కొంత భయం చోటుచేసుకుందని అధికారులు అంటున్నారు.

8 వేలకు పైగా దరఖాస్తులు

కొన్నేళ్లుగా అక్రమార్కులు అసలును పోలిన నకిలీ సర్టిఫికెట్లను సృష్టిస్తున్నారు. ఈ అనుభవాలను దృష్టిలో ఉంచుకుని విశ్వవిద్యాలయాలు పలు చర్యలు తీసుకున్నాయి. సర్టిఫికెట్ల ముద్రణకు వాడే లోగోలు, వాటర్ మార్కుల్లో హైసెక్యూరిటీ విధానాలను తెచ్చాయి. సర్టిఫికెట్ల కోసం నాణ్యమైన, ధృడమైన పేపర్‌ను వాడటంతోపాటు ఆధునిక సాంకేతికతతో సెక్యూరిటీ ఫీచర్లను జోడిస్తున్నాయి.



యూనిక్ కోడ్ నంబర్లను అందుబాటులోకి తెచ్చాయి. అయితే, వీటిని కూడా నకిలీ సర్టిఫికెట్ల ముఠా తెలుసుకుని, తేలికగా నకిలీలకు పాల్పడుతోంది. వీటి ఆధారంగా విదేశాలకు వెళ్లి, అక్కడ పట్టుబడ్డ వాళ్లూ ఉన్నారు. ఐదేళ్లుగా దేశవ్యాప్తంగా 48 కేసులు ఐటీ రంగంలో చోటుచేసుకున్నాయి. ఫిర్యాదులు చేస్తే ఇవి పెద్ద మొత్తంలో ఉంటాయని అధికారులు అంటున్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకునే ఎస్‌ఏవీఎస్‌ను ఏర్పాటు చేశారు. ఇందుకు సంబంధించిన పోర్టల్‌లో ఎవరైనా సంబంధిత సర్టిఫికెట్లను లోడ్ చేస్తే వర్సిటీలు వీలైనంత త్వరగా సాఫ్ట్‌వేర్ సాయంతో పరిశీలించి, నకిలీవో, అసలువో తెలియజేస్తారు. బోగస్ సర్టిఫికెట్లు అని తేలితే కంపెనీలు ఉద్యోగులను తొలగించి చేతులు దులుపుకుంటున్నాయి. పది నెలల వ్యవధిలో ఎస్‌ఏవీఎస్‌కు 8,376 దరఖాస్తులొచ్చాయి. ఇందులో ఇప్పటి వరకూ 3 వేలకుపైగా పరిశీలించి, నిర్ధారణ చేయగా, మిగతా వాటిని పరిశీలించాల్సి ఉంది.

ఎక్కువ భాగం టెక్నికల్ విద్యవే..

నకిలీ సర్టిఫికెట్లు ఎక్కువగా సాంకేతిక విద్యకు సంబంధించినవే వస్తున్నాయి. అందులోనూ ఇంజనీరింగ్ సర్టిఫికెట్లను ఎక్కువగా నకిలీ ముఠా టార్గెట్ చేసింది. సాఫ్ట్‌వేర్ కొలువులే ఎక్కువగా ఉండటం వల్ల వీటికి డిమాండ్ ఉన్నట్టు పోలీసు వర్గాలు గుర్తించాయి. ఇంజనీరింగ్ పూర్తి చేయకుండానే కొన్ని కోర్సులు నేర్చుకుని బోగస్ సర్టిఫికెట్లతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగాలు పొందుతున్నట్టు తేలింది. ఇంజనీరింగ్ కాలేజీలు ఎక్కువగా ఉన్న జేఎన్‌టీయూహెచ్ పరిధిలోని సర్టిఫికెట్ల నిర్ధారణకు ఎక్కువగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటివరకూ ఈ వర్సిటీ జారీచేసినట్లు చెబుతున్న సర్టిఫికెట్లకు సంబంధించి 5,269 దరఖాస్తులు వచ్చాయని అధికారులు తెలిపారు. తర్వాత స్థానంలో ఉస్మానియా వర్సిటీ ఉంది.

అధిక పెన్షన్ దరఖాస్తులకు రేపే ఆఖరు

▶ మొదటి పేజీ తరువాయి

అవకాశం ఉందని, దీన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించాయి.

రెండు నెలల్లో పరిశీలన పూర్తి..

ఈపీఎఫ్‌వో అధిక పెన్షన్ పథకం కింద ఎంప్లాయీస్ పెన్షన్ స్కీం (ఈపీఎస్)కు అర్హత ఉన్న వారి నుంచి ఆప్షన్ స్వీకరిస్తోంది. దరఖాస్తుల ప్రక్రియ ముగిశాక వాటిని పరిశీలించేందుకు ఈపీఎఫ్‌వో ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్టు అధికారులు తెలిపారు. ఇందుకు సంబంధించి పరిశీలన అధికారులను ఈపీఎఫ్‌వో సన్నద్ధం చేస్తోందని వివరించారు. వారు ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులను నిశితంగా పరిశీలిస్తారు. ఇందులో భాగంగా ఈపీఎఫ్‌వో అధికారులు ఉద్యోగికి, వారు పనిచేస్తున్న సంస్థ యాజమాన్యానికి నోటీసులు జారీ చేస్తారు. రికార్డులను పరిశీలిస్తారు. తర్వాత అధిక పెన్షన్ కింద చందా, బకాయిలకు సంబంధించిన అంశాలను వెల్లడిస్తూ.. చెల్లించేందుకు కొంత గడువు ఇస్తారు. ఈ ప్రక్రియకు కనీసం రెండు నెలలు పడుతుందని అధికారులు చెప్తున్నారు.

క్లుప్తంగా...

త్వరలో నానమ్మ ఊరికి మంత్రి కేటీఆర్..

కోనాపూర్‌కు వస్తానంటూ ట్వీట్



సాక్షి, కామారెడ్డి: 'ఇచ్చిన మాట ప్రకారం కోనాపూర్‌లో ప్రభుత్వ పాఠశాల భవన నిర్మాణం పూర్తి చేశాం. త్వరలోనే దానిని ప్రారంభిస్తాం. మా నానమ్మ వెంకటమ్మ సంతోషిస్తుంది'.. అని మున్సిపల్, ఐటీ శాఖల మంత్రి కేటీఆర్ ఆదివారం ట్విట్టర్‌లో పోస్టు చేశారు. నానమ్మ వెంకటమ్మ స్మారకార్థం ఆమె పుట్టిన ఊరైన కామారెడ్డి జిల్లా బీబీపేట మండలం కోనాపూర్‌లో ఆధునిక హంగులతో బడి నిర్మిస్తానని మంత్రి కేటీఆర్ గతంలో హామీ ఇచ్చారు. ఈ మేరకు గతేడాది మే 10న సొంత డబ్బులతో పాఠశాల భవన నిర్మాణానికి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. రూ.2.5 కోట్లతో ఆధునిక హంగులతో భవనం నిర్మించారు. పూర్తయిన పాఠశాల భవనం ఫొటో, వీడియోను కేటీఆర్ ఆదివారం ట్విట్టర్‌లో షేర్ చేసి త్వరలోనే ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మంత్రి ప్రకటనపై కోనాపూర్‌వాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

బీఆర్‌ఎస్‌తో బ్రేకప్ కాలేదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు



కరీంనగర్: బీఆర్‌ఎస్ పార్టీతో బ్రేకప్ కాలేదని, రానున్న ఎన్నికల్లో బీజేపీని నిలువరించేందుకు అన్నీ కుదిరితే బీఆర్‌ఎస్‌తో పొత్తు ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు స్పష్టం చేశారు. పరస్పర ఓటు బదిలీ, సీట్లు ఇచ్చిపుచ్చుకునే ధోరణి బాగుంటేనే పొత్తు అని, లేకుంటే సింగిల్‌గానే పోటీ చేస్తామని వెల్లడించారు. కమ్యూనిస్టులకు ఓట్లు, సీట్లు ముఖ్యం కాదని, ప్రజలపక్షం ఉంటూ పాలకవర్గాల విధానాలు ఎండగట్టడమే లక్ష్యంగా పనిచేస్తామని తెలిపారు. ఆదివారం ఆయన కరీంనగర్‌లో విలేకరులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ పార్టీతో మునుగోడు ఉప ఎన్నిక నుంచి సంబంధాలు ఉన్నాయని, కమ్యూనిస్టుల మద్దతుతోనే మునుగోడులో బీజేపీని ఓడించగలిగామని చెప్పారు. కానీ పొత్తులపై తలవంచే ప్రసక్తి లేదని, గౌరవానికి భంగం కలిగితే ఊరుకోబోమని వ్యాఖ్యానించారు. బీజేపీకి తెలుగు రాష్ట్రాల్లో స్థానం లేదన్నారు.

కేసీఆర్.. మోదీ మధ్య రహస్య ఒప్పందం

- ట్విట్టర్‌లో వైఎస్ షర్మిల



సాక్షి, హైదరాబాద్: కేసీఆర్‌ను ప్రధాని నరేంద్ర మోదీ కేడీ అంటే.. మోదీని బోడీ అని కేసీఆర్ అంటున్నారని.. 'నువ్వు కొట్టినట్లు చెయ్యి, నేను పడ్డట్లు ఏడుస్తా'చందంగా ఇద్దరి మధ్య రహస్య ఒప్పందం కుదిరిందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిలరెడ్డి విమర్శించారు. ఢిల్లీ దాకా కేసీఆర్ అవినీతి పాకిందని చెబుతున్న బీజేపీ ఇన్నాళ్లు ఎందుకు విచారణ జరిపించలేదని ఆమె ఆదివారం ట్విట్టర్ వేదికగా ప్రశ్నించారు. కేసీఆర్‌ది అత్యంత అవినీతి ప్రభుత్వమైతే తక్షణ దర్యాప్తునకు ఎందుకు ఆదేశాలు ఇవ్వలేదని నిలదీశారు. మాయల ఫకీరు ప్రాణాలు చిలకలో ఉన్నట్లు.. కేసీఆర్ అవినీతి చిట్టా బీజేపీ దగ్గర ఉందంటూ ఆమె వ్యాఖ్యానించారు. బీజేపీకి బీఆర్‌ఎస్ బీ టీం కాకపోతే కేసీఆర్‌ను ఎందుకు అరెస్ట్ చేయలేదని సూటిగా ప్రశ్నించారు. 'రాష్ట్రాన్ని దోచుకు తిన్న కల్వకుంట్ల కుటుంబానికి బీజేపీనే అండా దండ అని.. పైకి సిగపట్లు, లోపల చప్పట్లు.. ఇదే రెండు పార్టీల దొంగ రాజకీయం'.. అని ఆమె ఎద్దేవా చేశారు. బీజేపీ బీఆర్‌ఎస్ రెండూ వేర్వేరు పార్టీలు కావని స్పష్టం చేశారు. రెండు పార్టీలు కలిసి 'బీజేపీ రాష్ట్ర సమితి'రాజకీయాన్ని నడుపుతున్నాయని దుయ్యబట్టారు. నిజంగా కేసీఆర్ తెలంగాణ బిడ్డే అయితే, బీజేపీతో వైరమే ఉంటే.. మోదీ రాష్ట్రానికి వస్తే ఎందుకు మొహం చాటేస్తున్నట్టని షర్మిల నిలదీశారు.

నిధులిస్తారనుకుంటే మోదీ నిరాశ పరిచారు

- రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: వరంగల్ నగరానికి తొలిసారిగా వచ్చిన ప్రధాని మోదీ జిల్లాకు ఏమైనా నిధులిస్తారేమోనని ఎదురుచూసిన ప్రజలకు నిరాశ మిగిల్చి వెళ్లారని ఎమ్మెల్సీ, రైతుబంధు సమితి అధ్యక్షుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విమర్శించారు. ప్రధానమంత్రి ప్రజల చిరకాల డిమాండ్ల గురించి, నిధుల మంజూరు గురించి మాట్లాడకుండా ఫక్తు రాజకీయ నాయకుడిగా ప్రత్యర్థి పార్టీలను విమర్శించడం శోచనీయమని అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, ములుగులో గిరిజన యూనివర్సిటీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ వంటి ప్రజల చిరకాల కోరికలను నెరవేర్చే ఏ హామీ ఇవ్వని ప్రధాని.. బీజేపీ నాయకులు రాసిచ్చిన స్క్రిప్టు చదివి వెళ్లారని ధ్వజమెత్తారు. బీజేపీ రాష్ట్రాల్లో ఉన్న అవినీతి, అక్రమాలు దేశ ప్రజలకు తెలుసని, కర్ణాటకలో అవినీతి కారణంగానే అక్కడి ప్రజలు మొన్నటి ఎన్నికల్లో బీజేపీని తిరస్కరించారని గుర్తు చేశారు. మధ్యప్రదేశ్‌లో వ్యాపం కుంభకోణం ఇప్పటికీ కొలిక్కి రాలేదన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థను దిగజార్చారని, అదానీ, అంబానీ కోసమే మోదీ పని చేస్తున్నారని విమర్శించారు.

బీజేపీ, బీఆర్‌ఎస్ ఎప్పుడూ ఒకటి కాబోవని చెప్పండి

దుష్ప్రచారం దీటుగా తిప్పికొట్టండి
- ప్రజలకు వాస్తవాలు వివరించండి
- బీఆర్‌ఎస్, కాంగ్రెస్ ఇరవై ఏళ్లుగా కలిసి సాగుతుండటాన్ని ఎండగట్టండి
- రాష్ట్ర బీజేపీ నేతలకు నడ్డా సీరియస్ క్లాస్
- పార్టీ లైన్ దాటితే కఠిన చర్యలంటూ హెచ్చరిక



నోవాటెల్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న నడ్డా. చిత్రంలో కిషన్‌రెడ్డి, ప్రకాశ్ జవదేకర్, తరుణ్ చుగ్, జితేందర్‌రెడ్డి, ఈటల, డీకే అరుణ, బండి సంజయ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: 'బీఆర్‌ఎస్, బీజేపీ ఒకటి కాదనే ప్రచారాన్ని సమర్థవంతంగా గట్టిగా తిప్పికొట్టండి.. ఈ రెండు పార్టీలు ఎప్పుడూ ఒకటి కావు..కాబోవు అనే విషయాన్ని విడమర్చి చెప్పండి. బీఆర్‌ఎస్‌తో బీజేపీకి గతంలోనూ ఎలాంటి ఒప్పందాలు లేని విషయాన్ని, బీఆర్‌ఎస్ మన ప్రధాన శత్రువు అని చాటండి. గతంలో చోటుచేసుకున్న పరిణామాలను, బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి దాదాపు ఇరవై ఏళ్లుగా వివిధ సందర్భాల్లో కలిసి సాగుతున్న విషయాన్ని ఎండగట్టండి. ఎవరో ఏదో అంటున్నారని, బీజేపీపై దుష్ప్రచారం చేస్తున్నారని మా దృష్టికి తీసుకొచ్చే ముందు క్షేత్రస్థాయిలో ఆ ప్రచారాన్ని బలంగా తిప్పికొట్టండి. ప్రజలకు వాస్తవాలు వివరించి మద్దతు కూడగట్టండి. పార్టీ వ్యతిరేక ప్రచారాన్ని సమష్టిగా ఎదుర్కోండి..'అంటూ బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా రాష్ట్ర నేతలకు క్లాస్ తీసుకున్నారు. 'ఎన్నికల సమరంలోకి దిగి అన్ని సవాళ్లను ఎదుర్కోండి. అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపొందేందుకు ఉమ్మడిగా కృషి చేయండి. ఏ సమస్యలున్నా మీకు అండగా నిలుస్తాం. పూర్తి సహాయ సహకారాలు అందిస్తాం. మీరంతా సీనియర్ నేతలు. రాజకీయాల్లో ఎలా వ్యవహరించాలో మీకు మేము చెప్పాల్సిన అవసరం లేదు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎదుర్కొనేలా కార్యాచరణను సిద్ధం చేసుకుని ముందుకు సాగండి..'అని చెప్పారు. నగరంలోని నోవాటెల్ హోటల్లో ఆదివారం రాత్రి పొద్దు పోయేదాకా రాష్ట్ర పార్టీ ముఖ్య నేతలతో నడ్డా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ భేటీలో రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి, పార్లమెంటరీబోర్డు సభ్యుడు డా.కె.లక్ష్మణ్, జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ, రాష్ట్ర పార్టీ ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, తమిళనాడు సహ ఇన్‌చార్జి పొంగులేటి సుధాకరరెడ్డి, జాతీయ కార్యవర్గసభ్యులు విజయశాంతి, వివేక్ వెంకటస్వామి, గరికపాటి మోహన్‌రావు పాల్గొన్నారు.

లీకులిస్తే ఉపేక్షించేది లేదు..

వివిధ స్థాయిల్లోని నేతలు గత కొంతకాలంగా మీడియా చిట్‌చాట్‌ల పేరిట, లీకులతో జరిపిన వ్యవహారం పార్టీకి నష్టం చేసిందని, ఇకపై ఎవరూ ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడొద్దని నడ్డా హెచ్చరించినట్టు సమాచారం. 'పార్టీ క్రమశిక్షణను ఎవరూ ఉల్లంఘించకూడదు. ఇదే పద్ధతి కొనసాగిస్తే కఠిన చర్యలు ఉంటాయ్'అని అన్నట్టు తెలిసింది. కర్ణాటకలో పార్టీకి ప్రజల్లో మద్దతున్నా, పార్టీ నాయకులు, ముఖ్యనేతల మధ్య సమన్వయం లేకపోవడం, విభేదాలు రోడ్డెక్కడంతో ప్రజల తిరస్కారానికి గురికావాల్సి వచ్చిందని వివరించినట్టు తెలిసింది. తెలంగాణలో కర్ణాటక పరిస్థితి ఎదురుకాకుండా పార్టీ నేతలంతా సమన్వయంతో కలిసికట్టుగా ముందుకు సాగాలని దిశానిర్దేశం చేసినట్లు పార్టీవర్గాలు తెలిపాయి. 'పార్టీ లైన్ దాటొద్దు..నోరు జారొద్దు..క్రమశిక్షణను ఉల్లంఘించొద్దు...పార్టీ కేడర్‌లో విశ్వాసం, నమ్మకం నింపండి. పూర్తి విశ్వాసంతో ముందుకు సాగండి..' అని సూచించినట్లు వెల్లడించాయి. రాత్రి నోవాటెల్‌లోనే బసచేసిన నడ్డా, సోమవారం ఉదయం ఢిల్లీకి తిరిగి వెళ్లనున్నారు. రాష్ట్ర శాసనసభ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వంద రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని రాష్ట్ర నాయకత్వం నిర్ణయించినట్టు సమాచారం.

గులాబీ టీమ్ గందరగోళం ఎట్లా?

మొదటి పేజీ తరువాయి

అంశాలపై చర్చ జరిగినప్పుడు రాష్ట్ర నేతలు పలు అంశాలను లేవనెత్తగా.. జాతీయ పార్టీ తరఫున నడ్డా స్పష్టత ఇచ్చారు.

బీఆర్‌ఎస్ పట్ల మెతక వైఖరి ఉండదు!

భేటీ సందర్భంగా బీఆర్‌ఎస్‌కు బీజేపీ బీ టీం అంటూ కాంగ్రెస్ చేస్తున్న ప్రచారం ఇబ్బందికరంగా మారిందని రాష్ట్ర ముఖ్యనేతలు కిషన్‌రెడ్డి, లక్ష్మణ్, డీకే అరుణ, పొంగులేటి సుధాకర్‌రెడ్డి తదితరులు నడ్డా దృష్టికి తీసుకొచ్చినట్టు తెలిసింది. ఈ ప్రచారాన్ని ప్రజలు నమ్మే పరిస్థితులు కనిపిస్తున్నందున తగిన చర్యలు తీసుకోవాలని కోరినట్టు సమాచారం. దీనిపై స్పందించిన నడ్డా.. ''తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వచ్చేందుకు కచ్చితంగా అవకాశాలు ఉన్నాయి. అవినీతికి పాల్పడిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు. పార్టీ నాయకత్వం దృష్టిలో అన్ని అంశాలు ఉన్నాయి. తగిన సమయంలో కచ్చితంగా అవసరమైన చర్యలు ఉంటాయి. మీ పని మీరు చేసుకుంటూ వెళ్లండి. పార్టీ బలోపేతం, ప్రజల్లో మద్దతు కూడగట్టడంపై సమన్వయంతో ఐక్యంగా కృషి చేయండి'' అని స్పష్టం చేసినట్టు తెలిసింది.

ఏపీలో పార్టీ పరిస్థితిపైనా చర్చ

భేటీ సందర్భంగా ఏపీలో పార్టీ ప్రస్తుత పరిస్థితిపై చర్చకు వచ్చినట్టు తెలిసింది. అక్కడ చేపడుతున్న కార్యక్రమాలు, వచ్చే ఎన్నికల్లో పార్టీ పరిస్థితి ఎలా ఉండబోతున్నదన్న అంశాలు, ఇతర సంస్థాగత పరిస్థితులను ఆ రాష్ట్ర నేతలు నడ్డాకు వివరించినట్టు సమాచారం. ప్రస్తుతం ఏపీలో పరిస్థితి రాజకీయంగా పెద్దగా ఆశాజనకంగా లేదని.. క్షేత్రస్థాయిలో అంతగా బలపడనందున వచ్చే ఎన్నికల్లో ప్రభావం చూపే అవకాశాలు తక్కువనే చర్చ జరిగినట్టు తెలిసింది.

వచ్చే అన్ని ఎన్నికల్లో గెలవాల్సిందే..

ఈ ఏడాది చివరిలోగా జరగనున్న తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో కచ్చితంగా గెలవాల్సిందేనని, వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో గతంలో కంటే అధిక సీట్లు సాధించాల్సిందేనని 11 రాష్ట్రాల ముఖ్య నేతలకు జేపీ నడ్డా స్పష్టం చేశారు. ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆరు గంటలకుపైగా సాగిన ఈ సమావేశంలో దక్షిణాది రాష్ట్రాల్లో తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్నికలు, పార్టీ బలోపేతం, విజయం సాధించేందుకు చేపట్టాల్సిన కార్యాచరణపై చర్చించి.. పలు అంశాలపై దిశానిర్దేశం చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు ఆనుకుని పొరుగున రాష్ట్రాలు కలుపుకొని మొత్తం 11 రాష్ట్రాల్లో 181 ఎంపీ సీట్లు ఉండగా.. గత ఎన్నికల్లో ఇందులో 53 గెలిచామని, ఈసారి అంతకన్నా ఎక్కువగా గెలుచుకునేలా కచ్చితమైన వ్యూహాలు, కార్యాచరణ ప్రణాళికతో ముందుకెళ్లాలని నడ్డా ఆదేశించినట్టు సమాచారం.

దక్షిణాదిపై ప్రత్యేకంగా ఫోకస్

ఉత్తరాదిన బలంగా ఉన్న బీజేపీ దక్షిణాదిన ఇంకా పూర్తిస్థాయిలో బలోపేతం కాకపోవడానికి కారణాలపై భేటీలో సమాలోచనలు జరిపినట్టు తెలిసింది. ఇందులో భాగంగా దక్షిణాదికి సంబంధించిన ప్రత్యేక ఎజెండాను రూపొందించాలని సమావేశంలో నిర్ణయించినట్టు సమాచారం. తెలంగాణ సహా వివిధ రాష్ట్ర ప్రభుత్వాల వైఫల్యాలపై ప్రత్యేక కార్యాచరణ రూపొందించుకోవాలని దిశానిర్దేశం చేసినట్టు తెలిసింది. కొన్ని రాష్ట్రాల్లో పార్టీ అధ్యక్షుల తీరు సరిగా లేదని, వెంటనే సరిదిద్దుకోకుంటే ఇబ్బందులు తప్పవని హెచ్చరించినట్టు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తమిళనాడు పార్టీ అధ్యక్షుడు అన్నామలై పనితీరు బాగుందని ప్రశంసించారని తెలిపాయి. దక్షిణాది రాష్ట్రాల్లో పార్టీ బలోపేతం, ఆయా రాష్ట్రాల్లో లోక్‌సభ సీట్ల సంఖ్య పెంపుపైనా చర్చ జరిగిందని.. అయితే సీట్ల పెంపు, దానితో ముడిపడిన అంశాలపై స్పష్టత రాలేదని పేర్కొన్నాయి. ఈ భేటీలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, అండమాన్, లక్ష్యద్వీప్, పుదుచ్చేరి, మహారాష్ట్ర, ముంబై (పార్టీ సంస్థాగత అంశాల ప్రతిపాదికగా విడిగా ఓ రాష్ట్రంగా పరిగణన), గోవా, తమిళనాడు, కేరళ పార్టీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శులు, ఇన్‌చార్జులతోపాటు జాతీయ సంస్థాగత ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, ప్రధాన కార్యదర్శులు తరుణ్‌ఛుగ్, సునీల్ బన్సల్ తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారి ఆలయంలో పూజలు చేస్తున్న బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

మహంకాళి అమ్మవారి ఆలయంలో నడ్డా పూజలు

రాంగోపాల్‌పేట (హైదరాబాద్): పార్టీ భేటీ కోసం హైదరాబాద్‌కు వచ్చిన బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా.. సికింద్రాబాద్ శ్రీ ఉజ్జయిని మహంకాళి ఆలయంలో అమ్మవారిని దర్శించుకున్నారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని.. దీనిని కాపాడేందుకు బీజేపీ ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

కడియం శ్రీహరి కుబేరుడు | అవినీతి తిమింగలం

- ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య ధ్వజం
- ఆయన ఎస్సీ కాదు.. బీసీ
- త్వరలో కడియం ఆస్తులన్నింటినీ బయటపెడతా



జఫర్‌గఢ్: 'ఎమ్మెల్సీ కడియం శ్రీహరి కుబేరుడు.. అవినీతి తిమింగలం, ఆయన ఎస్సీ కాదు, ఆయన తల్లి పద్మశాలి సామాజికవర్గానికి చెందిన వారు' అని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య మరోసారి సంచలన ఆరోపణలు చేశారు. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం హిమ్మత్‌నగర్, తిమ్మాపూర్ గ్రామాల్లో అసంపూర్తిగా ఉన్న నూతన గ్రామపంచాయతీ భవనాల పనులకు ఆదివారం ఎమ్మెల్యే రాజయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా హిమ్మత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో కడియం శ్రీహరి పలు శాఖల మంత్రిగా పనిచేసిన సమయంలో ఘన్‌పూర్ నియోజకవర్గాన్ని కుదవపెట్టి భారీగా అస్తులు సంపాదించారన్నారు. మలేసియా, సింగపూర్, బెంగళూరు, హైదరాబాద్, ఏపీలోని గుంటూరులో కడియంకు ఉన్న ఆస్తులన్నింటినీ త్వరలో బయటపెడతానన్నారు. కడియం అవినీతిపై అనాడే 'ఖల్‌నాయక్'అనే పుస్తకాన్ని ముద్రించినట్లు గుర్తు చేశారు. తాను ఎమ్మెల్యే కాకముందే తన తండ్రి 3 గుంటల భూమి ఇస్తే తాను కష్టపడి 40 ఎకరాల భూమి, నాలుగు కార్లు సంపాదించానన్నారు. కానీ కడియం శ్రీహరి ఎమ్మెల్యే కాక ముందు ఆయన ఇంటికి గచ్చు లేదని, కిటికీలకు గోనె సంచులు కట్టుకొని ఉన్న వ్యక్తి ఈ రోజు రూ.కోట్లకు ఎలా పడగలెత్తారని ప్రశ్నించారు. కడియం శ్రీహరి నిజాయితీ పరుడైతే ఇన్ని అస్తులు ఎలా వచ్చాయో చెప్పాలని ప్రశ్నించారు. బీసీ అయి ఉండి.. కడియం శ్రీహరి ఎస్సీగా చెప్పుకుంటూ తిరుగుతున్నారన్నారు. దళితుడినని చెప్పుకునే వ్యక్తి నియోజకవర్గంలో ఏ ఒక్కచోట అంబేడ్కర్, బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాల ఏర్పాటు కోసం కృషి చేయలేదని అన్నారు. ఆయనకు అప్పట్లో దళిత దొర అని పేరు ఉండేదన్నారు. బీఆర్‌ఎస్‌లో ఉండి ప్రభుత్వం చేపట్టే సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల్లో ఎక్కడా పాలుపంచుకోలేదన్నారు. ఇప్పుడు మాత్రం టికెట్ కావాలని చెప్పుకుంటూ తిరగడం సిగ్గుచేటన్నారు. 'నీకు చాలెంజ్ చేస్తున్నా.. నీవు కానీ, నీ అనుచర వర్గం కానీ ఎక్కడైనా బీఆర్‌ఎస్ అధికార కార్యక్రమాల్లో పాల్గొన్నట్లయితే నిరూపించుకోవాలి'అని అన్నారు. అప్పట్లోనే తాను వైఎస్ రాజశేఖరరెడ్డి ఆశీస్సులతో నియోజకవర్గంలో 13 వేల ఇందిరమ్మ ఇళ్లు కట్టించినట్లు తెలిపారు.

మాజీ మంత్రి చంద్రశేఖర్‌తో ఈటల భేటీ



వికారాబాద్: బీజేపీ రాష్ట్ర ఎన్నికల నిర్వహణ కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మాజీ మంత్రి చంద్రశేఖర్‌ను కలిశారు. ఆదివారం ఈటల హైదరాబాద్‌లోని చంద్రశేఖర్ నివాసానికి వెళ్లారు. చంద్రశేఖర్ బీజేపీని వీడనున్నారనే వదంతుల నేపథ్యంలో ఆయనను బుజ్జగించేందుకే ఈటల వచ్చారనే ప్రచారం జరుగుతోంది. భేటీ అనంతరం బయటకు వచ్చిన ఇద్దరు నేతలు మీడియాతో మాట్లాడారు. 'కర్ణాటకలోనూ ఎస్సీ వర్గీకరణకు బీజేపీ హామీ ఇచ్చింది. ఇక్కడ కూడా అందుకోసం కృషి చేస్తాం. పార్టీతో చర్చలు జరుపుతాం. మాకు కామన్ ఎజెండా ఉంది. కేసీఆర్ మా ఇద్దరినీ మోసం చేశారు. ఆయనను గద్దె దించేందుకు కలసి పని చేస్తాం. చంద్రశేఖర్ పార్టీ మారతారనే వదంతుల్లో ఎలాంటి వాస్తవం లేదు'అని ఈటల వెల్లడించారు. అనంతరం చంద్రశేఖర్ మాట్లాడుతూ.. 'పార్టీ బాగుపడాలని చర్చించాం. ఉద్యమ సమయంలో పదవులను త్యజించి, కొట్లాడి తెలంగాణ తెచ్చుకున్నాం. రాష్ట్రం బాగుపడాలనే చర్చించాం' అని చెప్పారు. అయితే ఈటలకు ఇచ్చిన పదవి కూడా బీజేపీ కార్యవర్గంలో లేనిదేనని.. లేని పదవికి విలువ ఎక్కడ ఉంటుందని..? చంద్రశేఖర్ తన సన్నిహితుల వద్ద పేర్కొన్నట్లు సమాచారం.

టామాటాలు ఉచితంగా పంచి నిరసన

హన్మకొండ: కూరగాయల ధరలు అమాంతం పెరగడంతో మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆదివారం హనుమకొండలో ఉచితంగా టమాటాలు పంచి వినూత్న నిరసన తెలిపారు. దీంతో మహిళలు టమాటాలు తీసుకెళ్లేందుకు ఎగబడ్డారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు నాయిని రాజేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు సరళ యాదవ్ మాట్లాడుతూ.. కూరగాయలు, నిత్యావసరాల ధరలు ఆకాశన్నంటడంతో సామాన్యులు, పేదలు కూరగాయలు తినడం మానేశారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఏపీలో అమెరికా పూల సోయగాలు

లిసియాంతస్ సాగుకు ఏపీ అనుకూలమని తేల్చిన ఉద్యాన వర్సిటీ

ఉత్తర అమెరికాలో ఇవి ఎంతో స్పెషల్

రైతులకు శిక్షణ, సాంకేతిక చేయూత అందించేందుకు నిర్ణయం



సాక్షి, అమరావతి: లిసియాంతస్.. ఉత్తర అమెరికా ప్రాంతానికి చెందిన ఈ పువ్వులు గులాబీలను పోలి ఉండే కట్ ఫ్లవర్స్. విభిన్న రంగుల్లో ఉండే ఇవి మైదాన, కొండ ప్రాంతాల్లోనే కాదు ఇంటి ఆవరణలో పూలకుండీల్లోనూ పెంచుకునేందుకు అనువైనవి. బొకేలు, అలంకరణకు ఉపయోగించే ఈ పూలకు విదేశాల్లో మంచి డిమాండ్ ఉంది. వీటిని ఏపీలోనూ సాగు చేసేవిధంగా శాస్త్రవేత్తలు చేసిన పరిశోధనలు ఫలించాయి. దేశంలోని బెంగళూరు పరిసర ప్రాంతాల్లో కొద్దిపాటి విస్తీర్ణంలో లిసియాంతస్ పూలను సాగు చేస్తున్నారు. వీటి సాగుకు ఆంధ్రప్రదేశ్‌లోనూ అనువైన వాతావరణం ఉన్నట్టు వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు గుర్తించారు. అల్లూరి జిల్లాలోని చింతపల్లి ఉద్యాన పరిశోధన కేంద్రంలోని పాలీహౌస్‌లో 6 రకాల లిసియాంతస్‌పై పరిశోధనలు జరిపారు. పింక్, ఆకుపచ్చ, పసుపు, తెలుపు, నీలం, పికోటీ, చాంపేన్ రకాలను ప్రయోగాత్మకంగా సాగు చేశారు. శీతాకాలంలో మైదాన ప్రాంతాల్లోను, కొండ ప్రాంతాల్లో వేసవి కాలంలోనూ వీటిని సాగు చేయవచ్చని గుర్తించారు. ఇండోర్ డెకరేషన్‌కు ఉపయోగించే ఈ పూలు కనీసం ఐదారు రోజుల పాటు తాజాదనం కోల్పోకుండా ఉంటున్నాయి. అలంకరణ కోసం ఉపయోగించే ఈ పూలకు యూరోప్, చైనా, ఇంగ్లాండ్, వియత్నాం, మలేషియా, జపాన్ దేశాల్లో మంచి డిమాండ్ ఉంది.

రూ.40 లక్షల ఆదాయం

వీటి పంట కాలం నాలుగు నెలలు. నర్సరీల్లో 70 నుంచి 75 రోజులు ఉంచాలి. నాటిన 60 రోజులకు పుష్పిస్తాయి. ఒక మొక్క మూడు కొమ్ములతో ఉంటుంది. కాండానికి 9 నుంచి 12 పువ్వులు వస్తాయి. సీజన్ బట్టి ఒక్కొక్క పువ్వు రూ.20 నుంచి రూ.35 వరకు పలుకుతుంది. రూ.24 లక్షల వరకు పెట్టుబడి పెడితే.. రూ.40 లక్షల వరకు ఆదాయం వస్తుంది. పెట్టుబడి పోనూ రూ.12 లక్షల నుంచి రూ.16 లక్షల నికర ఆదాయం పొందొచ్చు. మన ప్రాంతానికి రోసిట 3 బ్లూ పికోటీ వెరైటీ-2, ఎక్స్ కాలిబూర్ 3 బ్లూ పికోటీ, రోసిట 4 ప్యూర్ వైట్, రోసిట 3 పింక్ పికోటీ, రోసిట 4 గ్రీన్ రకాలు అనుకూలమని తేల్చారు.

ఖమ్మంకు దీటుగా కొల్లాపూర్ సభ

- ప్రియాంక హాజరయ్యే బహిరంగ సభకు భారీ జనసమీకరణకు కాంగ్రెస్ ప్లాన్
- ఏర్పాట్లకోసం మల్లురవి నేతృత్వంలో ఉమ్మడి పాలమూరు నేతల భేటీ



మొయినాబాద్ సమీపంలోని రిసార్ట్‌లో సమావేశమైన ఉమ్మడి పాలమూరు జిల్లా కాంగ్రెస్ నేతలు

సాక్షి, హైదరాబాద్: మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు బృందం కాంగ్రెస్ పార్టీలో చేరిక సందర్భంగా ఖమ్మంలో ఇటీవల జరిగిన బహిరంగ సభకు దీటుగా కొల్లాపూర్‌లోనూ భారీ బహిరంగ సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ నెల 20న జరుగుతుందని భావిస్తోన్న ఈ సభకు పెద్ద ఎత్తున జనసమీకరణ చేసేందుకు ఉమ్మడి పాలమూరు జిల్లా కాంగ్రెస్ నేతలు కసరత్తు చేస్తున్నారు. అందులో భాగంగా టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ మల్లురవి నేతృత్వంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నాయకులు ఆదివారం సాయంత్రం మొయినాబాద్‌లోని గ్రీన్‌వ్యాలీ రిసార్ట్‌లో సమావేశమయ్యారు. జూపల్లి కృష్ణారావు, కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, గద్వాల జెడ్పీ చైర్‌పర్సన్ సరిత భర్త తిరుపతయ్య, గుర్నాథ్‌రెడ్డి, వనపర్తి ఎంపీపీ మేఘారెడ్డి, డీసీసీ అధ్యక్షుడు వంశీకృష్ణ, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చరణ్ కౌశిక్ యాదవ్ తదితరులు ఇందులో పాల్గొన్నారు. కొల్లాపూర్ సభకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకా గాంధీ హాజరు కానున్న నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి జనసమీకరణ, సభ ఏర్పాట్లు, సమన్వయం లాంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చించినట్టు కాంగ్రెస్ నేతలు వెల్లడించారు.

రాష్ట్రంలో రజాకార్ల పాలన

బీఆర్‌ఎస్ సర్కారుపై టీజేఎస్ అధ్యక్షుడు కోదండరామ్ ధ్వజం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ కోదండరాం

యాచారం (రంగారెడ్డి జిల్లా): రాష్ట్రంలో రజాకార్ల పాలన నడుస్తోందని, కష్టపడి తెచ్చుకున్న ప్రత్యేక రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు అన్యాయానికి గురవుతున్నారని తెలంగాణ జన సమితి (టీజేఎస్) అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ ఆరోపించారు. 'తెలంగాణ బచావో'పేరిట ఆదివారం ఆయన ప్రజాయాత్ర చేపట్టారు. ఇందులోభాగంగా రంగారెడ్డి జిల్లాలో ఫార్మాసిటీకి భూములు సేకరించిన గొలుసుకట్టు చెరువులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ...ఫార్మాసిటీ భూసేకరణలో ఏదో మతలబు ఉందని, దుర్మార్గుల్లాంటి అధికారులను నియమించి దౌర్జన్యంగా భూసేకరణ చేస్తున్నారని విమర్శించారు. ఫార్మాసిటీతో భూగర్భంలో వచ్చే జలకాలుష్యం కారణంగా భవిష్యత్తులో కృష్ణానదికి కూడా ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కేసీఆర్ సర్కార్‌కు రోజులు దగ్గర పడ్డాయని, వచ్చే ఎన్నికల్లో ఓటమి ఖాయమని జోస్యం చెప్పారు. వచ్చే ప్రభుత్వంలో ఫార్మాసిటీ భూసేకరణపై విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన అధికారులు, అధికార పార్టీ నేతలపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం ఖాయమని హెచ్చరించారు. కేసీఆర్ సర్కార్ స్థిరాస్తి వ్యాపారం చేసుకోవడానికే ఫార్మాసిటీ ఏర్పాటు చేస్తున్నారని ఏఐసీసీ కిసాన్ సెల్ ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ముదిరెడ్డి కోదండరెడ్డి దుయ్యబట్టారు. ఫార్మా పేరుతో రైతుల వద్ద ఎకరా భూమి రూ.16 లక్షలకు కొనుగోలు చేసి వ్యాపారులకు ఎకరాకు రూ.కోటిన్నరకు పైనే విక్రయిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో పర్యావరణవేత్త కవుల సరస్వతి, ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట సమితి నాయకులు, వివిధ రాజకీయపార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ పదవికి కూచుకుళ్ల రాజీనామా

- 20న కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ప్రకటన
- నాగర్‌కర్నూల్ జిల్లా పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న నేత




నాగర్‌కర్నూల్ డీసీసీ ఆఫీస్ ప్రారంభోత్సవంలో ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి

సాక్షి, నాగర్‌కర్నూల్: బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ నూతన కార్యాలయం ప్రారంభోత్సవానికి హాజరయ్యారు. జిల్లాకేంద్రంలోని కొల్లాపూర్ చౌరస్తాలో ఆదివారం కాంగ్రెస్ నూతన జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి ఏఐసీసీ కార్యదర్శి వంశీచంద్‌రెడ్డి, పీసీసీ ఉపాధ్యక్షుడు మల్లురవి, మాజీమంత్రి నాగం జనార్దన్‌రెడ్డితో కలిసి దామోదర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వంశీచంద్‌రెడ్డి, మల్లురవి, నాగం జనార్దన్‌రెడ్డితో కాంగ్రెస్‌లో చేరికపై ఆయన చర్చించారు. అనంతరం దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ...తాను ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ నెల 20న కొల్లాపూర్ నియోజకవర్గంలో నిర్వహించే కాంగ్రెస్ బహిరంగ సభలో ఆ పార్టీ అగ్రనేత ప్రియాంకగాంధీ సమక్షంలో తనతోపాటు కుమారుడు రాజేశ్‌రెడ్డి సైతం కాంగ్రెస్‌లో చేరనున్నట్టు వెల్లడించారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన నాటి నుంచి స్థానిక ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి నుంచి సరైన గౌరవం దక్కడం లేదన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా తనకు పదవి రాకుండా కుట్ర పన్నారని ఆరోపించారు.


కేసీఆర్ అవినీతి తెలిసినా చర్యలెందుకు తీసుకోలేదు?

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

నేరేడుచర్ల (సూర్యాపేట జిల్లా) : దేశంలోనే ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుది అత్యంత అవినీతి ప్రభుత్వమని ప్రధాని నరేంద్ర మోదీ వరంగల్ సభా వేదికపై వెల్లడించారని, అయితే సీఎం కేసీఆర్‌పై చర్యలెందుకు తీసుకోలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి ప్రశ్నించారు. సూర్యాపేట జిల్లా నేరేడుచర్లలోని పార్టీ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు పెద్ద ఎత్తున రాయితీలను కల్పిస్తోందని, వారు రూ.లక్షల కోట్లు అప్పులు తీసుకుని ఎగ్గొట్టినా కేంద్ర ప్రభుత్వం ప్రేక్షకపాత్ర పోషిస్తోందని విమర్శించారు. మోదీ ప్రధాని కాకముందు రూ.60 వేల కోట్ల ఆస్తులు ఉన్న అదానీ నేడు రూ.11లక్షల కోట్లకు పడగలెత్తారని ఆరోపించారు. 70 ఏళ్లుగా కాపాడుకుంటూ వస్తున్న ప్రభుత్వరంగ సంస్థలను ప్రధాని మోదీ ప్రైవేటు వ్యక్తులకు అమ్మేస్తున్నారని ధ్వజమెత్తారు. బీజేపీకి వ్యతిరేకంగా ఉన్న పార్టీలను చీల్చడం, ప్రభుత్వాలను కూల్చడం మోదీకి ఆనవాయితీగా మారిందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య మోదీ చిచ్చుపెడుతున్నారని మండిపడ్డారు.



“యుద్ధపు అంతాన్ని కేవలం చనిపోయినవాళ్లే చూశారు.

– ప్లేటో

సాక్షి

సోమవారం, 10 జూలై 2023

వానలు కురవాలి

ఇది ఆషాఢ మాసం. వర్షారంభ కాలం. ఆషాఢమంటే ఆకాశంలో కనిపించే మబ్బులు. నేలమీద కురిసే తొలకరి చినుకులు వీచే మట్టి పరిమళాలు. ‘తొలకరి వాన మొలకల తల్లి’ అనే నానుడి ఉంది. ఆషాఢంతో ముడిపడిన అనేక సంప్రదాయాలు మన జనజీవనంలో ఉన్నాయి. ఆషాఢం నుంచి కార్తీకం మొదలయ్యే వరకు వానలు కురుస్తాయి. పూర్వం మనకు వానాకాలంతోనే ఏడాది మొదలయ్యేది. అందుకే, వానను వర్షం అని అంటారు. ఏడాదులను వర్షాలతో లెక్క కట్టడం కూడా మనకు వాడుకలో ఉన్న పద్ధతే! ప్రకృతిలోని జీవకళకు వానలే ఆధారం. వర్షసౌందర్యాన్ని వర్ణించని కవులు అరుదు. ‘సదా మనోజ్ఞం స్వనదుత్సవోత్సుకమ్/ వికీర్ణ విస్తీర్ణ కలాప శోభితమ్/ ససంభ్రమాలింగన చుంబనాకులం/ ప్రవృత్త నృత్యం కులమద్య బర్హిణామ్’ అని కాళిదాసు ‘ఋతుసంహారం’లో వర్షర్తు సౌందర్యాన్ని వర్ణించాడు. మబ్బులు కమ్మి ఉరుములు మెరుపులతో వాన కురుస్తున్నప్పుడు నెమళ్లన్నీ పింఛాలు విప్పి జంటలు జంటలుగా ఒకదానినొకటి ముద్దాడుతూ నర్తిస్తున్నాయట! తొలకరి జల్లులు కురిసే వేళల్లో ఇలాంటి చూడచక్కని దృశ్యాలు కనిపిస్తాయి.

‘ఎలగోలు జల్లు మున్ బెళబెళ నేటవా/ల్పడి గాలి నట్టిండ్ల దడిపి చనగ/... భూభిదాపాది దుర్భరాంభోభరంపు/... కడవ వంచి/నట్లు హోరని దారౌఘ మైక్యమొంది/ మిన్ను మన్నునొకటిగా వృష్టి బలిసె’ అంటూ హోరైన గాలితో చిటపట చినుకులుగా మొదలైన వర్షం వేగాన్ని పుంజుకుని మింటినీ మంటినీ ఏకం చేసేంత కుంభవృష్టిగా పరిణమించిన వైనాన్ని శ్రీకృష్ణదేవరాయలు ‘ఆముక్తమాల్యదలో’ కళ్లకు కట్టాడు. ఇలాంటి దృశ్యాన్నే శేషేంద్ర తన ‘ఋతుఘోష’లో ‘విరిసెను మేఘపరంపర/ మెరసెను శాంపేయలతలు మిన్నులు మొరసెన్/ పరచెను ఝుంఝానిలములు/ కురిసెను వర్షము కుంభగుంభిత రీతిన్’ అని వర్ణించారు. సకాలంలో సజావుగా కురిస్తే, వర్షం హర్షదాయకమే! వర్షం ఒక్కొక్కప్పుడు బీభత్సం సృష్టిస్తుంది. శేషేంద్ర తన కావ్యంలో వర్షబీభత్సాన్ని కూడా వర్ణించారు. ‘పసికందుల్ జడివానలో వడకగా పాకల్ ధరం గూలి తా/మసహాయస్థితి తల్లిదండ్రులును హాహాకారముల్ సేయగా... నిర్వేల హాలాహల శ్వసనంబుల్ ప్రసవించె దీనజనతా సంసారపూరంబులన్’ అంటూ జడివానకు పూరిపాకలు కూలిపోయినప్పుడు నిరుపేదల నిస్సహాయతను కళ్లకు కట్టారు.

రుతువులలో వర్షర్తువంతటి అస్తవ్యస్తమైన రుతువు మరొకటి లేదు. వానాకాలానికి ఉండే సహజ లక్షణం అనిశ్చితి. ‘వాన రాకడ ప్రాణం పోకడ ఎవరికీ తెలీదు’ అని సామెత. వర్షాకాలంలో మోతాదుగా వానలు కురుస్తాయనే భరోసా ఎప్పుడూ లేదు. భూమ్మీద ఎక్కడో ఒకచోట అతివృష్టి లేదా అనావృష్టి దాదాపు సర్వసాధారణం. మనుషులు అతివృష్టినీ తట్టుకోలేరు, అనావృష్టినీ భరించలేరు. సకాలంలో వానలు కురవకుంటే వానల కోసం ఎదురు చూస్తారు. ఎదురుచూపులకు ఫలితం దక్కకుంటే కప్పలకు పెళ్లిళ్లు చేయడం, వరుణ హోమాలు చేయడం వంటి తతంగాలను యథాశక్తి సాగిస్తారు. ప్రార్థనల ఫలితంగానో, ప్రకృతి రుతుధర్మ ప్రకారమో జడివానలు మొదలైతే, చిత్తడితో నిండిన వీథుల్లోకి వెళ్లలేక వానలను తిట్టుకుంటారు. మనుషులు స్తుతించినా, నిందించినా వాటితో ఏమాత్రం నిమిత్తం లేకుండా వానలు వాటి మానాన అవి వచ్చిపోతుంటాయి. అతివృష్టి వరదబీభత్సం వంటి ఉపద్రవాలను తెచ్చిపెడితే, అనావృష్టి కరవు కాటకాలతో ఆకలిమంటలు రేపుతుంది. ‘ఆకాశంబున మేఘమాలికల రూపైనం గనన్ రాదు, శు/ష్కాకారంబుల బైరులెల్ల సుదుమై యల్లాడె తీవ్రంబుగా/... మాకీ కష్టము వెట్టి దైవమని యేలా మాటికిం జింతిలన్?’ అంటూ దువ్వూరి రామిరెడ్డి తన ‘కృషీవలుడు’ కావ్యంలో కళ్లకు కట్టారు. అనావృష్టి ప్రభావం రైతులకే ఎక్కువగా ఉంటుంది. చినుకు కరవై బీడువారిన నేలను చూస్తే రైతు గుండె చెరువవుతుంది.

ఆషాఢం అంటే తొలకరి చినుకులు మాత్రమే కాదు, అరచేతులను పండించే గోరింట కూడా! ఆషాఢమాసంలో గోరింటాకు పెట్టుకోవడం మన సంప్రదాయం. పురాతన నాగరికతల కాలం నుంచి గోరింటాకు వాడుకలో ఉంది. అయినా మన కావ్య ప్రబంధాలలో కాళిదాసాది పూర్వకవులు గోరింటాకుపై ఎందుకో శీతకన్నేశారు. గోరింట ప్రస్తావన ప్రాచీన ఆయుర్వేద గ్రంథాలలోనే కనిపిస్తుంది గాని, కావ్యాలలో కనిపించదు. జానపద గీతాల్లో గోరింట ప్రస్తావన కనిపిస్తుంది. ‘గోపాల కృష్ణమ్మ పెళ్లయ్యెనాడు/ గోరింట పూచింది కొమ్మ లేకుండా’ అనే జానపద గీతం ఉంది. ‘గోరింటాకు’ సినిమా పాట పల్లవిని కృష్ణశాస్త్రి బహుశా దీనినుంచే సంగ్రహించి ఉంటారు.

ఆధునిక కవుల్లో కొద్దిమంది గోరింటపై దృష్టి సారించారు. సరోజినీ నాయుడు ‘గోరింటాకు’ కవిత రాశారు. ‘వధువు నెన్నుదుటికి కుంకుమం ఎరుపు/ మధురాధరాలకు తాంబూల మెరుపు/ లిల్లీల తలపించు కాళ్లకూ వేళ్లకూ/ లేత గోరింటాకు ఎరుపే ఎరుపు’ అంటూ గోరింటాకు ఎరుపును ఎంతో ముచ్చటగా వర్ణించారు. ఆమె ఇంగ్లిష్‌లో రాసిన కవితను సినారె తెలుగులోకి అనువదించారు. ‘బొప్పి గట్టినగాని యే పురుషుడైన/ తెలివినొందడు లోకంబు తెలియబోడు/ రాళ్లదెబ్బల గోరింట రంగొసంగు/ మనుజు డగచాటులనె గాని మారడెపుడు’ అంటారు ఉమర్ అలీషా. అగచాట్లలో నలిగితే తప్ప మనిషి మారడని చెప్పడానికి రాళ్లదెబ్బలతో నలిగితేనే గోరింట రంగునిస్తుందని పోల్చడం విశేషం. ఆషాఢంలోని తొలకరి జల్లులతో మొదలయ్యే వానాకాలంలో సజావుగా వానలు కురిస్తే పంటపొలాల్లో నవధాన్యాలు పండుతాయి. ఆషాఢంలో అతివలు అలంకరించుకునే గోరింటాకుతో అరచేతులు పండుతాయి. ప్రకృతి కరుణిస్తే బతుకులు పండుతాయి. మన పంట పండాలంటే వానలు కురవాలి.

మొండి మౌనానికి మోక్షం ఎన్నడు?

కామెంట్



కరణ్ థాపర్

రెండు నెలలుగా మణిపూర్ అతలాకుతలం అవుతోంది. అయినప్పటికీ ప్రధాని ఒక్క మాటా మాట్లాడటం లేదు. ఆయన తాజా ‘మన్ కీ బాత్’లో గుజరాత్‌లో తుపాను గురించి మాట్లాడారు కానీ, అంతకన్నా ప్రధానమైనదైన మణిపూర్ గాయాన్ని వదిలేశారు. టర్కీలో భయంకర భూకంపం సంభవించినప్పుడు మొదట సానుభూతి తెలిపిన వారిలో ఆయనా ఒకరు. మణిపూర్ విషయం వచ్చేటప్పటికి... తన సొంత ప్రజలు, ఇంకా చెప్పాలంటే తన ఓటర్లకు జరుగుతున్న దానిపై మొండిగా మౌనాన్ని ఆశ్రయించారు. మణిపూర్ సంక్షోభం గురించి తాను ప్రతి ఒక్క రోజూ ప్రధానికి వివరిస్తూనే ఉన్నానని హోమ్ మంత్రి చెబుతున్నారు. అందులో సందేహించడానికేం లేదు. కానీ మణిపూర్‌పై మాట్లాడేందుకు ప్రధాని ఉద్దేశపూర్వకంగా నిరాకరించడాన్ని అంగీకరించడమే మరింత కష్టతరంగా ఉంది.

నేను ఇంతకు ముందెన్నడూ ఆరంభించని విధంగా ఈ వ్యాసాన్ని మొదలు పెట్టబోతున్నాను. ఒక ఉద్దేశ ప్రకటనతో. కొలిచినట్లుగా, సమతూకంతో, వేరుగా ఉండి చూస్తూ నాకు వీలైనంతగా ఇందులో న్యాయంగా ఉండేందుకు ప్రయత్నిస్తాను. విషయం మణిపూర్ అయినప్పుడు ఇలా ఉండటం తప్పనిసరి. నేనిక్కడ మూడు ముఖ్యమైన అంశాలను ప్రస్తావించాలని అనుకుంటున్నప్పటికీ మానని గాయాల్ని రేపడం లేదా భావావేశాలను భగ్గుమనిపించడం మాత్రం నా ఆకాంక్ష కాదు.

మొదటిది, ముఖ్యమంత్రి బీరేన్ సింగ్‌ను ఎందుకు తొలగించలేదు? 65 రోజుల తర్వాత కూడా పరిస్థితిని అదుపు చేయలేకపోవడంలోని ఆయన అసమర్థత లేదా అశక్తత కచ్చితంగా రూఢి అయినదే. సొంత శాసనసభ్యులకు కూడా ఆయనపై నమ్మకం పోయింది. మే నెలలో, ప్రత్యేక పాలన కోసం డిమాండ్ చేసిన ఏడుగురు బీజేపీ కుకీ ఎమ్మెల్యేలు తమ ముఖ్యమంత్రిపై తమకు విశ్వాసం లేదని బహిరంగంగానే ప్రకటించారు. జూన్‌లో ఎనిమిది మంది బీజేపీ మెయితీ ఎమ్మెల్యేలు, ‘‘మణిపూర్ ప్రజలు ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వంపై పూర్తిగా నమ్మకం కోల్పోయారు’’ అని పేర్కొంటూ ప్రధానమంత్రికి వినతి పత్రం సమర్పించారు. అంటే తమ 32 మంది ఎమ్మెల్యేలలో 15 మంది.

లెక్కల్ని పక్కన పెడితే, బీరేన్ సింగ్‌ను తొలగించాలనే డిమాండ్ వెనుక లోతైన నైతిక హేతువే ఉంది. మణిపూర్ జనాభాలో 16 శాతంగా ఉన్న కుకీలు... ప్రస్తుతం ఆ రాష్ట్రంలో జరుగుతున్న దానికి ఆయనే కారణం అని నిందిస్తున్నారు. మెయితీ దురహంకారిగా, కుకీల వ్యతిరేకిగా వారు ఆయన్ని పరిగణిస్తున్నారు. గతవారం బీరేన్ సింగ్ అధికార ట్విట్టర్ అకౌంట్ ఈ ఆరోపణకు ఒక ధ్రువీకరణగా నిలిచింది. తనను విమర్శిస్తున్నది కుకీలు, మయన్మార్‌కు చెందిన వారు మాత్రమేనన్న అర్థం వచ్చేలా బీరేన్ సింగ్ ఒక ట్విట్టర్ యూజర్‌కు బదులిచ్చినట్లు ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’ రాసింది. ‘‘మీరసలు ఎప్పుడో రాజీనామా చేయవలసింది కదా?’’ అని ఆ యూజర్ చేసిన కామెంట్‌కు సమాధానంగా, ‘‘నీది భారతదేశమా? లేక మయన్మారా?’’ అని బీరేన్ సింగ్ ప్రశ్నించినట్లు ట్విట్టర్ స్క్రీన్ షాట్‌లు చూపిస్తున్నాయి. కుకీలను అన్నిటి కంటే ఎక్కువగా ద్వేషించే వ్యక్తి ముఖ్యమంత్రిగా కొనసాగితే సయోధ్యపై ఏ విధమైన ఆశ ఉంటుంది?



నేను లేవనెత్తాలని అనుకుంటున్న రెండవ అంశం, జూన్ నెలాఖరులో జరిగిన ఒక సంఘటన. దాదాపు 1,500 మంది మెయితీ మహిళలు, బహుశా ‘మీరా పైబిస్’ మహిళా ఉద్యమ కార్యకర్తలు... తూర్పు ఇంఫాల్‌లోని 3వ ఆర్మీ దళ శిబిరాన్ని చుట్టుముట్టి మెయితీ వేర్పాటువాద ‘కంగ్లేయ్ యావోల్ కన్న లుప్’ గ్రూపునకు చెందిన 12 మంది మెయితీ తీవ్రవాదులను విడిపించుకుని వెళ్లారు. 2015లో చందేల్‌లో పొంచివుండి జరిపిన మెరుపుదాడితో 18 మంది సైనికులను హతమార్చింది ఈ ‘కంగ్లేయ్ యావోల్ కన్న లుప్’ గ్రూపు సభ్యులే. ఆ పన్నెండు మందిలో తనను తాను లెఫ్టినెంట్ కల్నల్ మెయి రంగ్‌థెమ్ తంబా అని చెప్పుకునే వ్యక్తి ఆనాటి దాడికి వ్యూహం రచించాడు.

వీళ్లసలు ఎప్పటికీ విడుదల కావలసినవాళ్లు కాదు. కానీ విడుదలయ్యారు. ఇంకా ఘోరం ఏమిటంటే, విడిపించుకుని వెళ్లిన ఈ మహిళలందరికీ బీజేపీ మెయితీ ఎమ్మెల్యే తొనోజం శ్యామ్‌కుమార్ సింగ్ మద్దతు ఉండటం. వారిని విడిపించుకుని వెళ్లేటప్పుడు తను అక్కడ ఉన్నానన్న విషయాన్ని ఆయన ఖండించడం లేదు కానీ, వాళ్లను విడుదల చేయాలని తను అడగలేదని మాత్రం గట్టిగా చెబుతున్నారు. అయితే భద్రతా అధికారులు ‘ఇండియన్ ఎక్స్‌ప్రెస్’కు చెప్పిన కథనం భిన్నంగా ఉంది. ఎమ్మెల్యేనే స్వయంగా మిలిటెంట్ల విడుదలకు బలగాలతో చర్చలు జరిపారని!

వైరుధ్యం ఏమిటంటే కుకీలను వెళ్లి కలుసుకోవాలనీ, ద్వైపాక్షికంగా ఉండాలనీ బీరేన్ సింగ్‌కు హోమ్ మంత్రి చెప్పారని ‘ది హిందూ’లో వార్త వచ్చిన తర్వాతే ఈ ‘విడిపించుకు పోవడం’ జరగడం. ఇంఫాల్‌లోని బీజేపీ ఎమ్మెల్యేలు... హోమ్ మంత్రి చెప్పారంటున్న దానికి పూర్తి భిన్నంగా వ్యవహరించారు. ఇంకొక సంగతి. శ్యామ్ కుమార్ సింగ్ వార్తను మిగతా పత్రికలు ఎందుకు వేయలేదు? ఇంఫాల్‌లో గానీ, ఢిల్లీలో గానీ ఎవరూ ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించలేదు?

నా మూడో ఆందోళన... బాధను కలిగించేది మాత్రమే కాదు, భ్రాంతులను పోగొట్టేది కూడా! రెండు నెలలుగా మణిపూర్ అతలాకుతలం అవుతోంది. గృహ దహనాలు, మూకుమ్మడి హింస, ఒక వర్గం వారిని లక్ష్యంగా చేసుకుని హత్యలు, ఇప్పుడిక భయానకమైన శిరచ్ఛేదనం! అయినప్పటికీ మన ప్రధాని ఒక్క మాటా మాట్లాడటం లేదు. ఆయన తాజా ‘మన్ కీ బాత్’లో గుజరాత్‌లో తుపాను గురించి మాట్లాడారు కానీ, అంతకన్నా ప్రధానమైనదైన మణిపూర్ గాయాన్ని వదిలేశారు. టర్కీలో భయంకర భూకంపం సంభవించినప్పుడు మొదట సానుభూతి తెలిపిన వారిలో ఆయనా ఒకరు. మణిపూర్ విషయం వచ్చేటప్పటికి... తన సొంత ప్రజలు, ఇంకా చెప్పాలంటే తన ఓటర్లకు జరుగుతున్న దానిపై మొండిగా మౌనాన్ని ఆశ్రయించారు. ఈ విషయమై నేను ఇంటర్వ్యూ చేసిన ప్రతి మెయితీ, ప్రతి కుకీ, ప్రతి నాగా... నిరాశలో ఉన్నారు. మొదట వారు కలత చెందారు. తర్వాత ఆగ్రహించారు. ఆ తర్వాత తమకు నమ్మకద్రోహం జరిగినట్లుగా భావించారు. ఇప్పుడు తాము ఎవరికీ అక్కర్లేదని నమ్ముతున్నారు.

మణిపూర్ సంక్షోభం గురించి తాను ప్రతి ఒక్క రోజూ ప్రధానికి వివరిస్తూనే ఉన్నానని హోమ్ మంత్రి చెబుతున్నారు. అందులో సందేహించడానికేం లేదు. కానీ మణిపూర్‌పై మాట్లాడేందుకు మోదీ ఉద్దేశపూర్వకంగా నిరాకరించడాన్ని అంగీకరించడమే మరింత కష్టతరంగా ఉంది. విధులు, రాజ్యాంగ అవసరాలను మించి దేశంలోని ఆందోళనకర పరిస్థితులపైన మాట్లాడవలసిన నైతిక ఒత్తిడి ప్రభుత్వాధినేతపై ఉంటుంది. ఆయన మాట్లాడారూ అంటే మనందరి తరఫున మాట్లాడినట్లు. మన ప్రధానమంత్రిగా మాట్లాడినట్లు. కానీ ఆయనకు మాట్లాడేందుకు ఏమీ లేదంటే ఆయన మౌనం ఆయన ఒక్కరితోనే ఉంటుంది. ఆ మౌనం మనందరికి ప్రాతినిధ్యం వహించదు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల ‘మనసులోని మాట’లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

ఓన్లీ ఇంజిన్



21వ సెర్చ్ ఇంజిన్‌గా గూగుల్ 1998లో మార్కెట్లోకి ప్రవేశించింది. ఇప్పుడు అదే ప్రబలమైన శక్తిగా మారిపోయింది. వ్యాపార పాఠం: పోటీలో ఉన్నవాళ్లను గురించి తెలుసుకోవడం ముఖ్యం, కానీ వారిని కాపీ కొట్టకూడదు. – వాలా అఫ్షార్, డిజిటల్ ఇవాంజెలిస్ట్

శ్రద్ధ



అంతర్జాతీయ సమావేశాల్లో అమెరికన్లు అత్యుత్తమ ప్రెజెంటర్లు. ఆంగ్లం వారి భాష కావడం కచ్చితంగా ఒక సానుకూలాంశమే. దానికంటే మించిన అంశాలూ ఉన్నాయనిపిస్తుంది.

– ఇయాన్ జూ, ఫోనోలాజికల్ టైపాలజిస్ట్

అవి పోవు



మనుషుల్లో దురాశ, అసూయలను తగ్గించగలిగే సాఫ్ట్‌వేర్ గానీ, యాప్ గానీ, కృత్రిమ మేధ(ఏఐ) గానీ ఏ ఒక్క ‘మహా మేధావి’ బిలియనీర్ (కోటాను కోటీశ్వరుడు) ఇంజినీర్ కూడా సృష్టించలేడు. అంటే, ఈ సాంకేతిక పరిజ్ఞానాలు ప్రపంచాన్ని ‘కాపాడలేవు’.

– దేవ్‌దత్ పట్నాయక్, మైథాలజిస్ట్

ఎంత టాలెంటో!



అలవోకగా కొంతమంది ట్విట్టర్ థ్రెడ్స్‌లో చాలా చక్కటి, యుక్తమైన, పదునైన కామెంట్లు చేస్తుంటారు. కానీ వాటికి లైక్స్ రావు, ఎవరూ పట్టించుకోరు. అయితే అంతర్దృష్టి, చమత్కారం, విశ్లేషణా శక్తి కలిగిన ప్రతిభావంతులు బయట విస్తారంగా ఉన్నారని మాత్రం నాకు అర్థమవుతోంది. ప్రోత్సాహకర విషయం.

– వాల్టర్ కిమ్, హోస్ట్

వద్దంటే వద్దు



ఐదేళ్ల నుంచి ఒంటరి ప్రయాణాలు చేస్తున్నాను. నా అనుభవంలో ఒంటరి మహిళలు ప్రయాణం చేయకూడని దేశాలు మూడు. ఇక్కడ వీధుల్లో లైంగిక హింస అనేది సాధారణం అని అంగీకరించినట్టుగా ఉంటుంది. అవి: మొరాకో, ఈజిప్ట్, పాకిస్తాన్.

– పర్వానే, పాక్ ట్రావెలర్

వీళ్లు రచయితలేనా?



పుస్తకాలకు సంబంధించిన ప్రపోజల్స్ సంపాదకులకు ఫోన్లో వివరించేవి కావని కొత్త రచయితలకు ఎలా అర్థం చేయించాలి? ఒక తగిన ప్రతిపాదన రాసి పంపడానికి ఇంత వైముఖ్యం ఎందుకు?

– వైశాలీ మాథుర్, ప్రచురణకర్త

అదీ లెక్క!



పీహెచ్‌డీ కోసం దేశాన్ని వదులుతున్న రోజు, ఢిల్లీలోని ఇమ్మిగ్రేషన్ అధికారి నా కాగితాలను చూసి, “అమ్మాయిలు లెక్కలంటే భయపడరా?” అన్నారు. “ఆ భయాన్ని అధిగమించడానికి పీహెచ్‌డీ అత్యుత్తమ మార్గం” అన్నాను. ఆయన కళ్లు వెలిగాయి. శుభాకాంక్షలతో వీడ్కోలిచ్చారు. – కనీనికా సిన్హా, విద్యార్థిని

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com

నాణ్యమైన ఉపాధ్యాయుడు

విలువలతో కూడిన విద్యను అందించడానికి అధ్యాపకునికి కొన్ని అర్హతలు ఉండాలి. అందుకు కొన్ని సూత్రాలను అలవరచుకోవలసి ఉంటుంది. అవి: ఔచిత్యం, సహజసిద్ధ హేతుకత, సంపూర్ణత, సమతౌల్యతా దోహదం. పై అంశాలను పరిశీలిస్తే జాతి, కుల, మత, వర్ణ, వర్గ, సంబంధాలకు అతీతంగా అందరు విద్యార్థులకూ ఒకే రకమైన విద్యను అందించగలిగే సౌహార్దంతో ఉపాధ్యాయుడు ఉండగలగాలి. అలా చెప్పగలగాలంటే ఉపాధ్యాయుడు ముందు అలా ఉండగలగాలి.

బోధన జరుగుతున్న సందర్భంలో సమాజంలోని మంచి చెడుల ప్రస్తావన వచ్చినపుడు తరగతి గదిలోనున్న విద్యార్థుల దృష్టి బోధిస్తున్న ఉపాధ్యాయునిపై కూడా పడుతుంది. ఉపాధ్యాయుని నడవడిక విద్యార్థులను ప్రభావితం చేస్తుంది. తరగతి గదిలో చెప్పేదొకటి, బయట చేసేదొకటిగా ఉపాధ్యాయుడు ఉండకూడదు. కచ్చితమైన మనఃచేతన కలిగి ఉండాలి. అప్పుడే బోధన సహజసిద్ధంగా, సహేతుకంగా ఉంటుంది. ఆలోచన, ప్రవర్తన, కార్యా చరణ, జ్ఞాన సముపార్జనలను దృష్టిలో పెట్టుకొని వర్తమాన మానవ జీవితంలో ఉండే సంక్లిష్టతలను విద్యార్థులకు ఉపాధ్యాయుడు తెలియజేయాలి. అందుకు అనుగుణంగా నేటి విద్యావిధానంలో చాలా ప్రయోజనకరమైన అంశాలున్నాయి. వాటిని అందిపుచ్చుకుని అభివృద్ధి చెందుతూ కెరీర్‌లోకి వెళ్ళాలని బోధించాలి.

ప్రతి వ్యక్తిలోనూ అంతర్బాహ్య సౌందర్యాలు రెండుంటాయి. విద్యార్థులు కూడా దీనికి భిన్నం కాదు. వారు తమ వయసు రీత్యా దుడుకుతనంతో వాటిని త్వరగా బయటకు వ్యక్తీకరిస్తారు. అటువంటప్పుడు ప్రసక్తానుప్రసక్తంగా ఏది ఎక్కడ ఎలా ప్రదర్శించాలో విద్యార్థులకు సూచిస్తూ ఉపాధ్యాయుడు వారిలోని సమతౌల్యతకు దోహదపడాలి. తద్వారా విద్యార్థులను మంచి వ్యక్తులుగా తీర్చిదిద్దవచ్చు.

నాణ్యమైన విద్యను అందించే క్రమంలో ఉపాధ్యాయుడు తనలోని నైపుణ్యాలను ఎప్పటికప్పుడు పెంపొందించుకోవాలి. ‘ఉపాధ్యాయునిలోని చైతన్యశీలత అతని నైపుణ్యాలకు దోహదం చేస్తుంది. తద్వారా సమాజం అతనిని ఉత్తమ గురువుగా గుర్తిస్తుంది’ అంటారు మహాత్మాగాంధీ. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని బోధన సాగాలి. అంతేకాకుండా విద్యలో విలువలు కూడా అవసరమే. ‘సత్యమును పలుకుము, పెద్దలను గౌరవించుము’ వంటివి ఏ కాలంలోనైనా ఉన్నతాంశాలే. వీటిని బోధించే ముందర ఒక క్రమశిక్షణాయుతమైన బాధ్యత ఉపాధ్యాయునికి ఉండాలి. సమయపాలన, పఠనం, నిరంతరం రాయటం వంటివి ఉపాధ్యాయునిలో నాణ్య మైన గుణాలు పెంపొందింపజేసే అంశాలే. ఇవి నిత్యకృత్యం కావాలి. ఉపాధ్యాయునిలో ఇటువంటి సుగుణా లన్నింటినీ విద్యార్థులు గమనిస్తూనే ఉంటారు. ‘నా జీవితంలో నిపుణత, విలువలకు మార్గదర్శి నా గురువు. నా ఈ స్థానం ఆయనదే, తర్వాత నా తల్లిదండ్రులది’ అన్న నెహ్రూ మాటలు ఎన్నదగినవి.

మరికొన్ని విషయాలు కాలానుగుణంగా అవసరమౌతాయి. కొత్త కొత్త ఆలోచనలు కల్పించే విధంగా బోధన చేస్తూ విద్యార్థులలోని సృజనను వెలికితీయవచ్చు. విద్యార్థులు వివిధ సదస్సులలో పాల్గొనడం, అతిథి ఉపన్యాసాలు వినటం, వివిధ పోటీలలో పాల్గొనటం వంటివి కొత్త భావనాశక్తిని పెంపొందించేందుకు ఉపయోగపడతాయి. ఏది ఏమైనా ఉపాధ్యాయుడు ఎప్పుడూ క్రియాశీలకంగా ఉండాలి. తన వృత్తి పట్ల, వ్యవస్థ పట్ల, వ్యక్తిత్వం పట్ల విలువలతో కూడి ఉండాలి. సమయపాలన, బోధనా పద్ధతులు, సమస్యా పరిష్కారం, సంబంధాల విషయంలో జాగురూకతతో ఉండగలిగినప్పుడు నిబద్ధత కలిగిన ఉపాధ్యాయునిగా రాణించగలుగుతాడు.

– భమిడిపాటి గౌరీశంకర్,
తెలుగు ఉపన్యాసకులు । 94928 58395

తల్లీ పిల్లల స్థితి మెరుగుపడితేనే భవిష్యత్తు!

అభిప్రాయం



డాక్టర్ కత్తి పద్మారావు

భారతదేశం ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్యా సంక్షోభాల్లో ఉంది. దీనికి కారణం రాజ్యాంగ సూత్రాలను అమలు జరపకపోవటమే. సామాజిక పరిణామానికి విద్యే ప్రధానమైన వాహిక అని డా॥ బీఆర్ అంబేడ్కర్ చెప్పారు. కాని ఈనాడు దేశ వ్యాప్తంగా చిన్న పిల్లలు బడికి వెళ్ళడానికి సంబంధించిన సామాజిక, ఆర్థిక నేపథ్యం తగ్గుతూ వస్తోంది. కారణం వ్యవసాయ కూలీలుగా ఉన్న దళితులు, బహుజనులు వలస వెళ్ళటం వల్ల పిల్లలకు ఇళ్ళలో ఆలనాపాలనా తగ్గింది. స్థిరమైన జీవితానికి ఇంక మనకు పాదులు పడలేదు. ఆ దిశలో ప్రభుత్వాలు కృషి చేయవలసి ఉంది.

విద్య సామాజిక పరిణామాలకు మూలం. నూతన సమాజాన్ని సృష్టిస్తుంది. వ్యక్తిత్వ నైపుణ్యాన్ని తీర్చిదిద్దుతుంది. ఒక్క భారతదేశంలో తప్ప పెక్కు దేశాల్లో ఇప్పుడు నిరక్షరాస్యులు లేరు. అక్షరం అనేది ఆహారంతో, ఆహార్యంతో, నివాసంతో సమానంగా అభ్యసించబడుతుంది. అందుకనే భర్తృహరి విద్యాధనాన్ని దొంగలు దోచుకోలేరనీ, ఆ ధనం మనల్ని ఉన్నతుల్ని చేస్తుందనీ, ఆ ధనం ఎంత ఇచ్చినా తరగనిదనీ అన్నారు. విద్య విద్యార్థులకు సరిగా రావాలంటే టీచర్స్‌కు మాతృ హృదయం ఉండాలి.

అనేక రాష్ట్రాలలో విద్యాభ్యసనానికి సంబంధించి ఇళ్ళలో సరియైన వసతులు లేవు. హైస్కూల్‌లో పదవ తరగతి పాస్ అయిన విద్యార్థులు ఎక్కువ మంది ఇంటర్మీడియట్‌లో చేరలేకపోతున్నారు. అందువల్ల ఆడపిల్లలకు బాల్య వివాహాలు జరుగుతున్నాయి. దీనికి కారణం వారి ఆర్థిక సామాజిక పరిస్థితులే. ఇకపోతే మధ్యాహ్న భోజనం ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలో తప్ప మిగిలిన రాష్ట్రాలలో మెరుగుపడలేదు. నిజానికి మధ్యాహ్న భోజనం విద్యార్థులకు చాలా విలువైనది. ఈ భోజనం నాణ్యత పెంచడం వల్ల పిల్లల్లో మేధా శక్తి పెరుగుతుంది. నిజానికి ఇంటి దగ్గర తల్లిదండ్రులు 60 శాతం మంది పిల్లలకు సరైన ఆహారం పెట్టలేకపోతున్నారు. భారతదేశ వ్యాప్తంగా అసలు గర్భస్థ శిశువుకే సరైన పోషణ లేదు. దళిత బహుజన స్త్రీలలో రక్తహీనత ఎక్కువగా ఉంది. ప్రస్తుత లెక్కల ప్రకారం ప్రతి దినం 800 మంది మహిళలు పిల్లలను కనేటప్పుడు దేశ వ్యాప్తంగా చనిపోతున్నారు. మొత్తం భారతదేశంలో ఉన్న స్త్రీలకు ఒక గ్లాసుడు పాలు ఇవ్వలేని అభాగ్యతలో ఉన్నాం. భారతదేశానికి తల్లి పునాది. ఆ తల్లి నిర్భాగ్యతలో, నిరక్షరాస్యతలో ఉండడం దేశ దారిద్ర్యానికి నిలువుటద్దం. ఇప్పటికీ బహుజన కుటుంబాల్లోని తల్లిదండ్రులు అత్యధికులు నిరక్షరాస్యులుగానే ఉన్నారు. మరి వారి పిల్లలు ఎలా చదువుతారు? మరోపక్క ఈనాడు తల్లి శారీరకంగా బలహీనంగా వుంది. ఆమెకు పిండిపదార్థాలు, కొవ్వు పదార్థాలు, విటమిన్లు, ఖనిజ లవణాలు వంటివి తక్కువగా అందుతున్నాయి. దీనికి కారణం సరైన ఉపాధి, సంపాదన, అన్నీ తినే తాహతు లేకపోవడం. అందుకే ఈ దిశలోనూ తల్లుల



బాగోగులను ప్రభుత్వాలు పట్టించుకోవాలి. విద్య పురుషు లకంటే స్త్రీలకు బాగా వస్తుందని అంబేడ్కర్ అన్నారు. అందుకే భారతీయ సమాజాన్ని అంబేడ్కర్ ఆలోచనలతో మనం పునర్నిర్మించుకోవాలి. తల్లీ బిడ్డ విద్యలను సుసంపన్నం చేసినప్పుడే భారత దేశానికి పునరుజ్జీవనం వస్తుంది.

పిల్లలు, తల్లులూ... టీవీలు, సెల్ ఫోన్‌లు, సీరియల్స్‌కు అలవాటు పడటం కూడా ప్రాథమిక, ఉన్నత విద్యకు చాలా అవరోధంగా ఉంది. నిరక్షరాస్యతలో ఉన్న ఒక తల్లికి తన బిడ్డల్ని అత్యున్నత విద్యావంతులుగా చేసే మానసిక, సామాజిక శక్తి తక్కువ అవుతుంది. ఇక ఇటీవల విద్యార్థులకు క్లాసుల్లో పాఠం వినడం మీద శ్రద్ధ తగ్గింది. అపహాస్యానికీ, హాస్యానికీ, అల్లరికీ ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారనీ, టీచర్లను గౌరవించటం తగ్గిందనీ, పిల్లలకు పాఠం చెప్పటం ఒక సవాలుగా మారిందనీ ఉపాధ్యాయులు అంటున్నారు. అయితే ఈ అవలక్షణాలకు పిల్లలు అలవాటు కావడానికి సినిమాలు, సెల్‌ఫోన్‌లు, బార్లు, నెట్ సెంటర్లు, పబ్బులు, క్లబ్బులు, రిసార్ట్‌లు కారణం అని మానసిక నిపుణులు అంటున్నారు.

విద్య మానవ సామాజిక వ్యవస్థలను సుసంపన్నం చేస్తుంది. విద్య ద్వారా శాస్త్రజ్ఞులు, పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, పరిపాలనా దక్షులు, రాజనీతిజ్ఞులు, సామాజిక శాస్త్ర దార్శనికులు రూపొందుతారు. వారు ప్రపంచ మానవులుగా అభివృద్ధి చెందుతారు. మానవ సమాజ అభివృద్ధికి వారు దోహదకారులు అవుతారు. ఆ విద్య గుండెల మీద దెబ్బతగిలితే మెదడుకు రక్తప్రసరణ ఆగిపోతుంది. ఆర్థిక దోపిడీ, అవినీతి పెరిగిపోతాయి. విద్య తగ్గితే దేశానికి నైతిక శక్తి తగ్గుతుంది. విశ్వవిద్యాలయ స్థాయిలో ఆయా సబ్జెక్టులకు తగిన ఉపాధ్యాయ, ఆచార్య నియామకాలు లేక పోవడం వల్ల విద్య నాణ్యత తగ్గుతోంది.

మరో పక్క కార్పొరేట్ విద్యా సంస్థలు విస్తరిస్తూ విద్యను వ్యాపారమయం చేసి జ్ఞానశూన్యమైన బట్టీ విద్యను అభ్యసింపజేసి, ధారణ చేయించి విద్యా వాణిజ్యాన్ని కొనసాగిస్తున్నాయి. చివరికి వాళ్ళు ప్రశ్న పత్రాలు ప్రింటయ్యే ముద్రణాలయాల వారితో కూడా సంబంధాలు పెట్టుకొని ర్యాంకులు సంపాదించే స్థితికి చేరారు. దొంగ సర్టిఫికేట్లతో వైద్యులూ, ఇంజినీర్లూ అయినవాళ్ళు దేశానికి ఇప్పటికే ఎంతో నష్టాన్ని తెచ్చారు. నిజానికి విద్యా పునాదులు కదులుతున్న చప్పుడు భారతదేశంలో బలంగా వినిపిస్తోంది. సామాజిక రుగ్మతల విజృంభణ పెరిగింది. సాంస్కృతిక విధ్వంస భేరి మోగుతోంది. అక్షర దాతలు తగ్గి, దేవతార్చనల దాతలు పెరిగారు. పిల్లలకు నోటు పుస్తకాలు ఇచ్చే దాతలు తగ్గారు. విద్య అనేది దాతల దానం మీద కూడా ఆధారపడి ఉంటుంది. విద్యకు విద్యార్థులకు, విద్యార్థుల పౌష్టిక ఆహారానికి ఖర్చు పెట్టాలనే భావన పాలకులలోనే కాకుండా ప్రజలలో కూడా రావాలి. అప్పుడే మన సామాజిక, సాంస్కృతిక వాతావరణం వెల్లివిరుస్తుంది.

వ్యాసకర్త దళిత బహుజన ఉద్యమ నేత
మొబైల్: 98497 41695

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.అష్టమి రా. 9.33 వరకు, తదుపరి నవమి, **నక్షత్రం:** రేవతి రా. 12.12 వరకు, తదుపరి అశ్వని, **వర్జ్యం:** ప. 12.43 నుండి 2.15 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.30 నుండి 1.23 వరకు, **అమృతఘడియలు:** రా.9.52 నుండి 11.15 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.35, **సూర్యాస్తమయం:** 6.35.

క్లుప్తంగా...

పొలం వద్దకే పోడు పట్టా..

● మహిళా రైతుకు అందజేసిన ఎమ్మెల్యే



పొలం వద్ద మహిళా రైతుకు పోడు పట్టా అందిస్తున్న ఎమ్మెల్యే నాగేశ్వరరావు

అశ్వారావుపేట రూరల్: ఎంతోకాలంగా పోడు పట్టా కోసం ఎదురుచూస్తున్న ఓ మహిళా రైతుకు.. ఊహించనివిధంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు ఆదివారం ఆమె పొలం వద్దకే వెళ్లి పట్టా అందజేశారు. అశ్వారావుపేట మండలం కన్నాయిగూడెంలో ఎమ్మెల్యే మెచ్చా పోడు పట్టాలు పంపిణీ చేస్తుండగా.. మడకం చుక్కమ్మ అనే రైతు పేరును అధికారులు చదివారు. ఆమె పొలానికి వెళ్లిందని స్థానికులు చెప్పగా.. ఎమ్మెల్యే స్వయంగా పొలం వద్దకే వెళ్లారు. ఆమెకు పోడు పట్టా పుస్తకాన్ని అందజేశారు. దీంతో చుక్కమ్మతో పాటు స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు.

యాదాద్రిలో ట్రాన్స్‌కో సీఎండీ పూజలు



ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్‌రావుకు లడ్డూ ప్రసాదం అందజేస్తున్న ఆలయాధికారి

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి వారిని ట్రాన్స్‌కో సీఎండీ ప్రభాకర్ రావు కుటుంబ సభ్యులతో కలిసి ఆదివారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆచార్యులు వీరికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం స్వామి దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా, అధికారులు లడ్డూ ప్రసాదం అందజేశారు.

కిటకిటలాడిన యాదాద్రి

యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. స్వామి వారి ధర్మదర్శనానికి రెండున్నర గంటలు, వీఐపీ దర్శనానికి 30 నిమిషాలు పట్టినట్లు భక్తులు తెలిపారు. స్వామి వారిని 35వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారు.

అన్ని జిల్లాల్లో పద్మశాలి ఉద్యోగుల సదస్సులు

సాక్షి, హైదరాబాద్: వచ్చే సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో అన్ని జిల్లా కేంద్రాల్లో పద్మశాలి ఉద్యోగుల సదస్సులను నిర్వహించాలని తెలంగాణ పద్మశాలి ఉద్యోగుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం తీర్మానించింది. ఆదివారం నాగోల్‌లోని ప్రధాన కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు ఈగ వెంకటేశ్వర్లు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరందాసు యాదగిరి, అసోసియేట్ అధ్యక్షుడు ఎనగండ్ల రాహుల్ కుమార్, సంస్థాగత కార్యదర్శి శిరందాసు యాదగిరేందర్, ఉపాధ్యక్షులు గుండు శ్రీనివాస్, ఇప్పకాయల విష్ణుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

12న ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ సమావేశం

సాక్షి, హైదరాబాద్: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ చట్టబద్ధత ఉద్యమాన్ని మరింత ఉధృతం చేయాలని ఎమ్మార్పీఎస్ నిర్ణయించింది. వరంగల్‌లో ప్రధాని మోదీ దృష్టికి ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తీసుకెళ్లిన తర్వాత జరుగుతున్న పరిణామాలపై సమీక్షించేందుకు చర్యలు వేగవంతం చేసింది. ఇందులో భాగంగా ఈనెల 12న వరంగల్‌లో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్), మహాజన సోషలిస్టు పార్టీ (ఎంఎస్‌పీ) జాతీయ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించనున్నారు. వర్షాకాల పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లు సాధించుకునే లక్ష్యంతో త్వరలో చలో హైదరాబాద్ పేరిట బహిరంగసభ నిర్వహించనున్నట్లు ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు నరేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఫిషరీస్ హబ్‌గా ఉమ్మడి కరీంనగర్



రవీందర్

విద్యానగర్ (కరీంనగర్ జిల్లా): విస్తారమైన జలవనరులున్న ఉమ్మడి కరీంనగర్ జిల్లాను ఫిషరీస్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు మత్స్యశాఖ ఆధ్వర్యంలో కృషి చేస్తున్నట్లు మత్స్యశాఖ సమాఖ్య చైర్మన్ పిట్టల రవీందర్ తెలిపారు. కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...ఉమ్మడి కరీంనగర్ జిల్లాను ఫిషరీస్ హబ్‌గా మార్చడానికి సమగ్ర కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నామన్నారు. జలవనరుల ఫలితంగా చేపల ఉత్పత్తికి అవకాశాలు మెరుగుపడ్డాయని ఫలితంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లా మత్స్యరంగంతోపాటు ఆక్వా కల్చర్ రంగం అభివృద్ధికి అనుకూలంగా మారిందన్నారు. ఉమ్మడి జిల్లాల పరిధిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ఆధునిక పద్ధతుల్లో చేపల పెంపకానికి చర్యలు తీసుకుంటున్నామని ఫలితంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని చెప్పారు.



మనసంతా మహబూబ్ ఘాట్

అడపాదడపా కురుస్తున్న వర్షాలకు మహబూబ్ ఘాట్ పచ్చదనం సంతరించుకుంది. ప్రకృతి ప్రేమికుల్ని పరవశింపజేస్తోంది. నిర్మల్ నుంచి 15 కిలోమీటర్ల దూరంలో నిర్మల్–ఆదిలాబాద్ ప్రధాన రహదారిపై మహబూబ్ ఘాట్ ప్రస్తుతం ప్రకృతి ప్రేమికులతో కళకళలాడుతోంది. ఆదివారం సెలవు కావడంతో చాలా మంది పర్యాటకులు మహబూబ్‌ఘాట్‌కు వచ్చారు. సమీపంలోని జలపాతాన్ని వీక్షించి ఫొటోలు దిగారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నిర్మల్



బొగత జలపాతంలో సందడి

వర్షాలు పడుతుండడంతో ములుగు జిల్లా వాజేడు మండల పరిధిలోని చీకుపల్లి గ్రామ సమీపంలో బొగత జలపాతం కనువిందు చేస్తోంది. దీంతో ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. బొగత సమీపంలో ఏర్పాటు చేసిన నీటి కొలనులో సేదదీరుతూ.. సెల్ఫీలు దిగుతూ సందడి చేశారు.

– వాజేడు

గోదావరిలో 3,396.9 టీఎంసీల లభ్యత

● 1941–42 నుంచి 1979–80 వరకూ బేసిన్‌లో వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా తేల్చిన సీడబ్ల్యూసీ
● బచావత్ ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చే నాటికి సబ్ బేసిన్ల వారీగా నీటి లభ్యతపై అధ్యయనం
● వ్యాప్కోస్ తేల్చిన దానికంటే ఐదు టీఎంసీల లభ్యత అధికంగా ఉందని వెల్లడి

సాక్షి, హైదరాబాద్: గోదావరి జల వివాదాల (బచావత్) ట్రిబ్యునల్ అవార్డు అమల్లోకి వచ్చే నాటికి గోదావరిలో మొత్తం 4,535.1 టీఎంసీల లభ్యత ఉందని కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) తాజాగా అంచనా వేసింది. ఇక 75 శాతం లభ్యత ఆధారంగా గోదావరిలో 3,396.9 టీఎంసీల లభ్యత ఉందని తేల్చింది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరిలో 75 శాతం లభ్యత ఆధారంగా 1,430 టీఎంసీల లభ్యత ఉందని 2004లో వ్యాప్కోస్ తేల్చగా.. సీడబ్ల్యూసీ తాజా అధ్యయనంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో గోదావరిలో 75 శాతం లభ్యత ఆధారంగా 1,435 టీఎంసీల లభ్యత ఉందని తేల్చింది. వ్యాప్కోస్ అంచనా వేసిన దానికంటే ఐదు టీఎంసీలు అధికంగా ఉన్నట్లు తేల్చింది. నదీ పరివాహక ప్రాంతం (బేసిన్)లో 1941–42 నుంచి 1979–80 వరకూ వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా గోదావరిలో నీటి లభ్యతపై తాజాగా సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది. గోదావరిలో ఉప నదీ పరీవాహక ప్రాంతాల(సబ్ బేసిన్) వారీగా నీటి లభ్యత, బచావత్ ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులను తేల్చింది. ఈ అధ్యయనం ప్రకారం ఉమ్మడి మధ్యప్రదేశ్‌కు 679.6, మహారాష్ట్రకు 951, కర్ణాటకకు 37.8, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు 1,435, ఒడిశాకు 293.6 టీఎంసీలను బచావత్ ట్రిబ్యునల్ కేటాయించినట్లు అంచనా వేసింది. ఇందుకు సంబంధించిన నివేదికను గోదావరి బోర్డు (జీఆర్‌ఎంబీ)కు సీడబ్ల్యూసీ ఇటీవల సమర్పించింది. ఈ నివేదికపై ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ప్రభుత్వాల అభిప్రాయాలను జీఆర్‌ఎంబీ కోరింది.

తాజా అధ్యయన నేపథ్యం ఇదీ..

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ పరిధిలోని గోదావరిలో 75 శాతం లభ్యత ఆధారంగా 1,430 టీఎంసీల (70 టీఎంసీల పునరుత్పత్తి జలాలు) 2004లో వ్యాప్కోస్ తేల్చింది. ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులకు 1,238.46 టీఎంసీలు (902.46 నికర, 336 మిగులు) అవసరమని గోదావరి బోర్డుకు ఏపీ ప్రభుత్వం అనేక సందర్భాలలో స్పష్టం చేసింది. ఇక తెలంగాణ సర్కార్ కూడా ఇప్పటికే పూర్తయిన, నిర్మాణంలో ఉన్న, భవిష్యత్తులో చేపట్టే ప్రాజెక్టులకు 1,767 టీఎంసీలు (967 నికర, 800 మిగులు) అవసరమని తెలిపింది. రెండు రాష్ట్రాల ప్రతిపాదనలను పరిగణనలోకి తీసుకుంటే 3,005.46 టీఎంసీలు అవసరం. ఈ



నేపథ్యంలో.. గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చి, 2 రాష్ట్రాలకు కేటాయింపులు చేశాకే.. కొత్త ప్రాజెక్టులకు అనుమతివ్వాలని జనవరి 3న జరిగిన సర్వసభ్య సమావేశంలో గోదావరి బోర్డును రెండు రాష్ట్రాలు కోరాయి. గోదావరిలో సబ్ బేసిన్ల వారీగా నీటి లభ్యతను తేల్చకుండానే.. అప్పట్లో రాష్ట్రాల మధ్య కుదిరిన ఒప్పందాల ఆధారంగా బచావత్ ట్రిబ్యునల్ జలాలను పంపిణీ చేసింది. ఇదే అంశాన్ని ఎత్తిచూపుతూ గోదావరిలో నీటి లభ్యతను శాస్త్రీయంగా తేల్చాలని ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు అటు కేంద్ర జల్ శక్తి శాఖను.. ఇటు గోదావరి బోర్డును కోరుతూ వస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే బచావత్ ట్రిబ్యునల్ అవార్డు వెలువడే నాటికి గోదావరిలో నీటి లభ్యతపై శాస్త్రీయంగా అధ్యయనం చేసి.. నివేదిక ఇవ్వాలని గత జనవరి 19న సీడబ్ల్యూసీకి గోదావరి బోర్డు లేఖ రాసింది. ఈ మేరకు సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది.

గోదావరిలో నీటి లభ్యతపై ఇప్పటిదాకా చేసిన అధ్యయనాల వివరాలు.. (టీఎంసీలలో)

ఏడాది	అధ్యయనం చేసిన సంస్థ	నీటి లభ్యత (75% ఆధారంగా)
1901–03	ఫస్ట్ ఇరిగేషన్ కమిషన్	3,306.64
1949	ఖోస్లా ఎంపీరియల్ ఫార్ములా	3,554.72
1960	సీడబ్ల్యూ అండ్ పీసీ	3,266.14
1962	కృష్ణా, గోదావరి కమిషన్	3,341.47
1988	సీడబ్ల్యూసీ	3,341.47
1993	సీడబ్ల్యూసీ	3,130.49
2019	సీడబ్ల్యూసీ	3,334.39
2023	సీడబ్ల్యూసీ	3,396.9

40 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా..

మహారాష్ట్రలోని పశ్చిమ కనుమల్లో నాసిక్ వద్ద పురుడుపోసుకునే గోదావరి 1,465 కిలోమీటర్ల పొడవున ప్రవహించి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని అంతర్వేది వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. మహారాష్ట్ర, కర్ణాటక, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశాలలో 3,12,150 చ.కి.మీ. పరిధిలో ఈ నదీ పరీవాహక ప్రాంతం ఉంది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 9.5 శాతంతో సమానం. గోదావరి జలాలను బేసిన్ పరిధిలోని రాష్ట్రాలకు పంపిణీ చేస్తూ 1980, జూలై 7న బచావత్ ట్రిబ్యునల్ కేంద్రానికి నివేదిక ఇచ్చింది. అదే ఏడాది ఆ అవార్డును కేంద్రం అమల్లోకి తెచ్చింది. ఈ నేపథ్యంలో 1941–42 నుంచి 1979–80 వరకూ అంటే 40 ఏళ్ల గోదావరి బేసిన్‌లో వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ తాజాగా అధ్యయనం చేసింది.

సబ్ బేసిన్‌ల వారీగా 75 శాతం లభ్యత ఆధారంగా నీటి లభ్యత

సబ్ బేసిన్	మొత్తం లభ్యత	75 శాతం లభ్యత ఆధారంగా (టీఎంసీలలో)
అప్పర్ గోదావరి(జీ–1)	320	264.0
ప్రవర(జీ–2)	43.6	38.5
పూర్ణ(జీ–3)	103.8	66.00
మంజీర(జీ–4)	216.8	132.7
మధ్య గోదావరి(జీ–5)	256.1	183.7
మానేరు(జీ–6)	85.8	45.9
పెన్‌గంగ(జీ–7)	235.4	133.2
వార్ధా(జీ–8)	252.9	174.7
ప్రాణహిత(జీ–9)	1197.2	919.2
లోయర్ గోదావరి(జీ–10)	306.3	213.3
ఇంద్రావతి(జీ–11)	998.8	816.7
శబరి(జీ–12)	518.4	408.9
మొత్తం	4535.1	3396.9

సాయికి 'గళ' నివాళి

● హస్తినాపురంలో సంతాపసభ
● హాజరైన సీఎం కేసీఆర్, మంత్రులు, కళాకారులు



సాయిచంద్ దశదిన కర్మ సందర్భంగా సంతాప సభలో ఆయన భార్యను ఓదారుస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్ తదితరులు

సాక్షి, రంగారెడ్డి జిల్లా: తెలంగాణ ఉద్యమ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ మాజీ చైర్మన్ వేద సాయిచంద్‌కు సీఎం కేసీఆర్ సహా పలువురు మంత్రులు, ప్రజాప్రతినిధులు, తోటి కళాకారులు, అభిమానులు ఘన నివాళులర్పించారు. సాయిచంద్ దశదిన కర్మ సందర్భంగా ఆదివారం హస్తినాపురంలో బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సంతాప సభకు ముఖ్యమంత్రి హాజరయ్యారు. సాయిచంద్ చిత్రపటానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. అధైర్యపడొద్దు, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఆయన వెంట మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, మంత్రులు మహమూద్ అలీ, చామకూర మల్లారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, గంగుల కమలాకర్, శ్రీనివాస్‌గౌడ్, జగదీశ్‌రెడ్డి, నిరంజన్ రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి, ప్రభుత్వ విప్ బాల్క సుమన్, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్ రెడ్డి, గోరటి వెంకన్న, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రసమయి బాలకిషన్ ఇతర ప్రజా ప్రతినిధులు ఉన్నారు. ఈ సందర్భంగా కళాకారులు తమ స్వరాలతో సాయిని స్మరించారు. 'పాలమూరు పిల్లగాడు బయలుదేరెనే..ప్రపంచ వేదిక మీద ప్రజలపాటై నిలిచెనే..అమరచింత చిన్నవాడు ఎల్లలు దాటినే..స్వరాష్ట్ర సాధన ధ్యానం చేసి గానం చేసెనే..'అంటూ సురేందర్, మధుప్రియ, సందీప్, బిత్తిరి సత్తి, యశ్‌పాల్, సంతోష్ కుమార్, ప్రసాద్ తదితర కళాకారులంతా ఒకే గొంతుగా పాటను ఆలపించి సాయికి నివాళులర్పించారు. ఈ పాటకు సీఎం కేసీఆర్ సైతం కంటతడి పెట్టడం గమనార్హం. గాయని మధు ప్రియ ఆలపించిన 'నాన్నా... నాన్నా..నీ మనసెంతో తీయన నాన్నా..'అంటూ ఆలపించిన గీతానికి సాయిచంద్ తండ్రి వెంకటరాములు కన్నీరు మున్నీరుగా విలపించారు. పలువురు కళాకారులు, బీఆర్‌ఎస్ పార్టీ నేతలు, అభిమానులు సాయిచంద్‌తో తమకు ఉన్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. సాయిచంద్ మరణం తెలంగాణకు తీరని లోటని వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తమ జిల్లా (మహబూబ్‌నగర్)కు చెందిన సాయిచంద్ తన పాటతో ప్రజలందరి గుండెల్లో నిలిచిపోయారని పేర్కొన్నారు.



బ్రహ్మగర్జన సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత. చిత్రంలో కేవీ రమణాచారి, వేణుగోపాలచారి తదితరులు

అవసరమైతే గాండీవం ఎత్తాలి

● బ్రాహ్మణులను హేళన చేస్తే ఊరుకునే ప్రసక్తే లేదు
● బ్రాహ్మణులు రాజకీయంగా రాణించాలి
● 'బ్రహ్మగర్జన'సభలో ఎమ్మెల్సీ కవిత

హుడా కాంప్లెక్స్: 'అవసరమైనప్పుడు వేదం చదవాలి. గాండీవం కూడా ఎత్తాలి.. సమయం, సందర్భాన్ని బట్టి స్ఫూర్తిని అలవర్చుకోవాలి.. విజ్ఞతను ప్రదర్శించాలి'అని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బ్రాహ్మణులకు పిలుపునిచ్చారు. సరూర్‌నగర్ స్టేడియంలో ఆదివారం బ్రాహ్మణ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బ్రహ్మగర్జన సభలో ఆమె ముఖ్య అతిథిగా ప్రసంగించారు. సింహాలు గర్జించాలని.. అప్పుడే అడవి ఆర్డర్‌లో ఉంటుందని, మేఘాలు గర్జించాలని.. అప్పుడే సమాజం చల్లగా ఉంటుందని వ్యాఖ్యానించారు. 75 ఏళ్ల స్వాతంత్ర భారతంలో ఏ ఒక్క ప్రభుత్వం కూడా బ్రాహ్మణులకు ఒక్క రూపాయి ఇవ్వలేదనీ కానీ బీఆర్ఎస్ ప్రభుత్వం అర్చక స్వాములకుజీతాలు ఇస్తోందని, ఉద్యోగ భద్రత కల్పిస్తోందని, దూపదీప నైవేద్యాల సొమ్మును రూ.2,500 నుంచి రూ.10 వేలకు పెంచిందని ఆమె గుర్తు చేశారు. బోనాల పండుగ సందర్భంగా హైదరాబాద్‌లోని 1,600పైగా ఆలయాలకు రూ.16,000 నుంచి రూ.ఐదు లక్షల వరకు ఇచ్చిన ఘనత తెలంగాణ ప్రభుత్వానికే దక్కిందన్నారు. ఐఏఎస్, ఐపీఎస్ చదువుకోవాలనే వారికి స్టడీ సర్కిళ్లలో అవకాశం కల్పిస్తున్నట్టు తెలిపారు.

హేళన చేస్తే క్షమించం: బ్రాహ్మణులను చూసి హేళన చేసే వారిని బీఆర్ఎస్ ప్రభుత్వం క్షమించదని కవిత స్పష్టం చేశారు. బ్రాహ్మణులు సైతం రాజకీయంగా రాణించాలని ఆకాంక్షించారు. బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జగన్మోహన్ శర్మ అధ్యక్షతన జరిగిన సభలో సత్యానంద భారతీస్వామి, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, టీఎస్ఐడీసీ చైర్మన్ వేణుగోపాలచారి, ఎమ్మెల్సీ వాణీదేవి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, మాజీ ఎంపీ లక్ష్మీకాంతరావు, మాజీ ఎమ్మెల్సీలు రాంచందర్‌రావు, పురాణం సతీష్, దేవిప్రసాద్, ఏపీ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, మాజీ ఎమ్మెల్యే ఎంవీఎస్ఎస్ ప్రభాకర్, బ్రాహ్మణ సంఘం కార్యదర్శి తులసి శ్రీనివాస్, కోశాధికారి మునిపెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

సెయిలింగ్ రేసుల్లో మహిళలు భేష్

● 17 మంది బాలికలు పాల్గొనడం గర్వకారణం
● హైదరాబాద్‌లో సెయిలింగ్‌కు అనుకూల వాతావరణం..
● సెయిలింగ్ ట్రోఫీ ప్రదానోత్సవంలో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్



సెయిలింగ్ ట్రోఫి ప్రదానోత్సవంలో రేసర్లు, అధికారులతో గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

సాక్షి, హైదరాబాద్: సెయిలింగ్ వంటి విభిన్నమైన రేసుల్లో మహిళలు రాణించడం హర్షణీయమని రాష్ట్ర గవర్నర్ డాక్టర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. నగరంలో జరిగిన 'హైదరాబాద్ సెయిలింగ్ వీక్'లో 93 మంది సెయిలర్స్ పాల్గొంటే అందులో 17 మంది రేసర్లు బాలికలు ఉండటం అభినందనీయమన్నారు. ఈఎంఈ సెయిలింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత వారం రోజులుగా నిర్వహించిన 37వ 'హైదరాబాద్ సెయిలింగ్ వీక్' పోటీల విజేతలకు ఆమె ఆదివారం మెడల్స్, ట్రోఫీలను అందించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ మాట్లాడుతూ., సెయిలింగ్ అనేది అనేక ఛాలెంజ్‌లతో కొనసాగే క్రీడ అని, ఇందులో రాణించడం అంత సులభం కాదని పేర్కొన్నారు. ఈ గేమ్‌లో రాణించిన రేసర్లు జీవితంలో ఎదురయ్యే ఒడిదుడుకులను కూడా సమర్థవంతంగా ఎదుర్కొనే పరిపూర్ణతను సాధిస్తారని అభిప్రాయపడ్డారు. ఏషియన్స్ గేమ్స్, ఒలింపిక్స్ వంటి అంతర్జాతీయ వేదికల్లో కూడా మన వాళ్ల పతకాలను సాధించాలని ఆశించారు. సెయిలింగ్ వంటి విభిన్న ఆటలకు నగర వాతావరణం అనుకూలంగా ఉండటం హర్షణీయమన్నారు.

సాగర్ పరిశుభ్రతపై శ్రద్ధ చూపాలి

ఈ సందర్భంగా హుస్సేన్ సాగర్‌ను మరింత పరిశుభ్రంగా చూసుకోవాలని గవర్నర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వంతో పాటు నగరవాసులు కూడా హుస్సేన్ సాగర్ సంరక్షణను బాధ్యతగా తీసుకోవాలని, అందరూ కలిసి పనిచేస్తేనే మార్పు సాధ్యమవుతుందన్నారు. గతంలో సాగర్ వేదికగా సెయిలింగ్ పోటీలు నిర్వహించే సమయంలో చేపలు, కప్పలు, పాములు కనిపించేవని, కానీ ఇప్పుడు కాలుష్యం వల్ల అవి కనిపించడం లేదని ఆర్మీ అధికారులు చెప్పారని గవర్నర్ పేర్కొన్నారు. పోటీల నిర్వహణకు రాష్ట్ర ప్రభుత్వం, క్రీడా మంత్రిత్వ శాఖ, పర్యాటక శాఖ అందించిన సహకారానికి ఎమ్‌సీఈఎమ్ఈ కమాండెంట్, లేజర్ క్లాస్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ప్రెసిడెంట్ లెఫ్టినెంట్ జనరల్ జేఎస్ సిదాన కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం లేజర్‌స్టాండర్డ్, లేజర్ రేడియల్, లేజర్ 4.7 విభాగాల్లో మొత్తం 12 రేసుల్లో విజేతలకు గవర్నర్ మెడల్స్, ట్రోఫీలను అందించారు. ఐఎల్‌సీఏ 4 విభాగంలో వైష్ణవి, మల్లేష్, ఐఎల్‌సీఏ 6లో రితికా డాంగి, కోటేశ్వరరావు, ఐఎల్‌సీఏ 7లో హవ్ మోహిత్ సైనీ స్వర్ణ పతక విజేతలుగా నిలిచారు. ఛాంపియన్ ట్రోఫీలను మల్లేష్, వైష్ణవి, నేషనల్ ఛాంపియన్ ట్రోఫీని రితికా డాంగి సాధించారు. వీటితో పాటు పలు విభాగాల్లో పతకాలను గవర్నర్ చేతుల మీదుగా రేసర్లు తీసుకున్నారు.

బీమాపై సాగదీత.. రైతుకు ఏదీ భరోసా?

▶ మొదటి పేజీ తరువాయి

బయటకు వచ్చింది. కేంద్ర బీమా పథకాలు రైతులకు నష్టం చేకూర్చడం వల్లే రాష్ట్ర ప్రభుత్వం వాటి నుంచి బయటకు వచ్చిందని వ్యవసాయ శాఖ వర్గాలు చెబుతున్నాయి. ఈ కారణంగానే పంజాబ్, జార్ఖండ్, గుజరాత్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాలు కూడా పీఎంఎఫ్‌బీవై నుంచి బయటకు వచ్చాయని ఆ వర్గాలు వివరిస్తున్నాయి.

బీమా సంస్థలకే ఎక్కువ ప్రయోజనం?

రాష్ట్రంలో దాదాపు 66 లక్షల మంది రైతులున్నారు. గతంలో పంటల బీమా పథకాలు అమల్లో ఉన్నప్పుడు సుమారు 8 లక్షల నుంచి 10 లక్షల మంది తమ పంటలకు బీమా చేయించేవారు. దీంతో ప్రకృతి విపత్తులు సంభవించినప్పుడు ఎంతో కొంత నష్టపరిహారం వచ్చేది. 2015–16లో 7.73 లక్షల మంది పంటల బీమా చేయగా, ఆ ఏడాది నష్టం ఎక్కువ జరగటంతో ఏకంగా రూ.441.79 కోట్ల నష్ట పరిహారం రైతులకు అందింది. 2016 వానాకాలం సీజన్ నుంచి దేశ వ్యాప్తంగా పీఎంఎఫ్‌బీవై పథకం అమలులోకి వచ్చింది. 2016–17లో 8.87 లక్షల మంది మంది రైతులు 7.33 లక్షల ఎకరాలకు ఈ పథకం కింద బీమా చేయించగా, 1.34 లక్షల మంది రైతులకు రూ.111.33 కోట్ల పరిహారం వచ్చింది. అలాగే 2018–19, 2019–20లో రూ.960 కోట్ల పరిహారం రాష్ట్రానికి మంజూరు కాగా.. అందులో కొంతమేరకు రైతులకు దక్కింది. అయితే కేంద్ర పథకం వల్ల రైతులకు జరిగే లాభం కంటే బీమా కంపెనీలకే ఎక్కువ ప్రయోజనం జరుగుతోందని రాష్ట్ర ప్రభుత్వం భావించింది. కొందరు రైతులు కూడా బీమా పథకంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. మరోవైపు భారీగా లాభాలు గడిస్తున్నప్పటికీ ప్రీమియం ధరలను బీమా కంపెనీలు పెంచుకుంటూ పోయాయి. ప్రైవేటు సంస్థలకు సైతం పంటల బీమా పథకంలో అవకాశం కల్పించడంతో పరిస్థితి మరింత దిగజారింది. ఈ నేపథ్యంలోనే కేంద్ర పంటల బీమా పథకం నుంచి రాష్ట్ర ప్రభుత్వం బయటకు వచ్చింది.

రాష్ట్ర ప్రభుత్వ పథకం జాడేదీ?

కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకానికి ప్రత్యామ్నాయంగా రాష్ట్రంలో ప్రత్యేకంగా ఒక పంటల బీమా పథకాన్ని ప్రవేశపెడితే ఎలా ఉంటుందన్న దానిపై గతంలో వ్యవసాయశాఖ కసరత్తు చేసింది. రైతు యూనిట్‌గా దీన్ని ప్రవేశపెట్టాలని అనుకున్నారు. కానీ అమలుకు నోచుకోలేదు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం వ్యక్తిగత బీమా పథకాన్ని అమలు చేస్తోంది. ఏ కారణంతోనైనా రైతు చనిపోతే రూ.5 లక్షల బీమా నగదు అందేలా చూస్తోంది. కానీ పంటల బీమా పథకంపై ఇంతవరకు ముందడుగు పడక పోవడం రైతుల్లో ఆందోళనకు కారణమవుతోంది. దేశంలో రెండు మూడు రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వ బీమా పథకాలతో విసిగివేసారి బయటకు వచ్చి, సొంత పథకాలను రూపొందించుకోవడాన్ని రైతు సంఘాలు గుర్తు చేస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం కూడా ఈ దిశగా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నాయి.

క్లుప్తంగా...

బీచ్‌లో బైడెన్ సందడి



డెలావర్: ఊపిరిసలపని పనుల్లో సతమతమయ్యే అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ డెలావర్ బీచ్‌లో సందడి చేశారు. 80 ఏళ్ల వయసున్న బైడెన్ భార్య జిల్ బైడెన్, మనవరాలు ఫిన్నెగన్‌తో కలిసి బీచ్‌లో కాసేపు సన్ బాత్ తీసుకున్నారు. కుటుంబంతో కలిసి బీచ్‌లో ఎంజాయ్ చేస్తూ పని ఒత్తిళ్ల నుంచి రిలాక్సయ్యారు. బీచ్‌కి వెళ్లే వారికి అధ్యక్షుడు వస్తున్నారని సమాచారం కాస్త ముందుగా ఇచ్చారు. దీంతో బీచ్‌లో అక్కడక్కడా జనం కనిపిస్తూనే ఉన్నారు. అయిదు రోజుల యూరప్ పర్యటనకి వెళ్లడానికి ముందు శనివారం డెలావర్‌లోని రెహోబాత్ బీచ్‌కు బైడెన్ వచ్చారు. ఆ రోజు కాస్త సూర్యుడు రావడంతో సన్ బాత్ తీసుకున్న ఫొటోలు ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారాయి.

సిగరెట్‌తో సల్మాన్...



ముంబై: బాలీవుడ్ కండలవీరుడు సల్మాన్ ఖాన్ మరో వివాదంలో చిక్కుకున్నారు. హిందీ బిగ్ బాస్ షోకి హోస్ట్‌గా వ్యవహరిస్తున్న సల్మాన్ చేతిలో సిగరెట్‌తో కనిపించడం సోషల్ మీడియాలో దుమారం రేపుతోంది. బిగ్‌బాస్ ఓటీటీ సీజన్ 2 ఇటీవల మొదలైంది. అందులో వీకెండ్ షోకి హోస్ట్‌గా వచ్చే సల్మాన్ కంటెస్టెంట్‌ల తప్పొప్పుల్ని ఎత్తి చూపిస్తూ ఎలిమినేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. ఆ ఎపిసోడ్ తీసిన సమయంలో బయటకు వచ్చిన ఒక ఫోటో ప్రస్తుతం ఇంటర్నెట్‌లో వైరల్‌గా మారింది. ఆ ఫొటోలో సల్మాన్ చేతిలో సిగరెట్‌తో కనిపించడంతో నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. దేశ సంస్కృతి సంప్రదాయాలు, కుటుంబ విలువల గురించి లెక్చర్లు ఇచ్చే సల్మాన్ షోకి వచ్చే సమయంలో సిగరెట్ ఎలా కాలుస్తారని ప్రశ్నిస్తున్నారు.

దయా హృదయం.. మహా ఖరీదు

- అస్థికలను భద్రపర్చడానికి హాంకాంగ్‌లో భారీ భవనం
- ఒక కలశానికి పదేళ్లకు రూ.63 లక్షల ఖర్చు
- మహిళా పారిశ్రామికవేత్త మార్గరెట్ జీ సంకల్పం సాకారం

ప్రపంచ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో అత్యంత ఖరీదైన ప్రాంతం ఏదంటే హాంకాంగ్ అని ఠక్కున చెప్పేయొచ్చు. ఒక జత చెప్పుల డబ్బా అంతటి విస్తీర్ణం ఉన్న స్థలం కూడా వేల డాలర్లు పలుకుతుంది. అలాంటి ప్రాంతంలో చూపరుల్ని ఆకట్టుకునే 12 అంతస్తుల అందమైన భవనాన్ని ఈ మధ్య నిర్మించారు. పాలరాతితో, వంపులు తిరిగిన డిజైన్, రూఫ్ గార్డెన్‌తో చూడముచ్చటగా కనిపిస్తున్న ఈ భవనాన్ని చూస్తే ఎవరైనా ఫిదా(వశం) అయిపోతారు. అయితే అది నిర్మించింది ధనవంతులు నివసించడం కోసం కాదు. మరణించిన వారి అస్థికలను భద్రపరచడం కోసం ప్రత్యేకంగా నిర్మించారు. ఒక లగ్జరీ అపార్ట్‌మెంట్ ఎలా ఉంటుందో అదే స్థాయిలో అందులో సకల సదుపాయాలు ఏర్పాటు చేశారు. షాన్ సమ్ టవర్ పేరుతో నిర్మించిన ఈ భవనంలో అస్థికల కలశాన్ని భద్రపరచాలంటే 76,000 డాలర్లు (రూ.63 లక్షలు) చెల్లించాలి. అది కూడా 10 సంవత్సరాలు మాత్రమే తీసుకోవచ్చు. ఆ తర్వాత లీజ్ రద్దయిపోతుంది. ఎందుకంటే ఆ భవనంలో 22,000 మంది అస్థికలను మాత్రమే భద్రపరచవచ్చు. ఒక కుటుంబంలో ఎనిమిది మంది అస్థికలను భద్రపరచడానికి ఫ్యామిలీ ప్యాకేజీ సదుపాయం ఉంది. అందుకయ్యే ఖర్చు 4,40,000 డాలర్లు (రూ.3.64 కోట్లు). షాన్ సమ్ అంటే చైనా భాషలో దయా హృదయం అని అర్థం. ఈ భవనం సంపన్నులకే అందుబాటులో ఉండడం గమనార్హం.

అంతా అత్యాధునికం

కేవలం అస్థికల కోసం ఇంత ఖరీదా? అని ఎవరైనా నోరెళ్లబెట్టొచ్చు. కానీ, అక్కడున్న హంగులు, ఆర్భాటాలు చూస్తే మతి పోవాల్సిందే. తమకెంతో ఇష్టమైన వారిని స్మరించుకోవడానికి వచ్చేవారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆ భవనాన్ని నిర్మించారు. పైన అంతా రూఫ్‌గార్డెన్ ఉంటుంది. ప్రతి అంతస్తులోనూ పెద్ద పెద్ద బాల్కనీలు ఉంటాయి. చైనా సంస్కృతి సంప్రదాయాల్లో శ్మశాన వాటికలు ఎలా ఉంటాయో అలా వంపుల తిరిగిన డిజైన్‌తో భవనం ఉంటుంది. ఇక లోపల పాలరాతి ఫ్లోరింగ్, ఏసీలు, గాలిలో తేమని తొలగించే వ్యవస్థ కూడా ఉన్నాయి. అస్థికలను భద్రపర్చే చిన్నచిన్న గదుల తలుపులను బంగారు నాణేలతో సౌందర్యభరితం చేశారు. భిన్న సంప్రదాయాలు, ఆచారాలను పాటించే వారి అభిరుచులకు అనుగుణంగా ఈ భవన నిర్మాణం జరిగింది. పెద్దలకి నివాళులర్పించుకోవడానికి ముందస్తుగా యాప్ ద్వారా బుక్ చేసుకోవచ్చు. వారికిష్టమైన ఆహారాన్ని వండి తీసుకువెళ్లి, సంప్రదాయబద్ధంగా నివేదించవచ్చు.

పెద్దలను గౌరవించుకోవడానికి

మనుషుల అస్థికల కోసం ప్రత్యేకంగా అందమైన భవనం కట్టాలన్న ఆలోచన ఏడు పదుల వయసున్న మార్గరెట్ జీ అనే ఒక మహిళా పారిశ్రామికవేత్తకు వచ్చింది. జ్యువెలరీ, రియల్ ఎస్టేట్ వ్యాపారాలు చేస్తున్న ఆమె వయసు మీదపడ్డాక సేవా కార్యక్రమాల బాట పట్టారు. తన పేరు మీదే ఒక ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసి సమాజానికి సేవలందిస్తున్నారు.''మరణించిన పెద్దలకి నివాళులర్పించడానికి చైనా సంప్రదాయంలో చాలా ప్రాధాన్యతనిస్తారు. దివికేగిన పెద్దల స్మృతుల్లో గడిపి, వారిని గౌరవిస్తే అంతా మంచే జరుగుతుందని విశ్వసిస్తారు. అలాంటి వారి ఆకాంక్షలకు అనుగుణంగా ఈ భవనం నిర్మించాం'' అని మార్గరెట్ చెప్పారు.

- సాక్షి, నేషనల్ డెస్క్



హాంకాంగ్‌లో అస్థికలను భద్రపరిచే భవనం

హాంకాంగ్‌లో నిండిపోయిన శ్మశానం

భర్త మరణంతో..

హాంకాంగ్ నగర జనాభా 70 లక్షలపైమాటే. చుట్టుపక్కల ప్రాంతాల్లోనూ జనాభా కిటకిటలాడిపోతూ ఉంటుంది. వాస్తవానికి విస్తీర్ణంలో హాంకాంగ్ పెద్దదే. కానీ కొండలు, గుట్టలు ఎక్కువగా ఉండడం వల్ల నివాసయోగ్యమైన ప్రాంతం తక్కువే. అందుకే ఇక్కడ ఆకాశహర్మ్యాల నిర్మాణం ఎక్కువగా ఉంది. ఈ నగరంలో ఒక ఇంటి సగటు విస్తీర్ణం 430 చదరపు అడుగులు మాత్రమేనని గణాంకాలు చెబుతున్నాయి. అస్థికల భవన నిర్మాణాన్ని తలపెట్టిన మార్గరెట్ భర్త 2007లో మరణించారు. ఆయన స్మృతి చిహ్నం ఏర్పాటు చేయడానికి ఆమెకి స్థలం దొరకలేదు. ఆ సమయంలోనే మరణించిన వారి కోసం ప్రత్యేకంగా ఒక అపార్ట్‌మెంట్ నిర్మించాలన్న ఆలోచన ఆమెకు వచ్చింది. అది ఇన్నేళ్లకి సాధ్యమైందని చెబుతున్నారు. ఇక హాంకాంగ్‌లో వృద్ధుల జనాభా పెరిగిపోతోంది. ప్రతి అయిదుగురిలో ఒకరు 65 ఏళ్లకు పైబడిన వారే. ఇక నగరంలో ప్రతి ఏటా దాదాపు 46,000 మంది మరణిస్తున్నారు. వారి అవశేషాలను భద్రపరచడానికి ప్రభుత్వం పలు సదుపాయాలు ఏర్పాటు చేసింది. అయితే అవి సరిపోకపోవడం వల్ల ప్రైవేట్ భవనం నిర్మించాల్సి వచ్చింది. హాంకాంగ్‌లో సంపన్నులు కూడా ఎక్కువే. అలాంటి వారి సౌకర్యార్థం షాన్ సమ్ అందుబాటులోకి వచ్చింది.

విశాఖ నుంచి కేరళకు గంజాయి

నలుగురిని అరెస్ట్ చేసిన ఎక్సైజ్ అధికారులు



తిరువనంతపురం: ఆంధ్రప్రదేశ్‌లోని విశాఖపట్టణం నుంచి కేరళకు తీసుకువచ్చిన 155 కిలోల గంజాయిని ఎక్సైజ్ అధికారులు పట్టుకున్నారు. విశాఖ నుంచి తీసుకువచ్చిన గంజాయిని తిరువనంతపురంలోని పల్లితురలోని ఓ గోదాములోకి మార్చుతుండగా అధికారులు నలుగురిని అరెస్ట్ చేశారు. గంజాయితోపాటు 61 గ్రాముల ఎండీఎంఏ అనే సింథటిక్ డ్రగ్‌ను స్వాధీనం చేసుకున్నారు. తిరువనంతపురం నుంచి విశాఖకు వెళ్లిన నలుగురిలో ఇద్దరు విమానంలో తిరిగి రాగా మిగిలిన ఇద్దరు వాహనంలో డ్రగ్స్‌ను తీసుకువచ్చారని అధికారులు తెలిపారు.

ఎన్డీయేలోకి ఎల్జేపీ (రామ్‌విలాస్)!

పాట్నా: బీజేపీ నేతృత్వంలోని జాతీయ ప్రజాస్వామ్య కూటమి(ఎన్డీయే)లో బిహార్‌కు చెందిన లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) భాగస్వామిగా చేరేందుకు రంగం సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఆ పార్టీ నేత, ఎంపీ చిరాగ్ పాశ్వాన్‌తో కేంద్ర మంత్రి, బీజేపీ సీనియర్ నాయకుడు నిత్యానంద రాయ్ తాజాగా చర్చలు జరిపారు. బీజేపీ, దివంగత రామ్ విలాస్ పాశ్వాన్ ఒకే విలువలను పంచుకొనేవారని గుర్తుచేశారు. ప్రజా సాధికారతతోపాటు అభివృద్ధి కోసం పాశ్వాన్ ఎంతగానో తపించేవారని కొనియాడారు. అయితే, ఎన్డీయేలో లోక్ జనశక్తి పార్టీ(రామ్ విలాస్) చేరికపై నిత్యానంద రాయ్ నేరుగా స్పందించలేదు. చిరాగ్ పాశ్వాన్ మాట్లాడుతూ.. బీజేపీతో మరో దఫా చర్చలు జరిగే అవకాశం ఉందని చెప్పారు. ఎన్డీయేలో చేరికపై ఇప్పుడే స్పందించడం సరైంది కాదన్నారు. బీజేపీపై, ప్రధానమంత్రి నరేంద్ర మోదీపై తన అభిమానాన్ని ఆయన గతంలో పలుమార్లు చాటుకున్నారు.

ఖలిస్తానీ, భారత అనుకూలుర పోటాపోటీ ప్రదర్శనలు

టొరంటో: కెనడాలో ఖలిస్తానీ అనుకూలురు మరోసారి నిరసనకు దిగారు. అయితే, జాతీయ జెండాలతో భారతీయులు చేపట్టిన ర్యాలీ ముందు ఆ నిరసన వెలవెలబోయింది. టొరంటోలోని భారత కాన్సులేట్ కార్యాలయం ఎదుట ఆదివారం కొందరు ఖలిస్తానీ మద్దతుదారులు గుమికూడారు. జూన్ 18వ తేదీన కెనడాలో హత్యకు గురైన హర్దీప్ సింగ్ నిజ్జర్ చిత్రపటాన్ని వారు ప్రదర్శించారు. అదే సమయంలో, భారత సంతతికి చెందిన కొందరు త్రివర్ణ పతాకం చేబూని 'వందేమాతరం, భారత్ మాతా కీ జై, లాంగ్ లివ్ ఇండియా'అంటూ నినాదాలతో హోరెత్తించారు. ముందు జాగ్రత్తగా ఆ ప్రాంతంలో పోలీసులను పెద్ద సంఖ్యలో మోహరించారు. ఇటీవల ఖలిస్తానీవాదులు నిర్వహించిన ర్యాలీలో అట్టావాలోని భారత హై కమిషనర్ సంజయ్ కుమార్ వర్మ, టొరంటోలోని కాన్సుల్ జనరల్ అపూర్వ శ్రీవాస్తవలను హర్దీప్ సింగ్ నిజ్జర్ హంతకులుగా పేర్కొంటూ పోస్టర్లు ప్రదర్శించడంపై భారత ప్రభుత్వం ఢిల్లీలోని కెనడా రాయబారికి సమన్లు జారీ చేసింది.

15కు బెంగాల్ హింస మృతులు

కోల్‌కతా: పశ్చిమబెంగాల్‌లో పంచాయతీ ఎన్నికల సందర్భంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో మృతుల సంఖ్య 15కు చేరింది. దక్షిణ 24 పరగణాల జిల్లాలో ఒక మృతదేహం లభ్యం కాగా, మరో ఇద్దరు ఆస్పత్రిలో మరణించారని అధికారులు ఆదివారం తెలిపారు., కుల్టాలి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పోలింగ్ బూత్ వద్ద అబు సలేం ఖాన్ అనే వ్యక్తి మృతదేహం పడి ఉందన్నారు. అతడు టీఎంసీ కార్యకర్త అని చెప్పారు. ఆప్రాంతంలో ఉద్రిక్తతలు పెరగడంతో భారీగా పోలీసులను తరలించారు. ఇదే జిల్లా బసంతిలో శనివారం రాత్రి జరిగిన హింసాత్మక ఘటనల్లో గాయపడిన అజార్ లష్కర్ అనే టీఎంసీ కార్యకర్త ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడని అధికారులు వివరించారు. అదేవిధంగా, మాల్దా జిల్లా బైషన్‌నగర్‌కు చెందిన టీఎంసీ కార్యకర్త మొతియుర్ రహ్మాన్ కత్తిపోట్లతో ఆస్పత్రిలో చనిపోయాడు. పంచాయతీ ఎన్నికల సందర్భంగా శనివారం రాష్ట్రవ్యాప్తంగా జరిగిన హింసాత్మక ఘటనల్లో 12 మంది చనిపోగా అందులో అధికార టీఎంసీకి చెందిన 8 మంది ఉన్నారు. అయితే, మరణాల సంఖ్య వాస్తవానికి 18 వరకు ఉంటుందని రాజకీయ పార్టీలు అంటున్నాయి. ఈ మరణాలపై 24 గంటల్లోగా నివేదిక ఇవ్వాలని ఎన్నికల సంఘం అధికార యంత్రాంగాన్ని ఆదేశించింది.

12న కాంగ్రెస్ మౌన సత్యాగ్రహం

న్యూఢిల్లీ: అధికార బీజేపీ నీచ రాజకీయాలు చేస్తోందని కాంగ్రెస్ పాఠీర్ట ప్రధాన కార్యదర్శి కె.సి.వేణుగోపాల్ ఆరోపించారు. తమ పార్టీ నేత రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పూర్తిస్థాయిలో విజయవంతమైందని, ప్రజల నుంచి అపూర్వమైన ఆదరణ లభించిందని చెప్పారు. ఈ యాత్ర తర్వాత రాహుల్ గాంధీ లోక్‌సభలో ప్రసంగిస్తూ నరేంద్ర మోదీ ప్రభుత్వం, అదానీ గ్రూప్ మధ్యనున్న బంధాన్ని బయటపెట్టారని తెలిపారు. దాంతో కక్షగట్టిన మోదీ ప్రభుత్వం రాహుల్‌పై అనర్హత వేటు వేసిందని దుయ్యబట్టారు. ప్రభుత్వ చర్యకు నిరసనగా ఈ నెల 12న దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాల రాజధానుల్లో గాంధీజీ విగ్రహాల వద్ద మౌన సత్యాగ్రహం చేపట్టనున్నట్లు కె.సి.వేణుగోపాల్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు.

ఉత్తరాదిన భారీ వర్షాలు

- ఢిల్లీలో 40 ఏళ్ల, హిమాచల్‌లో 50 ఏళ్ల రికార్డులు బద్దలు
- పలు ఘటనల్లో 19 మంది మృతి
- పొంగిపొర్లుతున్న పలు నదులు

న్యూఢిల్లీ: ఉత్తరభారతాన్ని భారీ వర్షాలు వణికిస్తున్నాయి. కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో 19 మంది చనిపోయారు. ఢిల్లీలోని యమున సహా పలు నదులు పొంగిపొర్లుతున్నాయి. ఆకస్మిక వరదలతో రహదారులపై రాకపోకలు స్తంభించాయి. లోతట్టు ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడ్డారు. దేశ రాజధానిలో రికార్డు స్థాయిలో వర్షం కురిసింది. 24 గంటల వ్యవధిలో ఏకంగా 153 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. 1982 జూలై తర్వాత, ఈ స్థాయిలో వాన దంచికొట్టడం ఇదే ప్రథమం. ఢిల్లీతోపాటు జమ్మూకశ్మీర్, లద్దాఖ్, హిమాచల్ ప్రదేశ్‌ల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ విభాగం హెచ్చరించింది. ఢిల్లీతోపాటు గురుగ్రామ్ సహా పలు నగరాలు పట్టణాల్లో రహదారులపై నీరు నిలవడంతో జనం ట్రాఫిక్ కష్టాలపై వీడియోలు, ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. భారీ వర్షాలు, వరదల కారణంగా ఉత్తర రైల్వే 17 రైళ్లను రద్దు చేసింది. మరో 12 రైళ్లను దారి మళ్లించింది.



గుర్గావ్‌లో రోడ్డుపై పోటెత్తుతున్న వరద

హిమాచల్ అస్తవ్యస్తం

హిమాచల్ ప్రదేశ్‌లోని 7 జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురిశాయి. సిమ్లా జిల్లాలో ఇల్లు కూలిన ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు, కులు, చంబా జిల్లాల్లో ఒక్కరు చొప్పున చనిపోయారు. గత 36 గంటల్లో 14 కొండ చరియలు విరిగి పడిన ఘటనలు, 13 ఆకస్మిక వరదల ఘటనలు నమోదయ్యాయి. వరదలతో కొట్టుకుపోయిన 700 రోడ్లను మూసివేశారు. హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రం లాహోల్ స్పిటిలోని చంద్రతాల్‌లో 200 మంది వరద నీటిలో చిక్కుకుపోయారు. బియాస్ వరదల్లో చండీగఢ్–మనాలి హైవేలోని కొంతభాగం కొట్టుకుపోయింది. మనాలి, కిన్నౌర్, చంబాల్లో వరదల్లో దుకాణాలు, వాహనాలు కొట్టుకుపోయాయి.

ఉత్తరాఖండ్‌లో ముగ్గురు గల్లంతు

ఉత్తరాఖండ్‌లో భక్తులతో వెళ్తున్న జీపు రిషికేశ్–బద్రీనాథ్ నేషనల్ హైవేపై గంగా నదిలో పడిపోయి ముగ్గురు మృతి చెందారు. జీపులో 11 మంది ఉండగా, ఐదుగురిని కాపాడామని, మరో ముగ్గురి కోసం గాలిస్తున్నామని యంత్రాంగం తెలిపింది.

కశ్మీర్‌లో ఇద్దరు జవాన్ల దుర్మరణం

జమ్మూకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఆకస్మిక వరదలకు బస్సుపై కొండచరియలు విరిగిపడి ఇద్దరు జవాన్లు కొట్టుకుపోయి దుర్మరణం పాలయ్యారు. పంజాబ్, హరియాణాల్లో భారీ వర్షాలు కురిశాయి.

అమర్‌నాథ్ యాత్ర పునఃప్రారంభం

శ్రీనగర్: జమ్మూకశ్మీర్‌లో అమర్‌నాథ్ యాత్ర మూడు రోజుల విరామం తర్వాత పునఃప్రారంభమైంది. ప్రతికూల వాతావరణం వల్ల పంజ్‌తరణి, శేష్‌నాగ్ బేస్‌క్యాంపుల్లో చిక్కుకుపోయిన యాత్రికులు ఆదివారం మంచు శివలింగ దర్శనానికి తరలివెళ్లారు. భారీ వర్షాలకుతోడు కొండ చరియలు విరిగిపడుతుండడంతో అమర్‌నాథ్ యాత్రను అధికారులు మూడు రోజుల క్రితం నిలిపివేసిన సంగతి తెలిసిందే. పవిత్ర గుహ చుట్టుపక్కల ప్రాంతాల్లో వర్షాలు కొంత తగ్గుముఖం పట్టడంతో యాత్రికులను అనుమతించాలని నిర్ణయించినట్లు అధికారులు వెల్లడించారు. జమ్మూ–శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు. ఈ రోడ్డుపై పెద్ద సంఖ్యలో వాహనాలు చిక్కుకుపోయాయి. వాటిని తొలగించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. జమ్మూ నుంచి కొత్తగా యాత్రికులను అనుమతించడం లేదు. జమ్మూకశ్మీర్‌లో గురువారం రాత్రి నుంచి ఎడతెరిపిలేకుండా వర్షాలు కురుస్తున్నాయి. అమర్‌నాథ్‌లో మంచు సైతం కురిసింది. సోమవారం నుంచి వర్షాలు పూర్తిగా తగ్గిపోయే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ ప్రకటించింది.

ఏపీ వాసి దుర్మరణం

రాజాం సిటీ(ఆంధ్రప్రదేశ్): ఉత్తరాఖండ్‌లో జరిగిన ప్రమాదంలో విజయనగరం జిల్లా రాజాం మండలం బొద్దాం గ్రామానికి చెందిన జరజాన రవి రావు మృతి చెందారు. బొద్దాం గ్రామానికి చెందిన రవి రావు హైదరాబాద్‌లో ప్రైవేటు ఉద్యోగి. ఐదు నెలల క్రితమే వివాహమైంది. భార్య కల్యాణితో కలిసి వారం క్రితం కేదార్‌నాథ్ యాత్రకు బయలుదేరారు. శనివారం రాత్రి ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలతో వీరు ప్రయాణిస్తున్న వాహనం అదుపు తప్పి లోయలో పడింది. ఈ ఘటనలో రవి రావు ప్రాణాలు కోల్పోయారు. కల్యాణితో పాటు మరికొందరిని సహాయక సిబ్బంది రక్షించారు.

మెకానిక్‌లు సాధికారత సాధించాలి

కార్మికుల అభివృద్ధిపై దేశాభివృద్ధి ఆధారపడి ఉంది: రాహుల్



న్యూఢిల్లీ: మన దేశ ఆటోమొబైల్ రంగాన్ని బలోపేతం చేయడానికి మెకానిక్‌లు మరింత కృషి చేయాలని కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ పిలుపునిచ్చారు. పరిశ్రమ అభివృద్ధి కోసం వారు సాధికారత సాధించాలని సూచించారు. ఆయన ఇటీవల ఢిల్లీ కరోల్ బాగ్‌లోని బైకర్స్ మార్కెట్‌లో మోటార్‌సైకిల్ మెకానిక్‌లతో సమావేశమై, వారి సమస్యలను అడిగి తెలుసుకున్న విషయం విదితమే. మెకానిక్‌లతో కలిసి ఓ బైక్‌ను ఆయన సర్వీసు కూడా చేశారు. సంబంధిత వీడియోను రాహుల్ ఆదివారం ట్విట్టర్‌లో షేర్ చేశారు. తనకు కేటీఎం 390 మోటార్ సైకిల్ ఉందని, దాన్ని ఉపయోగించడం లేదని, ఇంట్లోనే పార్క్ చేసి ఉంచానని ఈ వీడియోలో రాహుల్ చెప్పారు. మోటార్‌సైకిల్‌పై బయటకు వెళ్లేందుకు తన భద్రతా సిబ్బంది అనుమతించడం లేదని, అందుకే కేటీఎం 390ని ఇంటికే పరిమితం చేశానని వివరించారు. మీరు పెళ్లి ఎప్పుడు చేసుకుంటారు? అని ఓ మెకానిక్ ప్రశ్నించగా.. చూద్దాం అంటూ రాహుల్ బదులిచ్చారు. ఆటోమొబైల్ పురోగతి కోసం మెకానిక్‌లు వారి ఆరోగ్యాన్ని సైతం లెక్కచేయకుండా కష్టపడుతున్నారని, మెరుగైన వసతులు, ఉత్తమ అవకాశాలు పొందడానికి వారు అన్ని విధాలా అర్హులని రాహుల్ గాంధీ ఉద్ఘాటించారు. భారతదేశ అసలైన అభివృద్ధి కార్మికుల అభివృద్ధిపై ఆధారపడి ఉందని తెలిపారు.

ఇక కాషాయ వందేభారత్



చెన్నై: వందేభారత్ రైళ్లు ఇకపై రంగు మార్చుకోనున్నాయి. ఇన్నాళ్లూ నీలం రంగులో ఉండే రైలు బోగీలు ఇకపై కాషాయం రంగులో కనిపిస్తాయి. కొత్తగా తయారు చేసే రైళ్లకు కాషాయం రంగు వేస్తున్నారు. ప్రస్తుతం చెన్నైలోని ఇంటిగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్)లో వందేభారత్ రైలు కోచ్‌లు తయారవుతున్నాయి. రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ ఫ్యాక్టరీని సందర్శించారు. రైలు బోగీలోకి వెళ్లి సీట్లను పరిశీలించారు. లోకో పైలెట్ జోన్‌లోకి కూడా వెళ్లి అన్నీ సరిగ్గా అమర్చారా లేదా అని పరీక్షించి చూశారు. ఈ కొత్త రైళ్లు బూడిద, కాషాయం రంగు కలయికతో ఉన్నాయి. మన దేశ జెండా త్రివర్ణ పతాకం స్ఫూర్తితో ఈ రంగుల్ని ఎంపిక చేసినట్టుగా అశ్విన్ వైష్ణవ్ తెలిపారు. ''వందేభారత్ రైళ్లు మేకిన్ ఇండియాలో భాగంగా రూపొందిస్తున్నాం. ప్రస్తుతమున్న రైళ్లలో లోటు పాట్లు గురించి సమాచారాన్ని సేకరించి కొత్తగా నిర్మించే కోచ్‌ల్ని మరింతగా మెరుగుపరుస్తున్నాం'' అని వైష్ణవ్ వివరించారు.

చంద్రయాన్-3..

త్రీ ఇన్ వన్

ఒకేసారి ఆర్బిటార్, ల్యాండర్, రోవర్‌ను పంపించనున్న ఇస్రో

రూ.1,600 కోట్ల వ్యయం

- చంద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా మూడు ప్రయోగాలకు సుమారు రూ.1,600 కోట్లు వ్యయం చేస్తున్నారు.
- చంద్రయాన్-3 ద్వారా చంద్రుడి రహస్యాలు తెలుసుకోవడమే కాకుండా వ్యోమగాములను పంపించే ప్రయత్నాలు సైతం ప్రారంభమయ్యే అవకాశం వుంది.
- చంద్రయాన్-1 ప్రయోగానికి రూ.380 కోట్లు ఖర్చు చేశారు.
- చంద్రయాన్-2 ప్రాజెక్టును రూ.425 కోట్లతో చేపట్టేందుకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ ప్రయోగాన్ని నిర్వహించేందుకు పదేళ్ల సమయం పట్టడంతో ఖర్చు అదనంగా రూ.173 కోట్లు పెరిగింది. అంటే చంద్రయాన్-2కు రూ.598 కోట్లు వ్యయం చేశారు.
- చంద్రయాన్-3 ప్రయోగానికి దాదాపు రూ.615 కోట్లు వెచ్చిస్తున్నారు.

సూళ్లూరుపేట: చందమామ గురించి తెలుసుకోవడానికి గత 60 ఏళ్లుగా పరిశోధనలు జరుగుతున్నాయి. అమెరికా 1958 నుంచి చంద్రుడిపై పరిశోధనలు సాగిస్తోంది. 1969లో అపోలో రాకెట్ ద్వారా ముగ్గురు వ్యోమగాములను చంద్రుడిపైకి పంపించింది. రష్యా, జపాన్, చైనా, ఇజ్రాయెల్, జర్మనీ, భారత్ తదితర దేశాలు చంద్రుడి రహస్యాలను ఛేదించేందుకు కృషి చేస్తున్నాయి. భారత్ 2008లో చంద్రుడి మీదికి చంద్రయాన్–1 పేరుతో ఆర్బిటార్‌ను ప్రయోగించింది. అక్కడ నీటి జాడలున్నాయని గుర్తించింది. చంద్రుడిపై రెండు ప్రయోగాలు చేసిన భారత్ మూడో ప్రయోగానికి సన్నద్ధమవుతోంది. సైంటిస్టులు ఏర్పాట్లను దాదాపు పూర్తిచేశారు. చంద్రయాన్–1, చంద్రయాన్–2 ప్రయోగాల వల్ల ఆర్బిటార్ ద్వారా ల్యాండర్‌ను, ల్యాండర్ ద్వారా రోవర్‌ను పంపించిన నాలుగో దేశంగా భారత్ గుర్తింపు పొందింది.



చంద్రయాన్–3లో మూడింటినీ ఒకేసారి పంపిస్తున్నారు కనుక దీన్ని త్రీ ఇన్ వన్ ప్రయోగంగా ఇస్రో శాస్త్రవేత్తలు పరిగణిస్తున్నారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) 2008 అక్టోబర్ 22న చేపట్టిన చంద్రయాన్–1 ప్రయోగం విజయవంతమైంది. 2019 జూలై 15న చంద్రయాన్–2కు శ్రీకారం చుట్టింది. ఆర్బిటార్ ద్వారా ల్యాండర్, ల్యాండర్ ద్వారా రోవర్‌ను పంపించడమే కాకుండా 14 రకాల పేలోడ్స్‌ను పంపించారు. ప్రయోగమంతా సక్సెస్ అయిందనుకున్న తరుణంలో ఆఖరు రెండు నిమిషాల్లో ల్యాండర్ చంద్రుడి ఉపరితలాన్ని ఢీకొట్టడంతో సంకేతాలు ఆగిపోయాయి. దాంతో ఆ ప్రయోగం పాక్షిక విజయం మాత్రమే సాధించింది. దాదాపు నాలుగు సంవత్సరాలు తరువాత చంద్రయాన్–3 పేరుతో మూడోసారి ప్రయోగానికి ఇస్రో ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ నెల 14వ తేదీన ఈ ప్రయోగం చేపట్టనుంది. చంద్రయాన్–3లో ప్రొపల్షన్ మాడ్యూల్‌లో రెండు పేలోడ్స్, ల్యాండర్‌లో 4 పేలోడ్స్, రోవర్‌లో రెండు పేలోడ్స్, అమెరికాకు చెందిన ఒక పేలోడ్‌ను అమర్చి పంపించనున్నారు.

టమాటాకు రక్షణగా బౌన్సర్లు



వారణాసి: దేశంలో టమాటా ధరలు అంతకంతకూ పెరిగిపోతూ కొన్ని ప్రాంతాల్లో కేజీ 200 కూడా దాటడంతో వ్యాపారులకు వింత వింత ఆలోచనలు వస్తున్నాయి. మార్కెట్‌లో తమ దుకాణాల్లో టమాటాలకి రక్షణగా బౌన్సర్లను నియమిస్తున్నారు. ఉత్తరప్రదేశ్‌లోని వారణాసి కూరగాయల మార్కెట్‌లో టమాటాలకు ఇరు వైపులా ఇద్దరు బౌన్సర్లు నిల్చొని ఉన్న ఫోటో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. మధ్యప్రదేశ్‌లో స్మార్ట్ ఫోన్ల వ్యాపారి అభిషేక్ అగర్వాల్ ఒక స్మార్ట్ ఫోన్ కొంటే రెండు కిలోల టమాటాలు ఉచితమని ప్రకటించాడు.

స్కూటర్‌పై వెళ్తూ తుపాకీతో కాల్పులు..

ఒకరు మృతి, ముగ్గురికి గాయాలు

న్యూయార్క్: ఓ సాయుధుడు స్కూటర్‌పై వెళుతూ జరిపిన కాల్పుల్లో ఒక వృద్ధుడు చనిపోగా, మరో ముగ్గురు గాయాలపాలయ్యారు. ఈ ఘటన న్యూయార్క్‌లో ఆదివారం ఉదయం చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు ఒక యువకుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి హ్యాండ్‌గన్‌ను స్వాధీనం చేసుకున్నారు. క్షతగాత్రుల్లో ఒకరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు.

సాక్షి హైదరాబాద్

సోమవారం | 10 | జూలై | 2023

బోనాల చెక్కుల పంపిణీ

బోనాల వేడుకల సందర్భంగా బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోని 18 అమ్మవారి దేవాలయాలకు ప్రభుత్వం నుంచి విడుదలైన చెక్కులను ఆదివారం మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పంపిణీ చేశారు. రూ.6 లక్షల విలువైన చెక్కులను 18 ఆలయాల ఉత్సవ కమిటీలకు అందజేసిన అనంతరం ఆమె మాట్లాడుతూ.. బోనాల పర్వదినాన్ని ఆనందోత్సాహాల మధ్య నిర్వహించుకోవాలని సూచించారు. - బంజారాహిల్స్



▼ ఉజ్జయినీ మహంకాళి బోనాల వేడుకల్లో భక్తుల సందడి



జాతరలో ఎవరేమన్నారు..



భక్తులకు అన్ని ఏర్పాట్లు

ఉజ్జయినీ మహంకాళి బోనాల జాతర కోసం నెల రోజుల ముందు నుంచే అన్ని శాఖల అధికారులను సమన్వయం చేస్తూ ఏర్పాట్లు చేపట్టాం. బోనాలతో వచ్చే భక్తులకు రెండు ప్రత్యేక క్యూ లైన్లు ఏర్పాటు చేయడంతో అరగంటలో అమ్మవారిని దర్శించుకున్నారు. భక్తులకు మంచినీళ్లు, వైద్యం తదితర ఏరాట్లు చేపట్టాం. సాధారణ భక్తులు కూడా గంట లోపే అమ్మవారిని దర్శించుకున్నారు. - తలసాని శ్రీనివాస్ యాదవ్, మంత్రి



రాష్ట్రంలో మంచి పాలన అందించే ప్రభుత్వం వస్తుంది

అమ్మవారి ఆశీస్సులతో త్వరలోనే తెలంగాణ రాష్ట్రంలో మంచి పాలన అందించే ప్రభుత్వం వస్తుంది. రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నా. నగర ప్రజలు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నా.

- జి.కిషన్‌రెడ్డి, కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



ప్రపంచానికి భారతీయ సంస్కృతి మార్గదర్శకం

భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలు ప్రపంచానికి మార్గదర్శకం చేస్తామని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. అలాగే తెలంగాణాలోని సంస్కతి సాంప్రదాయాలు కూడా ఎంతో ప్రత్యేకమని అన్నారు. దేశంలో విస్తారంగా వర్షాలు కురిసి ప్రజలందరు సుఖ శాంతులతో ఉండాలని అమ్మవారిని మొక్కుకున్నట్లు ఆయన చెప్పారు.

- బండారు దత్తాత్రేయ, హరియాణా గవర్నర్



తెలంగాణలో రాబోయేది బీజేపీ సర్కారే..

రాష్ట్రంలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమే. మా పాలనతోనే బంగారు తెలంగాణ సాధ్యం. తెలంగాణ నిర్మాణం కోసం బీజేపీ అధికారంలోకి వచ్చేలా ఆశీర్వదించాలని అమ్మవారిని మొక్కుకున్నా.

- ఈటల రాజేందర్, హుజూరాబాద్ ఎమ్మెల్యే

భక్తితో బయలెల్లి..

అమ్మకు ప్రణమిల్లి..

వైభవంగా ఉజ్జయినీ మహంకాళి బోనాల ఉత్సవాలు

- భక్తజన సంద్రంగా మారిన లష్కర్ పరిసరాలు
- హాజరైన సీఎం, మంత్రులు, ఇతర ప్రజాప్రతినిధులు

రాంగోపాల్‌పేట్: శివసత్తుల పూనకాలు.. డప్పుల దరువులు.. యువతరం నృత్యాలు.. ఆనందోత్సాహాల మధ్య బోనం సమర్పించేందుకు వచ్చిన అశేషమైన భక్తజనులు.. ఆదివారం సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారికి బోనాలు, సాక, తొట్టెలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బోనాల జాతరతో లష్కర్‌లో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది. అమ్మవారికి మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆయన కుటుంబ సభ్యులు తొలిపూజ చేసి బోనం సమర్పించారు. అనంతరం సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవిత బోనం సమర్పించారు. కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాష్ట్ర మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, మల్లారెడ్డి, డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, హరియాణా గవర్నర్ బండారు దత్తాత్రేయ, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, కాంగ్రెస్ సీనియర్ నేత మల్లు భట్టి విక్రమార్క, సీఎస్ శాంతికుమారి తదితర ప్రముఖులు మహంకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. పోలీసులు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.

నేడు భవిష్యవాణి

సోమవారం రంగం కార్యక్రమం జరగనుంది. రంగంలో అవివాహిత మహిళ స్వర్ణలత పచ్చికుండపై నిల్చుని భవిష్యవాణి వినిపిస్తారు. ఆమె నోటి నుంచి వచ్చే ప్రతి మాట అమ్మవారి పలుకుగా భక్తులు భావిస్తారు. దీంతో భవిష్యవాణికి ఎంతో ప్రాముఖ్యత ఏర్పడింది. సోమవారం ఉదయం 9 గంటలకు స్వర్ణలత భవిష్య వాణి వినిపిస్తారు.

పాతబస్తీలో నేత్రపర్వంగా..

అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపు

చార్మినార్: ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం అమ్మవారి సామూహిక ఘటస్థాపన ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఊరేగింపు మేళాతాళాలు.. డప్పు దరువులు.. బ్యాండ్ మేళాలు.. శివ సత్తులు, పోతరాజులు, కళాకారుల నృత్యాలు భక్తులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. శాలిబండలోని కాశీ విశ్వనాథ ఆలయం నుంచి ప్రారంభమైన ఘటస్థాపన ఊరేగింపు లాల్ దర్వాజా మోడ్ మీదుగా అమ్మవారి దేవాలయాలకు చేరుకుంది. ఊరేగింపు అనంతరం ఆయా దేవాలయాల్లో ఘటస్థాపన జరిగింది. అమ్మవారి ఘటస్థాపన సామూహిక ఊరేగింపునకు లాల్‌దర్వాజా మోడ్ వద్ద ఏర్పాటు చేసిన స్వాగత వేదికపై నుంచి ప్రముఖులు స్వాగతం పలికారు.



తెలంగాణలో ఆలయాలకు మహర్దశ

బోనాల జాతర వైభవాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటడంతో పాటు రాష్ట్రంలో ఉన్న ఆలయాలను అభివృద్ధి చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌కే దక్కుతుంది. ఆలయాలకు ప్రత్యేక నిధులు కేటాయించడంతో పాటు బోనాల ఉత్సవాలను రాష్ట్ర పండుగగా ప్రభుత్వం నిర్వహిస్తోంది.

- ఇంద్రకరణ్‌రెడ్డి, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి



దేశంలో బీఆర్ఎస్ పాలన రావాలని మొక్కుకున్నా..

స్వాతంత్ర్యం అనంతరం వచ్చిన ఎన్నో ప్రభుత్వాలు చేయని పనులు తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక ముఖ్యమంత్రి కేసీఆర్ చేశారు. బీఆర్ఎస్ దేశ వ్యాప్తంగా అధికారంలోకి రావాలని అమ్మవారికి మొక్కుకున్నాను.

- మంత్రి చామకూర మల్లారెడ్డి





బోనాల ఉత్సవాల్లో విదేశీయుల సందడి





బోనంతో ఎమ్మెల్సీ కవిత



మల్లు భట్టి విక్రమార్క



సీఎస్ శాంతికుమారి





ఏర్పాట్లను పరిశీలిస్తున్న కొత్వాల్ ఆనంద్





పాతబస్తీలో ఘటాల ఊరేగింపు

వస్త్ర దుకాణంలో భారీ అగ్నిప్రమాదం

- దాదాపు రూ.50 లక్షల ఆస్తి నష్టం
- సికింద్రాబాద్ పాలికాబజార్‌లో ఘటన

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ప్రాంతంలోని పాలికాబజార్‌లో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. మార్కెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ప్రమాదంలో దాదాపు రూ.50 లక్షల నష్టం వాటిల్లినట్లు అంచనా. పోలీసుల కథనం ప్రకారం వివరాలు.. సికింద్రాబాద్ బోయిగూడలో నివసించే రమేష్ అనే వ్యక్తి పాలికాబజార్‌లోని గ్రౌండ్ ఫ్లోర్‌లో ధమాకా సేల్ అనే పేరుతో రెండు రెడీమేడ్ దుస్తుల దుకాణాలు నిర్వహిస్తున్నారు. ఆదివారం ఉదయం 6.50 గంటలకు దుకాణంలో నుంచి దట్టమైన పొగలు వస్తుండటాన్ని గమనించిన స్థానికులు వెంటనే మార్కెట్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. డీఆర్ఎఫ్ బృందాలు అక్కడికి చేరుకుని షట్టర్ పగులగొట్టి మంటలను ఆర్పేందుకు యత్నించారు. దుస్తులు కాలిపోయి భారీగా పొగలు వ్యాపించడంతో మంటలు ఎక్కడ నుంచి విస్తరించాయో తెలియకుండాపోయింది. వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు చుట్టు పక్కల ఉండే లాడ్జీలు, షాపుల యజమానులను అప్రమత్తం చేసి బయటకు తరలించారు. అయిదు ఫైర్ ఇంజిన్లతో ఉదయం 10.30 గంటలకు మంటలను ఎట్టకేలకు అదుపులోకి తీసుకవచ్చారు. రెండు దుకాణాల్లో దుస్తులు అగ్నికి ఆహుతయ్యాయి. సుమారు రూ.50 లక్షల ఆస్తి నష్టం జరిగి ఉండవచ్చని యజమాని తెలిపారు. మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో పాటు జీహెచ్ఎంసీ కమిషనర్ రొనాల్డ్ రాస్, కార్పొరేటర్ కొంత దీపిక, డీఆర్ఎఫ్ డైరెక్టర్, ఈవీడీఎం ప్రకాష్‌రావు, జోనల్ కమిషనర్ రవికిరణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్

తప్పిన పెనుప్రమాదం

పాలికాబజార్‌లో సుమారు 400 దుకాణాలు ఉన్నాయి. ఇందులో సెల్లార్‌లో సుమారు వందకు పైగా దుకాణాలు ఉన్నాయి. అగ్ని ప్రమాదం కేవలం గ్రౌండ్ ఫ్లోర్‌లో మాత్రమే జరగడంతో పెద్ద ప్రమాదం తప్పింది. సెల్లార్‌లోకి మంటలు వ్యాపిస్తే వాటిని అదుపు చేయడం అగ్నిమాపక సిబ్బందికి కూడా పెద్ద సవాలుగా మారేది. సెల్లార్‌లో గాలి, వెలుతురు కూడా లేకున్నా పెద్ద సంఖ్యలో షాపులు నడుపుతున్నారు. అలాగే ఇందులో ఏ ఒక్క షాపుకు కనీసం మంటలను ఆర్పే పరికరాలు లేకపోవడం గమనార్హం.

ఎంబీబీఎస్ విద్యార్థి ఆత్మహత్య

జగద్గిరిగుట్ట: మానసిక ఆరోగ్యం సరిగా లేక ఓ ఎంబీబీఎస్ విద్యార్థి కత్తితో కోసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. సీఐ క్రాంతి కుమార్ వివరాల ప్రకారం.. దీక్షిత్ రెడ్డి (20) గాంధీ మెడికల్ కాలేజీలో ఎంబీబీఎస్ సెకండియర్ చదువుతున్నాడు. ఆయన తండ్రి అయిదేళ్ల క్రితమే ఇంట్లో నుంచి వెళ్లిపోవడంతో తల్లి, సోదరితో కలిసి పాపిరెడ్డినగర్ రోడ్ నంబర్ 18లో ఉంటున్నాడు. కొంత కాలంగా అనారోగ్యానికి గురయ్యాడు. ఆదివారం సాయంత్రం 7 గంటల ప్రాంతంలో దీక్షిత్ రెడ్డి తల్లి బయటకు వెళ్లి వచ్చేసరికి రక్తపు మరకలతో పడి ఉన్నాడు. వెంటనే పోలీసులకి సమాచారం అందించడంతో అక్కడికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పదునైన కత్తితో తన వ్యక్తిగత భాగాల పక్కన కోసుకోవడంతో తీవ్ర రక్తస్రావంతో చనిపోయాడని పోలీసులు తెలిపారు. ఆరోగ్యాం సరిగా లేకనే కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని ఆయన తల్లి ఫిర్యాదులో పేర్కొంది.

లక్నోలో బీకేఎంయూ జాతీయ మహాసభలు

కాచిగూడ: భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ (బీకేఎంయూ) అఖిల భారత మహాసభలు ఆగస్టు 2 నుంచి 5 వరకు లక్నో నగరంలో జరుగుతాయని బీకేఎంయూ జాతీయ కార్యదర్శి ఎమ్మెస్ నిర్మల్ తెలిపారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లో జరిగిన తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రభుత్వ భూముల్లో గుడిసెలు వేసుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీకేఎంయూ రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య తదితరులు పాల్గొన్నారు.

సీఎన్జీ కొరత

- పెరిగిన వాహనాల సంఖ్య

సాక్షి, సిటీబ్యూరో: వాహనాల్లో నింపే సీఎన్జీ (కంప్రెస్డ్ నేచురల్ గ్యాస్) కొరత వెంటాడుతోంది. ఇంధన ధరల మోతతో సీఎన్జీ మొగ్గు చూపి.. గ్యాస్ కిట్లు అమర్చుకున్న వాహనదారులకు కష్టాలు తప్పడం లేదు. డిమాండ్‌కు తగ్గట్టు సరఫరా లేకపోవడంతో అవస్థలు పడుతున్నారు. బంకుల్లో గ్యాస్ లోడ్ నింపిన నాలుగైదు గంటల్లోనే నో స్టాక్ బోర్డులు కనిపిస్తున్నాయి.

మూడు లక్షలకుపైనే..

నగరంలో సుమారు మూడు లక్షల వాహనాలకు పైగానే సీఎన్జీ, ఆటో గ్యాస్, లిక్విడ్, ఎల్పీజీ గ్యాస్‌ను వినియోగిస్తున్నట్లు సమాచారం. ఆటో గ్యాస్, లిక్విడ్ గ్యాస్‌కు కొరత లేనప్పటికీ సీఎన్జీ పూర్తిస్థాయిలో సరఫరా లేదు. సాధారణంగా గ్యాస్ స్టేషన్లకు ప్రతిరోజు 5000 ఆటోలు, 1000 వరకు కార్ల తాకిడి ఉంటుంది. పెట్రోల్, డీజిల్ కంటే సీఎన్జీ, గ్యాస్‌తో నడిచే వాహనాలు మైలేజీ అధికంగా ఇస్తాయి. పెట్రోల్, డీజిల్ లీటర్‌కు 15 నుంచి 20 కిలో మీటర్ల వరకు మైలేజీ ఇస్తే సీఎన్జీ, ఆటో గ్యాస్, ఎల్పీజీ కిలోకు 22 నుంచి 28 కిలో మీటర్ల వరకు మైలేజీ వస్తుందని అంచనా. ప్రస్తుతం మార్కెట్‌లో పెట్రోల్, డీజిల్ బంకులతో పాటు ఆటో గ్యాస్, సీఎన్జీ, లిక్విడ్ గ్యాస్ కేంద్రాలు వేర్వేరుగా ఉన్నాయి. గ్రేటర్ పరిధిలో 460పైగా పెట్రోల్ బంకులు ఉండగా, ప్రత్యేకంగా 75కుపైగా సీఎన్జీ స్టేషన్లు ఉన్నాయి.



అంతమాత్రమే..

నగరంలో పూర్తి స్థాయిలో సీఎన్జీని అందుబాటులోకి తెచ్చే ప్రక్రియ అంతంత మాత్రంగా తయారైంది. శామీర్‌పేట మదర్ స్టేషన్ ఏర్పాటు చేసి సీఎన్జీని అందుబాటులోకి తెచ్చినప్పటికీ కొంతకాలంగా గ్యాస్ కొరతతో గ్రిడ్ నుంచి స్టేషన్లకు డిమాండ్‌కు తగ్గ సరఫరా చేయలేక పోతోంది. పన్నెండేళ్ల క్రితం గ్రేటర్‌లో ప్రజా రవాణాకు వినియోగించే 85 వేల ఆటోలు, 7,500 బస్సులు, 20 వేలకు పైగా టాక్సీలకు సగటున రోజుకు 7,62,500 కిలోల (1.067 ఎంఎంఎస్‌సీఎండీ) సీఎన్జీ అవసరమని బీజేఎల్ అంచనా వేసింది. తొలిదశలో మేడ్చల్, హకీంపేట, కంటోన్మెంట్ తదితర డిపోలకు చెందిన 350 ఆర్టీసీ బస్సులకు సీఎన్జీ పంపిణీ చేస్తామని ప్రకటించింది. కానీ.. కొద్ది రోజులు 164 బస్సులకు సరఫరా చేసినా.. క్రమేణా బస్సుల సంఖ్య 135కు పరిమితమైంది. దీంతో 215 బస్సులు డిపోల్లోనే మూలుగుతున్నాయి.

ప్రజలకు చేరువవుతున్న సిటీబస్సు

అత్యుత్తమ రీజియన్‌గా నిలిచిన సికింద్రాబాద్

- ఆదాయంలో, ఆక్యుపెన్సీలో గణనీయమైన అభివృద్ధి
- వివిధ విభాగాల్లో ఏకంగా 56 ప్రగతిచక్ర అవార్డులు



అవార్డు అందుకుంటున్న ఆర్‌ఎం వెంకన్న (ఫైల్)

సాక్షి, సిటీబ్యూరో: 'ప్రయాణికుల వద్దకు సిటీబస్సు' స్ఫూర్తితో ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ పరుగులు తీస్తోంది. ప్రయాణికుల డిమాండ్‌కు అనుగుణంగా నిర్వహించే రూట్ సర్వేలు సత్ఫలితాలనిస్తున్నాయి. జగద్గిరిగుట్ట, బాచుపల్లి, గండిమైసమ్మ, ఘట్కేసర్, కీసర,బీహెచ్‌ఈఎల్, ఇబ్రహీంపట్నం వంటి నగర శివారు ప్రాంతాలను ఐటీ కారిడార్‌లకు, నగరంలోని ప్రధాన మార్గాలకు అనుసంధానం చేస్తూ ప్రయాణికులకు మెరుగైన రవాణా సదుపాయాలను అందజేయడంలో అధికారులు కృషి ఫలిస్తోంది. ఈ ఆర్థిక సంవత్సరం సికింద్రాబాద్ రీజియన్ ప్రయాణికుల ఆక్యుపెన్సీలో, ఆదాయంలో గణనీయమైన అభివృద్ధిని సాధించింది. గతసంవత్సరం 58.19 శాతం ఉన్న ప్రయాణికుల భర్తీ శాతం ఈ సంవత్సరం అనూహ్యంగా 69.09 శాతానికి చేరుకోవడం విశేషం. అలాగే ఆదాయ సముపార్జనలోనూ మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. గత సంవత్సరం ఒక కిలోమీటర్‌పైన రూ.36.66 చొప్పున లభించగా, ఈ సంవత్సరం అది ఏకంగా రూ.49.51 గా నమోదైంది. దీంతో కేవలం అత్యుత్తమ రీజియన్‌గానే కాకుండా ఈ సంవత్సరం ఆ ఒక్క రీజియన్‌కే వివిధ కేటగిరీల్లో మొత్తం 56 ప్రగతిచక్ర అవార్డులు లభించడం విశేషం.

ప్రయాణికుల చెంతకు బస్సు

- గ్రేటర్ హైదరాబాద్‌లో సుమారు 1050 కిపైగా రూట్‌లలో సిటీ బస్సులు నడుస్తున్నాయి. కానీ ప్రయాణికులు ఏ రూట్ నుంచి ఏ రూట్‌కు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నారనే అంశం ఎంతో కీలకం. ఈ క్రమంలో సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్ వెంకన్న వివిధ రూట్‌లపైన సీరియస్‌గా దృష్టి సారించారు. ప్రయాణికులు ఎటు వైపు నుంచి ఎటు వైపు ఎక్కువగా వెళ్తున్నారనే శాస్త్రీయమైన అధ్యయనం ఆధారంగా వివిధ మార్గాల్లో బస్సులను అందుబాటులోకి తెచ్చారు. అలాగే వివిధ మార్గాల్లో ఔటర్‌కు చేరుకొనేవారి కోసం, ఔటర్ సర్వీసు రోడ్లలో ప్రయాణికుల కోసం సిటీ బస్సులను విస్తరించడం వల్ల ఈ ఏడాది సికింద్రాబాద్ రీజియన్ ఉత్తమ ఫలితాలను సాధించింది. తెలంగాణ ఆర్టీసీలోని మొత్తం 11 రీజియన్‌లలో సికింద్రాబాద్ ' ది బెస్ట్'గా అవార్డును అందుకొంది.

అందరి విజయం: వెంకన్న, ఆర్టీసీ సికింద్రాబాద్ రీజనల్ మేనేజర్

'ఇది మా అందరి సమిష్టి కృషి ఫలితం.ప్రతి డిపో కష్టం ఉంది.విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగి అంకితభావం ఉంది. గతేడాది కంటే ఈ ఏడాది నష్టాలను చాలా వరకు తగ్గించుకోగలిగాం. ప్రయాణికుల సంఖ్య ఇతోధికంగా పెరిగింది. ప్రయాణికుల అవసరాలను గుర్తించి బస్సులు నడపడంతోనే చక్కటి ఫలితాలు లభిస్తాయి.త్వరలోనే పూర్తిస్థాయిలో నష్టాలను అధిగమిస్తాం.

ఇదీ ఆర్టీసీ సికింద్రాబాద్ రీజియన్ ప్రగతి ..

మొత్తం డిపోలు: 11
బస్సులు: 1450
ప్రయాణికులు: 12 లక్షలకు పైగా (సుమారు)
గత సంవత్సరం ఆక్యుపెన్సీ : 58.18 శాతం
ఈ సంవత్సరం: 69.09 శాతం.
గత సంవత్సరం ఈపీకే రూ.36.66,
ఈ సంవత్సరం: రూ.49.51
(ఎర్నింగ్ పర్ కిలోమీటర్)

ముస్లిం డిక్లరేషన్ చారిత్రక అవసరం

ప్రొఫెసర్ హరగోపాల్



పంజగుట్ట: ముస్లిం డిక్లరేషన్ చారిత్రక అవసరమని ప్రొఫెసర్ హరగోపాల్ అన్నారు. ముస్లింల ఓట్ల కోసం అన్ని పార్టీలు పాకులాడుతాయేగాని, వారి సమస్యలు పరిష్కరించడంలో మాత్రం స్పందించడంలేదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో తెలంగాణ ముస్లిం ఆర్గనైజేషన్స్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో 22 అంశాలతో రూపొందించిన ముస్లిం డిక్లరేషన్‌ను ఆయన సీనియర్ సంపాదకులు జహీరుద్దీన్ అలీ ఖాన్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ సయ్యద్ సలీం పాషాతో కలిసి వారు మాట్లాడుతూ తెలంగాణ వచ్చాక ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింలకు ఎంతో చేస్తున్నారన్న అపోహ ఉందని, కాని అది వాస్తవం కాదన్నారు. ఒక్కరోజు ఇఫ్తార్ విందు ఇవ్వడంతో ముస్లింల బతుకులు మారవన్న విషయం తెలుసుకోవాలన్నారు. అన్ని పార్టీలు ఎన్నికలకు ముందు ముస్లింలకు మద్దతుగా మాట్లాడతాయని, ఎన్నికలు అయిపోగానే అన్నీ మర్చిపోతున్నారని ఆరోపించారు. ముస్లింలకు జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం, విద్య, ఉద్యోగాల్లో 10 నుండి 12 శాతం రిజర్వేషన్లు, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో ఏటా 10 వేల కోట్ల కేటాయింపు తదితర 22 డిమాండ్లతో డిక్లరేషన్ రూపొందించినట్లు, దీన్ని అన్ని పార్టీలకు అందించి..వారి స్పందన మేరకు ఎన్నికల్లో మద్దతు తెలుపుతామన్నారు. సైకిబాబా, ప్రొఫెసర్ అన్సారీ, ఎండీ యూనిస్, డాక్టర్ రియాజ్, రవూఫ్‌ఖాన్, రహమాన్, షకీల్ తదితరులు పాల్గొన్నారు.

సహకార బ్యాంకింగ్ రంగంలో రెండంచెల విధానానికి సానుకూలం



సదస్సులో ప్రసంగిస్తున్న బోయినపల్లి వినోద్‌కుమార్

సుల్తాన్‌బజార్: రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా సహకార బ్యాంకింగ్ రంగంలో రెండంచెల విధానం పట్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వం సానుకూలంగా ఉందని తెలంగాణ రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు బోయినపల్లి వినోద్‌కుమార్ అన్నారు. సహకార రంగంలో నిర్మాణాత్మక మార్పులు అనే అంశంపై అఖిలభారత బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ (ఏఐబీఈఏ) ఆధ్వర్యంలో ఆదివారం కోఠిలో సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి వినోద్‌కుమార్‌తో పాటు సంఘం జాతీయ కార్యదర్శి బీఎస్.రాంబాబు, ఆంధ్రప్రదేశ్ తెలంగాణ బ్యాంక్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షులు రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శి పి.వి.కృష్ణారావు, సహకార బ్యాంకుల ఉద్యోగుల అసోసియేషన్ నాయకులు సురేందర్ తదితరులు ప్రసంగించారు. అనంతరం బోయినపల్లి వినోద్‌కుమార్ మాట్లాడుతూ సహకార ఉద్యమం పుట్టిన ప్పటికంటే ప్రస్తుత సమాజంలోనే సహకార ఉద్యమం మరింత ఎక్కువగా అవసరం ఉందన్నారు. అనేక రకాల ప్రజా ఉద్యమాల ద్వారా భూ సంస్కరణల అమలు అనంతరం భూమి పంపిణీ జరిగి ప్రస్తుతం వ్యవసాయ భూమి పెద్దఎత్తున పెరగడమే ఇందుకు కారణమన్నారు. ఈ ఉద్దేశ్యంతోనే బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతు వేదికలను ఏర్పాటు చేసిందని, ప్రతి 5 వేల ఎకరాలకు ఒక వ్యవసాయ విస్తరణ అధికారిని నియమించిందని, ఎకరానికి రూ.5 వేల పంట పెట్టుబడి సహాయం, పంట రుణాలు రైతులకు ఎంతో ధైర్యాన్ని ఇస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున బ్యాంకు ఉద్యోగులు పాల్గొన్నారు.

'టెక్నాలజీ పెరిగినా దళితులకు అందని ఫలితాలు'



జై భీం కథల పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఐపీఎస్ అధికారి డాక్టర్ చేతన తదితరులు

ఖైరతాబాద్: రోజు రోజుకు టెక్నాలజీలో ముందడుగు వేస్తూ రోబో టెక్నాలజీ వరకు చేరుకున్నా దళితులు ఇప్పటికీ వందల సంత్సరాలనాటి కుల వృత్తులకే పరిమితమవడం బాధాకరమైన విషయమని ఐపీఎస్ అధికారి డాక్టర్ చేతన అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ విశ్వేశ్వరయ్య భవన్‌లో ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ హక్కుల పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సమస్యలపై జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర చేతన మాట్లాడుతూ టెక్నాలజీ ఎంత పెరిగినా ఇప్పటికి ఎన్నో సంవత్సరాలుగా కొనసాగుతూ వస్తున్న కుల వృత్తుల్లోనే దళితులు కొనసాగడం అన్యాయమన్నారు. దళితులు అన్ని రంగాల్లో రాణించాలని, ముఖ్యంగా పరిపాలనా రంగంలో ముందుండాలని సూచించారు. ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ రైట్స్ హక్కుల పరిరక్షణ కమిటీ జాతీయ అధ్యక్షుడు జి.మురళీధర్‌రావు నేతృత్వంలో నిర్వహించిన జాతీయ సదస్సులో ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల సమస్యలపై నిపుణులు పలు సూచనలు సలహాలు చేశారు. జై భీం కథల పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సులో తెలంగాణ హైకోర్టు అడ్వొకేట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఆత్మహత్య

మాదాపూర్: ఆర్థిక ఇబ్బందులు తాళలేక వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ అవినాశ్ తెలిపిన వివరాల ప్రకారం గాజుల రామారంలో ఉంటున్న హేమంత్ కుమార్(25) ఓ హోటల్‌లో టెక్నికల్ సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం తెల్లవారు జామున నైలాన్ తాడుతో ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. బావమరిది నరేష్‌బాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసునమోదు చేశారు.

ఓటు విలువ తెలుసుకోండి



సాక్షి, సిటీబ్యూరో: ఓటు అనేది హక్కు మాత్రమే కాదు, దేశ భవిష్యత్తును ప్రభావితం చేయగల శక్తివంతమైన ఆయుధమని యంగిస్తాన్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ అరుణ్ డేనియల్ అన్నారు. నగరంలోని లామకాన్ వేదికగా ఆదివారం ఓటు హక్కు ప్రాధాన్యతను, ప్రస్తుత రాజకీయ అంశాలపైన చర్చించడానికి యంగిస్తాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'డెమోక్రసీ ఇన్ యాక్షన్' అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని ఇంటరాక్టివ్ సెషన్‌లో ఫరా, కిరణ్ బరత్వాల్, ఆదర్శ్ వంటి యువ కళాకారులతో పాటు ముషీర్‌ఖాన్, వినయ్ వంగల తదితర ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా క్రియాశీల రాజకీయాల్లో యువత ప్రాముఖ్యతను, ఓటు విలువను అరుణ్ డేనియల్ వివరించారు. ఓటు వేయడం ఎలాగో తెలుసుకోవాలంటే 1950కి కాల్ చేయాలని పేర్కొన్నారు. దాదాపు వంద మంది ఔత్సాహిక యువకులు పాల్గొన్నారు.

భర్త అన్నం తినడం లేదని అలిగి భార్య ఆత్మహత్య

బంజారాహిల్స్: మూడు రోజులుగా తాను చేసిన వంటలు తినకుండా బయట తినడమే కాకుండా ఇదేమిటని అడిగితే సరైన సమాధానం చెప్పకపోవడంతో మనస్థాపానికి గురైన ఓ వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బంజారాహిల్స్ రోడ్ నెం.11లోని గౌరీశంకర్ కాలనీలో నివసించే కె.సంగీత (23) వివాహం 2019లో కె.సంజీవతో జరిగింది. డ్రైవర్‌గా పనిచేస్తున్న సంజీవ గత మూడు రోజుల నుంచి ఇంట్లో తినకపోవడంతో సంగీత ప్రశ్నించింది. ప్రతిరోజూ వంట చేస్తున్నానని, తినకపోవడంతో అవి పాడైపోతున్నాయని వెల్లడించింది. దీనికి తోడు ఆమెకు కొంత కాలంగా అనారోగ్యం కూడా సమస్యగా మారింది. ఈ నేపథ్యంలోనే శనివారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. తండ్రి సంజయ్ రాముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

మినిస్టర్ క్వార్టర్స్ నీటి బకాయిలు రూ.4.34 కోట్లు!



బంజారాహిల్స్‌లోని మినిస్టర్ క్వార్టర్స్

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని మంత్రుల నివాస సముదాయాల మంచినీటి బిల్లులు రోజురోజుకు పెరిగిపోతుండటంతో జలమండలి అధికారులు పెండింగ్ బిల్లులు రాబట్టుకోలేక సతమతమవుతున్నారు. మినిస్టర్ క్వార్టర్స్ వాటర్ కనెక్షన్లు కట్ చేయడానికి కూడా వెనుకాడబోమని ఈ ఏడాది మార్చిలో హెచ్చరికలు జారీ చేసినా సంబంధిత ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించడం లేదు. బంజారాహిల్స్ రోడ్ నెం.12లోని మినిస్టర్ క్వార్టర్స్‌లో 32 క్వార్టర్స్ ఉన్నాయి. 2009 నుంచి ఈ క్వార్టర్స్‌కు సంబంధించిన మంచినీటి బిల్లులు చెల్లించకపోవడంతో యేటికాయేడు అవి చాంతాడాంత పెరిగిపోతున్నాయి. ఇప్పటికీ బిల్లుల బకాయిలు రూ.4.34 కోట్లకు చేరుకున్నాయి. ఉమ్మడి ఏపీ నుంచే ఈ బిల్లులు బకాయి ఉన్నాయని జలమండలి అధికారులు పేర్కొంటున్నారు. ఈ ఏడాది మార్చి 15వ తేదీన ఆర్‌అండ్‌బీ ఈఈ ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈకి వాటర్ బిల్లులు విడుదల చేయాల్సిందిగా లేఖ కూడా రాశారు. ఇప్పటిదాకా దానికి స్పందన కరువైంది. బకాయిలు చెల్లించాలని జలమండలి అధికారులు ఎన్నోసార్లు ఆర్‌అండ్ బి అధికారులకు లేఖలు రాయడమే కాకుండా మొరపెట్టుకుంటున్నారు. భారీగా బకాయిలు పేరుకుపోయాయని బోర్డుకు నష్టంవాటిల్లుతుందని ఆందోళన కూడా వ్యక్తం చేశారు. కొంతనైనా చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. వాటర్ కనెక్షన్లు కట్‌చేయకముందే చెల్లించండి అంటూ వేడుకున్నారు. అయినాసరే ఆర్‌అండ్‌బి అధికారులు కనికరించడం లేదు. సామాన్యులు ఒక నెల బిల్లు చెల్లించకపోతే వాటర్ కనెక్షన్ కట్‌చేసే జలమండలి అధికారులు మంత్రులు బిల్లులు చెల్లించకపోతే మాత్రం పుష్కర కాలంగా నోరెత్తడం లేదు. ఈ విషయంలో ఆర్‌అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. సామాన్యులకు ఒక న్యాయం, అమాత్యులకు మరో న్యాయమా అంటూ పలువురు విమర్శిస్తున్నారు.

ఇంకా చెల్లించని కరెంటు బకాయిలు

మినిస్టర్ క్వార్టర్స్‌లో కరెంటు బకాయిలు ఏ నెలకా నెల పెరిగిపోతున్నాయి. 2022 ఆగస్టు నుంచి మినిస్టర్ క్వార్టర్స్ కరెంటు బిల్లులు చెల్లించకపోవడంతో ఇప్పటికే ' 70 లక్షల బకాయిలు పేరుకుపోయాయి. ఈ బిల్లులు చెల్లించాలంటూ విద్యుత్ శాఖ అధికారులు సంబంధిత ఆర్‌అండ్‌బి అధికారులను వేడుకుంటున్నా స్పందన కరువవుతున్నది. భారీగా కరెంటు బిల్లులు పేరుకుపోతుండటంతో సంబంధిత ఏఈలకు విద్యుత్ ఉన్నతాధికారులు మెమోలు జారీచేస్తున్నారు ఇంక్రిమెంట్లు కట్ చేస్తున్నారు. ప్రతిరోజూ పెండింగ్ బిల్లుల వసూళ్లు ఎంత వరకు వచ్చాయంటూ తీవ్ర ఒత్తిడి తీసుకొస్తున్నారు. అమాత్యులు మాత్రం స్పందించకపోగా ఈ బిల్లులు చెల్లించాల్సిన ఆర్‌అండ్‌బి ఇంజనీర్లు నోరెత్తడం లేదు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థికి గాయాలు

రాజేంద్రనగర్: శివరాంపల్లిలోని మైనార్టీ హాస్టల్లో క్రికెట్ ఆడుతున్న విద్యార్థికి విద్యుత్ షాక్ తగలడంతో తీవ్ర గాయాలకు గురై ఓవైసీ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు, బాధితుని తండ్రి తెలిపిన వివరాల ప్రకారం పాతబస్తీ కిల్వత్ ప్రాంతానికి చెందిన షేక్ హైమద్ కుమారుడు షేక్ మహమ్మద్ ఉమర్(10) శివరాంపల్లిలోని మైనార్టీ హాస్టల్లో ఉంటూ ఆరవ తరగతి చదువుతున్నాడు. శనివారం సాయంత్రం ఐదు గంటల ప్రాంతంలో హాస్టల్లోని మైదానంలో తోటి విద్యార్థులతో కలిసి క్రికెట్ ఆడుతున్నాడు. క్రికెట్ ఆడుతూ ఉమర్ గ్రౌండ్ నుండి వెళ్తుండగా విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. విషయం గమనించిన తోటి విద్యార్థులు విషయాన్ని ఉపాధ్యాయులకు తెలపడంతో హుటాహుటిన 108 అంబులెన్స్ ద్వారా ఓవైసీ ఆసుపత్రికి తరలించారు. గ్రౌండ్ ఆవరణలో విద్యుత్ వైర్లు ప్రమాద భరితంగా ఉండటంతో ఈ సంఘటన జరిగిందని బాధితుని తండ్రి ఆరోపించాడు. ఈ మేరకు ఆదివారం ఉదయం ఆయన పోలీసులకు ఫిర్యాదు చేశాడు

మరో ఘటనలో వ్యక్తి మృతి

విద్యుత్ షాక్‌కు గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం హిమాయత్ సాగర్ ప్రాంతానికి చెందిన ఎల్లయ్య ఆదివారం ఉదయం తన ఇంట్లో సంపు నుండి విద్యుత్ మోటార్ సహాయంతో నీటిని ట్యాంకులోకి నింపుతున్నాడు. ఇదే సమయంలో ప్రమాదవశాస్తూ విద్యుత్ మోటార్ వైరు తగలడంతో షాక్‌కుగురై అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక ఆసుపత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు వెల్లడించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు

భర్త ఇంటి ఎదుట భార్య ధర్నా



ఆందోళన చేస్తున్న స్వప్న, మహిళా సంఘం కార్యకర్తలు

ముషీరాబాద్: భర్త, అత్త, ఆడపడుచుల వేధింపుల నుంచి కాపాడాలని కోరుతూ ఓ మహిళ అత్తింటి ఎదుట ధర్నాకు దిగింది. కార్వాన్‌లోని కుమ్మరివాడకి చెందిన స్వప్నకు బాకారానికి చెందిన నాగమణి కుమారుడు ఫణీంద్రతో 2021 లో వివాహం జరిగింది. అప్పటి నుంచి అత్త, ఆడపడుచు, భర్త తనను నిత్యం వేధిస్తు మానసికంగా, శారీరకంగా ఇబ్బంది పెడుతున్నారని ఆరోపిస్తూ స్వప్న ఆదివారం బాకారంలోని ఫణీంద్ర ఇంటి వద్ద ఆందోళనకు దిగింది. ఈ విషయమై నాంపల్లి ఉమెన్స్ పోలీస్‌స్టేషన్‌లోని భరోసా కేంద్రంలో ఫిర్యాదు చేసినట్లు స్వప్న తెలిపారు. పోలీసులు కౌన్సిలింగ్‌కు పిలిచినా రావడం లేదని ఆరోపించారు. దీంతో నాంపల్లి పోలీస్‌స్టేషన్‌లో 498ఏ కేసు నమోదైందని తెలిపారు. కాగా మహిళా సంఘం నేతలతో కలిసి ఆందోళన చేపట్టగా స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది. దీంతో ముషీరాబాద్ పోలీసులు ఎస్‌ఐ ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. ఫణీంద్రను ముషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కాగా తనపై 498ఏ కేసు నమోదు చేశారని, దీనిపై తాను కోర్టుకు వెళ్లగా కోర్టులో వాదనలు జరుగుతున్నాయని ఫణీంద్ర తెలిపారు.

ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలకు మెగా స్పందన

చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్– స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో..



కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షల శిబిరంలో జనం

సాక్షి, హైదరాబాద్: సినీ కార్మికులు, సినీ జర్నలిస్టులు, ప్రజల కోసం ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మెగాస్టార్ చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్–స్టార్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో ఆదివారం నగరంలో ప్రారంభించారు. చిరంజీవి బ్లడ్ అండ్ ఐ బ్యాంక్ లో జరిగిన ఈ కార్యక్రమంలో దాదాపు 2000 మంది రిజిస్టర్ చేసుకున్నారు. తొలుత మూడు నగరాల్లో స్క్రీనింగ్ క్యాంపులు నిర్వహించనున్నట్టు గతంలో చిరంజీవి ప్రకటించగా మొదటి శిబిరం ఆదివారం హైదరాబాద్‌లో జరిగింది. జూలై 16న విశాఖపట్నం.. జూలై 23న కరీంనగర్ లో ఈ శిబిరాల్ని నిర్వహిస్తారు. ఈ శిబిరాల్లో పాల్గొనే వారికి ఎలాంటి ఖర్చు లేకుండా కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించనున్నారు. కార్యక్రమంలో మెగా బ్రదర్ నాగబాబు, స్టార్ హాస్పిటల్ వైద్యులు గోపీచంద్, డైరెక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కాశీ విశ్వనాథ్, ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్, వి.ఎన్. ఆదిత్య, దొరై పాల్గొన్నారు.

చికిత్సలో కూడా రాయితీ అందేలా కృషి: నాగబాబు

సినీనటుడు నాగబాబు మాట్లాడుతూ. ఇప్పటివరకు రక్తదానం, నేత్రదానం మీద అవగాహన పెంచామని, ఇప్పుడు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తూ ముందుగానే కేన్సర్‌ను అరికట్టేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఇందుకు సహకరించిన డాక్టర్ గోపీచంద్‌కి కృతజ్ఞతలు తెలిపారు. కేన్సర్ చికిత్సలో కూడా మెగాస్టార్ చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా రాయితీ అందేలా కృషి చేస్తామని నాగబాబు హామీనిచ్చారు. స్టార్ హాస్పిటల్ వైద్యులు గోపీచంద్ మాట్లాడుతూ రెండు తెలుగు రాష్ట్రాలలో సుమారు 20 ప్రాంతాలలో ఇలాంటి స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహిస్తామని, దానికి మెగాస్టార్ చిరంజీవి అండగా ఉంటామని హామీ ఇచ్చారని చెప్పారు.

క్లుప్తంగా...

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే దానం

బంజారాహిల్స్: ఖైరతాబాద్ నియోజక వర్గ పరిధిలోని వివిధ డివిజన్‌లకు చెందిన కల్యాణ లక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, కార్పొరేటర్లు కవితారెడ్డి చెక్కులను అందజేశారు. ఆదివారం ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేని పథకాలు తెలంగాణలో ఉన్నాయని వాటన్నింటినీ అర్హులైన ప్రతీ మహిళ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా 18 మంది లబ్ధిదారులకు అందజేశారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ అందజేత



శ్రీనగర్‌కాలనీ: జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి చెందిన నలుగురు కుటుంబసభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా వచ్చిన చెక్కులను లబ్ధిదారులకు ఆదివారం దారుసలాంలో ఎంఐఎం ఎంఎల్‌సీ మీర్జా రియాజ్ ఉల్‌హసన్ అందజేశారు. సోమాజీగూడ ఎంఐఎం ప్రెసిడెంట్ షేక్ జాఫర్, సయ్యద్, సలీమ్, అహ్మద్, యూసుఫ్ తదితరులు పాల్గొన్నారు.

అభినందన



నల్లపు యాదగిరిని అభినందిస్తున్న బస్తీవాసులు

ఫిలింనగర్: ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్ బస్తీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా నల్లపు యాదగిరి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం స్థానిక నల్లపోచమ్మ–ఎల్లమ్మ–కనకదుర్గ ఆలయ ప్రాంగణంలో జరిగిన సమావేశానికి బస్తీ నుంచి 200 మంది హాజరయ్యారు. ఈ సందర్భంగా బస్తీవాసులు ఆయనను ఘనంగా సత్కరించారు. బస్తీ అభివృద్ధికి కృషి చేస్తానని అందరికీ అందుబాటులో ఉంటానని ఈ సందర్భంగా ఆయన తెలిపారు.

మున్సిపల్ కమిషనర్ సుడిగాలి పర్యటన



శ్రీరాంనగర్ గార్బేజ్ ఓపెన్ పాయింట్‌ను పరిశీలిస్తున్న దృశ్యం

రహమత్‌నగర్: జీహెచ్‌ఎంసీ సర్కిల్–19 లో మున్సిపల్ కమిషనర్ రోనాల్డ్‌రాస్ సుడిగాలి పర్యటన చేశారు. బోరబండ, ఎర్రగడ్డ, రహమత్‌నగర్ డివిజన్‌లలో ఆయన ఆకస్మిక పర్యటన చేశారు. ఈ సందర్భంగా శానిటేషన్ సిబ్బంది పనితీరు, స్వచ్ఛ ఆటో సేవలను అడిగి తెలుసుకున్నారు. శ్రీరాంనగర్ ముబారక్ హోటల్ వద్ద ఏర్పాటు చేసిన ఓపెన్ గార్బేజ్ పాయింట్, కార్మికనగర్ డంపింగ్ పాయింట్‌ల వద్ద ప్రజలను పారిశుద్ధ్య సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పారిశుద్ధ్య పనుల్లో అలసత్వం చేయకూడదని సిబ్బందికి సూచించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, డీఎంసీ రమేష్, ఏఎంహెచ్‌ఓ డా.ప్రవీణ, ఈఈ రాజ్‌కుమార్, ఎస్‌ఎఫ్‌ఐలు పాల్గొన్నారు.

ఏపీ తరహాలో యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

అమీర్‌పేట. ఆంధ్రప్రదేశ్‌లో మాదిరిగా తెలంగాణ రాష్ట్రంలో 20 శాతంగా ఉన్న యాదవులకు యాదవ కార్పొరేషన్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా రూ.10వేల కోట్ల నిధులు కేటాయించాలని జాతీయ యాదవ హక్కుల పోరాట సమితి జాతీయ అధ్యక్షులు మేకల రాములు యాదవ్ డిమాండ్ చేశారు. యాదవ సంఘం రాష్ట్ర యువత అధ్యక్షుడు శెట్టి వంశీమోహన్ సన్మాన కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. డిమాండ్ల సాధన కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు వచ్చే నెల 8వ తేదీన ఇందిరా పార్కు వద్ద వేలాది మందితో కలిసి యాదవ గర్జన నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పోరాడి యాదవ కార్పొరేషన్‌ను సాధించుకున్నామని చెప్పారు. కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా చిన్న చిన్న పరిశ్రమలను ఏర్పాటు చేసుకోవడంతో పాటు ఉన్నత విద్యను అభ్యసించేందుకు విదేశాలకు వెళ్లే పిల్లలకు ఆర్థిక సహాయం అందుతుందని వివరించారు.అదే విధంగా రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరారు. ఎస్‌ఎన్‌టీ రిజర్వేషన్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఎన్నికల్లో జనాభా ప్రాతిపదికన టికెట్లు ఇచ్చే రాజకీయ పార్టీలకే తమ మద్దతు ఉంటుందని స్పష్టం చేశారు.

అసలు మాటున నకిలీ !

బంజారాహిల్స్‌లోని రంగారావు అనే వ్యక్తికి నీటి ట్యాంకర్ అవసరమవడంతో తనకు తెలిసిన వారి ద్వారా నీటిట్యాంకర్ కోసం వాకబు చేస్తాడు. చెప్పిన క్షణాల్లోనే జలమండలి వాటర్ ట్యాంకర్ వచ్చి సంబంధిత నివాసి ఇంట్లో నీళ్లుపోసి డబ్బులు తీసుకుని వెళ్లిపోతాడు. ఇక్కడే ఓ ట్విస్ట్ ఉంది. అసలు నీళ్లు పోసింది.. జలమండలి సిబ్బంది కాదు. అవీ.. మంచినీళ్లు.. కావు. జలమండలిలో సస్పెన్షన్‌కు గురైన కొందరు డ్రైవర్లు ప్రైవేట్ స్థలాల్లో ఉండే బోర్లలో నీటిని నింపుకుని బంజారాహిల్స్, పంజగుట్ట, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లోని నివాసితులకు పోసి జలమండలికి రావాల్సిన ఆదాయానికి గండికొడుతున్నారు.

– బంజారాహిల్స్



బంజారాహిల్స్‌లో నిర్మాణంలో ఉన్న షాపింగ్‌మాల్ బోర్‌వెల్ నుంచి ట్యాంకర్లు నింపుతున్న దృశ్యం

- మొక్కుబడిగా జలమండలి అధికారుల ఫిర్యాదులు
- జలమండలి ఖజానాకు గండికొడుతున్న ప్రైవేట్ డ్రైవర్లు
- ఎఫ్ఐఆర్ నమోదు చేసి పట్టించుకోని వైనం

- ఈ వ్యవహారంపై అవగాహన ఉన్న సదరు జలమండలి అధికారులు సైతం పోలీసులకు ఫిర్యాదులు చేసి చేతులు దులుపుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. తదానంతరం ఎలాంటి కఠినచర్యలు లేకపోవడంతో ఈ వ్యాపారం యథేచ్ఛగా కొనసాగుతోంది. ఓ వైపు జలమండలి ఆదాయాన్ని కోల్పోతుండగా.. మరోవైపు డబ్బులిచ్చి మరీ నాణ్యతలేని నీళ్లను ప్రజలు పొందుతున్నారు.

సస్పెండెడ్ ట్యాంకర్లు.. హెచ్‌ఎండబ్ల్యూఎస్ స్టిక్కర్లు..

- బంజారాహిల్స్ రోడ్ నెం. 1/3 చౌరస్తాలో ఉన్న ఓ భారీ భవంతిలో నిత్యం ఓ వ్యక్తి నాలుగైదు వాటర్ ట్యాంకర్లను ఏర్పాటు చేసుకుని ఆ ట్యాంకర్లకు జలమండలి శాఖ స్టిక్కర్లు అంటించుకుని వేలాది రూపాయల జలమండలి ఆదాయానికి గండి కొడుతున్నాడు. కొన్ని రోజుల బంజారాహిల్స్ మేనేజర్‌కు ఫిర్యాదు రావడంతో ఓ బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్‌లో ఒకే ఒక్క ట్యాంకర్ ద్వారా నీటి సరఫరా జరుగుతున్నట్లు ఫిర్యాదు చేశాడు.
- జలమండలి పేరుతో అక్రమంగా నీటిసరఫరా జరుగుతున్నట్లు ఫిర్యాదులు రావడంతో బంజారాహిల్స్ పోలీసులు సైతం అక్కడ ఒకే ఒక్క ట్యాంకర్ ఉన్నట్లు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. నిజానికి ట్యాంకర్లపై జలమండలి అధికారులు, బంజారాహిల్స్ పోలీసులు ఎలాంటి విచారణ చేపట్టలేదని సమాచారం.

వ్యాపారం యథాతథం..

- ఎఫ్ఐఆర్ నమోదైన తర్వాత రెండు రోజులు ఖాళీగా ఉన్న సదరు వ్యక్తి తదానంతరం యధావిధిగా తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు. ఈ వ్యవహారమంతా.. జలమండలి అధికారుల కనుసన్నల్లోనే జరుగుతున్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జలమండలి సెక్షన్ కార్యాలయానికి కూతవేటు దూరంలోనే ఈ తతంగమంతా జరుగుతోందని సమాచారం. ఎవరికీ అనుమానం రాకుండా సంబంధిత వాటర్ ట్యాంకర్ నిర్వాహకులు సంబంధిత శాఖ పెయింటింగ్ ఉన్న వాటర్ ట్యాంకర్లను యథేచ్ఛగా తిప్పుతున్నాడనే వార్తలు వినిపిస్తున్నాయి.

నిర్మాణాల్లో ఉన్న భవనాల్లోనే అధికం...

- జలమండలిలో గతంలో పలు తప్పులు చేసిన డ్రైవర్లకు పనిష్మెంట్‌గా వారి వాహనాలను తొలగించగా.. వారు మాత్రం ఫిలింనగర్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్‌లలో నిర్మాణాల్లో ఉన్న భవనాల యజమానులతో మాట్లాడుకుని అక్కడున్న బోర్ల సాయంతో నీటిని ట్యాంకర్లలో నింపుకుని గుట్టుచప్పుడు కాకుండా నీళ్లను విక్రయిస్తున్నారు. ఈ డ్రైవర్లు తమకున్న పరిచయాలతో నిత్యం పెద్దఎత్తున ట్యాంకర్ల ద్వారా నీటిని విక్రయిస్తూ.. డబ్బులు దండుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. జలమండలి అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుండటం గమనార్హం.

అమ్మవారి తొట్టెలకు ప్రత్యేక పూజలు



పూజల్లో పాల్గొన్న విజయారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: గోల్కొండ కోటలో కొలువుదీరిన జగదాంబికా అమ్మవారికి ప్రతిఏటా బంజారాహిల్స్ రోడ్ నెం. 11లోని గౌరీశంకర్ కాలనీవాసులు ఘటాలు తీసుకెళ్లడం ఆనవాయితీగా వస్తుంది. ఈ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. వందలాదిగా తరలివచ్చిన బస్తీవాసులు ఈ ఊరేగింపులో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఖైరతాబాద్ కాంగ్రెస్ నేతలతో పాటు కార్పొరేటర్ విజయారెడ్డి ఈ ఊరేగింపులో పాల్గొని తొట్టెలకు పూజలు చేశారు. పోతరాజుల విన్యాసాలు, శివసత్తులతో ఈ కార్యక్రమం కన్నుల పండువగా సాగింది. గౌరీశంకర్ కాలనీ నుంచి గోల్కొండ కోట వరకు ఈ ఊరేగింపు నిర్వహించారు. దారి పొడవునా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌లోకి చేరికలు



బీఆర్ఎస్ పార్టీలో చేరిన అంబేద్కర్‌నగర్ బస్తీవాసులు

ఫిలింనగర్: జూబ్లీహిల్స్ డివిజన్ ఫిలింనగర్ రోడ్ నెం 9లోని అంబేద్కర్‌నగర్ బస్తీకి చెందిన బీజేపీ, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో బీఆర్ఎస్‌లో చేరారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఫిలింనగర్ బస్తీల్లో కోట్లాది రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామని వచ్చే ఎన్నికల్లో మరోసారి తనను ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. మహిళల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో పథకాలు అమలు చేస్తోందన్నారు. మహిళలు వందశాతం బీఆర్ఎస్ వైపే ఉన్నారని ఆశాభావం వ్యక్తం చేశారు. సీనియర్ నేత మామిడి నర్సింగ్‌రావు, విజయారెడ్డి, వెంకటేష్, మధు, రాజు, బుచ్చిలింగం, చంద్రమ్మ, పాలపద్మ, సువర్ణ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన ఉత్పత్తులకు ప్రజాదరణ

శ్రీనగర్‌కాలనీ: నాణ్యమైన ఉత్పత్తులను ప్రజాదరణ ఎప్పటికీ ఉంటుందని తక్కువ ధరలకు ఆల్కలీన్ వాటర్‌ను వినియోగదారులకు అందించడం శుభపరిణామమని ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఆదివారం శ్రీనగర్‌కాలనీలో కాయిన్ ఎర్త్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్–ఆక్సీలైఫ్ కార్పొరేట్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. సీఈఓ సునీల్‌కుమార్ సింగ్, డైరెక్టర్స్ వెంకటసుబ్బయ్య, యోగానందం పాల్గొన్నారు.



ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టిన బొలేరో వ్యాన్



రహమత్‌నగర్: రహమత్‌నగర్‌లో విద్యుత్ స్తంభాన్ని ఓ మినీ వ్యాన్ ఢీ కొనడంతో స్తంభం విరిగి పడగా.. పెను ప్రమాదం తప్పింది. రహమత్‌నగర్‌లో సరుకులతో వెళ్తున్న బొలేరో ట్రాలీ బంగారు మైసమ్మ లైన్‌లో ప్రమాదవశాత్తు విద్యుత్తు స్తంభాన్ని ఢీకొట్టింది. దీంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. సమాచారం అందుకున్న కార్పొరేటర్ సీఎన్ రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం అందించి మరమ్మత్తులు చేయించారు.

క్షతగాత్రుని కుటుంబానికి ఆర్థికసాయం



రహమత్‌నగర్: వడ్డెర కులస్తుల సమస్యల సాధన కోసం తమ సంఘం ఎల్లప్పుడు సహాయ సహకారాలు అందిస్తుందని వడ్డెర ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షుడు వేముల యాదయ్య పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదంలో క్షతగాత్రుడైన దండుగుల బాబయ్య కుటుంబానికి సంఘం తరపున ఆదివారం ఆర్థికసాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ట్రాక్టర్ డ్రైవర్‌గా తన కుటుంబాన్ని పోషించుకునే బాబయ్య ప్రమాదవశాత్తు ఓ స్కూల్ బస్సు ఢీకొనడంతో తీవ్రగాయాల పాలయ్యారని వాపోయారు. ఆయన పరిస్థితిని భార్య ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి వివరించినా.. స్పందించకపోవడం బాధకరమన్నారు. తమ సంఘం తరుపున బాధితులకు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ముద్దంగుల శేఖర్, మేఘన, పద్మ, నాగమణి, మల్లయ్య, రాజు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పేయింటర్ మృతి

ఫిలింనగర్: విద్యుదాఘాతంతో ఓ పేయింటర్ మృతి చెందిన ఘటన ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... జార్ఖండ్ గొడ్డా జిల్లా, హన్వార సమీపంలోని పర్సా గ్రామానికి చెందిన సోకత్(21) బతుకుదెరువు కోసం 4 ఏళ్ల క్రితం నగరానికి వచ్చి టోలీచౌకీ సమతాకాలనీలో స్నేహితులతో కలిసి అద్దెకు ఉంటున్నాడు. యాకత్‌పురాలోని ఇస్లామియా స్కూల్‌లో వాల్‌పెయింటర్‌గా పనిచేస్తున్న అతడు రెండురోజులుగా పనికిరాకపోవడంతో పాటు కాంట్రాక్టర్ ఫోన్ చేసినా స్పందించకపోవడంతో ఈ నెల 7 న సోకత్ ఇంటికి వచ్చాడు. స్నేహితులు ముగ్గురూ బక్రీద్ సందర్భంగా స్వగ్రామానికి వెళ్లగా.. సోకత్ ఒక్కడే ఇక్కడ ఉంటున్నాడని ఇంటి యజమాని చెప్పాడు. దీంతో అనుమానం వచ్చి ఇంటికి వెళ్లి చూడగా.. విగతజీవిగా కనిపించాడు. ఎయిర్‌కూలర్ వైర్‌కు కరెంట్‌షాక్ రావడంతో మృతి చెంది రెండు రోజులుగా విగతజీవిగానే ఉన్నాడు. ఎవరూ చూడకపోవడంతో అతడు మరణించిన విషయం బయటికి తెలియరాలేదు. వెంటనే విషయాన్ని మృతుడి సోదరుడు హకీంపేటలో నివసించే అహ్మద్ మన్సూరీకి తెలిపాడు. మన్సూర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిలింనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో యువకుడి మృతి

బంజారాహిల్స్: గుండెపోటుతో ఓ యువకుడు మృతి చెందిన ఘటన బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ... తూర్పుగోదావరి జిల్లా గన్నవరం రామాలయం స్ట్రీట్‌కు చెందిన కె. సత్యనారాయణ(33) బంజారాహిల్స్ రోడ్‌నెం. 10లోని స్టార్ ఆసుపత్రిలో ఐటీ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తూ.. సమీపంలోని ఓ రెసిడెన్సీలో నివసిస్తున్నాడు. శనివారం రాత్రి తన స్నేహితులతో మాట్లాడుతూ.. ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. ఆందోళన చెందిన స్నేహితులు వాచ్‌మెన్ సాయంతో వెంటనే ఆస్పత్రిలో చేర్పించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతుడి సోదరుడు కె.విజయ్ భాస్కర్‌రావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంబేడ్కర్ విగ్రహానికి ఎమ్మెల్సీ నివాళి



నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ కవిత

బంజారాహిల్స్: ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బంగారు బోనం సమర్పించేందుకు ఆదివారం ఉదయం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని తన నివాసం నుంచి భారీ ఊరేగింపుతో తరలివెళ్లారు. పెద్దఎత్తున కార్యకర్తలు బైక్‌ర్యాలీ నిర్వహించగా.. ఎమ్మెల్సీ వారిని అనుసరించి మహంకాళి అమ్మవారి గుడికి వెళ్లే క్రమంలో బంజారాహిల్స్ రోడ్‌నెం. 1లోని జీవీకే చౌరస్తాలోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఖైరతాబాద్ నియోజక వర్గానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలు పాల్గొన్నారు.

పిజ్జా క్రస్ట్‌లతో వినూత్న రుచులు



సాక్షి, సిటీబ్యూరో: నగరం వేదికగా పిజ్జా క్రస్ట్ ఆర్ట్‌తో ప్రసిద్ధిగాంచిన క్లౌడ్ కిచెన్ 'డో మామా' ఆధ్వర్యంలో మొదటి వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించింది. జూబ్లీహిల్స్‌లో 'డో మామా' పిజ్జా క్రస్ట్‌లను క్యూరేట్ చేయడంలో వినూత్న పరిశోధనలతో విభిన్న రుచులను పరిచయం చేసింది. ఈ సందర్భంగా వ్యవస్థాపకురాలు స్వాతిరెడ్డి గునుపాటి మాట్లాడుతూ.. అన్ని రకాల కాంటినెంటల్ ఫుడ్స్ సైతం లభించే హైదరాబాద్ నగరంలో వినూత్న రుచులను అందించాలంటే పెద్ద సాహసమే. ఇలాంటి తరుణంలో తమ పిజ్జా క్రస్ట్‌లతో నగరవాసులను సంతృప్తి పరుస్తున్నామన్నారు. కొత్త రుచులను ఆహ్వానించడంలో నగరవాసులు ఎల్లప్పుడూ ముందుంటారని ఆపరేషన్స్ మేనేజర్ శ్రావ్య చుండిరి పేర్కొన్నారు. ప్రముఖ చెఫ్ శ్రేయ తదితర ఆహార ప్రియులు పాల్గొన్నారు.

ఎస్పీఆర్ హిల్స్ క్వారీలో బోనాలు



అమ్మవారికి బోనాలు సమర్పిస్తున్న భక్తులు

రహమత్‌నగర్: ఎస్పీఆర్‌హిల్స్ క్వారీలోని అమ్మవారి బోనాలు వైభవంగా జరిగాయి. మహిళలు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. శివసత్తుల పూనకాలతో ఆలయం మార్మోగింది. ఆలయ కమిటీ ప్రతినిధులు ముద్దంగులు శేఖర్, మేఘన పద్మలు మాట్లాడుతూ.. స్వయంభూ వెలిసిన అమ్మవార్లకు ఎంతో ఘనచరిత్ర ఉందన్నారు. భక్తులు ఆలయ నిర్మాణానికి సహకరించాలని కోరారు. వడ్డెర ఐక్యవేదిక నాయకులు యాదయ్య, ముద్దంగుల ఎల్లయ్య, లక్ష్మి, మల్లయ్య, రాజు, నర్సింహ,రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

లిబర్టీ: పెరిగిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలకు అనుగుణంగా ఆటోమీటర్ చార్జీలు పెంచాలని ఆమ్‌ఆద్మీ పార్టీ ఆటో రిక్షా డ్రైవర్స్ యూనియన్ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షులు రుద్రాక్ష మల్లేష్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సీఎం కేసీఆర్, రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్, రవాణాశాఖ అధికారులు వెంటనే స్పందించి మీటర్ చార్జీలు పెంచుతూ.. జీవో జారీచేయాలని కోరారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఆటోమీటర్ చార్జీ రూ.20 ఉందని దాన్ని రూ.40కి పెంచాలని విన్నవించారు. ఎప్పుడు లేని విధంగా పెట్రోల్ ధర రూ.110, డీజిల్ ధర రూ.100, గ్యాస్ ధర రూ.60కి పైగా పలుకుతుందన్నారు. దాదాపు 10 ఏళ్ల క్రితం ఆటో చార్జీలు పెంచారే తప్పా.. తిరిగి పెంచలేదన్నారు. డ్రైవర్లకు ప్రస్తుతం ఉన్న చార్జీలు గిట్టుబాటు కావడం లేదని తెలిపారు. ఆటోలు కొనుగోలు చేసుకోవడానికి ప్రభుత్వం రుణాలు ఇప్పించి ఆదుకోవాలన్నారు. అర్హులైన డ్రైవర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని విన్నవించారు. డ్రైవర్లకు జీవితబీమా కల్పించాలని ఏపీ సీఎం ఇస్తున్న తరహాలోని ప్రతి ఆటోడ్రైవర్‌కు రూ.10 వేలు చెల్లించాలని కోరారు. సమావేశంలో ఫరూఖ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల సేవలు ఎనలేనివి: జస్టిస్ చంద్రకుమార్



బంజారాహిల్స్: డాక్టర్స్‌డేను పురస్కరించుకుని ఫిల్మ్‌నగర్‌లోని ఫిల్మ్ చాంబర్ ప్రివ్యూ థియేటర్‌లో వైద్యవృత్తిలో ప్రతిభ, సేవాభావం కలిగిన డాక్టర్లకు విశ్వగురు వరల్డ్ రికార్డ్స్ ఆధ్వర్యంలో ఎక్సలెన్స్ అవార్డులను ప్రదానం చేశారు. విశ్వగురు సంస్థ ఎండీ సత్యవోలు రాంబాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తమ వ్యక్తిగత జీవితాన్ని త్యాగం చేసి రోగులకు సేవచేసే వైద్యులు నిజంగా దేవుళ్లని ప్రశంసించారు. డాక్టర్ల సేవలను గుర్తించి వారిని సన్మానించిన విశ్వగురు సంస్థను అభినందించారు. ప్రముఖ గుండె వైద్య నిపుణులు డాక్టర్ రామచంద్ర, డాక్టర్ సారంగ పాణి, విజయభాస్కర్, ఎమ్ఆర్ఎస్ రాజు, డా.మహేష్ పగడాల, నంది అవార్డు గ్రహీత రాంకీ అతిథులుగా, అవార్డు గ్రహీతలుగా, డాక్టర్లు శ్రీనివాసప్రసాద్, కిరణ్‌మార్, జలజ, పద్మజ, సోమశేఖర్, స్రవంతి, యశోద, నరేశ్, కిశోర్, విశ్వగురు ప్రతినిధులు కృష్ణాది శేషు, యాదయ్యగౌడ్, పూజిత, సుబ్బారెడ్డి, తోట రామకృష్ణ, విజయకుమార్, రామకృష్ణ, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

మన సంస్కృతికి ప్రతీక బోనాలు

కవాడిగూడ: సంస్కృతి, సంప్రదాయాలకు బోనాల పండుగ ప్రతీకగా నిలుస్తుందని రాష్ట్రంలో జరిగే బోనాల, పండుగకు ఎంతో విశిష్టత ఉందని హరియాణా రాష్ట్ర గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆషాఢమాసంలో జరిగే బోనాల పండగను పురస్కరించుకుని ఆదివారం కవాడిగూడ కొత్తబజార్‌లో బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సురేష్‌ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉజ్జయిని మహంకాళి ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి బండారు దత్తాత్రేయ, బీజేపీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్, స్థానిక ఎమ్మెల్యే ముఠా గోపాల్, కార్పొరేటర్ రచనశ్రీ, మాజీ కార్పొరేటర్ రవీందర్, చిక్కడపల్లి ఏసీపీ యాదగిరి, గాంధీనగర్ సీఐ మోహన్‌రావు, ఎస్సై కావ్యలు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సురేష్‌ముదిరాజ్ వారిని శాలువాలతో ఘనంగా సత్కరించారు. పోతరాజుల నృత్యాలు, బోనాలు, ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ప్రీ ప్రైమరీ టీచింగ్ కోర్సు దరఖాస్తులకు ఆహ్వానం

చిక్కడపల్లి: కేంద్ర ప్రభుత్వంచే గుర్తింపు పొందిన సర్టిఫికేషన్ టెక్ విహాన్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో ప్రీ ప్రైమరీ టీచింగ్ శిక్షణ కోర్సుల్లో (రెగ్యులర్, కరస్పాండెంట్) చేరేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సెంటర్ డైరెక్టర్ కొంగర శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. చైల్డ్ సైకాలజీ, టీచింగ్ మెథడ్స్, చైల్డ్ హెల్త్‌కేర్, స్కూల్–అడ్మినిస్ట్రేషన్, మేనేజ్‌మెంట్, స్పోకెన్ ఇంగ్లీష్, కంప్యూటర్ కోర్సులు, ప్రాక్టికల్స్ అంశాల్లో 45 రోజుల పాటు క్రాష్ కోర్సులో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ అభ్యర్థులకు ఫీజుల్లో రాయితీ ఉంటుందన్నారు. ఎస్‌ఎస్‌సీ, ఇంటర్మీడియట్, డిగ్రీ అర్హత కలిగిన వారు ఈనెల 15 లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఆర్థికసాయం అందజేత

వెంగళరావునగర్: సృష్టిలో తల్లిని మించిన దైవం లేదని, ప్రతి ఒక్కరూ తల్లిదండ్రులను గౌరవించాలని టీ–హోప్ సంస్థ చైర్మన్ ఉపేందర్‌రెడ్డి అన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లోని సంస్థలో విధులు నిర్వహిస్తున్న రోజీ అనే మహిళా ఉద్యోగి తల్లి మేరీ హైడెన్ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ యాదగిరినగర్‌లోని ఆమె ఇంటికి వెళ్లి ఓదార్చి సానుభూతిని తెలియజేశారు. ఈ సందర్భంగా ఉపేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీ–హోప్ సంస్థ తమ ఉద్యోగులకు అండగా ఉంటుందన్నారు. అనంతరం ఆమెకు ఆర్థికసాయం అందజేశారు. మేరీ హైడెన్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

క్లుప్తంగా...

శ్రీవారి సర్వదర్శనానికి 24 గంటలు



ఆలయం వెలుపల జస్టిస్ ఏవీ రవీంద్రబాబు

తిరుమల: తిరుమలలోని క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్‌లు నిండిపోయి క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. శనివారం అర్ధరాత్రి వరకు 86,781 మంది శ్రీవారిని దర్శించుకుని హుండీలో రూ.3.47 కోట్లు వేశారు. టైంస్లాట్ టోకెన్లు ఉన్నవారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 24 గంటల్లో.. ఎస్‌ఈడీ టోకెన్లు ఉన్నవారికి 2 గంటల్లో దర్శనమవుతోంది. కాగా, శ్రీవారిని ఆదివారం ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు, తెలంగాణ మంత్రి సత్యవతి రాథోడ్ దర్శించుకున్నారు.

లంక భూములకు పట్టాలు

9 వేల ఎకరాలు..

19 వేల మందికి పైగా లబ్ధిదారులు

సాక్షి, అమరావతి: కృష్ణా, గోదావరి నదీ తీరంలో ఉన్న లంక భూములను సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలిచ్చేందుకు ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఎనిమిది జిల్లాల్లో ఉన్న కృష్ణా, గోదావరి లంకల్లోని 9,062 ఎకరాలకు సంబంధించిన 19 వేల మందికిపైగా ఈ పట్టాలు ఇవ్వనుంది. మంత్రివర్గ సమావేశంలో ఆమోదముద్ర వేయడమే తరువాయి. ఆ తర్వాత పట్టాల పంపిణీ ప్రారంభం కానుంది. ఏపీలోని నిరుపేదలకు 54 వేల ఎకరాలను పంపిణీ చేసేందుకు ఏర్పాట్లుచేస్తున్న విషయం తెలిసిందే. ఆ భూములతోపాటే లంక భూములను సాగుచేసుకుంటున్న రైతులకు డి-పట్టాలు ఇవ్వనున్నారు. ఈ భూములను మూడు కేటగిరీలుగా విభజించారు. గట్టుకు దగ్గరగా ఉండి వరద వచ్చినా కొట్టుకుపోని భూమిని ఏ-కేటగిరీగా.. వీటికి ఆనుకుని కొంత నదిలోకి ఉన్న భూమిని బి-కేటగిరీగా.. ఏ, బీ కేటగిరీకి ఆనుకుని వరదలొస్తే పూర్తిగా మునిగిపోయే భూమిని సీ-కేటగిరీగా విభజించారు. ఎ-కేటగిరీలో 475.93 ఎకరాలను 1,178 మందికి.. బి-కేటగిరీలో 848.22 ఎకరాలను 2,333 మందికి.. సి-కేటగిరీలో 7,738.25 ఎకరాలను 15,665 మందికి ఇవ్వాలని నిర్ణయించారు. ఇందుకు అసైన్‌మెంట్ కమిటీలు ఆమోదం కూడా తెలిపాయి.

గ్లోబల్ టూరిజం మ్యాపులో గండికోట

- సెవెన్ స్టార్ హోటల్ ఒబెరాయ్‌కి శంకుస్థాపన కార్యక్రమంలో ఏపీ సీఎం జగన్
- విశాఖ, తిరుపతిలో కూడా ఒబెరాయ్ గ్రూప్ హోటల్స్‌కు వర్చువల్‌గా శంకుస్థాపన

సాక్షి ప్రతినిధి, కడప: గ్రాండ్ కాన్యన్ ఆఫ్ ఇండియాగా పిల్చుకునే మన గండికోటను ప్రపంచానికి పరిచయం చేస్తున్నామని ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. వైఎస్సార్ జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గంలోని గండికోటలో ఆదివారం ఆయన ఒబెరాయ్ హోటల్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తిరుపతి, విశాఖపట్నం ఒబెరాయ్ హోటల్స్‌కు కూడా వర్చువల్‌గా శంకుస్థాపన చేసిన అనంతరం మాట్లాడారు. ఒక్క రోజే గండికోట, విశాఖపట్నం, తిరుపతితో కలిపి మూడు చోట్ల ఒబెరాయ్ హోటళ్ల నిర్మాణానికి శంకుస్థాపన కార్యక్రమాలు జరగడం సంతోషకరం అని చెప్పారు. ఒబెరాయ్ లాంటి గ్రూపు ఇక్కడకు వచ్చి.. సూపర్ లగ్జరీ సెవెన్ స్టార్ హోటల్ నిర్మాణం చేపడుతోందన్నారు. ఇలాంటి పెద్ద పెద్ద గ్రూపులు వచ్చి ఇలాంటి హోటల్స్ కడితే గండికోట గ్లోబల్ టూరిజం మ్యాప్‌లోకి చేరుతుందని తెలిపారు. ఈ ప్రాజెక్టుల వల్ల వైఎస్సార్ జిల్లా, గండికోట రెండూ అంతర్జాతీయంగా చోటు దక్కించుకుంటున్నాయని అన్నారు. ఈ సందర్భంగా సీఎం జగన్ ఇంకా ఏమన్నారంటే..

ఉద్యోగావకాశాలు విస్తృతం

- ఈ హోటల్ వల్ల ప్రత్యక్షంగా, పరోక్షంగా దాదాపు 500 నుంచి 800 మందికి ఉద్యోగ అవకాశాలు వస్తాయి. ఒబెరాయ్ ప్రాజెక్టు అనేది మిగిలిన ప్రాజెక్టులు రావడానికి ఒక దిక్సూచిగా ఉపయోగపడుతుంది. గండికోటలో ఇలాంటి గ్రూపు ప్రాజెక్టులు రావడానికి ఇంకా అవకాశం ఉంది. ఒబరాయ్ లాంటి ఇంకో గ్రూపుని తీసుకొచ్చే కార్యక్రమం ముమ్మరంగా చేస్తాం.
- ఇంతకుముందు విక్రమ్ ఒబెరాయ్‌తో మాట్లాడుతూ ఇక్కడ గోల్ఫ్ కోర్ట్ పెట్టే ఆలోచన చేస్తే హోటల్‌కు మంచిదని, ఈ ప్రాంతంలో ఉద్యోగ అవకాశాలు కూడా మెరుగవుతాయని.. ఈ హోటల్‌ను ఒక గోల్ఫ్ రిసార్ట్‌గా దేశానికి, ప్రపంచానికి పరిచయం చేసే అవకాశాలు ఉంటాయని చెప్పాను. ఆ దిశగా అడుగులు వేసేలా ఆలోచన చేస్తామన్నారు.
- జమ్మలమడుగు నియోజకవర్గంలో స్టీల్ ఫ్యాక్టరీ రావాలని కలలు కన్నాం. మన పిల్లలకు ఇక్కడే ఉద్యోగ అవకాశాలు రావాలని దశాబ్దాలుగా కన్న కలను నిజం చేస్తూ గతేడాది జిందాల్ గ్రూపుతో కలిసి ఆ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశాం. ఇందుకు సంబంధించిన వైఎస్సార్ స్టీల్ కార్పొరేషన్‌కు ఈ నెలలోనే ఎన్విరాన్‌మెంటల్ క్లియరెన్స్ వస్తుంది. ఆ తర్వాత రెట్టించిన వేగంతో పనులు జరుగుతాయి.
- రేపు కొప్పర్తిలో డిక్సన్ కంపెనీకి సంబంధించిన ప్లాంట్‌కు ప్రారంభోత్సవం చేస్తున్నాం. కొప్పర్తిలో డిక్సన్ గ్రూపు 1000కి పైగా ఉద్యోగాలు ఇచ్చింది. మరో రెండు నెలల్లో ఇంకో 1000 ఉద్యోగాలు రాబోతున్నాయి. చానల్ ప్లే అనే మరో కంపెనీ హోం ఆడియో సిస్టమ్స్ తయారు చేస్తుంది. రేపు కొప్పర్తిలో ఆ కంపెనీతో ఎంఓయూపై సంతకాలు చేయనున్నాం. ఈ కంపెనీ ద్వారా 150 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.
- ఎల్‌ఈడీ టీవీలు, ఎలక్ట్రానిక్ ప్రొడక్ట్స్ తయారు చేసే టెక్నో డామ్ ఇండియా అనే మరో కంపెనీతో కూడా రేపు ఎంఓయూ చేయబోతున్నాం. ఈ కంపెనీ ద్వారా మరో 200 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి.



సెవెన్ స్టార్ హోటల్ ఒబెరాయ్‌కి శంకుస్థాపన చేస్తున్న సీఎం జగన్, చిత్రంలో విక్రమ్ ఒబెరాయ్

> ప్రస్తుతం దేశంలో పర్యాటకం కీ రోల్ పోషిస్తోంది. దీనిని దృష్టిలో ఉంచుకొని ఒక దార్శనికతతో తన డైనమిక్ లీడర్‌షిప్‌తో సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని పర్యాటక రంగం అభివృద్ధి చెందుతోంది. ఇందులో మమ్మల్ని భాగస్వాములను చేస్తున్నందుకు కృతజ్ఞతలు. ప్రపంచ స్థాయి సెవెన్ స్టార్ రిసార్ట్స్‌ను, మంచి రూమ్స్, ఆహ్లాదకరమైన వాతావరణంలో ఏర్పాటు చేస్తాం. ఏపీలో హోటల్స్ స్థాపించడం వల్ల ఇక్కడి వారికి ఉపాధి ఇవ్వగలుగుతాం. ప్రఖ్యాతిగాంచిన ఈ గండికోటలో మంచి సౌకర్యాలతో లగ్జరీ సెవెన్ స్టార్ రిసార్ట్‌ను ఏర్పాటు చేస్తున్నాం. తిరుపతి, వైజాగ్‌లో కూడా హోటల్స్‌ను ప్రారంభిస్తాం. 2025కు ఈ హోటల్స్ ప్రారంభమవుతాయి.
>
> – విక్రమ్‌సింగ్ ఒబెరాయ్, ఒబెరాయ్ హోటల్స్ సీఈవో

‘తానా’లో బాహాబాహి

- ‘జై ఎన్టీఆర్’ నినాదాల కలకలం
- తన్నుకున్న లోకేశ్, జూ.ఎన్టీఆర్ వర్గాలు
- చొక్కాలు పట్టుకుని.. కర్రలు విసురుకుంటూ

పెన్సిల్వేనియా(అమెరికా): అమెరికాలో ‘తానా’(ఉత్తర అమెరికా తెలుగు సంఘం) సభల సందర్భంగా జూనియర్ ఎన్టీఆర్, లోకేశ్ వర్గాలు పరస్పరం తన్నుకున్నాయి. రెండుగా చీలిపోయిన టీడీపీ ఎన్నారై సభ్యులు పిడిగుద్దులు గుద్దుకున్నారు. తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాలు పరస్పరం చొక్కాలు పట్టుకుని మరీ దాడులకు దిగాయి. టీడీపీ ఎన్నారై అధ్యక్షుడు కోమటి జయరాం సమక్షంలోనే ఈ ఘటన జరిగింది. ఈ ఘర్షణకు ప్రధాన కారణం లోకేష్ నాయకత్వంపై వ్యక్తమైన విమర్శలే కారణమని తెలుస్తోంది. ఈ సమావేశాల సందర్భంగా కొందరు తెలుగు తమ్ముళ్లు ‘జై ఎన్టీఆర్’ అని నినదించడంతో ఉలిక్కిపడ్డ చంద్రబాబు వర్గం దాడులకు తెగబడినట్లు తెలుస్తోంది. పార్టీ పగ్గాలు చంద్రబాబు చేతిలో ఉన్నంతవరకు టీడీపీకి మనుగడ లేదని, 2024లోనూ మరోసారి పరాజయం ఖాయమని కొందరు వాదించినట్లు సమాచారం. తనను తాను మూర్ఖుడిగా చెప్పుకునే లోకేష్‌కు బదులుగా జూనియర్ ఎన్టీఆర్‌కు పార్టీ పగ్గాలను అప్పగించాలని ఓ వర్గం డిమాండ్ చేసింది. దీంతో కలవరం చెందిన చంద్రబాబు వర్గం దాడులకు దిగినట్లు తెలిసింది. అమెరికాలో సుదీర్ఘ చరిత్ర కలిగిన తానాకు ఈ ఘటన మాయని మచ్చలా మిగిలింది.

కర్రలు విసురుకుంటూ..

పెన్సిల్వేనియాలో తానా 23వ మహాసభలను ఘనంగా ప్రారంభించారు. మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, రిటైర్డ్ సీజేఐ జస్టిస్ ఎన్వీ రమణ, తెలంగాణ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తదితరులు ఈ వేడుకలను ప్రారంభించారు. తొలిరోజు బాంకెట్ డిన్నర్ ముగిసిన అనంతరం తానాలోని కొందరు ప్రముఖులు కన్వెన్షన్ సమీపంలోని హాలులో కలుసుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీకి సంబంధించిన అంశాలపై తరని పరుచూరి, సతీష్ వేమన వర్గాల మధ్య వివాదం రేగడంతో ముష్టి యుద్ధానికి దిగాయి. వివాదం శృతి మించడంతో కొందరు అందుబాటులో ఉన్న కర్రలను విసిరారు. ప్రతిష్టాత్మక తానా సంస్థను రాజకీయ సంస్థగా మార్చిన ఘనత చంద్రబాబుదేననే విమర్శలున్నాయి. నిధుల సేకరణ కోసం తానాను ఆయన కామధేనువులా మార్చుకున్నారు.



శ్రీకాళహస్తిలో ఘోర ప్రమాదం

- లారీని ఢీకొట్టిన కారు
- ఆరుగురు మృతి.. మరొకరికి తీవ్ర గాయాలు

శ్రీకాళహస్తి (తిరుపతి జిల్లా): తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి సమీపంలోని మిట్టకండ్రిగ వద్ద ఆదివారం మధ్యాహ్నం ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. లారీని ఓవర్‌టేక్ చేసిన కారు ఎదురుగా వస్తున్న మరో లారీని ఢీకొంది. ఈ దుర్ఘటనలో విజయవాడకు చెందిన ఆరుగురు మృత్యువాతపడగా.. ఓ యువకుడు తీవ్రగాయాలతో మిట్టకండ్రిగ వద్ద ఆస్పత్రి పాలయ్యాడు. సీఐ అంజు యాదవ్ కథనం ప్రకారం.. విజయవాడ కృష్ణలంకలోని బాలాజీ టవర్స్ 304 ప్లాట్‌లో ఉంటున్న తుంగల రమేష్‌బాబు, ఆయన భార్య రాజ్యలక్ష్మి(40), కుమారుడు భరత్(ఇంటర్), విజయవాడ సమీపంలోని ఉయ్యూరులో ఉంటున్న రాజ్యలక్ష్మి అక్క శ్రీలత(42), కృష్ణలంక ప్రాంతంలోని బాలాజీనగర్ పోలీస్ కాలనీలో ఉంటున్న రాజ్యలక్ష్మి స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్ష్య(17)లు కారులో శుక్రవారం రాత్రి తిరుమలకు బయలుదేరారు. శనివారం శ్రీవారిని దర్శించుకున్నారు. ఆదివారం వేకువజామున తిరుగుపయనమయ్యారు. శ్రీకాళహస్తి రెండు కిలోమీటర్ల దూరం ఉందనగా.. మిట్టకండ్రిగ వద్ద రమేష్‌బాబు నడుపుతున్న కారు ఓ లారీని ఓవర్‌టేక్ చేసి ఎదురుగా వస్తున్న మరో లారీని వేగంగా ఢీకొట్టింది. కారు నడుపుతున్న తుంగల రమేష్‌బాబు, భార్య రాజ్యలక్ష్మి(40), ఆమె అక్క శ్రీలత(42), స్నేహితురాలు రమణి(38), ఆమె భర్త మూర్తి(47), కుమార్తె అక్ష్య(17) అక్కడికక్కడే మృత్యువాతపడ్డారు. ఇంటర్మీడియెట్ చదువుతున్న తుంగల భరత్ ఒక్కడే తీవ్ర గాయాలపాలై ప్రాణాలతో బయటపడ్డాడు. మృతదేహాలను కారులోంచి బయటకు తీసేందుకు రెండు గంటలపాటు శ్రమించాల్సి వచ్చింది. డ్రైవింగ్ చేస్తున్న రమేష్ మృతదేహం ఎంతకీ రాకపోవడంతో క్రేన్ సహాయంతో వాహనాన్ని పక్కకు తొలగించి ఆపై కట్టర్లతో కారు డోరును కత్తిరించాల్సి వచ్చింది. అతివేగమే ప్రమాదానికి కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు.



శ్రీకాళహస్తి వద్ద ఢీకొన్న కారు, లారీ

దేశంలో బీసీలను ఆదరిస్తున్న ఏకైక సీఎం జగనే..

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్.కృష్ణయ్య



నరసరావుపేట: దేశంలో బీసీలకు అధికారం కల్పించి వారిని ఆదరిస్తున్న ఏకైక సీఎం వైఎస్ జగన్ ఒక్కరేనని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య చెప్పారు. దేశ ప్రధానిగా నరేంద్ర మోదీతో పాటు ఎన్నో రాష్టాలకు బీసీలు సీఎంలుగా ఉన్నా వారు బీసీలకు చేయలేని మేలు సీఎం జగన్ ఏపీలో చేశారని కొనియాడారు. నరసరావుపేట టౌన్‌హాల్లో ఆదివారం నిర్వహించిన పల్నాడు బీసీ సంక్షేమ సంఘం ఆత్మీయ సమావేశానికి కృష్ణయ్య ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీఎం జగన్ అడక్కుండానే బీసీలకు అన్నీ ఇస్తున్నారని ప్రశంసించారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు, కర్ణాటక, ఛతీస్‌గఢ్ లాంటి రాష్ట్రాల్లో పర్యటిస్తే సీఎం జగన్ విలువ తెలుస్తుందన్నారు. కర్ణాటకలో సిద్ధరామయ్య, తమిళనాడులో స్టాలిన్, చతీస్‌ఘడ్ రాష్ట్రాల్లో బీసీలే సీఎంలు, మంత్రులుగా ఉన్నా అక్కడ అమ్మ ఒడి లేదన్నారు. ఉత్తరప్రదేశ్, బిహార్, పశ్చిమ బెంగాల్ తిరిగానని, పశ్చిమబెంగాల్లో గురుకులాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్, అమ్మ ఒడి వంటి పథకాలు లేవని చెప్పారు. బీసీ కులాల పిల్లలు అడుక్కు తినే స్థితిలో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఛతీస్‌ఘడ్‌లో హాస్టళ్లు, గురుకులాలు, స్కాలర్‌షిప్‌లు లేవని, బీసీ వర్గీయులు అందరూ కూలి పని, భిక్షాటన చేసుకుని జీవిస్తున్నారని తెలిపారు. అనేక రాష్ట్రాల్లో బీసీ కులాలను చదవనీయకుండా కుట్ర జరుగుతోందని, ఇక్కడ సీఎం జగన్ మాత్రం బీసీలు చదువుకుంటేనే గొప్పవారవుతారని, పేదరికం తగ్గుతుందని వారికోసం ఎన్నో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీ బీసీలను కేవలం ఓటు బ్యాంకుగానే చూసిందని విమర్శించారు.

నగర వార్తలు

నగరంలో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐలకు హెల్త్‌కార్డులు ఇవ్వాలి

గోల్కొండ: దశాబ్దాల పాటు గల్ఫ్ దేశాలలో పని చేసి నగరంలో స్థిరపడ్డ ఎన్‌ఆర్‌ఐలకు ప్రభుత్వం హెల్త్‌కార్డు ఇవ్వడంతో పాటు ఇతర సౌకర్యాలు కల్పించాలని ఎన్‌ఆర్‌ఐల తెలంగాణ రాష్ట్ర సంఘం అధ్యక్షుడు డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ కోరారు. ఆదివారం టోలిచౌకి సాలార్జంగ్ కాలనీలోని స్వాప్ కిడ్నీ సెంటర్‌లో ఎన్‌ఆర్‌ఐల జంట నగరాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు ఎన్‌ఆర్‌ఐలు తాము గల్ఫ్‌లో పడ్డ కష్టాలు, చేసిన ఉద్యోగాలను నెమరవేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ నియాజ్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ, ఎన్‌ఆర్‌ఐల్లో ఎక్కువ శాతం సౌదీ అరేబియాలోనే పని చేశారన్నారు. వారు సంపాదించిన డబ్బును హైదరాబాద్‌లోనే పెట్టుబడి పెట్టి పలువురికి ఉపాధి కల్పించడంతో పాటు రాష్ట్రాభివృద్ధికి కృషి చేశారన్నారు. త్వరలోనే తాము ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ను కలిసి ఎన్‌ఆర్‌ఐలు చేస్తున్న సేవలను వివరిస్తామన్నారు. సమావేశంలో జియా ఉర్ రహమాన్, డాక్టర్ మహ్మద్ షోయబ్ అహ్మద్ ఖాన్, డాక్టర్ మహ్మద్ ఆకిబ్ అహ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం

నాంపల్లి: ములకనూరు ప్రజా గ్రంథాలయం సంస్థ నిర్వహించిన జాతీయ స్థాయి కథల పోటీలు-2022 విజేతలకు బహుమతుల ప్రదానోత్సవం ఆదివారం రాత్రి పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలోని నందమూరి తారక రామారావు కళా మందిరంలో జరిగింది. ఈ సందర్భంగా జరిగిన సభకు తెలుగు విశ్వవిద్యాలయం ఉపాధ్యక్షుడు ఆచార్య తంగెడ కిషన్ రావు అధ్యక్షత వహించారు. వరంగల్ అర్బన్ జిల్లా పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ మారపల్లి సుధీర్ కుమార్ సీఆర్‌ఈడీఏఐ (క్రెడాయ్) అధ్యక్షుడు పి.రామకృష్ణారావు, ములకనూరు సర్పంచ్ మాడుగుల కొమురయ్య, సినీ దర్శకుడు యెల్దండి వేణు అతిథులుగా హాజరయ్యారు. అనంతరం కథల పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ హైదరాబాద్ జాయింట్ ఇన్‌స్పెక్టర్ జనరల్ వేముల శ్రీనివాసులు, వంగ రవి పాల్గొన్నారు.



బహుమతి ప్రదానం చేస్తున్న ఆచార్య తంగెడ కిషన్ రావు

రూ.10 వేలు ఇస్తే రూ.లక్ష సాయం పక్కా!

- ఒకవైపు దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ
- మరోవైపు ముందస్తు వసూళ్లకు తెరలేపిన స్థానిక ప్రజాప్రతినిధుల అనుచరులు
- దళారులను నమ్మొద్దంటున్న అధికారులు

సాక్షి,సిటీ బ్యూరో: బీసీ చేతి, కుల వృత్తిదారులకు వంద శాతం సబ్సిడీతో కూడిన రూ.లక్ష సాయం పొందేందుకు వసూళ్ల దందా మొదలైంది. ఏకంగా స్థానిక ప్రజాప్రతినిధుల అనుచరులే దళారుల అవతారమెత్తి ముందస్తుగా తమకు పది శాతం ముట్టజెప్పితే ఆర్థిక సాయం పక్కా అంటూ గాలం వేస్తున్నారు. రూ.10 వేలు ఇస్తే జాబితాలో పేరు ఖాయమని, లేకుంటే అంతే అంటున్నారనే ప్రచారం సాగుతోంది. తెలంగాణ దశాబ్ది వేడుకల సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష సాయం కోసం గతనెల 6 నుంచి 20వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించారు. గడువు తక్కువగా ఉండటంతో సగానికి పైగా చేతి, కుల వృత్తిదారులు దరఖాస్తు చేసుకోలేకపోయారు. తాజాగా నిర్ణీత గడువులోగా అందిన దరఖాస్తులపై ఒకవైపు క్షేత్ర స్థాయి విచారణ జరుగుతుండగా, మరోవైపు స్థానిక ప్రజాప్రతినిధుల అనుచరులు దరఖాస్తుదారుతో బేరసారాలకు దిగుతున్నారు. మీ సేవా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు అనంతరం తీసుకున్న వాటి ప్రతులను పరిశీలిస్తూ రూ. లక్ష కావాలంటే పది శాతం కమీషన్ తప్పదని పేర్కొంటున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు.

గ్రేటర్‌లో 60 వేల దరఖాస్తులు

గ్రేటర్ హైదరాబాద్ నుంచి సుమారు 65 వేలకు పైగా చేతి, కులవృత్తిదారులు దరఖాస్తు చేసుకున్నారు. అందులో హైదరాబాద్ నుంచి 20,724, మేడ్చల్ నుంచి 22 వేల 87 మంది, రంగారెడ్డి జిల్లా నుంచి సుమారు 20 వేలకు పైగా దరఖాస్తులు అందినట్లు బీసీ సంక్షేమ శాఖ అధికార గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. వాటిపై క్షేత్ర స్థాయి విచారణ కొనసాగుతోంది. ఈ నేపథ్యంలోనే స్థానిక ప్రజాప్రతినిధుల అనుచరులు దళారుల అవతారమెత్తినట్టు తెలుస్తోంది.

దళారులను నమ్మొద్దు

రూ. లక్ష చేయూత విషయంలో దళారులను నమ్మొద్దని బీసీ సంక్షేమ శాఖ అధికారులు పేర్కొంటున్నారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది దరఖాస్తుదారుడి ఇంటికి వచ్చి పరిశీలన జరుపుతారన్నారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పత్రాలను ఎక్కడా సమర్పించాల్సిన అవసరం లేదని, సిబ్బంది పరిశీలనకు వచ్చినప్పుడు చూపిస్తే సరిపోతుందన్నారు. చేయూతకు ఎంపికైన వారికి ఫోన్ లేదా ఎస్‌ఎంఎస్ సమాచారం వస్తుందని తెలిపారు.

వృద్ధులకు సేవ చేయడం ప్రశంసనీయం

గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

రసూల్‌పురా: కరోనా విపత్కర పరిస్థితుల్లో సొంత పిల్లలే తమ తల్లిదండ్రులను రోడ్లపై వదిలివేసిన సందర్భాలు ఉన్నాయని, అలాంటి పరిస్థితుల్లో ఏ ఆధారం లేని వృద్ధులను ఆర్‌కే ఫౌండేషన్ చేరదీసి సపర్యలు చేసి, వైద్య సేవలు అందించడం ప్రశంసనీయమని రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందర రాజన్ అన్నారు. ఆదివారం కంటోన్మెంట్ క్లాసిక్ గార్డెన్‌లో నిర్వహించిన ఆర్‌కే ఫౌండేషన్ 15వ వార్షికోత్సవానికి గవర్నర్ తమిళిసై ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వృద్ధులకు సేవ చేయడం అంటే సాధారణ విషయం కాదని, ఆర్కే ఫౌండేషన్‌ను ఏర్పాటు చేసిన డాక్టర్ రామకృష్ణ మదర్ థెరిసా వృద్ధాశ్రమాన్ని స్థాపించి అందిస్తున్న సేవలు అభినందనీయమన్నారు. డాక్టర్ చదివిన వారు సంపాదనకు ప్రాధాన్యమిస్తున్న నేటి రోజుల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలకు రామకృష్ణ పూనుకొని ఇతరులకు మార్గదర్శకుడిగా నిలుస్తున్నారన్నారు. అనంతరం బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జ్ మురళీధర్ రావు మాట్లాడుతూ, ఇలాంటి సేవా కార్యక్రమాలకు తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మానవ హక్కుల కమిషన్ చైర్మన్ జస్టిస్ చంద్రయ్య, పద్మశ్రీ అవార్డు గ్రహీత హనుమాన్ చౌదరి, ఫౌండేషన్ మేనేజర్ నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న గవర్నర్ తమిళిసై సౌందర రాజన్

కుల, మత దురహంకార హత్యల నిరోధక చట్టం తేవాలి

జస్టిస్ బి.చంద్రకుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జస్టిస్ చంద్రకుమార్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: కుల, మత దురహంకార హత్యలపై పాలకులు మౌనం వీడాలని హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ బి.చంద్రకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో కేవీపీఎస్, టీపీఎస్‌కే ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశంలో జస్టిస్ బి.చంద్రకుమార్ మాట్లాడుతూ, కుల, మత దురహంకార హత్యల నిరోధానికి ప్రత్యేక చట్టం తేవాలన్నారు. ప్రేమించి పెళ్లి చేసుకున్న దంపతులకు ప్రభుత్వం రక్షణ కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై జరుగుతున్న దాడులపై మానవ హక్కుల కమిషన్, మహిళా కమిషన్లు స్పందించకపోవడం బాధాకరమన్నారు. కార్యక్రమంలో కేవీపీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.స్కైల్యాబ్‌బాబు, టీపీఎస్‌కే ప్రతినిధులు భూపతి వెంకటేశ్వర్లు, జి.రాములు, ఎస్‌పీకే కార్యదర్శి ఎస్.వినోద్‌కుమార్, కేఎన్‌ఎస్ గౌరవ అధ్యక్షుడు గట్టు జోత్స్న, వాహిద్, జి.బుచ్చిరెడ్డి, నరేష్, అలివేలుమంగ తదితరులు పాల్గొన్నారు.

దేశం తలదించుకునేలా బీజేపీ పాలన

- సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ



సదస్సులో మాట్లాడుతున్న సుభాషిణి అలీ

చాంద్రాయణగుట్ట: కేంద్రంలోని బీజేపీ పాలన దేశం తలదించుకునేలా ఉందని సీపీఎం పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణి అలీ ఆరోపించారు. ఆదివారం జంగంమెట్‌లో జరిగిన సీపీఎం సౌత్‌జోన్ జిల్లా సెమినార్‌లో ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గుజరాత్‌లో బిల్కిస్ బానో కేసులో జీవితఖైదు అనుభవిస్తున్న నిందితులను ఆగస్టు 15న కేంద్రం విడుదల చేయడం మనుస్మృతిని అమలు చేయడంలో భాగంగానే చూడాలని అన్నారు. మోదీ పాలనలో రాజ్యాంగాన్ని పూర్తిగా పక్కన పెట్టేస్తున్నారని, ఇది దేశ ప్రజలను మోసగించడమేనని అన్నారు. అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం పనికి మాలినదని బీజేపీ నేతలు ఉపన్యాసాలు ఇస్తున్నారని, ఇలాంటి వారిని బస్తీల్లోకి రాకుండా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. సదస్సులో చాంద్రాయణగుట్ట జోన్ సీపీఎం కన్వీనర్ ఎల్.కోటయ్య, నాయకులు ఎ.కృష్ణ, సీపీఎం సౌత్ జిల్లా నాయకులు జి.విఠల్, ఎం.మీన, పి.నాగేశ్వర్, ఎస్.కిషన్, ఎం.లక్ష్మమ్మ, ఎం.బాలు, బాబర్‌ఖాన్, అబ్దుల్ సత్తార్, రాంకుమార్, శ్రావణ్ కుమార్, నూర్జహాన్, జంగయ్య, కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

టీ హబ్‌ను సందర్శించిన కిర్గిస్థాన్ ఉపప్రధాని



టీ హబ్‌ను సందర్శించిన కిర్గిస్థాన్ ఉపప్రధాని ఎడిల్‌బైసలోవ్ తదితరులు

రాయదుర్గం: నగరంలోని నాలెడ్జి సిటీలోని టీ హబ్‌ను కిర్గిస్థాన్ ఉప ప్రధాని ఎడిల్‌బైసలోవ్, ఆయనతో వచ్చిన ప్రతినిధుల బృందం ఆదివారం సందర్శించింది. ఈ సందర్భంగా రాష్ట్ర ఐటీశాఖ ముఖ్య కార్యదర్శి జయేష్‌రంజన్, టీహబ్ సీఈఓ మహంకాళి శ్రీనివాసరావు, తెలంగాణ అకాడమీ ఫర్ స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) సీఈఓ శ్రీకాంత్‌సిన్హాలతో ఉపప్రధాని, ప్రతినిధుల బృందం సమావేశమైంది. ఈ సందర్భంగా కజకిస్థాన్ గౌరవ కాన్సుల్ డాక్టర్ మీర్ నాసిర్‌అలీఖాన్ వారికి సహకారం అందించారు. అనంతరం టాస్క్, టీ హబ్ పనితీరు, జరుగుతున్న కృషిపై ప్రజెంటేషన్ ఇచ్చారు. పలు అంశాలపై చర్చించి పరస్పరం సహకరించుకోవాలని కిర్గిస్థాన్, తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించాయి. ఒకరోజు పర్యటన కోసం నగరానికి వచ్చిన కిర్గిస్థాన్ ఉప ప్రధాని, ప్రతినిధుల బృందం టీ హబ్‌ను కూడా సందర్శించి అందులోని సౌకర్యాలు, స్టార్టప్‌లు, ఇతర అంశాలను అడిగి తెలుసుకుంది.

డాక్టర్ గంజి భాగ్యలక్ష్మికి ఇంటర్నేషనల్ హై-ఫై అవార్డు

సాక్షి, సిటీబ్యూరో: మదర్ ఇండియా బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ అందించే ఇంటర్నేషనల్ హై-ఫై అవార్డును నల్గొండ పట్టణంలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల జువాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి అందుకున్నారు. నగరంలోని శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వేదికగా ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆమెకు పురస్కారాన్ని ప్రదానం చేశారు. డాక్టర్ గంజి భాగ్యలక్ష్మి ‘విద్యావేత్తగా సామాజిక స్పృహ, ప్రేరణ కలిగించే రచనలతో పాటు మోటివేషనల్ స్పీచ్‌లతో తాను అందిస్తున్న సామాజిక సేవలకు గాను ఈ అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ, అవార్డ్ తన సామాజిక బాధ్యతను మరింత పెంచిందన్నారు. తన కృషిని గుర్తించి అవార్డ్ అందించిన సంస్థకు ధన్యవాదాలు తెలిపారు.



వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

పంజగుట్ట: తెలంగాణ ప్రభుత్వం వెంటనే వైశ్య కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని వరల్డ్ వైశ్య మహాసభ గ్లోబల్ అధ్యక్షుడు టంగుటూరి రామకృష్ణ డిమాండ్ చేశారు. అన్ని కులాలకు సాయం చేస్తున్న ప్రభుత్వం..వైశ్యులకు మాత్రం మొండి చేయి చూపిస్తోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు గౌరిశెట్టి మునిందర్‌తో కలిసి విలేకరులతో మాట్లాడారు. అటు రాజులకాలం నుంచి ఇప్పటి వరకు సమాజసేవలో వైశ్యుల పాత్ర ఎంతో ఉందని, కానీ ప్రస్తుతం వైశ్యులు ఇటు రాజకీయంగా, అటు ఆర్థికంగా చాలా వెనుకబడిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 51 మంది వైశ్యులు ఎమ్మెల్యేలు ఉంటే, ప్రస్తుతం పార్టీకి ఒక్కరు కూడా లేకుండా పోయారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ వైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్టు తెలంగాణ ప్రభుత్వం కూడా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. లేకుంటే అన్ని వైశ్య సంఘాలను ఐక్యం చేసి వైశ్య కార్పొరేషన్ సాధన సమితి ఏర్పాటు చేసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో గ్లోబల్ కోశాధికారి ఎల్‌వీ కుమార్, గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ విభాగం అధ్యక్షుడు ఎంఆర్ గుప్తా, సీనియర్ సిటీజన్ బాబూరావు, శ్రీనివాస్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

‘మనూ’లో ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్ ప్రారంభం

రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో ఇంటిగ్రేటెడ్ బీఈడీ ప్రోగ్రామ్‌ను ప్రారంభించినట్టు డైరెక్టరేట్ ఆఫ్ అడ్మిషన్స్ డైరెక్టర్ ఎం.వనజ ఆదివారం తెలిపారు. కొత్త విద్యావిధానం -2020కు అనుగుణంగా నేషనల్ కామన్ ఎంట్రెన్స్ టెస్ట్ (ఎన్‌సీఈటీ) ద్వారా నాలుగేళ్ల ఇంటిగ్రేటెడ్ టీచర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (ఐటీఈపీ)ను ప్రారంభించామన్నారు. బీఏ, బీఎస్సీ, బీకామ్ కోర్సులు చేసిన వారికి బీఈడీలో 50 సీట్ల చొప్పున అందుబాటులో ఉంటాయన్నారు. నేషనల్ టెస్టింగ్స్ ఏజెన్సీ నిర్వహించే ఎన్‌సీఈటీలో సాధించిన స్కోర్ ఆధారంగా అడ్మిషన్లు ఉంటాయన్నారు. అభ్యర్థులు 19 జూలై వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ప్రాస్పెక్ట్స్ యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచామని చెప్పారు.



సహృదయం.. సామరస్యం.. ద్వేష రాహిత్యం

అథర్వ వేదపాఠం అయిన సాంమనస్య సూక్తం ఎప్పటి నుంచో 'సహృదయం సాంమనస్యం అవిద్వేషం కృణోమి వః' అనీ, 'అన్యో అన్యమభి హర్యత వత్సం జాతమివాఘ్న్యా' అనీ ఘోషిస్తూనే లేదా చాటిస్తూనే ఉంది. అంటే సహృదయులుగానూ, సామరస్యంతోనూ లేదా ఏకమనస్కులుగానూ, ద్వేషరహితులుగానూ మిమ్మల్ని రూపొందిస్తాను అనీ, అప్పుడే పుట్టిన దూడను తల్లి ఆవు ప్రేమించేట్టుగా పరస్పరం ప్రేమించుకోవాలి అనీ అర్థం. ఈ మాటల్ని మనం అర్థం చేసుకోనేలేదు. అందుకే మనలో అపాయం అతిగా వ్యాపిస్తూనే ఉంది. ఈ పరిస్థితిని మనం వెనువెంటనే పరిష్కరించుకోవాలి.

ప్రపంచం, దేశం, సమాజం వీటికి తొలిదశ ఇల్లు. ఒక ఇంట్లోని వ్యక్తుల మధ్య సంబంధాలు ఎలా ఉండాలో తెలియజేస్తూ సాంమనస్య సూక్తం 'అనువ్రతః పితుః పుత్రో మాత్రా భవతు సంమనాః' అనీ, 'జాయా పత్యే మధుమతీమ్ వాచమ్ వదతు శాన్తివామ్' అనీ చెబుతోంది. అంటే ఒక కొడుకు తన తండ్రిని అనుసరించే వాడుగానూ, తన తల్లితో సామరస్యంతోనూ ఉండాలి, భార్య భర్తతో మధురమైనదై ప్రశాంతతను ఇచ్చే మాటల్ని చెప్పనీ అని అర్థం. ఒకరిని ఒకరు వెన్నంటి ఉండడం, ప్రశాంతత, హితవచనం ఇవి ఇంటి నుంచే మొదలు అవ్వాలి.

ద్వేషరాహిత్యం అన్నది కూడా ఇంటి నుంచే రావాలి అని తెలియజేస్తూ సాంమనస్య సూక్తం 'మా భ్రాతా భ్రాతరం దద్విక్షన్మా స్వసారముత స్వసా' అనీ, సమ్యఞ్చః సవ్రతా భూత్వా వాచం వదత భద్రయా' అనీ చెబుతోంది. అంటే సోదరీ సోదరులు ద్వేషించుకోకూడదు, కలిసికట్టుగా పనిచెయ్యండి, అందరూ శుభం కలిగించే మాటల్ని పలకండి అని అర్థం.

> 'భారతీయ వైదిక సాహిత్యం సహృదయత, సామరస్యం, ద్వేషరాహిత్యం వీటితో మానవులు మెలగాలని ప్రగాఢంగా ప్రవచించింది. దాన్ని మనం అర్థం చేసుకుని ఆచరణలోకి తెచ్చుకోవాలి. అది జరగకపోతే మన జీవితాలు అనర్థదాయకమూ, అల్లకల్లోలమూ అయిపోతాయి'.

అభిప్రాయ భేదాలతో ఒక ఇంట్లోని సభ్యులు పరస్పరం ద్వేషించుకుంటూ విడిపోవడం కాదు ఉమ్మడిగా ఉండడానికి వాళ్ల మధ్య అవగాహన ఉండాలి అని తెలియజేస్తూ సాంమనస్య సూక్తం 'యేన దేవా న వియన్తి నో చ విద్విషతే మిథః' అనీ,'తత్ కృణ్మో బ్రహ్మ వో గృహే సంజ్ఞానం పురుషేభ్యః' అనీ చెబుతోంది. అంటే దేనివల్ల దేవతలు విడిపోరో, ద్వేషించుకోరో అవగాహన అన్న ఆ ఉన్నతమైన భావన ఇంట్లోని సభ్యుల్లో ఉండాలి అని అర్థం. సంజ్ఞానం లేదా అవగాహన మనకు ఉండి తీరాలి.

చిన్నవాళ్లు పెద్దలను వెన్నంటి వెళుతున్నట్టుగా ఒకరికి ఒకరై ఏకమనస్కులుగా, సామూహిక ఆరాధన చేసేవాళ్లగా, పరస్పరం ప్రీతితో మాట్లాడుకునే వాళ్లుగా కలిసి మెలిసి బతకండి అని సూచిస్తూ 'జ్యాయస్వన్తశ్చిత్తినో మా వి యౌష్ట సమారాధయన్తః సధురాశ్చరన్తః' అని సాంమనస్య సూక్తం మనకు చెబుతోంది. అంతేకాదు ప్రేమ అనే తాడుతో అందరూ కట్టుబడాలి అన్న సూచ్య అర్థం వచ్చేట్టుగా 'సమానే యోక్త్రే సహ వో యునజ్మి' అనీ, 'దేవా ఇవామృతమ్ రక్షమాణాః సాయం ప్రాతః సౌమనసో వో అస్తు' అంటూ దేవతలు అమృతాన్ని రక్షిస్తున్నట్టుగా ఉదయ, సాయం కాలాల్లో సద్భావనల్ని రక్షించండి అనీ చెబుతోంది సాంమనస్య సూక్తం. సాంమనస్య సూక్తం చేసిన ఈ సూచనను అందుకుని సద్భావనల్ని రక్షించుకుంటూ మనల్ని మనం రక్షించుకోవాలి; ఆపై మనం రాణించాలి.


– రోచిష్మాన్

గురువాణి

చిన్న మాటలే.. ఛిన్నాభిన్నం చేసేస్తాయి

శ్రీరామాయణంలో... దశరథ మహారాజు రామలక్ష్మణ భరత శత్రుఘ్నులు నలుగురికీ వివాహాలు చేయాలని సంకల్పించాడు. సభతీర్చి వారికి తగిన వధువులను వెతకవలసిందిగా కోరుతూ మంత్రులతో, పురోహితులతో సమాలోచనలు జరుపుతున్నాడు. అదే సమయానికి విశ్వామిత్రుడు వచ్చాడు. సాక్షాత్ బ్రహ్మర్షి అయిన విశ్వామిత్రుడు వచ్చేసరికి మహారాజు కంగారు పడిపోయి గబాగబా వెళ్ళి స్వాగతం చెప్పి అర్ఘ్యపాద్యాదు లిచ్చి ఆహ్వానించాడు. బ్రహ్మర్షి కాకముందు విశ్వామిత్రుడు కోపధారి కనుక తొందరపాటులో ఏ శాపమిస్తాడో అని భయపడిపోయి... ఒకటికి పదిమార్లు ... ఆయన ఏమీ అడగకపోయినా... మీరు రావడం వల్ల మా వంశం తరించింది, నేను తరించాను, నా ఇల్లు పావనమయింది, మీకు ఏం కావాలో చెప్పండి, ఏదయినా చేసేస్తాను, ఏదయినా ఇచ్చేస్తాను.. అని అదేపనిగా చెప్పాడు.

అన్నీ విన్న మహర్షి చివరన మాట్లాడుతూ.. ''రాజా! నేనొక యజ్ఞాన్ని తలపెట్టాను. మారీచ సుబాహులనే రాక్షసులు వచ్చి నా యజ్ఞాన్ని ధ్వంసం చేస్తున్నారు. కాబట్టి ఆ యజ్ఞ సంరక్షణ కొరకు మీ కుమారులయిన రామలక్ష్మణులను ఇద్దరినీ నాతో పంపించండి'' అన్నాడు. అది విని దశరథుడు హతాశుడయ్యాడు. తన కుమారులకు



రాక్షసుల చేతిలో ఎక్కడ ఏ ఆపద కలుగుతుందో అని అనేక సాకులు చూపిస్తూ నేను పంపను... నేను పంపను... అనడం మొదలు పెట్టాడు. దానికి విశ్వామిత్రుడు ..''ఒకసారి మాటిచ్చి తప్పే లక్షణం ఉన్నవాడా! దీర్ఘకాలంలో శోకించెదవుగాక!'' అన్నాడు. విశ్వామిత్రుడు అడగకముందే తొందరపడిపోయి చేసేస్తాను అనడం వల్ల .. తీరా అడిగేసరికి చేయలేని పరిస్థితి కొనితెచ్చుకున్నందు వల్ల దశరథ మహారాజు అంతటివాడు సంకటపరిస్థితిలో పడ్డాడు.

ఏదయినా ఒకమాట ఇచ్చేముందు మనకున్న పరిమితుల విషయంలో ఒకటికి పదిసార్లు ఆలోచించుకోవాలి. ఇది నేను చేయగలనా? నాకు ఆ సామర్థ్యం ఉందా? నాకు సాధ్యమవుతుందా? ఆలోచించి... చెయ్యగలిగితే చేయగలను.. అని చెప్పాలి. చేయలేనప్పుడు అదే చెప్పాలి. గణిత శాస్త్ర మేధావి, సంగీత శాస్త్రంలో, రాజకీయంలో, మతవిశ్వాసాలను సిద్ధాంతీకరించడంలో దిట్ట అయిన పైథాగరస్ ఒక మాట అంటాడు.. ''అత్యంత ప్రాచీనమైన మాటలు, చాలా చిన్న చిన్న మాటలు ఏవి! అంటే... ''యస్'', ''నో''. అని – వీటిని వాడేటప్పుడు ఎంతో విచక్షణతో, సంయమనంతో వాడాలనేది ఆయన ఉద్దేశం.

అలాగే గొప్ప అవకాశం వచ్చినప్పుడు... ముందూ వెనకలు ఆలోచించకుండా తిరస్కరించడం, తమను తాము నిరూపించుకునే అవకాశాన్ని, జీవితంలో వృద్ధిలోకి వచ్చే అవకాశాన్ని. అపరిపక్వ అపోహలతో, లేనిపోని భయాలతో చేజేతులా వదులుకోవడం తరువాత మెలికలు తిరిగిపోవడం కంటే.. అవును అని కానీ, కాదు అని కానీ చెప్పేముందు తొందరపడకుండా, ఆవేశాలకు లోను కాకుండా పదిసార్లు విజ్ఞతతో ఆలోచించి ఆ పదాలను వాడుతూ ఉండాలి.

ఒక వ్యక్తి గౌరవం, మర్యాద, అభ్యున్నతి, ప్రతిష్ఠ, విశ్వసనీయత... వంటివన్నీ దీనితో ముడిపడి ఉన్నాయి. యస్ లేదా నో... అవును లేదా కాదు... చిన్న పదాలే కానీ జీవితాలను మలుపు తిప్పేస్తాయి... జాగ్రత్తగా ఆచి తూచి వ్యవహరించడం ఉత్తమం.


బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

ఉపేక్షిస్తే ఉనికికే ప్రమాదం!

బౌద్ధవాణి

అది మండు వేసవి. అప్పుడే సూర్యోదయం అయింది. లేత కిరణాలు సోకి సాలవృక్షం పచ్చదనాన్ని వెదజల్లుతూ పరవశించిపోతోంది. ఆ అడవిలో తానే ఎత్తైన వృక్షాన్ని అనే గర్వంతో కూడిన ఆనందం అది. అంతలో... ఒక కాకి ఎగిరి వచ్చి ఆ వృక్షం కొమ్మల మధ్య ఉన్న ఖాళీ ప్రదేశంలో వాలింది. దాని ముక్కున పండిన మాలువా పండు ఉంది. ఆ పండును కాలివేళ్ళతో తొక్కి పట్టి, గుజ్జునంతా తినేసింది. ముక్కును అటూ ఇటూ రాచి, వాలుగా చూసి, 'కా... కా'' అంటూ ఎగిరి వెళ్ళిపోయింది.

అలా కాకి వెళ్ళిపోగానే, తన మీద వదిలి వెళ్ళిన మాలువా విత్తనాన్ని గమనించిన ఆ సాలవృక్షం ఆలోచనలో పడింది. భయం పుట్టి వణికింది. అయినా తనని తాను సమాధాన పరచుకుని శాంతించింది.



వేసవి ముగిసింది. మాలువా విత్తనం టెంకె పగిలింది. దానిలోంచి నిగనిగలాడే విత్తనం బయటకొచ్చి పడింది. ఆ విత్తనాన్ని చూడగానే సాల వృక్షానికి వేళ్ళు కుంగినట్ల యింది. పెనుగాలికి కూలినట్లు భావించింది. కార్చిచ్చుకి తగలబడి బూడిద అయినట్లు అనిపించింది. నిలువెల్లా వణకసాగింది. మొత్తుకోసాగింది.

అప్పుడు ఆ వృక్షం చుట్టూ ఉండే ఇతర వృక్ష మిత్రులంతా ''దుఃఖ కారణం ఏమిటి?'' అని అడిగారు.

''సాలవక్షం విషయం చెప్పింది. అప్పుడు ''సాలవృక్షమా! చింతించకు. అనవసరంగా భయపడుతున్నావెందుకు? ఆ విత్తనాన్ని నెమలి తినవచ్చు. జింక నమిలి వేయవచ్చు. కార్చిచ్చు కాల్చవచ్చు. ఎవరైనా మనిషి చూసి తీసుకుపోవచ్చు. ఎండకు ఎండిపోవచ్చు. నీడలో నాని కుళ్ళిపోవచ్చు. చెద పురుగులు తినొచ్చు. చీమలు తీసుకుపోవచ్చు. ఇన్ని అవరోధాలు ఉన్నాయి. వీటన్నింటినీ దాటుకుని అది మొలకెత్తలేదు. ఒకవేళ మొలకెత్తినా వెంటనే వానలు ఆగిపోతే, మొలకలోనే మాడిపోవచ్చు. కాబట్టి లేనిపోని భయాన్ని ఊహించుకుని వణికిపోకు'' అంటూ ధైర్యం చెప్పాయి.

తోటి వృక్షాల ఓదార్పుకు ఆ సాల వృక్షం ధైర్యాన్ని తెచ్చుకుంది. కానీ ఆ విత్తనం మొలవడానికి ఏ అవరోధం కలగలేదు. ఆ ఏడాది సకాలంలో వర్షాలు పడడంతో చక్కగా మొలకెత్తింది. వేగంగా పెరిగింది. పెద్ద పెద్ద తమలపాకుల్లా లేత పచ్చని ఆకుల తీగపైకి లేచింది. దాన్ని చూసి సాలవృక్షం లబోదిబోమంది. మరలా వృక్షాల న్నీ– ''నీవు మహావృక్షానివి. అది చిన్న తీవె. అయినా ఆ బుజ్జి కాడ ఎంత ముచ్చటగా, అందంగా ఉందో, అది నీకు మంచి అలంకారంగా ఉంది. ఈ చిన్న తీవె నిన్నేమి చేయగలదు'' అని మరలా ధైర్యం చెప్పాయి. వాటి మాటలు విని సాలవృక్షం కొంత సాంత్వన పడింది.

కానీ... అతి తక్కువ కాలంలోనే ఆ తీగ బలపడింది. దాని బెరడును చీల్చుకుని వేళ్ళను లోనికి పంపింది. ఆ వృక్ష సారాన్నే పీల్చుకోసాగింది. చివరికి చెట్టంతా కమ్ముకుపోయింది. సారాన్ని కోల్పోయిన సాలవృక్షం ఎండి.. క్రమంగా జీవాన్నీ కోల్పోయింది.

ఒకప్పుడు అడవిలో తిరిగే మనుషులు ఏదైనా విషయం గురించి మాట్లాడుకుంటూ ''ఆ పెద్ద సాలవృక్షం దగ్గర ఆ మహా సాలవృక్షం పక్కన...'' అని ఆనవాళ్ళను చెప్పుకుంటూ ఉండేవారు. కానీ... ఇప్పుడు... ఆ మాలువా పొద పక్కన'' అంటూ చెప్పుకోసాగారు.

చెడ్డవారిని చేరదీయడం వల్ల, చెడ్డతనం పట్ల ఉపేక్ష భావంతో ఉండటం వల్ల అది మన ఉనికికే చేటు తెస్తుంది. మనిషి మనసులో చెడు కోరికలు రేగినప్పుడు... ''ఇది చిన్న కోరికే కదా! ఈ ఒక్కసారికీ ఈ పని చేసి ఇక ఆ తరువాత చేయకుండా ఉంటే మనకు వచ్చే నష్టం లేదు. కలిగే కష్టమూ లేదు'' అనుకుని ఆ చెడ్డ కర్మలకు పూనుకుంటారు. కానీ, ఆ తర్వాత వాటిని మానడం అటుంచి, మరింత లోతుకు కూరుకుపోతారు. కామ రాగాలన్నీ ఇలానే ప్రవేశించి, పెరిగి పెరిగి మన ఉనికికే ప్రమాదాన్ని తెస్తాయి. వాటిని మనస్సులో పుట్టకుండా చేసుకోవాలి. లేదా పుట్టిన వెంటనే నివారించుకోవాలి. ఆపేక్షతో ఉపేక్ష చూపితే మన ఉనికికే నిక్షిప్తం చేస్తాయి.

ఇది కామరాగాల పట్ల ఎంత అప్రమత్తతతో ఉండాలో బుద్ధుడు చెప్పిన కథ ఇది. ఆ రోజుల్లో 'మోక్షానికి కామం కూడా ఒక మార్గమే' అని చెప్పే సాధువులు కొందరు ఉండేవారు. వారికి కనువిప్పు కలిగించడం కోసం, బుద్ధుడే ఈ కథ చెప్పాడు.

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా



జామ్ జామ్ జజ్జనక

'జామ్ జామ్ జామ్ జామ్ జజ్జనక.. తెల్లార్లు ఆడుదాం తైతక్క..' అంటూ చిందేశారు చిరంజీవి. మెహర్ రమేష్ దర్శకత్వంలో చిరంజీవి హీరోగా నటించిన చిత్రం 'భోళా శంకర్'. ఈ మూవీలో తమన్నా కథానాయికగా నటించారు. ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై రామబ్రహ్మం సుంకర నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 11న ప్రపంచ వ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది. మహతి స్వరసాగర్ సంగీతం అందించిన ఈ చిత్రంలోని 'జామ్ జామ్ జజ్జనక...' అంటూ సాగే రెండో పాట ప్రోమోని ఆదివారం విడుదల చేసింది చిత్రయూనిట్. ఈ సందర్భంగా రిలీజ్ చేసిన పోస్టర్‌లో చిరంజీవి సంప్రదాయ దుస్తులు ధరించి సూపర్ కూల్‌గా కనిపిస్తున్నారు. ''మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రం 'భోళా శంకర్'. ఈ మూవీ టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. 'భోళా మానియా...' అనే మొదటి పాట చార్ట్ బస్టర్‌గా నిలిచింది. 'జామ్ జామ్ జజ్జనక...' అంటూ సాగే పూర్తి పాటని ఈ నెల 11 విడుదల చేస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. కీర్తీ సురేష్, సుశాంత్ కీలక పాత్రల్లో నటించిన ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: కిశోర్ గరికిపాటి, కెమెరా: డడ్లీ, లైన్ ప్రొడక్షన్: మెహెర్ మూవీస్.

● చిరంజీవి

మహావీరుడు కోసం ఎదురుచూస్తున్నా

– శేఖర్ కమ్ముల

''మహావీరుడు' సినిమా ట్రైలర్, విజువల్స్ గొప్పగా ఉన్నాయి. ఈ మూవీలో గ్రేట్ వైబ్ కనిపిస్తోంది. సినిమా విడుదల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అని డైరెక్టర్ శేఖర్ కమ్ముల అన్నారు. శివ కార్తికేయన్ హీరోగా 'మండేలా' ఫేమ్ మడోన్ అశ్విన్ దర్శకత్వంలో తెరకెక్కిన తమిళ చిత్రం 'మహావీరన్'. అదితీ శంకర్ హీరోయిన్. శాంతి టాకీస్ పతాకంపై అరుణ్ విశ్వ నిర్మించారు. ఈ సినిమాని ఏషియన్ సినిమాస్ ఈ నెల 14న తెలుగులో విడుదల చేస్తోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకకి హీరో అడివి శేష్, శేఖర్ కమ్ముల ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అడివి శేష్ మాట్లాడుతూ–''నా గురువు శేఖర్ కమ్ముల ముందు


● శేఖర్ కమ్ముల, మడోన్ అశ్విన్, అదితీ శంకర్, శివ కార్తికేయన్, అడివి శేష్, సునీల్ నారంగ్

మాట్లాడటం గౌరవంగా ఉంది. శివ కార్తికేయన్‌తో పని చేయాలని ఉంది'' అన్నారు. ''నా 'రెమో, వరుణ్ డాక్టర్, కాలేజ్ డాన్' సినిమాల్లా 'మహావీరుడు' ని తెలుగువారు ఇష్టపడతారు'' అన్నారు శివ కార్తికేయన్. ''మహావీరుడు' అందరికీ నచ్చుతుంది'' అన్నారు మడోన్ అశ్విన్. ''మా అమ్మగారి పేరుతో ఈ సంస్థ మొదలు పెట్టి, శివ కార్తికేయన్‌తో తొలి మూవీ చేయడం హ్యాపీ'' అన్నారు అరుణ్ విశ్వ.


● త్రిష

కాంబినేషన్ రిపీట్


● రవితేజ

హీరో రవితేజ, దర్శకుడు గోపీచంద్ మలినేని కొత్త సినిమా కోసం మరోసారి చేతులు కలిపారు. వీరిద్దరి కాంబినేషన్‌లో 'డాన్‌శీను' (2010), 'బలుపు'(2013), 'క్రాక్' (2021) చిత్రాలు వచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా రవితేజ, గోపీచంద్ మలినేని కాంబో నాలుగోసారి రిపీట్ అవుతున్నట్లు ఆదివారం ప్రకటించారు. మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ యర్నేని, వై.రవిశంకర్ ఈ సినిమాను నిర్మించనున్నారు. ''వాస్తవ సంఘటనలతో గోపీచంద్ మలినేని ఓ కథను తయారు చేశారు. ఈ సినిమాకి సంబంధించిన ఇతర వివరాలను త్వరలోనే ప్రకటిస్తాం'' అని చిత్రయూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: తమన్.

యాక్షన్ ఐడెంటిటీ

'ఫోరెన్సిక్' వంటి హిట్ మూవీ తర్వాత హీరో టోవినో థామస్, దర్శక ద్వయం అఖిల్ పాల్ – అనస్‌ఖాన్ కాంబినేషన్‌లో రూపొందనున్న మలయాళ చిత్రం 'ఐడెంటిటీ'. ఈ సినిమాలో హీరోయిన్‌గా త్రిషను ఎంపిక చేసింది యూనిట్. యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న చిత్రం 'ఐడెంటిటీ'. ఎర్నాకులం, బెంగళూరు, మారిషష్, కోయంబత్తూరు లొకేషన్స్‌లో షూటింగ్‌కి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. ''త్రిషతో స్క్రీన్ షేర్ చేసుకునేందుకు చాలా ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను'' అన్నారు టోవినో థామస్. ''ఐడెంటిటీ'లో జాయిన్ అవుతున్నందుకు చాలా సంతోషంగా ఉంది'' అని పేర్కొన్నారు త్రిష. కాగా నివిన్ పౌలి 'హే జూడ్', మోహన్‌లాల్ 'రామ్' (చిత్రీకరణ జరుగుతోంది) తర్వాత మలయాళంలో త్రిష చేస్తున్న మూడో చిత్రం 'ఐడెంటిటీ'.

యాక్షన్ థ్రిల్లర్

ప్రముఖ కన్నడ హీరో శివరాజ్ కుమార్ నటించిన తాజా చిత్రం 'ఘోస్ట్'. శ్రీని(బీర్బల్) దర్శకత్వం వహించిన ఈ మూవీలో మలయాళ నటుడు జయరామ్ కీలక పాత్ర పోషించారు. సందేశ్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సందేశ్ నాగరాజ్ నిర్మించారు. పాన్ ఇండియా మూవీగా రూపొందిన 'ఘోస్ట్' టీజర్‌ను బిగ్ డాడీ పేరుతో ఈ నెల 12న విడుదల చేయనున్నట్లు ప్రకటించి, ఓ పోస్టర్‌ని విడుదల చేసింది యూనిట్. చేతిలో గన్‌తో సీరియస్ లుక్‌తో ఉన్న శివరాజ్ కుమార్ పోస్టర్ బాగుంది. ''హై ఓల్టేజ్ యాక్షన్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'ఘోస్ట్'. పాన్ ఇండియా స్థాయిలో రూపొందిన ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ పనులు చివరి దశలో ఉన్నాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ చిత్రానికి కెమెరా: మహేంద్ర సింహ, సంగీతం: అర్జున్ జన్య.


● శివరాజ్ కుమార్

మిస్టర్ ఇడియట్ హిట్ కావాలి

– రవితేజ


● సిమ్రాన్ శర్మ, రవితేజ, మాధవ్

''నా కెరీర్‌లో 'ఇడియట్' సినిమాకు చాలా ప్రాముఖ్యత ఉంది. ఇప్పుడు మా తమ్ముడు రఘు తనయుడు మాధవ్ 'మిస్టర్ ఇడియట్'తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నాడు. నా 'ఇడియట్'లా 'మిస్టర్ ఇడియట్' కూడా పెద్ద హిట్ కావాలి'' అని హీరో రవితేజ అన్నారు. నటుడు రఘు తనయుడు మాధవ్ హీరోగా నటిస్తున్న సినిమాకు 'మిస్టర్ ఇడియట్' టైటిల్‌ను ఖరారు చేశారు. 'పెళ్లి సందడి' (2021) ఫేమ్ గౌరి రోణంకి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రంలో సిమ్రాన్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. యలమంచి రాణి సమర్పణలో జేజేఆర్ రవిచంద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఈ చిత్రం టైటిల్ పోస్టర్, ప్రీ లుక్‌ను రవితేజ విడుదల చేశారు. జేజేఆర్ రవిచంద్ మాట్లాడుతూ– ''మిస్టర్ ఇడియట్' షూటింగ్ ఈ నెలాఖరుకు పూర్తవుతుంది. నవంబరులో సినిమా రిలీజ్‌కి ప్లాన్ చేస్తున్నాం'' అన్నారు. ''మా సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు గౌరి. ఈ సినిమాకు సంగీతం: అనూప్ రూబెన్స్.

ఎవరు?


● జేడీ చక్రవర్తి

నటుడు, దర్శక–నిర్మాత జేడీ చక్రవర్తి స్వీయ దర్శకత్వంలో తెలుగు, కన్నడ భాషల్లో తీసిన తాజా చిత్రం 'హూ'. ఇందులో శుభరక్ష, నిత్య హీరోయిన్స్‌గా నటించారు. రెడ్డెమ్మ బాలాజీ.కె నిర్మించిన ఈ చిత్రం పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తి చేసుకుని, విడుదలకు రెడీ అయ్యింది. ఈ సందర్భంగా రెడ్డెమ్మ బాలాజీ.కె మాట్లాడుతూ–''ఎమోషనల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'హూ'. ఈ మూవీలో జేడీ చక్రవర్తి నటన చాలా వైవిధ్యంగా ఉంటుంది'' అన్నారు. ఈ సినిమాకు సంగీతం: ఈశ్వర్ చంద్.

రిస్క్ తీసుకొని హర్ చేశా

– రుహాని శర్మ

''హర్' సినిమా నా దగ్గరికి వచ్చినప్పుడు ఫీమేల్ ఓరియంటెడ్ మూవీ నేను చేయగలనా? అని ఒక అనుమానం ఉండేది. కానీ డైరెక్టర్ శ్రీధర్‌గారు నాకు నమ్మకం ఇచ్చారు. రిస్క్ తీసుకొని మరీ ఈ సినిమా చేశాను'' అని హీరోయిన్ రుహాని శర్మ అన్నారు. శ్రీధర్ స్వరాఘవ్ దర్శకత్వంలో రుహాని శర్మ లీడ్ రోల్‌లో నటించిన చిత్రం 'హర్'. డబుల్ అప్ మీడియాస్‌పై రఘు సంకురాత్రి, దీపా సంకురాత్రి నిర్మించారు. సురేష్ మూవీస్ ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్స్ ద్వారా ఈ నెల 21న ఈ మూవీ విడుదలవుతోంది. ఈ మూవీ ట్రైలర్‌ని హీరో వరుణ్ తేజ్ వర్చువల్‌గా లాంచ్ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌కి నిర్మాత రాజ్ కందుకూరి ముఖ్య అతిథిగా హాజరై, మాట్లాడుతూ–''హర్' నేను ఇప్పటికే చూశాను.. సినిమా చాలా బాగుంది. తప్పకుండా మంచి హిట్ అవుతుంది'' అన్నారు. శ్రీధర్ స్వరాగవ్ మాట్లాడుతూ– ''మా సినిమా మొదటి సీన్ నుంచి చివరి వరకు ప్రేక్షకుల్ని అలరిస్తుంది'' అన్నారు.


● రుహాని శర్మ, శ్రీధర్ స్వరాఘవ్

ప్యారిస్‌లో ప్రేమ

వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ జంటగా నటించిన హిందీ చిత్రం 'బవాల్'. 'దంగల్' ఫేమ్ నితేష్ తివారి దర్శకత్వంలో సాజిద్ నడియాద్‌వాలా నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 21 నుంచి అమేజాన్ ప్రైమ్ వీడియోలో స్ట్రీమింగ్ కానుంది. తాజాగా ఈ సినిమా ట్రైలర్ లాంచ్ వేడుక దుబాయ్‌లో జరిగింది. ఈ చిత్రంలో హిస్టరీ టీచర్ అజయ్‌గా వరుణ్ ధావన్, నిషాగా జాన్వీ నటించారు. అజయ్, నిషాలు వివాహం చేసుకుని హనీమూన్ కోసం ప్యారిస్ వెళతారు. అక్కడ వీరి మధ్య ఎలాంటి సంఘటనలు చోటుచేసుకున్నాయి? అనే కథాంశం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. ఈ సినిమా మేజర్ షూటింగ్ కూడా ప్యారిస్‌లోనే జరిగింది. అయితే ఈ మూవీలో రెండో ప్రపంచ యుద్ధానికి, వరుణ్–జాన్వీల ప్రేమకథకు ఉన్న సంబంధం ఏంటి? అనేది ఆసక్తికరంగా ఉంటుంది'' చిత్ర యూనిట్ పేర్కొంది. 'ప్రతి ప్రేమ కథకు, ఆ ప్రేమ తాలూకు యుద్ధం ఉంటుంది' అన్న విజువల్స్ ట్రైలర్‌లో కనిపిస్తాయి.


● వరుణ్ ధావన్, జాన్వీ కపూర్

తొలి అడుగు


● భద్ర, పద్మాకర్

భద్ర, పద్మాకర్ రావ్ హీరోలుగా, నేహా, అంజలి హీరోయిన్లుగా ఉప్పలపాటి శివ దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనుంది. మిస్సొ మూవీ మీడియాపై పద్మాకర్‌రావ్ చిన్నతోట, ఆర్.సువర్ణ నిర్మిస్తున్న ఈ చిత్రం కడపలో ప్రారంభమైంది. పద్మాకర్‌రావ్ చిన్నతోట మాట్లాడుతూ–''పదహారేళ్లగా మీడియా రంగంలో రాణిస్తున్న మా మిస్సొ మూవీ మీడియా సంస్థ నిర్మాణ రంగంలో తొలి అడుగు వేసింది. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం'' అన్నారు.



రెండో రౌండ్‌లో మానస్

వింబుల్డన్ జూనియర్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ బాలుర సింగిల్స్ విభాగంలో భారత ప్లేయర్ మానస్ ధామ్నే శుభారంభం చేశాడు. క్వాలిఫయర్ హోదాలో మెయిన్ 'డ్రా'లో అడుగు పెట్టిన మానస్ ఆదివారం లండన్‌లో జరిగిన తొలి రౌండ్‌లో 6-2, 6-4తో ప్రపంచ జూనియర్ ర్యాంకింగ్స్‌లో 47వ స్థానంలో ఉన్న హేడెన్ జోన్స్ (ఆస్ట్రేలియా)పై గెలుపొందాడు. 73 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో మానస్ నాలుగు ఏస్‌లు సంధించడంతోపాటు 14 విన్నర్స్ కొట్టి, ప్రత్యర్థి సర్వీస్‌ను నాలుగుసార్లు బ్రేక్ చేశాడు.

రన్నరప్ సహజ



అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) డబ్ల్యూ25 మహిళల టోర్నీలో హైదరాబాద్ అమ్మాయి సహజ యామలపల్లి రన్నరప్‌గా నిలిచింది. థాయ్‌లాండ్‌లో జరిగిన సింగిల్స్ ఫైనల్లో సహజ 4-6, 0-6తో మనన్‌చాయ సావంగ్‌కెయి (థాయ్‌లాండ్) చేతిలో ఓడిపోయింది. 65 నిమిషాలు జరిగిన ఈ మ్యాచ్‌లో సహజ ఒక ఏస్ సంధించి, ఏడు డబుల్ ఫాల్ట్‌లు చేసింది. ప్రత్యర్థి సర్వీస్‌ను ఒకసారి బ్రేక్ చేసి, తన సర్వీస్‌ను ఐదుసార్లు కోల్పోయింది.

ఆసియా క్రీడలకు భారత చెస్ జట్టులో హంపి, హారిక



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల చెస్ ఈవెంట్‌లో పాల్గొనే భారత మహిళల, పురుషుల జట్లను ప్రకటించారు. మహిళల జట్టులో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారికలతోపాటు తమిళనాడుకు చెందిన ఆర్.వైశాలి, సవితాశ్రీ... ఢిల్లీ అమ్మాయి వంతిక అగర్వాల్ ఎంపికయ్యారు. పురుషుల జట్టులో తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్, ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ పెంటేల హరికృష్ణలతోపాటు తమిళనాడు గ్రాండ్‌మాస్టర్లు దొమ్మరాజు గుకేశ్, ప్రజ్ఞానంద, మహారాష్ట్ర గ్రాండ్‌మాస్టర్ విదిత్ సంతోషి గుజరాతి చోటు సంపాదించారు. 13 ఏళ్ల తర్వాత ఆసియా క్రీడల్లో మళ్లీ చెస్ పునరాగమనం చేస్తోంది. 2006 దోహా ఆసియా క్రీడల్లో కోనేరు హంపి వ్యక్తిగత విభాగంలో, మిక్స్‌డ్ టీమ్ విభాగంలో స్వర్ణ పతకాలు సాధించింది. 2010 గ్వాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో హారిక వ్యక్తిగత విభాగంలో కాంస్య పతకాన్ని సొంతం చేసుకుంది.

సింధు పరాజయం



కాల్గరీ: కెనడా ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్-500 బ్యాడ్మింటన్ టోర్నీలో భారత స్టార్ పీవీ సింధు పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్ సెమీఫైనల్లో ప్రపంచ 15వ ర్యాంకర్ సింధు 14-21, 15-21తో ప్రపంచ నంబర్‌వన్ అకానె యామగుచి (జపాన్) చేతిలో ఓడిపోయింది. 43 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సింధు రెండో గేమ్‌లో ఒకదశలో 13-9తో ఆధిక్యంలో ఉన్నప్పటికీ సద్వినియోగం చేసుకోవడంలో విఫలమైంది. అకానె చేతిలో సింధుకిది 11వ పరాజయం కావడం గమనార్హం. మరోవైపు పురుషుల సింగిల్స్‌లో భారత ప్లేయర్ లక్ష్య సేన్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. సెమీఫైనల్లో ఉత్తరాఖండ్‌కు చెందిన లక్ష్య సేన్ 21-17, 21-14తో కెంటా నిషిమోటో (జపాన్)పై విజయం సాధించాడు. ఫైనల్లో లీ షి ఫెంగ్ (చైనా)తో లక్ష్య సేన్ ఆడతాడు.

భారత్ శుభారంభం

- తొలి టి20లో బంగ్లాదేశ్‌పై విజయం
- రాణించిన హర్మన్‌ప్రీత్
- రేపు రెండో టి20

మిర్పూర్: భారత మహిళల జట్టు అలవోక విజయంతో బంగ్లాదేశ్ పర్యటనను మొదలు పెట్టింది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (35 బంతుల్లో 54 నాటౌట్; 6 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరుపులతో తొలి టి20లో భారత్ 7 వికెట్ల తేడాతో జయభేరి మోగించింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్‌కు దిగిన బంగ్లాదేశ్ నిర్ణీత 20 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 114 పరుగులు చేసింది. షోర్న అక్తర్ (28 బంతుల్లో 28 నాటౌట్, 2 సిక్సర్లు), శోభన మొస్తరి (33 బంతుల్లో 23; 2 ఫోర్లు), శతి రాణి (26 బంతుల్లో 22; 4 ఫోర్లు) మెరుగ్గా ఆడారు. భారత బౌలర్లలో పూజ వస్త్రకర్, మిన్ను మణి, షఫాలీ వర్మ తలా ఒక వికెట్ తీశారు. అనంతరం ఏమంత కష్టం కానీ లక్ష్యాన్ని భారత అమ్మాయిల జట్టు 16.2 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 118 పరుగులు చేసి గెలిచింది. టాపార్డర్‌లో ఓపెనర్ షఫాలీ వర్మ (0) డకౌటైంది. వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (11; 2 ఫోర్లు) నిరాశపరిచింది. 21 పరుగులకే 2 కీలక వికెట్లు కోల్పోయినప్పటికీ మరో ఓపెనర్ స్మృతి మంధాన (34 బంతుల్లో 38; 5 ఫోర్లు), 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హర్మన్‌ప్రీత్ ఎలాంటి ఒత్తిడి లేకుండా యథేచ్ఛగా బ్యాటింగ్ చేశారు. ఇద్దరు 9.1 ఓవర్ల పాటు క్రీజులో నిలిచి మూడో వికెట్‌కు 70 పరుగులు జోడించడంతో విజయం సులువైంది. జట్టు స్కోరు 91 పరుగుల వద్ద స్మృతి నిష్క్రమించింది. యస్తిక భాటియా (9 నాటౌట్; 1 ఫోర్) క్రీజులోకి రాగా... 15వ ఓవర్లో జట్టు స్కోరు వంద పరుగులను చేరుకుంది. 17వ ఓవర్ వేసిన సల్మా ఖాటున్ బౌలింగ్‌లో తొలి బంతిని సిక్సర్‌గా బాదిన హర్మన్‌ప్రీత్ 34 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తిచేసుకుంది. మరుసటి బంతిని బౌండరీ కొట్టి మ్యాచ్‌ను ముగించింది. ఆంధ్రప్రదేశ్ అమ్మాయి బారెడ్డి అనూష, కేరళ అమ్మాయి మిన్ను మణి ఈ మ్యాచ్‌తో అంతర్జాతీయ అరంగేట్రం చేశారు. అనంతపురం జిల్లాకు చెందిన 20 ఏళ్ల అనూష పూర్తి కోటా (4-0-24-0) వేసినప్పటికీ వికెట్ దక్కలేదు. మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో హర్మన్ సేన 1-0తో ఆధిక్యంలో ఉండగా, మంగళవారం ఇదే వేదికపై రెండో టి20 జరుగుతుంది.



అనూషకు క్యాప్ అందజేస్తున్న హర్మన్‌ప్రీత్

క్వార్టర్ ఫైనల్లో రుబ్లెవ్



రుబ్లెవ్

లండన్: వింబుల్డన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నమెంట్ పురుషుల సింగిల్స్ విభాగంలో ఏడో సీడ్ ఆంద్రీ రుబ్లెవ్ (రష్యా) తన కెరీర్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ఆదివారం జరిగిన ప్రీక్వార్టర్ ఫైనల్లో రుబ్లెవ్ 7-5, 6-3, 6-7 (6/8), 6-7 (5/7), 6-4తో అలెగ్జాండర్ బుబ్లిక్ (కజకిస్తాన్)పై గెలుపొందాడు. 3 గంటల 17 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో రుబ్లెవ్ 21 ఏస్‌లు, బుబ్లిక్ 39 ఏస్‌లు సంధించడం విశేషం. మూడో సెట్ టైబ్రేక్‌లో మ్యాచ్ పాయింట్ చేజార్చుకున్న రుబ్లెవ్ చివరకు ఐదో సెట్‌లో విజయాన్ని ఖరారు చేసుకున్నాడు. ఇతర ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో 26వ సీడ్ షపోవలోవ్ (కెనడా) 6-3, 3-6, 1-6, 3-6తో సఫీయులిన్ (రష్యా) చేతిలో ఓడిపోగా... ఎనిమిదో సీడ్ యానిక్ సినెర్ (ఇటలీ) 7-6 (7/4), 6-4, 6-3తో గలాన్ (కొలంబియా)పై గెలిచాడు. మూడో రౌండ్‌లో పదో సీడ్ టియాఫో (అమెరికా) 2-6, 3-6, 2-6తో దిమిత్రోవ్ (బల్గేరియా) చేతిలో ఓటమి చవిచూశాడు. మహిళల సింగిల్స్ ప్రీక్వార్టర్ ఫైనల్స్‌లో నాలుగో సీడ్ పెగులా (అమెరికా) 6-1, 6-3తో సురెంకో (ఉక్రెయిన్)పై, వొంద్రుసోవా (చెక్ రిపబ్లిక్) 2-6, 6-4, 6-3తో బుజ్కోవా (చెక్ రిపబ్లిక్)పై నెగ్గి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మూడో రౌండ్‌లో మిరా ఆంద్రీవా (రష్యా) 6-2, 7-5తో పొటపోవా (రష్యా)పై నెగ్గింది.

పోరాడి ఓడిన సాకేత్–యూకీ జోడీ

పురుషుల డబుల్స్ విభాగంలో సాకేత్ మైనేని-యూకీ బాంబ్రీ (భారత్), జీవన్ నెడుంజెళియన్-శ్రీరామ్ బాలాజీ (భారత్) జోడీలు తొలి రౌండ్‌లోనే నిష్క్రమించాయి. సాకేత్-యూకీ ద్వయం 4-6, 6-4, 4-6తో ఫొకినా (స్పెయిన్)-మనారినో (ఫ్రాన్స్) జంట చేతిలో... బాలాజీ-జీవన్ జోడీ 6-7 (5/7), 4-6తో డోడిగ్ (క్రొయేషియా)-ఆస్టిన్ క్రాయిసెక్ (అమెరికా) ద్వయం చేతిలో పరాజయం పాలయ్యాయి. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో బోపన్న (భారత్)-డబ్రొస్కీ (కెనడా) జోడీ 7-6 (7/5), 3-6, 4-6తో డోడిగ్ (క్రొయేషియా)-లతీషా చాన్ (చైనీస్ తైపీ) జంట చేతిలో ఓడింది.

గెలిచి నిలిచిన ఇంగ్లండ్

- 'యాషెస్' మూడో టెస్టులో ఆస్ట్రేలియాపై 3 వికెట్లతో విజయం
- రాణించిన బ్రూక్, వోక్స్

లీడ్స్: రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ అద్వితీయ పోరాటం ఫలితమివ్వలేదు. కానీ హ్యారీ బ్రూక్ (93 బంతుల్లో 75; 9 ఫోర్లు) పట్టుదల, గెలవాలన్న క్రిస్ వోక్స్ (47 బంతుల్లో 32 నాటౌట్; 4 ఫోర్లు) కసి ఇంగ్లండ్ జట్టును మూడో టెస్టులో గెలిపించడమే కాదు... ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్ కోల్పోకుండా నిలిపింది. నాలుగు రోజుల్లో ముగిసిన ఈ మూడో టెస్టులో ఇంగ్లండ్ 3 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై నెగ్గింది. ప్రస్తుతం 1-2తో వెనుకబడినప్పటికీ సొంతగడ్డపై సిరీస్‌ను గెలుచుకునేందుకు నాలుగు, ఐదో టెస్టుల రూపంలో ఆశలు సజీవంగా ఉన్నాయి. 251 పరుగుల లక్ష్యం ఛేదించేందుకు ఓవర్‌నైట్ స్కోరు 27/0తో ఆదివారం రెండో ఇన్నింగ్స్ కొనసాగించిన ఇంగ్లండ్ 50 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి 254 పరుగులు చేసి గెలిచింది. ఆతిథ్య జట్టును ఓడించేందుకు ఆసీస్ సీమర్ మిచెల్ స్టార్క్ (5/78) నిప్పులు చెరిగే బౌలింగ్‌తో హడలెత్తించాడు. ముందుగా డకెట్ (23; 3 ఫోర్లు)ను అవుట్ చేసి ఓపెనింగ్ జోడీని విడగొట్టాడు. తర్వాత వరుస విరామాల్లో మొయిన్ అలీ (5), కెప్టెన్ బెన్ స్టోక్స్ (13), బెయిర్‌స్టో (5)లను క్రీజులో కుదురుకోకుండా చేయడంతో ఇంగ్లండ్ ఒకదశలో 171 పరుగుల వద్ద 6 వికెట్లను కోల్పోయి పరాజయం అంచున నిలిచింది. ఈ దశలో మిడిలార్డర్ బ్యాటర్ బ్రూక్, టెయిలెండర్ వోక్స్‌తో కలిసి గెలిచేందుకు అవసరమైన పరుగుల్ని కూడగట్టారు. బ్రూక్ అర్ధసెంచరీ సాధించగా, విజయానికి 21 పరుగుల దూరంలో స్టార్క్ అతన్నీ అవుట్ చేయడంతో ఉత్కంఠ పెరిగింది. అయితే అప్పటికే క్రీజులో పాతుకుపోయిన వోక్స్, మార్క్ వుడ్ (8 బంతుల్లో 16 నాటౌట్; 1 ఫోర్, 1 సిక్స్) అండతో చేసిన అజేయపోరాటం ఇంగ్లండ్‌ను నిలబెట్టింది. నాలుగో టెస్టు ఈ నెల 19 నుంచి మాంచెస్టర్‌లో జరుగుతుంది.



హ్యారీ బ్రూక్

వెర్‌స్టాపెన్ ఖాతాలో వరుసగా ఆరో విజయం

సిల్వర్‌స్టోన్: ఫార్ములావన్ తాజా సీజన్‌లో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ మాక్స్ వెర్‌స్టాపెన్ జైత్రయాత్ర కొనసాగుతోంది. ఆదివారం జరిగిన బ్రిటిష్ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. 52 ల్యాప్‌ల ఈ రేసును 'పోల్ పొజిషన్'తో ప్రారంభించిన ఈ నెదర్లాండ్స్ డ్రైవర్ అందరికంటే వేగంగా గంటా 25 నిమిషాల 16.938 సెకన్లలో ముగించి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. ఈ సీజన్‌లో వెర్‌స్టాపెన్‌కిది వరుసగా ఆరో విజయం కావడం విశేషం. లాండో నోరిస్ (మెక్‌లారెన్) రెండో స్థానంలో, హామిల్టన్ (మెర్సిడెస్) మూడో స్థానంలో నిలిచారు. ప్రస్తుతం వెర్‌స్టాపెన్ 255 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో కొనసాగుతున్నాడు. 22 రేసుల ఈ సీజన్‌లో ఇప్పటివరకు 10 రేసులు ముగిశాయి. పదింటికి పది రెడ్‌బుల్ జట్టు డ్రైవర్లే గెలుపొందడం విశేషం. వెర్‌స్టాపెన్ ఎనిమిది రేసుల్లో నెగ్గగా... మిగతా రెండింటిలో రెడ్‌బుల్‌కే చెందిన సెర్జియో పెరెజ్ విజయం సాధించాడు. సీజన్‌లోని తదుపరి రేసు హంగేరి గ్రాండ్‌ప్రి ఈనెల 23న జరుగుతుంది.



'క్వాలిఫయర్' విజేత శ్రీలంక

- ఫైనల్లో నెదర్లాండ్స్‌పై 128 పరుగులతో ఘనవిజయం
- అజేయంగా టోర్నీని ముగించిన షనక బృందం



హరారే: వన్డే ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఓటమి ఎరుగని శ్రీలంక జట్టే విజేతగా అవతరించింది. తద్వారా క్వాలిఫయర్-1 జట్టుగా భారత్ ఆతిథ్యమివ్వబోయే మెగా ఈవెంట్ బరిలో దిగనుంది. ఆదివారం జరిగిన 'క్వాలిఫయర్' ఫైనల్లో దాసున్ షనక సారథ్యంలోని శ్రీలంక జట్టు 128 పరుగుల తేడాతో నెదర్లాండ్స్‌పై భారీ విజయాన్ని సాధించింది. నెదర్లాండ్స్ టీమ్ క్వాలిఫయర్-2గా ఆడుతుంది. తుదిపోరులో మొదట బ్యాటింగ్ చేపట్టిన శ్రీలంక 47.5 ఓవర్లలో 233 పరుగుల వద్ద ఆలౌటైంది. సహన్ అరచిగే (57; 4 ఫోర్లు), కుశాల్ మెండిస్ (43; 5 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. అసలంక (36; 4 ఫోర్లు), హసరంగ (29; 2 ఫోర్లు, 1 సిక్స్) ఫర్వాలేదనిపించారు. డచ్ బౌలర్లలో వాన్‌బిక్, క్లెయిన్, విక్రమ్‌జీత్, జుల్ఫికర్ తలా 2 వికెట్లు తీశారు. తర్వాత నెదర్లాండ్స్ 23.3 ఓవర్లలో 105 పరుగులకే కుప్పకూలింది. మ్యాక్స్ ఓ డౌడ్ (33; 1 ఫోర్, 1 సిక్స్) టాప్ స్కోరర్! లంక బౌలర్లు తీక్షణ 4, మదుషంక 3, హసరంగ 2 వికెట్లు తీశారు. భారత్‌లో అక్టోబర్ 5 నుంచి నవంబర్ 19 వరకు వన్డే ప్రపంచకప్ జరుగుతుంది. హైదరాబాద్‌లో అక్టోబర్ 6న నెదర్లాండ్స్‌తో జరిగే మ్యాచ్‌తోనే పాక్ పోరు మొదలవుతుంది. 12న శ్రీలంక, పాక్‌ల మ్యాచ్‌కూ హైదరాబాదే వేదిక.

విద్య, ఉద్యోగ సమాచారం

జీహెచ్ఎంసీ, హైదరాబాద్‌లో వివిధ ఉద్యోగాలు

హైదరాబాద్‌లోని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్(జీహెచ్ఎంసీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 08
» పోస్టుల వివరాలు: చీఫ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్-01, చీఫ్ డేటా ఆఫీసర్-01, నాలెడ్జ్ కమ్ ఇన్ఫర్మేషన్ ఆఫీసర్-06.
» అర్హత: సంబంధిత విభాగంలో బీఈ/బీటెక్, ఎంఈ/ఎంటెక్, బీఎస్సీ, ఎంఎస్సీ, బీసీఏ, ఎంసీఏ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: 01.07.2023 నాటికి 35 నుంచి 55 ఏళ్ల మధ్య ఉండాలి.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా .
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 15.07.2023.
» వెబ్‌సైట్: https://ghmc.gov.in

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో 55 అప్రెంటిస్‌లు

ఇన్‌స్టిట్యూట్ ఫర్ ప్లాస్మా రీసెర్చ్‌లో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 55
» విభాగాలు: కంప్యూటర్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్-కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, ఇన్‌స్ట్రుమెంటేషన్-కంట్రోల్ ఇంజనీరింగ్.

అర్హత

» గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌షిప్: సంబంధిత స్పెషలైజేషన్‌లో బీఈ/బీటెక్ ఉత్తీర్ణులవ్వాలి.
» స్టైపెండ్: నెలకు రూ.10,500 చెల్లిస్తారు.
» టెక్నీషియన్ అప్రెంటిస్‌షిప్: సంబంధిత స్పెషలైజేషన్‌లో డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.
» స్టైపెండ్: నెలకు రూ.9400 చెల్లిస్తారు.
» అప్రెంటిస్‌షిప్ వ్యవధి: ఒక ఏడాది.
» ఎంపిక విధానం: అకడమిక్ మార్కుల ఆధారంగా
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 04.08.2023.
» వెబ్‌సైట్: www.ipr.res.in

ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్, హైదరాబాద్‌లో 46 ల్యాబ్ అటెండెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని ఐసీఎంఆర్-నేషనల్ యానిమల్ రిసోర్స్ ఫెసిలిటీ ఫర్ బయోమెడికల్ రీసెర్చ్(ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ద్వారా పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 46
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్-03, టెక్నీషియన్1-08, ల్యాబ్ అటెండెంట్1-35.
» అర్హత: ఖాళీలని అనుసరించి పదో తరగతి, ఇంటర్మీడియట్, డిప్లొమా, బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» వయసు: టెక్నికల్ అసిస్టెంట్‌కు 30 ఏళ్లు, టెక్నీషియన్‌కు 28 ఏళ్లు, ల్యాబ్ అటెండెంట్‌కు 25 ఏళ్ల మించకూడదు.
» ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, ఎన్ఏఆర్ఎఫ్‌బీఆర్,జీనోమ్ వ్యాలీ, కొల్తూర్(పోస్టు),శామీర్‌పేట్(మ),హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 14.08.2023.
» వెబ్‌సైట్: www.narfbr.org

నార్త్ ఈస్ట్రన్ రైల్వేలో 1104 యాక్ట్ అప్రెంటిస్‌లు

గోరఖ్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్-నార్త్ ఈస్టర్న్ రైల్వే ఎన్ఈఆర్ పరిధిలోని వివిధ యూనిట్లలో అప్రెంటిస్‌షిప్ శిక్షణకు సంబంధించి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం ఖాళీల సంఖ్య: 1104
» వర్క్‌షాప్/యూనిట్: మెకానికల్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్), సిగ్నల్ వర్క్‌షాప్ (గోరఖ్‌పూర్ కంటోన్మెంట్),బ్రిడ్జ్ వర్క్‌షాప్(గోరఖ్‌పూర్ కంటోన్మెంట్),మెకానికల్ వర్క్‌షాప్(ఇజ్జత్ నగర్),డీజిల్ షెడ్(ఇజ్జత్ నగర్), క్యారేజ్ అండ్ వ్యాగన్(ఇజ్జత్ నగర్),క్యారేజ్ అండ్ వ్యాగన్(లక్నో జంక్షన్), డీజిల్ షెడ్(గోండా),క్యారేజ్ అండ్ వ్యాగన్(వారణాసి).
» ట్రేడ్‌లు:ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, పెయింటర్, మెషినిస్ట్, టర్నర్, మెకానిక్ డీజిల్, ట్రిమ్మర్. అర్హత: 50%మార్కులతో పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: 02.08.2023 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: మెట్రిక్యులేషన్, ఐటీఐ పరీక్షల్లో సాధించిన మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 02.08.2023.
» వెబ్‌సైట్: https://rrcgorakhpur.net

ఎన్‌జేఐఎల్ అండ్ ఓఎండీ, ఆగ్రాలో 68 పోస్టులు

ఆగ్రాలోని ఐసీఎంఆర్-నేషనల్ జల్మా ఇన్‌స్టిట్యూట్ ఫర్ లెప్రసీ అండ్ అదర్ మైకోబాక్టీరియల్ డిసీజెస్.. రెగ్యులర్ టెక్నికల్ కేడర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 68
» పోస్టుల వివరాలు: టెక్నీషియన్1-35, ల్యాబొరేటరీ అటెండెంట్1-10, టెక్నికల్ అసిస్టెంట్-23.
» అర్హత: సంబంధిత విభాగంలో ఇంటర్మీడియట్, డిప్లొమా, డిగ్రీ, బీఈ, బీటెక్ ఉత్తీర్ణులై ఉండాలి.
» ఎంపిక విధానం: రాతపరీక్ష ఆధారంగా.
» దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును డైరెక్టర్, ఎన్‌జేఐఎల్ అండ్ ఓఎండీ, తాజ్‌గంజ్, ఆగ్రా చిరునామకు పంపించాలి. దరఖాస్తులకు చివరితేది: 28.07.2023.
» వెబ్‌సైట్: https://main.icmr.nic.in

పదితోనే కేంద్ర కొలువు

» 1,558 ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» టెన్త్‌తోనే కేంద్ర ప్రభుత్వ శాఖల్లో గ్రూప్-సి కొలువులు
» రాత పరీక్ష, ఫిజికల్ టెస్ట్‌లలో ప్రతిభ ఆధారంగా ఎంపిక
» రూ.18,000-రూ.56,900 వేతన శ్రేణి

ఎస్ఎస్‌సీ జాబ్స్



స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. మల్టీ టాస్కింగ్(నాన్-టెక్నికల్) స్టాఫ్, హవాల్దార్ (సీబీఐసీ అండ్ సీబీఎన్) ఎగ్జామ్-2023 నోటిఫికేషన్ విడుదల చేసింది! దీనిద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖలు, విభాగాలు, ట్రిబ్యునళ్లల్లో.. గ్రూప్-సి (నాన్ గెజిటెడ్) పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. పదో తరగతితోనే కేంద్ర కొలువు సొంతం చేసుకునేందుకు చక్కటి అవకాశం ఇది. ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ ఎంటీఎస్(నాన్-టెక్నికల్), హవాల్దార్ పోస్టులు, ఎంపిక విధానం తదితర వివరాలు..

ప్రభుత్వ ఉద్యోగం.. పదో తరగతి మొదలు ప్రొఫెషనల్ డిగ్రీ ఉత్తీర్ణుల వరకు ప్రతి ఒక్కరి లక్ష్యం . పదో తరగతి అర్హతతోనే కేంద్ర కొలువు సొంతం చేసుకునే అవకాశం కల్పిస్తోంది.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఎంటీఎస్(నాన్-టెక్నికల్), హవాల్దార్(సీబీఐసీ, సీబీఎన్) ఎగ్జామినేషన్.

మొత్తం 1,558 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) తాజా నోటిఫికేషన్ ద్వారా కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పలు శాఖల్లో 1,558 పోస్టుల భర్తీకి ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్) పోస్టులు 1,198; సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్ (సీబీఐసీ), సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో 360 హవాల్దార్ పోస్టులు అందుబాటులో ఉన్నాయి.

సదరన్ రీజియన్‌లో 207

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. రీజియన్ల వారీగా ఖాళీలను ప్రకటించింది. తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన సదరన్ రీజియన్‌లో 207 పోస్టులు ఉన్నాయి. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో తమకు ఆసక్తి ఉన్న రీజియన్, పోస్టులను ప్రాధాన్యత క్రమంలో పేర్కొనాల్సి ఉంటుంది. దాని ఆధారంగా పొందిన మార్కులు, ప్రతిభను పరిగణనలోకి తీసుకుని నియామకాలు ఖరారు చేస్తారు.

అర్హత

- పదో తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
- వయసు: ఆయా శాఖల నిబంధనలను అనుసరించి 01.08.2023 నాటికి 18-25 ఏళ్లు, 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు గరిష్ట వయో పరిమితిలో నిబంధనలకు అనుగుణంగా సడలింపు లభిస్తుంది.

మూడు దశల్లో ఎంపిక

ఎస్ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పోస్టులకు ఎంపిక ప్రక్రియ మూడు దశల్లో నిర్వహిస్తారు. అవి.. రాత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్. ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌ను హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకే నిర్వహిస్తారు.

రాత పరీక్ష.. 270 మార్కులు

ఎంటీఎస్, హవాల్దార్ పోస్టుల ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష రెండు సెషన్లుగా 270 మార్కులకు ఉంటుంది. సెషన్ 1లో న్యూమరికల్ ఎబిలిటీ అండ్ మ్యాథమెటికల్ ఎబిలిటీ 20 ప్రశ్నలు-60 మార్కులకు; రీజనింగ్ ఎబిలిటీ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ 20 ప్రశ్నలు-60 మార్కులకు; అలాగే సెషన్ 2లో జనరల్ అవేర్‌నెస్ 25 ప్రశ్నలు-75 మార్కులకు, ఇంగ్లిష్ లాంగ్వేజ్ 25 ప్రశ్నలు-75 మార్కులకు పరీక్ష జరుగుతుంది. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ విధానంలో ఉంటుంది. ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలు అడుగుతారు. ప్రతి సెషన్‌కు కేటాయించిన సమయం 45 నిమిషాలు. రెండో సెషన్‌లో మాత్రం నెగెటివ్ మార్కింగ్ నిబంధన ఉంటుంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు.

13 భాషల్లో రాత పరీక్ష

ఎస్ఎస్‌సీ ఎంటీఎస్, హవాల్దార్ పరీక్షను 13 ప్రాంతీయ భాషల్లో నిర్వహించనున్నారు. హిందీ, ఇంగ్లిష్‌తోపాటు అస్సామీ, బెంగాలీ, గుజరాతీ, కన్నడ, కొంకణి, మళయాళం, మణిపురి, మరాఠి, పంజాబీ, తమిళం, తెలుగు, ఉర్దూ భాషల్లో రాత పరీక్ష ఉంటుంది.

తదుపరి దశ పీఈటీ, పీఎస్‌టీ

రాత పరీక్షలో చూపిన ప్రతిభ, ఆయా విభాగాల్లో నిర్దేశించిన కటాఫ్ మార్కుల ఆధారంగా రాత పరీక్ష విజేతలను ప్రకటిస్తారు. వీరికి తదుపరి దశలో ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్‌లు నిర్వహిస్తారు. ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో భాగంగా నడక పరీక్ష ఉంటుంది. ఇందులో పురుష అభ్యర్థులు 1,600 మీటర్లను 15 నిమిషాల్లో, మహిళా అభ్యర్థులు ఒక కిలో మీటర్ దూరాన్ని 20 నిమిషాల్లో చేరుకోవాల్సి ఉంటుంది.

ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్

- సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ ట్యాక్సెస్ అండ్ కస్టమ్స్, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్‌లో హవాల్దార్ పోస్టుల అభ్యర్థులకు ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో భాగంగా నిర్దేశిత శారీరక ప్రమాణాలు కలిగుండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 157.5 సెం.మీ ఎత్తు ఉండాలి. ఛాతీ విస్తీర్ణం 81 సెం.మీ ఉండాలి. శ్వాస తీసుకున్నప్పుడు అయిదు సెంటీ మీటర్లు విస్తరించాలి.
- మహిళా అభ్యర్థులు కనీసం 152 సెం.మీ ఎత్తు ఉండాలి.

కనీస అర్హత మార్కులు

రాత పరీక్ష నుంచి అభ్యర్థులను తదుపరి దశకు ఎంపిక చేసే క్రమంలో కనీస అర్హత మార్కుల నిబంధన విధించారు. ప్రతి సెషన్‌లో ఓపెన్ కేటగిరీ అభ్యర్థులు 30 శాతం మార్కులు; ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు 25 శాతం మార్కులు; ఇతర రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 20 శాతం మార్కులు సాధించాల్సి ఉంటుంది. అదే విధంగా సెషన్-1లో కనీస అర్హత మార్కులు సాధిస్తేనే.. సెషన్-2 పేపర్ల మూల్యాంకన చేస్తారు. సెషన్-2లో పొందిన ప్రతిభ ఆధారంగానే తుది జాబితా రూపొందిస్తారు.

కొలువు ఖాయమైతే

అన్ని దశల్లోనూ విజయం సాధించి కొలువు ఖరారు చేసుకుంటే.. ప్రారంభంలోనే పే లెవల్-1తో రూ.18,000-రూ.56,900 వేతన శ్రేణిలో నెల వేతనం అందుకోవచ్చు. బేసిక్ పేతోపాటు ఇతర అలవెన్సులు కూడా లభిస్తాయి. దీంతో పాటు అర్హతలు పెంచుకుంటూ ఆయా డిపార్ట్‌మెంట్‌లు నిర్వహించే పరీక్షల్లో ఉత్తీర్ణతతో ఆయా శాఖల్లో సెక్షన్ ఆఫీసర్, సూపరింటెండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

విజయం సాధించాలంటే

సిలబస్‌పై అవగాహన

ప్రిపరేషన్ ప్రారంభించే ముందు.. అభ్యర్థులు సిలబస్‌ను సమగ్రంగా పరిశీలించాలి. పాత ప్రశ్న పత్రాలను విశ్లేషించాలి. దాని ఆధారంగా ప్రిపరేషన్‌కు ఉపక్రమించాలి. ఈ పరీక్షకు సంబంధించి పాత ప్రశ్న పత్రాలను ప్రాక్టీస్ చేయడం ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది. దీనివల్ల పరీక్షల్లో అడిగే ప్రశ్నల శైలిపై అవగాహన ఏర్పడుతుంది.

న్యూమరికల్, మ్యాథమెటికల్ ఎబిలిటీ

ఈ విభాగంలో మంచి మార్కుల కోసం అర్థమెటిక్‌తోపాటు ప్యూర్ మ్యాథ్స్ అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి. నంబర్ సిస్టమ్స్, డెసిమల్స్, ఫ్రాక్షన్స్, పర్సంటేజెస్, రేషియోస్, ఆల్జీబ్రా, ట్రిగ్నోమెట్రీ, లీనియర్ ఈక్వేషన్స్, టాంజెంట్స్ వంటి ప్యూర్ మ్యాథ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి.

రీజనింగ్ ఎబిలిటీ

గుర్తులు, ప్రాబ్లమ్ సాల్వింగ్, రిలేషన్ షిప్, క్లాసిఫికేషన్, నంబర్ సిరీస్, సిమాటిక్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వెన్ డయాగ్రమ్స్, డ్రాయింగ్ ఇన్ఫరెన్సెస్ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ అవేర్‌నెస్

జాతీయ, అంతర్జాతీయ సమకాలీన పరిణామాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమీ,హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ తదితర అంశాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారతదేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలను ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక, వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పదజాలంపైనా పట్టు సాధించాలి. సీహెచ్ఎస్ఎల్ అభ్యర్థులు కరెంట్ అఫైర్స్‌ను కీలకంగా భావించాలి. ముఖ్యమైన సమకాలీన పరిణామాలను ప్రత్యేక శ్రద్ధతో చదవాలి. స్టాక్ జీకేకు సంబంధించి ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు, అవార్డులు-విజేతలు వంటి వాటిని ఔపోసన పట్టాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించేందుకు వ్యాకరణంపై పట్టు సాధించాలి. పార్ట్స్ ఆఫ్ స్పీచ్ మొదలు ప్యాసేజ్ కాంప్రహెన్షన్ వరకూ.. అన్ని రకాల గ్రామర్ అంశాలను అధ్యయనం చేయాలి. ముఖ్యంగా యాక్టివ్ అండ్ పాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, సినానిమ్స్, యాంటానిమ్స్, వన్ వర్డ్ సబ్‌స్టిట్యూషన్‌లపై పట్టు సాధించాలి.

పునశ్చరణ, మోడల్ టెస్టులు

అభ్యర్థులు నిరంతరం పునశ్చరణ కొనసాగించేలా ప్లాన్ చేసుకోవాలి. అదేవిధంగా ఒక టాపిక్ లేదా యూనిట్ చదవడం పూర్తయ్యాక..నమూనా పరీక్షలు, మాక్ టెస్ట్‌లు రాయాలి. క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌లో అర్థమెటిక్‌పై పట్టు సాధించాలి. ఇందుకోసం పదో తరగతి స్థాయిలోని గణిత పుస్తకాలతో తమ ప్రిపరేషన్ ప్రారంభించాలి. వాటి ద్వారా ముందుగా కాన్సెప్ట్‌లపై అవగాహన పెంచుకోవాలి. ఆ తర్వాత అప్లికేషన్ దృక్పథంతో ప్రాక్టీస్ చేయాలి. ఫలితంగా ఆయా అంశాలపై పట్టు లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: జూలై 21, 2023
- దరఖాస్తు సవరణ అవకాశం: జూలై 26-28
- కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ తేదీ: సెప్టెంబర్‌లో నిర్వహించే అవకాశం
- పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.ssc.nic.in

స్టాక్‌ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్‌ ▽	505	65,280
నిఫ్టీ ▽	166	19,332


మరిన్ని బిజినెస్‌ వార్తల కోసం 'సాక్షి ప్లస్‌' చూడండి


విదేశీ సూచీలు

సూచీ	ముగింపు		మార్పు
నాస్‌డాక్‌	13,661	▽	18
డోజోన్స్‌	33,735	▽	187
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,257	▽	24
డాక్స్‌	15,603	△	75
షాంఘై	3,197	▽	9
నికాయ్‌	32,388	▽	385

•అమెరికా •బ్రిటన్‌ •జర్మనీ •చైనా •జపాన్‌

గెట్‌.. సెట్‌.. ఫారిన్‌!





- విదేశాలకు వలస వెళ్లాలంటే చాలా అంశాలపై దృష్టి పెట్టాలి
- ఏ మార్గంలో వెళుతున్నారన్నది కీలకం
- ఒక్కో వీసాకు భిన్నమైన ప్రక్రియ, చార్జీలు
- వెళ్లే ముందే అక్కడి చట్టాలను తెలుసుకోవాలి
- కొన్ని నెలల ఖర్చులకు సరిపడా ఉంచుకోవాలి
- రెండు దేశాల కరెన్సీలను తీసుకెళ్లడం నయం
- ముందస్తు ప్రణాళికతో ఇబ్బందులు దూరం

చక్రవర్తి (40) ఐటీ టెక్నికల్‌ మేనేజర్‌. శుభ్ర (32) ఐటీ బిజినెస్‌ అనలిస్ట్‌. ఈ దంపతులు మెరుగైన ఉద్యోగ అవకాశాల కోసం, నాణ్యమైన జీవితం కోరుకుంటూ 2019లో విదేశానికి వెళ్లిపోయి స్థిరపడాలని నిర్ణయించుకున్నారు. కెనడా శాశ్వత నివాస హోదా కోసం దరఖాస్తు చేసుకున్నారు. చివరికి 2022 మార్చిలో వీరు టొరంటోకు వెళ్లిపోయారు. ఇదొక్క ఉదాహరణ మాత్రమే. విద్యార్థులు ఉన్నత విద్య పేరుతో వెళ్లి, కోర్సు ముగిసిన అనంతరం అక్కడే అవకాశాలు వెతుక్కుని స్థిరపడుతున్నారు. ఇక్కడ కెరీర్‌ మొదలు పెట్టిన వారు కూడా విదేశీ అవకాశాల కోసం అన్వేషిస్తున్నారు. కానీ, వలసపోవడం అంత సులభ ప్రక్రియ కాదు. దానికి చాలా సమయం తీసుకుంటుంది. అనుకున్న గడువు కంటే ముందుగా ఆరంభించాలి. దీనికి ఎన్నో పత్రాలు సమర్పించాలి. ముందస్తు ప్రణాళిక మేరకు నడుచుకుంటే అనుకున్న విధంగా విదేశీయానం సుఖవంతమవుతుంది. ఈ దిశగా ఆలోచన చేసే వారు నిపుణుల సూచనలు తెలుసుకోవడం వల్ల మెరుగైన ప్రణాళిక వేసుకోవడం సాధ్యపడుతుంది.

'ప్యూ రీసెర్చ్‌' అధ్యయనం ప్రకారం ప్రపంచ దేశాల్లో ఉద్యోగ వలసలు భారత్‌ నుంచే ఎక్కువగా ఉంటున్నాయి. ''2020లో 1.79 కోట్ల మంది అంతర్జాతీయ వలసవాదుల మూలాలు భారత్‌లోనే ఉన్నాయి. ఆ తర్వాత 1.12 కోట్ల మంది మెక్సికో, 1.08 కోట్ల మంది రష్యా మూలాలు కలిగి ఉన్నారు''అని 'ప్యూ రీసెర్చ్‌' నివేదిక వెల్లడించింది. మన దేశం నుంచి ఏటా లక్షల సంఖ్యలో విదేశాలకు వలస పోతున్నట్టు ఈ నివేదికలోని గణాంకాలు తెలియజేస్తున్నాయి. ''విదేశీయాన ప్రక్రియను ముందుగా ప్రారంభించాలి. అప్పుడు అది సులభతరం అవుతుంది. ఏదైనా ఊహించని ఘటన ఎదురైనా ఎదురుకావచ్చు. మరో ఆరు నెలల్లో వెళ్లాలని అనుకుంటే ఇప్పుడే ఆ ప్రక్రియను ప్రారంభించాలి''అనిక్యానమ్‌ ఎంటర్‌ప్రైజెస్‌ సీఈవో క్యాలబ్రెస్‌ సూచించారు. క్యానమ్‌ అనేది న్యూయార్క్‌కు చెందిన బహుళజాతి పెట్టుబడుల నిర్వహణ సంస్థ.

వివరాలతో సరైన ప్రణాళిక ఎలా..?

చక్రవర్తి, శుభ్ర 2019లో కెనడా వెళ్లాలని ప్లాన్‌ చేసుకోగా, 2020లో కరోనా రాకతో ఆలస్యం అయింది. కాకపోతే భారత్‌లో వారు పనిచేస్తున్న కంపెనీయే ఇద్దరు బదిలీకి ఏర్పాట్లు చేయడంతో ఆలస్యమైనా సాఫీగా విదేశానికి తరలిపోయారు. కానీ, ప్రతి ఒక్కరికీ ఇలా జరగాలని లేదు. ''కొందరు విద్యార్థులుగానే విదేశాలకు వెళ్లి గ్రాడ్యుయేషన్‌ అయిన వెంటనే ఉద్యోగంలో చేరిపోతారు. కొందరు స్వదేశంలోనే విద్య పూర్తి చేసుకుని నిపుణులుగా తర్వాత విదేశీ ఉద్యోగానికి వెళ్లిపోతుంటారు. కొందరు వ్యాపారవేత్తలుగా వెళ్లి వ్యాపారాలు ప్రారంభిస్తుంటారు. చివరిగా పెట్టుబడి పెట్టడం ద్వారా కూడా విదేశీ పౌరసత్వం సొంతం చేసుకోవచ్చు''అని శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన గ్లోబల్‌గేట్‌ గ్లోబల్‌ బిజినెస్‌ డెవలప్‌మెంట్‌ డైరెక్టర్‌ అభినవ్‌ లోహియా వివరించారు.



విదేశంలో ఉద్యోగం సంపాదించి వలసపోవడం అన్నింటిలోకి ప్రముఖమైనది. 'ఎక్స్‌పాట్‌ ఇన్‌సైడర్‌ 2021' సర్వే ప్రకారం విదేశాల్లో పనిచేస్తున్న 59 శాతం మంది భారతీయులు కెరీర్‌లో మెరుగైన అవకాశాలను వెతుక్కుంటూ వెళ్లినవారే. అంతర్జాతీయంగా ఈ రేటు 47 శాతంగానే ఉంది. ఇలా విదేశాల్లో స్థిరపడిన భారతీయుల్లో 23 శాతం మంది సొంతంగా ఉద్యోగాన్ని వెతుక్కోగా, 19 శాతం మందిని అంతర్జాతీయ సంస్థలు సొంతంగా నియమించుకున్నాయి. 14 శాతం మందిని వారి సంస్థలే పంపించాయి. కేవలం 3 శాతం మంది వ్యాపారం పేరుతో విదేశాలకు వెళ్లి స్థిరపడ్డారు. బ్రిటన్‌ను తీసుకుంటే భారత్‌ నుంచి ఎక్కువమంది స్కిల్డ్‌ వర్కర్‌ వీసా ద్వారానే అక్కడికి వెళుతున్నారు. 2022లో భారతీయులు 1,03,000 యూకే వీసాలను సొంతం చేసుకున్నారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఇది 148 శాతం ఎక్కువ. 2022లో యూకే జారీ చేసిన వర్కర్‌ వీసాల్లో 46 శాతం భారతీయులకే దక్కాయి. జాబ్‌ ఆఫర్‌ ఉన్న వారికే స్కిల్డ్‌ వర్కర్‌ వీసా జారీ చేస్తారు. అభ్యర్థులకు ఇంగ్లిష్‌ ప్రావీణ్యం కూడా ఉండాలి''అని ఏవై అండ్‌ జే అసోసియేట్స్‌ డైరెక్టర్‌ యాష్‌ దుబాల్‌ తెలిపారు.

స్టూడెంట్‌ వీసా ద్వారా విదేశాలకు వెళ్లడం మరో మార్గం. ఇది పరోక్ష మార్గం కిందకు వస్తుంది. సాధారణంగా స్టూడెంట్‌ వీసా గడువు పూర్తయిన తర్వాత, విద్యార్థులు ఏడాది గడువుతో కూడిన విజిట్‌ పాస్‌ పొందొచ్చు. ఈ కాలంలో ఉద్యోగం వెతుక్కోవచ్చు. ఉద్యోగం పొందిన ఆరు నుంచి రెండేళ్ల అనంతరం (వివిధ దేశాల్లో వివిధ కాల వ్యవధి) శాశ్వత నివాస హోదా పొందొచ్చు. స్టూడెంట్‌ వీసా ఖర్చు అన్నది వివిధ దేశాల మధ్య మారిపోతుంటుంది. కొన్ని దేశాల్లో పౌరసత్వం కొనుగోలు చేసుకోవడం మరొక మార్గం. పరిమితి మేరకు పెట్టుబడులు పెట్టడం ద్వారా ఈబీ-5 వీసా తీసుకోవచ్చు. అమెరికాలో ఈబీ-5 వీసా కోసం యునైటెడ్‌ స్టేట్స్‌ సిటిజన్‌షిప్‌ సర్వీస్‌ ప్రాయోజిత ప్రాజెక్టులో పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. అమెరికాకు స్వల్ప వ్యవధిలోనే పౌరసత్వం ద్వారా వెళ్లేందుకు ఉన్న ఏకైక మార్గం ఇది. విద్యార్థులు అయితే యూనివర్సిటీ ర్యాంకింగులు చూడాలి. కెరీర్‌ వృద్ధి, ఉద్యోగ స్థిరత్వాన్ని పరిశీలించాలి. వ్యాపారం ప్రారంభించేందుకు వెళ్లేవారు ముందే విజయావకాశాలను అంచనా వేసుకోవాలి.



వ్యయాలు చూడాలి..

ఏ దేశానికి, ఏ రూపంలో వెళ్లాలనే దాని ఆధారంగా ఖర్చు మారిపోతుంది. ఓ కంపెనీలో పనిచేసే నిపుణుడు అదే కంపెనీ ఉద్యోగిగా వేరే దేశానికి వెళ్లేట్టు అయితే టికెట్‌, రవాణా చార్జీలను పెట్టుకుంటే చాలు. ఇమిగ్రేషన్‌ చార్జీలను కంపెనీలే భరిస్తాయి. వీసా, లీగల్‌ ఫీజు వంటి ఇతర వ్యయాలు కూడా ఉంటాయి. ''నా స్నేహితులు కొందరు ఉద్యోగం కోసం ఇక్కడకు (కెనడాకు) వచ్చారు. తగిన ఉద్యోగం వెతుక్కునేందుకు కొన్ని నెలల పాటు ఇక్కడ ఉండాల్సి వచ్చింది. ఇక్కడ అద్దెలు చాలా ఎక్కువ. కనుక ఇక్కడకు వచ్చే వారు ముందుగానే ఈ ఖర్చుల గురించి తెలుసుకోవాలి. అందుకు సరిపడా బ్యాంకు ఖాతాలో డిపాజిట్‌ చేసుకుని రావాలి. తమ ఖర్చులకు సరిపడా డబ్బు ఉన్నట్టు ఆధారాలు కూడా చూపించాలి''అని శుభ్ర తెలిపారు. కెనడాకు వెళ్లాలంటే ఒక వ్యక్తికి ఎంతలేదన్నా 15,500 కెనడియన్‌ డాలర్లు కావాలి. అదే దంపతులకు అయితే 21,000 డాలర్లు, పిల్లలతో వెళ్లాలంటే 30,000 డాలర్లు అవసరమవుతాయి. అమెరికాకు వెళ్లాంటే గ్రీన్‌ కార్డ్‌ కోసం కనీసం 1.8 మిలియన్‌ డాలర్ల పెట్టుబడి అవసరం అవుతుంది. అదే ఆస్ట్రేలియాకు వెళ్లాలంటే నలుగురు సభ్యుల కుటుంబానికి 30,000 నుంచి 40,000 ఆస్ట్రేలియన్‌ డాలర్లు కావాలి. ''ఈబీ-5 వీసా కోసం పెట్టుబడి వేర్వేరుగా ఉంటుంది. అమెరికా అయితే ఈబీ-5 వీసా ఖర్చు 8 లక్షల డాలర్లు. కెనడా అయితే 12 లక్షల కెనడియన్‌ డాలర్లు. ఈబీ-5 వీసాకు ముందు లోతైన పరిశీలన ఉంటుంది. సంబంధిత వ్యక్తి చేసే పెట్టుబడులకు మూలాలు, ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారన్నది చూస్తారు. దీనికి అదనంగా అమెరికాలో పరిపాలనా, న్యాయపరమైన చార్జీలు 75,000 డాలర్లు అవుతాయి. అటార్నీ ఫీజులు 10,000-20,000 డాలర్లు పెట్టుకోవాలి. అదే యూకే అయితే స్కిల్డ్‌ వర్కర్‌ వీసా కోసం దరఖాస్తు ఫీజు 625 నుంచి 1,423 బ్రిటిష్‌ పౌండ్లు ఉంటుంది. హెల్త్‌కేర్‌ సర్‌చార్జీ మరో 624 బ్రిటిష్‌ పౌండ్ల వరకు ఉంటుంది. కస్టమ్స్‌ డ్యూటీ, హోటల్‌ తదితర చార్జీలను కూడా దృష్టిలో పెట్టుకోవాలి.

వెళ్లే ముందుగా..

''విదేశానికి వలస వెళ్లే వరకు రెండు దేశాల కరెన్సీని దగ్గర ఉంచుకోవాలి. ఎందుకంటే కొత్త దేశానికి వెళ్లి సెటిల్‌ అవ్వడానికి ఎంత సమయం పడుతుందో తెలియదు. నివసించే దేశానికి సంబంధించి పన్ను నిబంధనలు, పౌర చట్టాల గురించి తెలుసుకోవాలి. విదేశాల్లో నివాస ప్రమాణాలు చాలా ఎక్కువ. కనుక తగినన్ని నిధులు సిద్ధం చేసుకుని వెళ్లాలి. పెద్ద మొత్తంలో ఖర్చులు ఎదురుకావచ్చు'' అని ఎప్సిలాన్‌ మనీ మార్ట్‌ ప్రాడక్ట్స్‌ హెడ్‌ నితిన్‌ రావు సూచించారు. ఇక బీమా తీసుకోవడం కూడా మర్చిపోవద్దు. చాలా దేశాల్లో దీన్ని తీసుకోవడం తప్పనిసరిగా అమల్లో ఉంది. తీసుకునే బీమాలో వేటికి కవరేజీ ఉంది, లేనిదీ తెలుసుకోవాలి. విదేశాలకు వెళ్లిన తర్వాత భారత్‌లో కేవైసీల్లో మార్పులు చేసుకోవాల్సి ఉంటుంది. దేశీయంగా పెట్టుబడులు కలిగిన ఆర్థిక సంస్థలకు విదేశాల్లోని చిరునామా ఇవ్వాలి. ఎన్‌ఆర్‌ఐగా హోదా మార్చుకోవాలి. అప్పుడు స్వదేశంలో పెట్టుబడులు, పన్నుల బాధ్యతలు కొనసాగించుకోవచ్చు. విదేశాలకు తరలిపోయే వారు స్వదేశంలో విలువ తరిగిపోయే ఆస్తులను వదిలించుకుని వెళ్లడమే సరైనది. విలువ పెరిగే రియల్‌ ఎస్టేట్‌ వంటి ఆస్తులు ఉంటే వాటి సంరక్షణ బాధ్యతలను ఎవరో ఒకరు చూసేలా ఏర్పాటు చేసుకోవాలి. ఇలా అన్ని అంశాలను సమగ్రంగా తెలుసుకుని, అన్నీ విచారించుకుని, తగిన ప్రణాళికతో బయల్దేరితే విదేశీయానం సుఖవంతమవుతుంది.

క్యూ1 బిజినెస్‌ ఇండికేటర్స్‌ సానుకూలం: సీఐఐ సర్వే



న్యూఢిల్లీ: సీఐఐ బిజినెస్‌ కాన్ఫిడెన్స్‌ ఇండెక్స్‌ ఏప్రిల్‌-జూన్‌ (క్యూ1) త్రైమాసికంలో సానుకూలంగా నమోదయ్యింది. జనవరి-మార్చి మధ్య 64 వద్ద సూచీ ఉంటే, క్యూ1లో ఇది 66.1కి పెరిగింది. జీఎస్టీ వసూళ్లు, విమాన- రైలు ప్రయాణీకుల ట్రాఫిక్‌ వంటి అధిక ఫ్రీక్వెన్సీ సూచికల్లో ఆశావహ ధోరణి నమోదయ్యింది. ఈ మేరకు జరిగిన బిజినెస్‌ ఔట్‌లుక్‌ సర్వేలో 180కి పైగా సంస్థల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. మెజారిటీ సంస్థల ప్రతినిధులు (63 శాతం) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో (2023-24) భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 6.7 శాతంగా ఉంటుందని అంచనా వేస్తు న్నా యి. 2022-23లో సంవత్సరంలో ఈ రేటు 7.2 శాతంగా ఉన్న సంగతి తెలిసిందే. 2022-23కన్నా వృద్ధి రేటు తగ్గడానికి ప్రపంచ ఆర్థిక అనిశ్చితి పరిస్థితులే కారణమని సర్వే పేర్కొంది. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మొత్తం రెపో రేటును (బ్యాంకులకు తానిచ్చే రుణాలపై ఆర్‌బీఐ వసూలు చేసే వడ్డీరేటు) ఆర్‌బీఐ 6.5 శాతం వద్దే యథాతథంగా కొనసాగిస్తుందన్న అభిప్రాయాన్ని 53 శాతం సంస్థల ప్రతినిధులు వ్యక్తం చేశారు. ప్రైవేటు ఇన్వెస్ట్‌మెంట్‌ పరిస్థితులు మెరుగుపడుతున్నాయన్న అభిప్రాయాన్ని 65 శాతంమంది వ్యక్తం చేశారు.

సోనా కామ్‌స్టార్‌ | ఎల్‌కేపీ సెక్యూరిటీస్‌ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 535

టార్గెట్‌: రూ. 624



ఎందుకంటే: ఆటో విడిభాగాల దిగ్గజం సోనా బీఎల్‌డబ్ల్యూ ప్రెసిషన్‌ ఫోర్జింగ్స్‌(సోనా కామ్‌స్టార్‌) ఆదాయంలో డిఫరెన్షియల్‌ గేర్స్‌(32 శాతం), డిఫరెన్షియల్‌ అసెంబ్లీస్‌(23%), హైబ్రిడ్‌లకు స్టార్టర్‌ మోటార్స్‌(20%), ఐసీఈ స్టార్టర్‌ మోటార్స్‌ (16%), 2వీలర్‌ ఈవీ ట్రాక్షన్‌ మోటార్స్‌(4%) చొప్పున వాటా ఆక్రమిస్తున్నాయి. ఇక ఎగుమతుల వాటా 71%కాగా.. యూఎస్‌, యూరప్‌ అతిపెద్ద మార్కెట్లుగా నిలుస్తున్నాయి. వేగవంత వృద్ధిలో ఉన్న ఎలక్ట్రిక్‌ వాహనాల(ఈవీ) విభాగం కంపెనీకి అదనపు బలాన్నివ్వనుంది. ప్రస్తుత ఆర్డర్‌ బుక్‌ రూ. 21,500 కోట్లలో ఈవీ నుంచే 77% లభించడం ఈ అంశాన్ని ధ్రువ పరుస్తోంది. కాగా.. సంప్రదాయ డిఫరెన్షియల్‌ విభాగంలోనూ కంపెనీ పటిష్ట పనితీరు చూపుతోంది. అంతేకాకుండా ఇతర విభాగాలైన ఈడీఎల్‌, ఏడీఏస్‌(ఇటీవ ల కొనుగోలు చేసిన నోవెలిక్‌ ద్వారా) ప్రొడక్టులలోనూ వృద్ధిని సాధిస్తోంది. అయితే ఐసీఈపై ఆధారపడుతున్న నేపథ్యంలో స్టార్టర్‌ మోటార్‌ బిజినెస్‌ నీరసిస్తోంది. అయినప్పటికీ జోరు చూపుతున్న ఈవీ బిజినెస్‌ ఈ లోటును పూడ్చుతోంది. తేలికపాటి వాహనాల(లైట్‌ వెహికల్స్‌) ఎలక్ట్రిఫికేషన్‌ ద్వారా కంపెనీ లబ్ధి పొందనుంది. డ్రైవర్‌లైన్‌, మోటార్స్‌ విభాగాలు ఇందుకు సహకరించనున్నాయి. ఈవీ విభాగంలో పలు ప్రొడక్టులను ప్రవేశపెట్టనుండటంతో మార్కెట్లతో సంబంధంలేకుండా పురోగతిని సాధించే వీలుంది. ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక(పీఎల్‌ఐ) పథకంలో భాగంగా ఈ ఏడాది(2023-24) ప్రొడ క్టులకు అనుమతి లభిస్తే వచ్చే వచ్చే ఏడాది (2024-25) నుంచి అదనపు లబ్ధిని చేకూర్చనుంది.

ఎస్‌బీఐ | మోతీలాల్‌ ఓస్వాల్‌ ఫైనాన్షియల్‌ | కొనొచ్చు

ప్రస్తుత ధర: రూ. 593

టార్గెట్‌: రూ. 700



ఎందుకంటే: పీఎస్‌యూ దిగ్గజం స్టేట్‌బ్యాంక్‌ ఆఫ్‌ ఇండియా(ఎస్‌బీఐ) గత ఆర్థిక సంవత్సరానికి(2022-23) వెలువరించిన వార్షిక నివేదికలో బ్యాలన్స్‌షీట్‌ను నిరంతరంగా పటిష్టపరచుకుంటున్న అంశాన్ని హైలైట్‌ చేసింది. నాయకత్వ స్థాయిని నిలుపుకుంటూ రావడంతోపాటు నిలకడగా మెరుగైన ఆర్‌వోఈని సాధిస్తున్నట్లు తెలియజేసింది. అత్యుత్తమ లోన్‌బుక్‌ను నిర్మించడంపై బ్యాంక్‌ ప్రత్యేక దృష్టిని కొనసాగిస్తోంది. ఒత్తిడికలిగిన ఆస్తులు(రుణాలు) తగ్గుతూ రావడం, పీసీఆర్‌ మెరుగుపడుతుండటం, గతేడాది రుణాల్లో నమోదైన 17 శాతం వృద్ధి తదితర అంశాలు లోన్‌ బుక్‌పై ప్రత్యేక దృష్టిని ప్రతిబింబిస్తున్నాయి. రిటైల్‌ రుణ విభాగం పన్నుకుముందు లాభం(పీబీటీ) రెండున్నర రెట్లు జంప్‌చేయగా.. కార్పొరేట్‌ విభాగం పీబీటీ అంతక్రితం ఏడాది(2021-22)లో 5 రెట్లు ఎగసింది. వెరసి గత 2020-23 మధ్య కాలంలో ఎస్‌బీఐ ఆర్జన వార్షిక ప్రాతిపదికన 51 శాతం దూసుకెళ్లింది. ఫలితంగా మార్చితో ముగిసిన గతేడాది బ్యాంక్‌ చరిత్రలోనే తొలిసారి రూ. 50,000 కోట్లకుపైగా నికర లాభాన్ని అందుకుంది. ఇక డిజిటల్‌ విభాగంలోనూ ఆకర్షణీయ పురోగతి సాధిస్తూ వస్తోంది. యోనో 14.3 కోట్ల డౌన్‌లోడ్స్‌ ద్వారా సరికొత్త రికార్డులకు తెరతీసింది. 6 కోట్ల రిజిస్టర్డ్‌ వినియోగదారులతో రోజుకి సగటున 10.3 మిలియన్‌ లాగిన్స్‌ ద్వారా చరిత్ర సృష్టిస్తోంది. గతేడాది రూ. 24,300 కోట్ల విలువైన 1.39 మిలియన్ల డిజిటల్‌ రుణాలు మంజూరు చేసింది. యోనో ద్వారా 64 శాతం పొదుపు ఖాతాలను తెరిచింది. ఆస్తుల(రుణాలు) నాణ్యతను మరింత మెరుగుపరచుకుంటూ పీసీఆర్‌ను 76 శాతానికి(కార్పొరేట్‌ బుక్‌లో 98.6 శాతం) చేర్చుకుంది.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్‌ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

డిజిటల్‌ ఎకానమీ అధ్యయనంపై కేంద్రం దృష్టి

ఏజెన్సీ నియామకంపై కసరత్తు

న్యూఢిల్లీ: దేశీ డిజిటల్‌ ఎకానమీ రాబోయే రోజుల్లో భారీ స్థాయిలో వృద్ధి చెందనుందన్న అంచనాలను నెలకొన్న నేపథ్యంలో ప్రస్తుత వాస్తవిక పరిమాణం ఎంత ఉందో తెలుసుకోవడంపై కేంద్రం దృష్టి పెట్టింది. దీనిపై అధ్యయనం చేసేందుకు కన్సల్టెన్సీని నియమించనున్నట్లు అధికారిక డాక్యుమెంటులో వెల్లడైంది. దీని ప్రకారం ఏజెన్సీల నుంచి కేంద్ర ఎలక్ట్రానిక్స్‌, ఐటీ శాఖ (మెయిటీ) దరఖాస్తులను (ఆర్‌ఎఫ్‌పీ) ఆహ్వానించనుంది. ఎంపికయ్యే సదరు ఏజెన్సీ తొమ్మిది నెలల వ్యవధిలో.. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం నుంచి 2029-30 వరకు డిజిటల్‌ ఎకానమీ పరిమాణం, అంచనాల గురించి ముసాయిదా నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. మదింపు ప్రక్రియలో భాగంగా రాష్ట్రాల ర్యాంకులు, డిజిటల్‌ ఎకానమీలో వాటి వాటా, అలాగే ఈ-కామర్స్‌, కొత్త టెక్నాలజీల ప్రభావం మొదలైన అంశాలను కూడా నివేదికలో పొందుపర్చాలి. దేశీ డిజిటల్‌ ఎకానమీ 2025 నాటికల్లా 1 లక్ష కోట్ల డాలర్ల స్థాయికి వృద్ధి చెందగలదన్న అంచనాల నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది.




కోడిగుడ్లు (హోల్‌సేల్‌-నెక్‌ / 100కు రూ.లలో)

10-7-2023	
విశాఖ	435-00
చిత్తూరు	523-00
ఈస్ట్‌, వెస్ట్‌ గోదావరి	425-00
విజయవాడ	425-00
రిటైల్‌ ధర (డజను)	72.00
9-7-2023 ఫామ్‌ ధర...	
హైదరాబాద్‌	425-00
వరంగల్‌	427-00
రిటైల్‌ ధర	5.10

స్థిరాదాయాన్నిచ్చే మార్గాలు ఏమిటి..?

Q & A



ధీరేంద్ర కుమార్‌
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్‌

నా వయసు 62 ఏళ్లు. స్థిరమైన ఆదాయం కోసం పెట్టుబడులు పెట్టాలనుకుంటున్నాను. అందుబాటులో ఉన్న మార్గాలు ఏవి?

– నారాయణ్‌

విశ్రాంత జీవనాన్ని ప్రశాంతంగా గడపాలంటే అందుకు తగినంత నిధిని సమకూర్చుకుని ఉండాలి. ఈ నిధి నుంచి క్రమం తప్పకుండా ఆదాయం పొందడం ద్వారా సౌకర్యవంతమైన జీవితాన్ని గడపొచ్చు. సీనియర్‌ సిటిజన్లు సహజంగా సంప్రదాయ మార్గాలనే ఎంపిక చేసుకుంటూ ఉంటారు. అత్యవసరాల్లో కావాల్సినప్పుడు వెంటనే పొందే లిక్విడిటీ కూడా ఉండాలని కోరుకుంటారు. ఇన్వెస్ట్‌ చేయడానికి ముందు ప్రతీ నెలా ఎంత మొత్తం కావాలో నిర్ణయించుకోవాలి. ఇతర మార్గాల ద్వారా ఏదైనా ఆదాయం వస్తుంటే దానిని కూడా పరిగణనలోకి తీసుకోవాలి. అంటే అద్దె రూపంలో ఆదాయం, పెన్షన్‌ లేదా మరొకటి కావచ్చు. ఏటా ఎంత మొత్తం పెట్టుబడి నుంచి కావాలో స్పష్టతకు రావాలి. ఒకవేళ ఏటా 4-6 శాతానికంటే ఎక్కువ కోరుకుంటుంటే అంచనాలను తగ్గించుకోవాల్సిందే. ఉదాహరణకు మీ పెట్టుబడి నిధి రూ.కోటి ఉందనుకుంటే వార్షికంగా ఉపసంహరించుకునే మొత్తం రూ.6 లక్షలకు మించి ఉండకూడదు. ఒకవేళ 6 శాతానికి మించి వెనక్కి తీసుకుంటే కనుక ఆ తర్వాతి సంవత్సరాల్లో తక్కువ ఆదాయానికి సిద్ధం కావాల్సిందే. ద్రవ్యోల్బణాన్ని విస్మరించడానికి లేదు. నేడు నెలవారీ ఖర్చులకు రూ.50,000 సరిపోతుంటే.. 5, 10, 15 ఏళ్ల తర్వాత ఈ మొత్తం చాలదు. ఆ సమయంలో ఇంకాస్త అధికంగా కావాల్సి ఉంటుంది. అందుకనే రిటైర్మెంట్‌ తీసుకున్న వారు ద్రవ్యోల్బణాన్ని తట్టుకుని రాబడులను ఇచ్చే మార్గాలను చూసుకోవాలి. అందుకని రిటైర్మెంట్‌ తర్వాత కూడా ఈక్విటీల్లో పెట్టుబడులు కొనసాగించాలి. అప్పుడే దీర్ఘకాలంలో ద్రవ్యోల్బణం మించి రాబడులకు అవకాశం ఉంటుంది. పెట్టుబడుల మొత్తాన్ని ఈక్విటీల్లో ఇన్వెస్ట్‌ చేయకూడదు. 30-40 శాతం చాలు. మిగతా మొత్తాన్ని ఫిక్స్‌డ్‌ ఇన్‌కమ్‌ సాధనాల్లోనే ఉంచాలి. ప్రభుత్వ హామీతో కూడిన పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. సీనియర్‌ సిటిజన్స్‌ సేవింగ్స్‌ స్కీమ్‌ (ఎస్‌సీఎస్‌ఎస్‌), పోస్టాఫీసు నెలవారీ ఆదాయ పథకాలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వాలి. ఒక ఇన్వెస్టర్‌ ఈ పథకాలు అన్నింటిలోనూ కలిపి రూ.24.5 లక్షలు ఇన్వెస్ట్‌ చేసుకోవచ్చు. మిగిలిన మొత్తాన్ని అధిక నాణ్యతతో కూడి డెట్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్‌ చేసుకోవాలి. మొత్తం పెట్టుబడుల్లో ఈక్విటీల వాటా 30-40 శాతం మేర ఉండేలా ఏడాదికోసారి పెట్టుబడులను మార్పులు (అస్సెట్‌ రీబ్యాలన్స్‌) చేసుకోవాలి.



ఆర్థిక ప్రణాళికను రూపొందించుకునే విషయంలో ఏ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి?

– రేవతి

మీ అవసరాలకు అనుగుణమైన ప్రణాళికను రూపొందించుకోవడమే ప్రాథమిక కర్తవ్యంగా ఉండాలి. చేతిలో అవసరాలకు కొంత నగదు, అత్యవసర నిధి ఏర్పాటు, జీవిత బీమా, ఆరోగ్య బీమాకు చోటు ఇవ్వాలి. ఆ తర్వాత మీ ఆకాంక్షల విషయానికి రావాలి. మీ పొదుపు, పెట్టుబడులకు స్థాయికి తగ్గట్టు వీటిని మార్చుకోవచ్చు. ఆర్థిక ప్రణాళిక రూపొందించుకునేందుకు కచ్చితమైన సూచనలు అంటూ ఉండవు. ఒక్కొక్కరికి సంబంధించి ఒక్కో రకంగా ఉంటుంది. ఎవరికి వారు తమ అవసరాలకు తగ్గట్టుగా దీన్ని డిజైన్‌ చేసుకోవాలి.

క్లుప్తంగా...

అరుదైన పాము 'కామన్‌కుక్రి' పట్టివేత

అంతరిస్తున్న పాము జాతుల్లో ఒకటిగా గుర్తింపు



జడ్చర్ల టౌన్: మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఆదివారం కామన్‌కుక్రి అనే అరుదైన పామును పట్టుకున్నారు. పట్టణంలోని వెంకటేశ్వరకాలనీలో ఓ వ్యాపారి ఇంట్లోకి పాము చొరబడగా ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు సర్ప రక్షకుడు డాక్టర్ సదాశివయ్యకు ఫోన్ ద్వారా సమాచారం అందించారు. దీంతో ఆయన తన శిష్యుడు, బీజెడ్సీ విద్యార్థి రాహుల్‌ను పంపించగా.. ఆయన పామును పట్టుకుని కళాశాలకు తీసుకెళ్లారు. కామన్‌కుక్రి పాము ప్రమాదకరం కాదని, అయితే అవి ఈ ప్రాంతంలో తక్కువ సంఖ్యలో సంచరిస్తాయని సదాశివయ్య చెప్పారు. కుక్రి పామును అంతరించిపోతున్న పాముల్లో ఒకటిగా ఐయూసీఎన్ (ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్- అంతర్జాతీయ ప్రకృతి సంరక్షణ సంస్థ) గుర్తించింది. ఈ పాము ఎక్కువగా చెత్తాచెదారంలో ఉండి సాయంత్రం సమయంలో బయటకు వస్తుందని, విషరహిత సర్పమని పేర్కొన్నారు.

వ్యవసాయ మహిళా డిగ్రీ కాలేజీల్లో ప్రవేశాలకు దరఖాస్తులు

సాక్షి, హైదరాబాద్: మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ (ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ఈఐఎస్) తన పరిధిలోని వ్యవసాయ మహిళా డిగ్రీ కళాశాలల్లో బీఎస్సీ(ఆనర్స్)లో మొదటి ఏడాది ప్రవేశాలకు విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ఎంసెట్-2023 ర్యాంకుల ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామని, బీసీ గురుకుల వెబ్‌సైట్‌లో ఈనెల 31 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని సొసైటీ కార్యదర్శి మల్లయ్య భట్టు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 040-23328266కు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని ఆయన సూచించారు.

గ్రామంలోకి అడవిబర్రె




ఏటూరునాగారం (ములుగు జిల్లా) : ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని శివాపురం దట్టమైన అటవీప్రాంతం నుంచి అడవి బర్రె శనివారం గ్రామంలోకి వచ్చి హల్‌చల్ చేసింది. దానిని చూసి ఆందోళన చెందిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారమివ్వగా...అధికారులు వచ్చి దానిని మళ్లీ అడవిలోకి పంపించారు. దారితప్పి గ్రామంలోకి వచ్చిందని, ఎవరూ ఆందోళన చెందనవసరంలేదని అటవీ అధికారులు సూచించారు.

ఎంసెట్ కౌన్సెలింగ్‌కు దూరంగా టాపర్లు!

ఇంతవరకూ రిజిస్ట్రేషన్ చేసుకోని మెరిట్ విద్యార్థులు

- రిజిస్ట్రేషన్లలో 200లోపు ర్యాంకు వారు సున్నా.. 300లోపు వారు ఒక్కరే
- టాప్ 1000 ర్యాంకర్లలో 23 మందే..
- ముందుకొచ్చినవారిలో 50వేలపైన ర్యాంకు వారే ఎక్కువ



సాక్షి, హైదరాబాద్: ఎంసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన విద్యార్థుల్లో చాలా మంది కౌన్సెలింగ్‌కు దూరంగా ఉన్నారు. ఎలాంటి ఆప్షన్లు ఇవ్వకపోవడమే కాదు, కనీసం రిజిస్ట్రేషన్ కూడా చేసుకోలేదు. టాప్-200లోపు ర్యాంకర్లలో ఒక్కరు కూడా ఎంసెట్ కౌన్సెలింగ్ జోలికి వెళ్లలేదు. 300లోపు ర్యాంకర్లలో కేవలం ఒక్కరు, 1000లోపు ర్యాంకర్లలో 23 మంది మాత్రమే రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 50వేల నుంచి 2.5 లక్షల వరకు ర్యాంకులు వచ్చినవారే ఎక్కువగా కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. రాష్ట్ర ఎంసెట్ విభాగం ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ వివరాలను వెల్లడించింది. ఇప్పటివరకు మొత్తం 81,856 మంది కౌన్సెలింగ్‌కు రిజిస్టర్ చేసుకున్నారు. వారు ఈ నెల 12వ తేదీ వరకు ఆప్షన్లు ఇవ్వడానికి సమయం ఉంది. సాధారణంగా ఎంసెట్‌లో మంచి ర్యాంకు వచ్చిన విద్యార్థులు జేఈఈ మెయిన్స్‌లోనూ మంచి ర్యాంకు సాధిస్తుంటారు. జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో సీట్ల కోసం ప్రయత్నిస్తారు. అందుకే ఎంసెట్ కౌన్సెలింగ్‌కు దూరంగా ఉంటుంటారు. అయితే రిజిస్ట్రేషన్ చేసుకున్నా ఈ నెల 12లోపు ఆప్షన్లు ఇవ్వకపోతే సీట్లు కోల్పోయే అవకాశం ఉంటుంది.

42వేల కంప్యూటర్ ఇంజనీరింగ్ సీట్లు

రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,07,039 ఇంజనీరింగ్ సీట్లు ఉన్నాయి. ఇందులో తొలి విడత కౌన్సెలింగ్‌లో 76,359 సీట్లను చేర్చారు. మిగతావి యాజమాన్య కోటా కింద భర్తీ చేస్తారు. కన్వీనర్ కోటా కింద భర్తీ చేస్తున్న సీట్లలో ఏకంగా 42,087 వరకు కంప్యూటర్ ఇంజనీరింగ్ సీట్లే ఉన్నాయి. విద్యార్థుల నుంచి వస్తున్న డిమాండ్ మేరకు ఇటీవలే.. సీఎస్‌సీ, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, ఇతర కంప్యూటర్ కోర్సుల్లో సీట్లు పెంచారు.

ఏ వర్సిటీ పరిధిలో ఎన్ని సీట్లు?

యూనివర్సిటీ	కాలేజీలు	కన్వీనర్ కోటా సీట్లు
ఉస్మానియా	14	6,986
జేఎన్‌టీయూహెచ్	138	62,280
కాకతీయ	3	934
ప్రైవేటు వర్సిటీలు	18	6,159

ప్రధాన బ్రాంచీల్లో ఉన్న సీట్ల సంఖ్య	బ్రాంచి	సీట్లు
	సివిల్ ఇంజనీరింగ్	3,777
	ఎలక్ట్రికల్-ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్	4,636
	మెకానికల్ ఇంజనీరింగ్	3,441
	కంప్యూటర్ సైన్స్ కోర్సులన్నీ కలిపి	42,087

(మిగతా సీట్లు ఇతర వివిధ బ్రాంచీల్లో ఉన్నాయి)

ర్యాంకుల వారీగా కౌన్సెలింగ్‌కు రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి సంఖ్య

ర్యాంకు	రిజిస్టర్ చేసుకున్న వారి సంఖ్య
1-200	0
201-300	1
301-400	2
401-500	11
501-600	18
601-700	11
701-800	17
801-900	21
901-1000	23
1001-2000	391
2001-3000	541
3001-4000	617
4001-5000	640
5001-10000	3,369
10001-20000	6,604
20001-30000	6,520
30001-50000	12,278
50001-100000	25,888
100001 పైన	24,904

ఏదైనా ఊరెళ్తున్నాం.. బస్సులోనో, రైల్లోనో అయితే వెంటనే స్మార్ట్‌ఫోన్ బయటికి తీయడం, ఏ సినిమాలో, వెబ్ సిరీస్‌లో చూడటం, సోషల్ మీడియాలో కాలక్షేపం చేయడం కనిపించేదే. అదే మరి విమానాల్లో అయితే..!? టవర్ సిగ్నల్స్ ఉండవు. ఉన్నా ఫోన్‌ను ఫ్లైట్ మోడ్‌లో పెట్టాల్సిందే. దీంతో ఫోన్ మెమరీలో ఉన్న వీడియోలు చూస్తూనో, పాటలు వింటూనో గడిపేయాల్సిందే. గంటా గంటన్నర జర్నీ అయితే ఓకేగానీ.. ఆరేడు గంటలకుపైన ప్రయాణించాల్సి వస్తే కష్టమే. అదే విమానాల్లో వైఫై ఉంటే కాసింత కాలక్షేపం.



విమానాల్లో.. వైఫై ప్లీజ్!



దేశాలు, సముద్రాలు దాటేస్తూ వెళ్లే విమానాల్లో ఇంటర్నెట్ ఎలా?

- ఇప్పటికే కొంతమేర ఉన్నా స్పీడ్ మరీ తక్కువ
- సుదూర ప్రయాణాలు చేసే వారికి ఇబ్బంది
- ఈ సమస్య తీర్చేందుకు తెరపైకి సరికొత్త ఇంటర్నెట్ సంస్థలు

రెండు రకాలుగా ఇంటర్నెట్

విమానాల్లో వైఫై ద్వారా ఇంటర్నెట్ ఇచ్చేందుకు రెండు రకాల అవకాశాలు ఉన్నాయి. ఒకటేమో ఇప్పుడు మనం స్మార్ట్‌ఫోన్లలో వాడుతున్నట్టుగా టెలికాం టవర్ల నుంచి సిగ్నల్ అందుకోవడం. రెండోది శాటిలైట్ల ద్వారా ఇంటర్నెట్‌కు అనుసంధానం కావడం.

→ టెలికం సిగ్నల్స్ నుంచి ఇంటర్నెట్ పొందే విమానాలకు దిగువ భాగంలో యాంటెన్నాలు ఉంటాయి. భూమ్మీద ఉన్న టెలికాం టవర్ల నుంచి సిగ్నల్స్ అందుకుంటూ ఇంటర్నెట్ వాడుతారు. అయితే ఇలాంటి వాటిలో అడవులు, ఎడారులు, సముద్రాల మీదుగా ప్రయాణించిన సమయంలో సిగ్నల్స్ ఉండవు.

→ శాటిలైట్‌కు అనుసంధానమై ఇంటర్నెట్ పొందే విమానాలకు పైభాగంలో యాంటెన్నాలు ఉంటాయి. ఈ ఇంటర్నెట్‌కు సిగ్నల్ సమస్యేదీ ఉండదు. కానీ అందుబాటు తక్కువ. ఖర్చు చాలా ఎక్కువ.

→ దాదాపు అన్ని దేశాలు యుద్ధ విమానాలు, ప్రత్యేక విమానాల్లో మాత్రం శాటిలైట్ కనెక్షన్‌ను వినియోగిస్తున్నాయి.



చాలా విమానాల్లో ఇంటర్నెట్.. బాగా స్లో

ప్రస్తుతం విమానాల్లో కొంతవరకు వైఫై సదుపాయం ఉన్నా.. దాని వేగం అత్యంత తక్కువ. ఎందుకంటే చాలా వరకు ప్రయాణికుల విమానాల్లో టెలికాం టవర్లకు అనుసంధానమయ్యే పరికరాలే ఉంటున్నాయి. వీటి నుంచి వచ్చే కాస్త ఇంటర్నెట్ స్పీడ్‌నే వైఫై ద్వారా అందిస్తున్నారు. విమానంలోని వారంతా ఆ స్పీడ్‌నే పంచుకోవాల్సి ఉంటుంది. దీనితో ఇంటర్నెట్ బాగా స్లోగా వస్తుంది.

విమానాల్లో ఇంటర్నెట్ కోసం ప్రత్యేకంగా..

విమానాల్లో ఇంటర్నెట్ కోసమంటూ ఇటీవలే ప్రత్యేక సంస్థలు తెరపైకి వస్తున్నాయి. అందులో 'గోగో కమర్షియల్ ఏవియేషన్' ఒకటి. ఇది ప్రపంచవ్యాప్తంగా శాటిలైట్ సేవలు అందించే ఇంటెల్‌శాట్ కంపెనీకి అనుబంధ సంస్థ. అత్యంత అధునాతనమైన '2కేయూ వ్యవస్థ'తో విమానాల్లో వేగవంతమైన ఇంటర్నెట్‌ను అందిస్తోంది.



gogo COMMERCIAL AVIATION

→ ప్రపంచ కుబేరుడు ఎలన్ మస్క్‌కు చెందిన శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థ 'స్టార్ లింక్' కూడా.. సముద్రాలు, ఎడారులు, ధ్రువ ప్రాంతాలు అనే తేడా లేకుండా భూమ్మీద అన్నిచోట్లా వేగవంతమైన ఇంటర్నెట్ అందిస్తామంటూ తెరపైకి వచ్చింది.

→ ఇలాంటి శాటిలైట్ ఇంటర్నెట్ సంస్థలు రావడం, ఆ ఇంటర్నెట్‌కు అయ్యే వ్యయం కూడా తగ్గుతుండటంతో విమానయాన సంస్థలు తమ అంతర్జాతీయ, దేశీయ విమానాల్లో వైఫైను అందించేందుకు ముందుకు వస్తున్నాయి.

- సాక్షి సెంట్రల్ డెస్క్

1998 డీఎస్సీ క్వాలిఫైడ్‌లకు ఉద్యోగాలివ్వాలి

డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ విజ్ఞప్తి



మృతి చెందిన 100 మంది క్వాలిఫైడ్‌లకు నివాళులర్పిస్తున్న అభ్యర్థులు

పంజగుట్ట (హైదరాబాద్): వచ్చే ఆగస్టు 15వ తేదీలోపు 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చి, స్వాతంత్ర్య వేడుకలను పాఠశాలల్లో నిర్వహించుకునేలా ముఖ్యమంత్రి కేసీఆర్ చొరవచూపాలని 1998 డీఎస్సీ సాధన సమితి రాష్ట్ర అధ్యక్షుడు కె.శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అనేక సార్లు తమను ఉద్యోగాల్లోకి తీసుకుంటామని స్పష్టమైన హామీ ఇచ్చారని పేర్కొన్నారు. ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి 4,567 మంది డీఎస్సీ-1998 క్వాలిఫైడ్ అభ్యర్థులకు ఎమ్‌టీఎస్ పద్ధతిలో ఉద్యోగాలు ఇస్తూ.. అభ్యర్థులనుంచి అంగీకార పత్రాలు కూడా తీసుకున్నారని గుర్తుచేశారు. అయితే తెలంగాణలో 1,500 మంది అభ్యర్థులు ఉద్యోగాలు పొందలేకపోయామని, ఇప్పటికే మానసిక వేదనతో సుమారు 100 మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. 2016 జనవరిలో ముఖ్యమంత్రి కేసీఆర్ తమను పిలిపించుకుని సుమారు రెండున్నర గంటలు చర్చించారని, న్యాయ, సాంకేతిక సమస్యలు ఏమున్నా సరిదిద్ది, సూపర్ న్యూమరరీ పోస్టులు సృష్టించి అయినా న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. కాగా, ముఖ్యమంత్రి హామీ మేరకు సాధారణ ఎన్నికలు మొదలు, జీహెచ్‌ఎంసీ, ఎమ్మెల్సీ అన్ని ఎన్నికల్లో సంపూర్ణ మద్దతు ఇచ్చామని గుర్తుచేశారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా ఉద్యోగాలు ఇచ్చి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సమితి గౌరవాధ్యక్షుడు నర్సింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్‌లో డ్రోన్లతో ప్రత్యర్థి వర్గాల నిఘా

బిష్ణుపూర్: హింసాత్మక ఘటనలతో అట్టుడుకుతున్న మణిపూర్‌కు సాంకేతిక పరిజ్ఞానం వరం, శాపంగానూ మారింది. బాధితులను కాపాడేందుకు, సాయుధుల కదలికలను గుర్తించేందుకు భద్రతాబలగాలు డ్రోన్లను వినియోగిస్తుండగా అదే సమయంలో, కుకీ, మెయితీ ప్రత్యర్థి వర్గాలు ఒకరిగుట్టు మరొకరు తెలుసుకునేందుకు డ్రోన్ల(క్వాడ్ కాప్టర్)ను సైతం వాడుతున్నాయి. ఘర్షణలను నివారించేందుకు ఫౌగక్‌చావో, కంగ్‌వాయి బజార్, టోర్బంగ్ బజార్ వంటి ప్రాంతాలను బఫర్ జోన్లుగా ప్రకటించామన్నారు. బిష్ణుపూర్ జిల్లా లీమరం, సేనాపతి జిల్లా లోయిబోల్‌ల్లో భద్రతా బలగాలను మోహరించినప్పటికీ తరచూ రెండు వర్గాలు హింసాత్మక ఘటనలకు దిగుతున్నాయన్నారు. మే 3వ తేదీన మణిపూర్‌లో వర్గ పోరాటం మొదలైన నాటి నుంచి ప్రజలను, వారి ఆస్తులను కాపాడేందుకు ఆర్మీ డ్రోన్లను వినియోగిస్తోంది. ఇటీవల ఇంఫాల్ నగరంలో అల్లర్లు జరిగే ప్రాంతానికి ఇరుకు మార్గాల్లో వెళ్తున్న ఆర్మీకి మార్గదర్శనం చేస్తున్న ఒక డ్రోన్‌ను ఆందోళనకారులు రాళ్లురువ్వి నేలకూల్చారు.

210 మంది చిన్నారులకు విముక్తి

- రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతున్న ఆపరేషన్ ముస్కాన్
- తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికుల కోసం పోలీస్ బృందాల గాలింపు



సాక్షి, హైదరాబాద్: తప్పిపోయిన పిల్లలు, బాలకార్మికులుగా మారిన చిన్నారులను కనిపెట్టేందుకు జూలై 1 నుంచి ప్రారంభమైన ఆపరేషన్ ముస్కాన్-9 స్పెషల్ డ్రైవ్ రాష్ట్రవ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోంది. బస్‌స్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ఎక్కువగా ఉండే మార్కెట్లు, కూడళ్లు, ఇటుక బట్టీలు, ఖార్ఖానాలు తదితర ప్రాంతాల్లో ఈ డ్రైవ్ నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఆరు రోజుల్లో మొత్తం 210 మంది చిన్నారుల జాడను అధికారులు గుర్తించారు. వీరిలో సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 125 మంది, వికారాబాద్‌లో 14, ఆదిలాబాద్‌లో 12, నిజామాబాద్‌లో 8, వరంగల్‌లో 11, నల్లగొండలో 9, నారాయణపేట్‌లో 8 మంది, భూపాలపల్లిలో ఏడుగురు, కామారెడ్డిలో ఇద్దరు, మహబూబాబాద్‌లో ఇద్దరు, రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఇద్దరు, మెదక్‌లో నలుగురు, భద్రాద్రి కొత్తగూడెంలో నలుగురు, ఆసిఫాబాద్‌లో ఇద్దరు చొప్పున చిన్నారుల జాడను గుర్తించినట్టు అధికారులు తెలిపారు. కేంద్ర హోంశాఖ ఆదేశాల మేరకు ఏటా జూలైలో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. రాష్ట్ర మహిళా భద్రత విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ స్పెషల్ డ్రైవ్‌లో పోలీసులతోపాటు మహిళా, శిశు సంక్షేమం, ఆరోగ్య, వైద్య, కార్మిక, రెవెన్యూ శాఖల నుంచి అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి రాష్ట్రవ్యాప్తంగా సోదాలు నిర్వహిస్తున్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే

సమరమే

తెలంగాణ బోధనా వైద్యుల సంఘం హెచ్చరిక

- సర్కారు సరిగ్గా స్పందించకుంటే 'చలో హైదరాబాద్' నినాదంతో ఇక పోరాటం
- 25 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన బోధనా వైద్యుల నిర్ణయం




సాక్షి, హైదరాబాద్: తమ సమస్యలను పరిష్కరించకుంటే సమరం చేయాల్సి ఉంటుందని తెలంగాణ బోధనా వైద్యుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించింది. ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఆ సంఘం సర్వసభ్య సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ అన్వర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జలగం తిరుపతి రావు, ఉపాధ్యక్షులు డాక్టర్ కిరణ్ మాదల, డాక్టర్ ప్రతిభాలక్ష్మి, కోశాధికారి డాక్టర్ కిరణ్ ప్రకాష్, ప్రాంతీయ కార్యదర్శి డాక్టర్ ఎల్.రమేష్ ఈ మేరకు ప్రకటించారు. రాష్ట్రంలోని మొత్తం 25 ప్రభుత్వ మెడికల్ కాలేజీలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్లు, అసోసియేట్ ప్రొఫెసర్లు, ప్రొఫెసర్లు సహా అదనపు డీఎంఈ స్థాయి వరకు బోధనా వైద్యులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ ప్రతీ నెలా జరుగుతున్న సమీక్ష సమావేశంలో కేవలం లక్ష్యాలు ఇవ్వటమే కాక, వైద్యుల సమస్యల గురించి కూడా చర్చ జరగాలని వారు డిమాండ్ చేశారు. సమస్యల విషయంలో గత ఏడాది నిరసన తెలిపినప్పుడు మంత్రి హరీశ్ రావు భరోసాతో వెనక్కి తగ్గినప్పటికీ, అందులో అనేక సమస్యలు అలాగే పరిష్కారం కాకుండా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను మరోసారి ప్రభుత్వానికి తెలియజేస్తామని, అప్పటినుంచి నిర్ణీత వారం రోజుల సమయంలో స్పందించకపోతే, 'చలో హైదరాబాద్' అనే నినాదంతో పోరాటం చేయాలని నిర్ణయించామన్నారు.

పీజీ మెడికల్ కన్వీనర్ కోటా సీట్లకు నోటిఫికేషన్

నేటినుంచి 17వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తుల స్వీకరణ

- కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడి
- ఆగస్టుకు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసినవారు అర్హులు
- సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం కౌన్సెలింగ్ ప్రారంభం



సాక్షి, హైదరాబాద్: పోస్ట్ గ్రాడ్యుయేట్ వైద్య ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది. 2023-24 వైద్య విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్రంలోని పీజీ మెడికల్ సీట్ల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తులను ఆహ్వానిస్తూ కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం ఆదివారం నోటిఫికేషన్ విడుదల చేసింది. విశ్వవిద్యాలయ పరిధిలోని కన్వీనర్ కోటా సీట్లను ఈ నోటిఫికేషన్ ద్వారా భర్తీ చేస్తారు. జాతీయ స్థాయి అర్హత పరీక్ష(నీట్)- 2023లో అర్హత సాధించిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

నేటినుంచి 17వ తేదీ వరకు రిజిస్ట్రేషన్

ఈ నెల 10వ తేదీ (సోమవారం) ఉదయం 10 గంటల నుంచి 17వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు అభ్యర్థులు ఆన్‌లైన్ లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని వర్సిటీ వర్గాలు విజ్ఞప్తి చేశాయి. నిర్దేశిత దరఖాస్తు పూర్తి చేయడంతో పాటు అభ్యర్థులు సంబంధిత సర్టిఫికెట్లను స్కాన్ చేసి వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఆన్‌లైన్ లో సమర్పించిన దరఖాస్తులు, సర్టిఫికెట్ల పరిశీలన అనంతరం తుది మెరిట్ జాబితాను విడుదల చేస్తారు. మెరిట్ జాబితా విడుదల అనంతరం వెబ్ ఆప్షన్లకు యూనివర్సిటీ మరో నోటిఫికేషన్ జారీచేస్తుంది. తదనుగుణంగా అభ్యర్థులు ప్రాధాన్యక్రమంలో ఆప్షన్లు నమోదు చేయాల్సి ఉంటుంది. అనంతరం కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుంది. ఇతర సమాచారానికి యూనివర్సిటీ వెబ్‌సైట్ www. knruhs. telangana.gov.inలో సంప్రదించాలని యూనివర్సిటీ తెలిపింది.

అభ్యర్థులు నీట్ పీజీలో కటాఫ్ స్కోర్ లేదా అంతకంటే ఎక్కువ సాధించి ఉండాలి. జనరల్ కేటగిరీ విద్యార్థులకు కనీస అర్హత 50 పర్సంటైల్ కాగా, కట్ ఆఫ్ స్కోర్ 291 మార్కులు, ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ విద్యార్థుల కనీస అర్హత 40 పర్సంటైల్ కాగా, కట్ ఆఫ్ స్కోర్ 257 మార్కులు, దివ్యాంగుల కనీస అర్హత 45 పర్సంటైల్ కాగా, కట్ ఆఫ్ స్కోర్ 274 మార్కులు సాధించి ఉండాలని వర్సిటీ వెల్లడించింది.

జనరల్ కేటగిరీ విద్యార్థులకు కటాఫ్ స్కోర్ 291 మార్కులు

ఇతర ముఖ్యాంశాలు

- అభ్యర్థి మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా గుర్తింపు పొందిన మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ లేదా తత్సమాన డిగ్రీ పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా లేదా స్టేట్ మెడికల్ కౌన్సిల్ నుంచి శాశ్వత నమోదు చేసుకొని ఉండాలి.
- కంపల్సరీ రొటేటింగ్ ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి.
- ఎంబీబీఎస్ చదివినవారు గుర్తింపు పొందిన మెడికల్ కాలేజీల నుండి వచ్చే నెల 11వ తేదీ లేదా అంతకు ముందు ఇంటర్న్‌షిప్ పూర్తి చేసి ఉండాలి. 11 ఆగస్టు 2023 నాటికి ఇంటర్న్‌షిప్ పూర్తి చేసే అభ్యర్థులు సంబంధిత మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ జారీ చేసిన సర్టిఫికెట్‌ను సమర్పించాలి.
- సర్వీస్‌లో ఉన్న అభ్యర్థుల విషయంలో 30 జూన్ 2023 నాటికి వారు అందించిన సేవలను పరిగణలోకి తీసుకుంటారు.
- ఓసీ, బీసీ అభ్యర్థులకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు రూ.5500
- పీజీ డిగ్రీ లేదా డిప్లొమా కోర్సులకు రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్ ఫీజు ఓసీ, బీసీ అభ్యర్థులకు రూ.5500 (బ్యాంక్ లావాదేవీల చార్జీలు అదనం), ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.5000 (బ్యాంకు లావాదేవీల చార్జీలు అదనం). రుసుమును డెబిట్ కార్డ్ / క్రెడిట్ కార్డ్ లేదా నెట్ బ్యాంకింగ్ ద్వారా ఆన్‌లైన్‌లో చెల్లించాలి.
- అభ్యర్థులు పాస్‌పోర్ట్ సైజు ఫొటో, అడ్మిట్ కార్డ్, నీట్ పీజీ ర్యాంక్ కార్డ్, ఒరిజినల్ లేదా ప్రొవిజనల్ డిగ్రీ సర్టిఫికెట్, ఆధార్ కార్డ్, ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం నుంచి చివరి సంవత్సరం వరకు స్టడీ సర్టిఫికెట్లు, ఇంటర్న్‌షిప్ కంప్లీషన్ సర్టిఫికెట్, పర్మినెంట్ మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ తదితరాలు సమర్పించాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తును సమర్పించడానికి అభ్యర్థులకు ఇబ్బందులు ఎదురైతే సాయం కోసం 9392685856, 7842542216 నంబర్లను సంప్రదించవచ్చు.

లారీలకు పాత ఫిట్‌నెస్ ఫీజు విధానానికి వినతి

సాక్షి, హైదరాబాద్: లారీలకు ఫిట్‌నెస్ ఫీజును పాతపద్ధతిలోనే వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలంటూ తెలంగాణ లారీ యజమానుల సంఘం మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌కు విజ్ఞప్తి చేసింది. మంత్రి సంఘం గౌరవాధ్యక్షుడు కూడా అయినందున.. ఆదివారం సంఘం అధ్యక్షుడు రాజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు ఆయనను కలిసి ఈమేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస గౌడ్.. తెలంగాణ-ఏపీ మధ్య అపరిష్కృతంగా ఉన్న సింగిల్ పర్మిట్ విధానం అమలుపై ఏపీ మంత్రి విశ్వరూప్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ అంశంపై చర్చించేందుకు త్వరలోనే హైదరాబాద్‌లో ఉన్నతస్థాయి సమావేశం నిర్వహిస్తామని మంత్రి వెల్లడించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.